# "తాళ్ళపాక కవులు ఋణపడ్డారు"

1-3-79, ముంగర శంకర రాజు.
చిత్తూరు.

గేయం గానయోగ్యమైంది. అది రాగ - తాళ-భావయుక్తమైంది. గానమాధుర్యానికి పండితుడు పామరుడు తన్మయులౌతారు. పశువు - పసిబిడ్డ - పాము - సైతం గానానికి పరవశిస్తాయట. లయ-భావ - రాగ రంజితమైంది కాబట్టి గేయానికి అంతటి ఐశ్వర్యం ప్రాప్తించింది.

ఆదిలో కవిత్వం గేయరూపంలోనే ఆవిర్భవించింది. ఋగ్వేద కాలంనుండీ నేటిదాకా భారతీయవాఙ్మయంలో గేయపరంపరకు గణనీయమైన స్థానం ఉంది.

తెలుగు సాహిత్యంలో ఈ గేయపరంపరకు అన్నమయ్య - త్యాగయ్య - క్షేత్రయ్య-లు ముఖ్యులుగా ప్రసిద్ధ వాగ్గేయకారులుగా పరిగణింప బడుచున్నారు. అందునా అన్నమయ్య అందరికీ ఆద్యుడు. పదకవితాపితామహుడు. అందరూ ఆయనకు వెనుకవారే. అందరూ ఆయన్ను ఇంతో అంతో అనుకరించినవారే.

అయినా దేశంలో త్యాగయ్యకీర్తనలకు క్షేత్రయ్య పదాలకు వచ్చిన ప్రాచుర్యం అన్నమాచార్యుల పాటలకు రాలేదనడం సత్యం. పోతులూరి వీరబ్రహ్మంగారి తత్త్వాలు సంపాదించుకున్న ప్రచారం పదకవితాపితామహుని పదాలు పొందలేక పోవడం విచారణీయమే. అందుకు, అవి బహుశా రాగిరేకులపై కెక్కించి భాండాగారంలో భద్రంగా దాచిపెట్టడం కారణమా! బంధింపబడినందున భద్రంగా అయితే వున్నాయి. కానీ ప్రజల్లోకి ప్రాకి ప్రాచుర్యం పొందలేకపోయి వుండవచ్చు. లేక, ప్రచారం చేసిపెట్టే విజ్ఞత పదకవితాపితామహుని వారసులకు లేకపోవడం కూడా కారణం కావచ్చు.

బైరాగులు బ్రహ్మంగారి తత్త్వాలనూ, భాగవతులు క్షేత్రయ్య పదాలనూ, సంగీతజ్ఞులు త్యాగయ్య కీర్తనలనూ ఊరూరూ మోసుక

తిరిగి, పదే పదే పాడి, ప్రజలకు బాగా పరిచయం చేసిపెట్టారు కాని అన్నమయ్య అనుయాయులు ఆ ప్రచార రహస్యం గుర్తించినట్లు లేదు.

ఇప్పుడీకార్యమే ముమ్మరంగా జరుగవలసియున్నది. తి. తి. దేవస్థానంవారు ఈ ముఖంగా కొంతకృషి చేస్తున్నట్లుంది. అయినా సాహితీవేత్తలు ముఖ్యంగా పూనుకోవలసియున్నది. ఎందుకనగా. క్షేత్రయ్య పదాలు నాట్య ప్రధానమైనవిగా త్యాగయ్య కీర్తనలు సంగీత ప్రధానమైనవిగా అన్నమయ్య సంకీర్తనలు సాహిత్య ప్రధానమైనవిగా ఉన్నవి. కనుక తాళ్ళపాకవారి సమగ్ర సాహిత్యా విష్కరణ సాహితీవేత్తలద్వారానే మొదట జరుగవలసియున్నది.

ఈ ఉద్దేశ్యంతోనే శ్రీయుత పెనుమాదు వేంకట శేషయ్యగారు ఈ "తాళ్ళపాక కవుల" గ్రంథ రచనకు పూనుకొన్నారు. వారి ఈ సంకల్పసిద్ధి సర్వథా చరితార్థకమైంది.

కడపజిల్లా రాజంపేట తాలూకాలో తాళ్లపాక గ్రామం ఒకటి. ఆ గ్రామంలో ఒక కుటుంబంవారికి వందల యేండ్లుగా విద్యాగంధం లేదట. వారి నిరంతర నోముఫలంగా చివరకు చదువులతల్లి తగినంత గాంధర్వాంశం కూడా తన కొంగున కట్టుకొని ఎవరికంటా బడకుండా ఆ యింటిలో కాలు పెట్టింది. అంతే. ఆనాటినుండీ ఆ వంశంలో ఆరేడు తరాలవరకు సంగీత సాహిత్యాలు ఝరులై ప్రవహించాయి. ఆ ప్రవాహాలకు ఉద్గమస్థానాలుగా రూపొందిన తాళ్లపాకకవులు నిలిచారు. అన్నమయ్య, తిమ్మక్క, పెదతిరుమలయ్య, చిన తిరుమలయ్య, చిన్నన్న, రేవణూరు వెంకటార్య మొదలగు కవులు వారే.

వీరందరూ ఒక కుటుంబంవారే. అందరూ పదకర్తలే. అందరూ ప్రబంధకవులే. అందరూ సంకీర్తనాచార్యులే. అందరూ ప్రతిభావంతులే. అందరూ తిరుపతి వెంకన్న భక్తులే. వారందరూ తాళ్లపాకవారే. ఈలాంటి సందర్భం ప్రపంచంలోనే అపూర్వమైంది. ఈ ఘనత ఒక్క తెలుగుతల్లికే దక్కింది. అందుకే ఆంధ్రభాషకు - "అందరిదీ కొంత అయితే తాళ్లపాకవారిది అంతా-" అన్న నానుడి యేర్పడింది.

ఆ "అంతా" ఒకచోట చేర్చి, రాశిపోసి, ఇదే మా తాళ్లపాక కవుల సాహితీసంపద-అని సగర్వంగా చెప్పకోదలచినట్లు శ్రీ శేషయ్య

గారు ఈ గ్రంథరచనకు పూనుకున్నారు. అంతేగాక ఈ సంపదను భద్రంగా కాపాడుకోదలచినట్లు కూడా వారి మాటల్లో ధ్వనిస్తూంది. ఆవేశంతో ఆత్రంతో ప్రాంతీయాభిమానంతో ఈ రచనకు పూనుకొన్నట్లు గూడా నుడివినారు.

అవును, శ్రీ వేంకటశేషయ్యగారు తాళ్ళపాకకు సమీపగ్రామస్థులు, కవులకు జన్మస్థలమైన తాళ్ళపాక గ్రామానికే తాళ్ళపాక కవుల కీర్తి సంపద శాశ్వతంగా దక్కించుకోవలెనన్న ఆదుర్దా కనబరచినట్లు తోస్తుంది. ఎందుకంటే - తెలుగుదేశంలో గొప్ప గొప్ప కవులు కులాంతరం స్థలాంతరం కావింపబడుతున్నారు. ఈ రచయిత గ్రామానికి దగ్గరవాడైన బమ్మెరపోతన ఒంటిమిట్ట నుండీ ఓరుగల్లుకు తరలించబడ్డాడు. ఇంకనూ, చంద్రగిరి తాలూకాలోని 'మువ్వపురి' గ్రామవాస్తవ్యుడూ, కార్వేటినగరం వేణుగోపాలదేవుని భక్తుడూ, వరదయ్య అను పేరుగల 'క్షేత్రయ్యను' కృష్ణాజిల్లా దివితాలూకాకు యెగరేసుకపొయ్యారు. 'కర్ర గలవానిదే బర్రె' కాలమిది. కాబట్టి రేపు తాళ్ళపాకవారినీ ఎవరు ఏ మండలానికి తన్నుకపోతారో ఎట్లా కాదనగలం! సొత్తు చేయి జారిపోయిన మీదట, పిమ్మట ఎన్ని డాకుమెంట్లు కైఫియత్తులు చూపెట్టి గోలపెట్టినా పోయిన సొత్తుమాత్రం తిరిగీ చేతికి దక్కుతుందనే నమ్మకంలేని పిదప కాలమాయె. కనుకనే గ్రంథకర్త తాళ్ళపాక కవుల జన్మస్థలంగురించి మాత్రం విస్తారంగా వివరాలతో వ్రాసి కట్టుదిట్టంచేసుకున్నారు.

రచయిత శ్రీ వేంకటశేషయ్యగారు మంచి సరసుడు, సాహితీప్రియుడు అయినందున - కవుల కులాలు గోత్రాలు జనన కాలాలు శాసనాలు వగైరా శుష్కమైన చారిత్రకాంశాలతో గ్రంథాన్ని దట్టించక కవుల ప్రజ్ఞాప్రాభవాలను వారి కావ్యగత విశేషాలను తక్కువపరిమితుల్లోనే అయినా యెక్కువగా చూపెట్టడానికి ప్రయత్నించారు. కనుక గ్రంథం పఠనాసక్తినీ కావ్యానందాన్నీ పఠితకు కలిగించే ప్రసాదగుణాన్ని సంతరించుకోగలిగింది.

తిమ్మక్క - 'సుభద్రాకల్యాణం' లోని కథా వైచిత్రిని; చిన్నన్న - 'అష్టమహిషీకల్యాణం' లోని రచనా పాటవాన్ని; 'పరమ

యోగి విలాసం' ద్విపదకావ్యంలో విష్ణుచిత్తు - గోదాదేవి కథన కౌశలాన్ని వరుసగా నన్నయ, చేమకూరు, పోతన, కృష్ణదేవరాయల రచనలతో పోల్చి వివరించిన తీరు; రేవణూరి వెంకటార్యుని "శ్రీపాదరేణు ప్రభావము" లోని మన్మథ-నారద, దత్తిల-తుంబుర, రంభా-పురందర, సరస్వతీ-చతుర్ముఖుల చతురసంవాదసరళి చదువ ఇంపుగా వినసొంపుగా చిత్రించినారు రచయిత. ఇంకనూ, -

"చక్కని తల్లికి ఛాంగు భళా"- "కొలనిదో పరికి గొబ్బిళ్లో" "సువ్వసువ్వని సుదతులు దంచేరోరాల" - "అదివో అల్లదివో హరివాసము" మొదలగు దేశీయ పదకవితాగంధంతో గుబాళించుచున్న పాటలను యథాతథంగా యిచ్చి అన్నమయ్యకాలంనాటి జాను తెనుగు జుంటితేనెతీపిని, పూలగుత్తుల్లాంటి కమ్మని పలుకుబళ్ళను, సామెతల్లోని సొబగు సోయగాన్ని కమనీయంగా రమణీయంగా చూపెట్టి గ్రంథాన్ని ఆద్యంతం ఆపాతమధురంగా రూపొందించారు. ఎడనెడ వీరుచేసిన వ్యాఖ్యలు ఇచ్చిన ఉపమానాలు దృష్టాంతాలు రచయిత వివిధ విషయజ్ఞతను వ్యక్తం చేస్తున్నవి.

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి తాళ్ళపాక కవులకు ఋణపడితే - తాళ్ళపాకకవులు శ్రీ వేంకటశేషయ్యగారికి ఋణపడ్డారేమో అనిపిస్తుంది.

గ్రంథకర్త శ్రీ వెంకటశేషయ్యగారు ఉద్యోగరీత్యా - ప్రిన్సిపాల్‌గా చిత్తూరుకు రావడం ఒక యాదృచ్ఛికం. ఇక్కడవున్న ఈస్వల్ప కాలంలో వారు ఈ గ్రంథరచనకు పూనుకోవడం - పూర్తిచేయడం ఒక అపూర్వం. ఈ గ్రంథానికి నేను 'ప్రథమ పాఠి' కావడం ఒక కాకతాళీయం. వారు నన్ను అభిప్రాయం వ్రాసివ్వమనడం వారి ఔదార్యతకు తార్కాణం.

లోకజ్ఞుడు విజ్ఞుడు రసజ్ఞుడు అయిన శ్రీ వెంకటశేషయ్యగారు బహుకార్యమగ్నులయినా మరింకా కొన్ని గ్రంథములు వ్రాయగలరనీ, వ్రాయ సమర్థులనీ విశ్వసిస్తున్నాను. శ్రీ శేషయ్యగారు ఆయురారోగ్య ఐశ్వర్యములతో వర్ధిల్లుదురు గాక!

యోగి విలాసం' ద్విపద కావ్యంలో విష్ణుచిత్తు - గోదాదేవి కథన కౌశలాన్ని వరుసగా నన్నయ, చేమకూర, పోతన, కృష్ణదేవరాయల రచనలతో పోల్చి వివరించిన తీరు; రేవణూరి వెంకటార్యుని "శ్రీపాదరేణు ప్రభావము" లోని మన్మథ-నారద, దత్తిల-తుంబుర, రంభా-పురందర, సరస్వతీ-చతుర్ముఖుల చతురసంవాదసరళి చదువ ఇంపుగా వినసొంపుగా చిత్రించినారు రచయిత. ఇంకనూ, -

"చక్కని తల్లికి ఛాంగు భళా"- "కొలనిదో పరికి గొబ్బిళ్లో" "సువ్వసువ్వని సుదతులు దంచేరోరాల" - "అదివో అల్లదివో హరివాసము" మొదలగు దేశీయ పదకవితాగంధంతో గుబాళించుచున్న పాటలను యథాతథంగా యిచ్చి అన్నమయ్యకాలంనాటి జానుతెనుగు జుంటితేనెతీపిని, పూలగుత్తుల్లాంటి కమ్మని పలుకబళ్ళను, సామెతల్లోని సొబగు సోయగాన్ని కమనీయంగా రమణీయంగా చూపెట్టి గ్రంథాన్ని ఆద్యంతం ఆపాతమధురంగా రూపొందించారు. ఎడనెడ వీరుచేసిన వ్యాఖ్యలు ఇచ్చిన ఉపమానాలు దృష్టాంతాలు రచయిత వివిధ విషయజ్ఞతను వ్యక్తం చేస్తున్నవి.

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి తాళ్ళపాక కవులకు ఋణపడితే - తాళ్ళపాకకవులు శ్రీ వేంకటశేషయ్యగారికి ఋణపడ్డారేమో అనిపిస్తుంది.

గ్రంథకర్త శ్రీ వెంకటశేషయ్యగారు ఉద్యోగరీత్యా - ప్రిన్సిపాల్‌గా చిత్తూరుకు రావడం ఒక యాదృచ్ఛికం. ఇక్కడవున్న ఈస్వల్పకాలంలో వారు ఈ గ్రంథరచనకు పూనుకోవడం - పూర్తిచేయడం ఒక అపూర్వం. ఈ గ్రంథానికి నేను 'ప్రథమ పాఠి' కావడం ఒక కాకతాళీయం. వారు నన్ను అభిప్రాయం వ్రాసివ్వమనడం వారి ఔదార్యతకు తార్కాణం.

లోకజ్ఞుడు విజ్ఞుడు రసజ్ఞుడు అయిన శ్రీ వెంకటశేషయ్యగారు బహుకార్యమగ్నులయినా మరింకా కొన్ని గ్రంథములు వ్రాయగలరనీ, వ్రాయ సమర్థులనీ విశ్వసిస్తున్నాను. శ్రీ శేషయ్యగారు ఆయురారోగ్య ఐశ్వర్యములతో వర్ధిల్లుదురు గాక!

సహపాఠి, బంధువు, సాహితీప్రియుడు

ఆంధ్రప్రదేశ్ కేంద్ర భూమిఅభివృద్ధి బ్యాంకు అధ్యక్షులు

# శ్రీ బండారు రత్నసభాపతి గారికి

# అంకితము

ప్రాథమిక విద్య మొదలుగ పట్టభద్ర
పట్టమందితిమిగ సహపాఠకులయి
సఖుడ! రత్నసభాపతీ! సరసనుండి
కన్న - నీగుణగణముల నెన్నుచుంట.

బండారు వంశవార్నిధి -
నిండౌ చందురునిబోలి నీ పుట్టువు, మా
మండలము కడప - కళలను
నిండారగ జేసెనయ్య నీకృషితోడన్.

తల్లి, దండ్రి - పోలమ్మ, చిదంబరములు
ఆది దైవతములు నీకు ఆత్మసఖుడ!
వేణుగోపాల స్వామిని వేడుకొంటి
కొలము సామిగ గురు, దైవబలము గూడె.

బాల్యము లోననే పరువెత్తి దూరితి
రాజకీయములందు రక్తితోడ
సోషలిస్టుగనీవు చోద్యమౌ తీరున
ఎన్నికైతివి అసెంబ్లీకి నాడు
ముమ్మారు గెలిచిన మొనగాడ వీవను
ప్రఖ్యాతి కెక్కితి ప్రజలలోన

ప్రతిపక్ష నాయక పదవి సభాపతి
సార్థక పదముగ చాటినావు
ఏ ప్రజా ఉద్యమం బెంత భయదంబైన
వెనుకంజ వేయని వీరుడవు

వివిధ శాఖల విజ్ఞాన వేత్తవీవు
మిత్రులకు సహృదయుడై మెలగువీవు
ధనికుడుగ బుట్టి సామ్యవాదము నెనమ్మి
ప్రజల మనిషిగ నేనాణ ప్రణుతి గంటి.

జంకు గొంకు లేక శాసన సభలోన
నీదు వాద పటిమ నిగ్గుదేరి
దద్దరిల్లెనాడు పెద్దగా సభయెల్ల
అబ్బ! సింహ గర్జ! అనిరినీది.

నీశక్తి యుక్తులు నిర్మాణ దక్షత
ప్రజలకుఉపయోగింప పట్టుబట్టి
మండలివారును మఱి ముఖ్యమంత్రియు
తమకు తోడుగ మిమ్ము దలచికొనిరి
జలగమంతటి వారు చనువిచ్చి పిలువంగ
మండలిమాటను దండి జేసి
పూర్వాపరంబుల పోడుముల్ పరికించి
కోరి కాంగ్రెసులోన జేరినావు

అన్ని రాష్ట్రాల మంత్రులు అబ్బురముతో
నీవే ఘనుడవు వేంగళరావనంగ
రాష్ట్రపాలన సాగించు శ్రేష్ఠతముని
మెప్పు నందితి తెలిసె నీ గొప్పతనము.

నీ ప్రతిభా వ్యుత్పత్తులు నిన్ను విదేశయాత్రల కంపించాయి
నీ ఇస్రాయిల్ ఐరోపా జపానుయాత్రలు మా కెంతో వుపకరించాయి
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ సిండికేటు సభ్యత్వం
అకడకమిక్కౌన్సిల్లో ప్రవేశం
నీ విజ్ఞాన వికాసాలను నిజమని నిరూపించాయి
ఇటు రాష్ట్రప్రభుత్వం అటు విద్యామంత్రి శ్రీ
మండలి వెంకటకృష్ణారావు మరియెంతో అభినందనీయులయ్యారు.

ఓ సభాపతి! సహపాఠి! నాసహాయి!
సాహితీప్రియ! నీకు యీ చక్కనైన
తాళ్ళపాకాన్వయుల చరిత్రంబునిత్తు
అంకితమ్ముగ నందుకొమ్మధిక ప్రేమ.

నీ మోమోటం వద్దన్నా
నా అభిమానం వదలదునిన్నా
తాళ్ళపాక కవుల పొత్తమునకు
ప్రోత్సాహం నీదేకదా!

అన్నివిధాలా దీనికి
అర్హుడవు నీవే కదా!
అందుకే అర్పిస్తున్నా నీకే
అతిముదంబున ఆత్మబంధూ!
అందుకో ఈ కావ్యకన్యను.

నీ ప్రతిభా వ్యుత్పత్తులు నిన్ను విదేశయాత్రల కంపించాయి
నీ ఇస్రాయిల్ యిరోపా జపానుయాత్రలు మాకెంతో వుపకరించాయి
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ సిండికేటు సభ్యత్వం
అకడకమిక్కౌన్సిల్లో ప్రవేశం
నీ విజ్ఞాన వికాసాలను నిజమని నిరూపించాయి
ఇటు రాష్ట్రప్రభుత్వం అటు విద్యామంత్రి శ్రీ
మండలి వెంకటకృష్ణారావు మరియెంతో అభినందనీయులయ్యారు.

ఓ సభాపతి! సహపాఠి! నాసహాయి!
సాహితీప్రియ! నీకు యీ చక్కనైన
తాళ్ళపాకాన్వయుల చరిత్రంబునిత్తు
అంకితమ్ముగ నందుకొమ్మధిక ప్రేమ.

నీ మోమోటం వద్దన్నా
నా అభిమానం వదలదునిన్నూ
తాళ్ళపాక కవుల పొత్తమునకు
ప్రోత్సాహం నీదేకదా!

అన్నివిధాలా దీనికి
అర్హుడవు నీవే కదా!
అందుకే అర్పిస్తున్నా నీకే
అతిముదంబున ఆత్మబంధూ!
అందుకో ఈ కావ్యకన్యను.

# తాళ్ళపాక కవులు

'తమది కొంత తాళ్లపాక వారిది కొంత' అను నానుడి అందరికి తెలిసినదే. దీని భావమేమి తిరుమలేశ ? అని చాల రోజులుగా అనుకొను చుంటిని. తిరుమల దేవస్థానం వారి సంకల్పము మరియు మిత్రుడు శ్రీ బి. కృష్ణంరాజు గారి కృషి వలనను అటు అన్నమాచార్యులూ, ఇటు తాళ్ళపాక గ్రామమూ ఈ మధ్య వెలుఁగు లోనికి వచ్చినవి. తాళ్ళపాకకు ప్రభుత్వము తరపున దేవాదాయ, విద్యాశాఖామాత్యులు, తిరుమల తిరుపతి దేవస్థాన సంఘాధ్యక్షులు, సభ్యులు, కార్య నిర్వ హణాధికారి ఆంధ్ర సారస్వత సంఘాధ్యక్షులు, తదితర ప్రముఖులు పదేపదే రావడము, ఏదో ఒక కార్యక్రమములో పాల్గొనడము, దేవస్థానము వారు అక్కడ ఒక కళ్యాణ మంటపము నిర్మించుటకు తగిన నిధులు చేకూర్చడము, ప్రభుత్వము ఆ కుగ్రామమునకు ఒక రోడ్డు నిర్మించి సుందరమైన అన్నమాచార్యుల ముఖద్వారమును నిలుపుటయు, ఈ కార్యక్రమములను మిత్రుడు శ్రీ కృష్ణంరాజు శ్రద్ధాసక్తులతో చేపట్టి మమ్మందరిని ఆహ్వానించడముతో – తాళ్ళపాక వారియెడ మాలో ఒక విధమైన ఉత్సాహము, ఉత్తేజము వీని నన్నింటిని మించిన కుతూహలము రేకెత్తినవి.

ఎవరీ అన్నమయ్య ? తాళ్ళపాక వారెవ్వరు ? అన్నమాచార్యు లెట్టివారు ? సంకీర్తనాచార్యులెవరు ? 'పేరున చిన్న, వయసున పిన్న,

యశోవిభవంబున మిన్న' అగు చిన్నన్న యెవరు? ఇంత మంది కవులు ఆంధ్ర సారస్వతములో అన్ని శాఖలలో అత్యున్నత స్థితికి రాగలశక్తి యుక్తులు యీ వంశస్థులకే యెట్లబ్బినవి?" అను అనేకములైన ఆలోచనలు పుట్టుకొని వచ్చినవి. వారిని గురించి ప్రముఖులు చేసిన ప్రసంగములు విని ఆనందాశ్చర్యములలో మునిగి అంతో ఇంతో వారిని గురించి తెలిసికొను గ్రంథములు, జీవిత చరిత్రలు విపులముగా ఒకచో లేమికి వగచి, నాకు సారస్వతమున గల కొద్దిపాటి పరిచయముతో వారిని గురించి, వారి కావ్యములను గురించి, కొంత పరిశ్రమించి, నాకు తోచిన విధముగా పుస్తకరూపమున తాళ్లపాకధీధితులను మీ ముందుంచుటకు సాహసించుచున్నాను.

నాకు గల స్వల్ప వ్యవధిలో పరిమిత జ్ఞానముతో, ఇంత పెద్ద పని చేయబూనుట సాహసమే యనవచ్చును. అయినా యీ కవులను గురించి, వారి మహత్తర కృషి, వారు సాధించిన మహాకావ్యములు, వాని పలుకుబడి ప్రాబల్యములను గురించి, అంతో ఇంతో కని విని ఆనందించిన ఆవేశముతో ఈ గ్రంథ రచనకు పూనుకొను చున్నాను. ఈ నా ఆత్రముతో కూడిన ప్రయత్నము లోప భూయిష్ఠమను శంక నన్ను పీడించు చున్నను, వ్రాయవలయునను, ఆవేశము ముందుకు లాగ, ప్రాంతీయాభిమానముతో ఈ కృషికి పూనుకొంటిని. సారస్వతాభిమానులు సౌజన్యముతో నా యీ కృషిని గ్రహింతురు గాక!

తాళ్ళపాక కవులను గురించి అంతా చదివిన వెనుక 'తమది కొంత తాళ్ళపాక వారిది కొంత' అనుటకన్న 'తాళ్ళపాక వారిది అంత' అనుట సముచితముగా నున్నది. వీరు వ్రాయని విషయము లేదు. తడవని అంశము లేదు. చెప్పని తీరు లేదు. ఆ వంశములోని వారందరు

కవులు, కవయిత్రులే! వారేకాదు, వారితో వియ్యమందుకొనిన వారందరు కవులేననిన, పూవు వలన దారమునకు వాసన అబ్బినట్లు, వీరి సంబంధ బాంధవ్యములలో వారికి గూడ కవితా వాసన కలిగినట్లున్నది. ఈ వంశమువారు దైవ వరప్రసాదితులై యుండవచ్చును. లేకున్న సంకీర్తనాచార్యులు, పదకవితా పితామహులు అన్నమాచార్యులు తన జీవిత కాలములో అనేక గ్రంథములను రచియించుట యే గాక, ముప్పది రెండువేల కీర్తనలను సంస్కృతాంధ్రములలో రచియించి చరితార్థుడైనాడనిన ఇది మానవ చైదముగా తోచకున్నది. దీనికి దైవ ప్రేరణయేగాక, దైవ సహాయము సయితము కలదను నమ్మకము సహజమైనది, సమంజసమైనది. వీరు పలికిన దల్లా పాట అయినదని ప్రతీతి.

వీరి సతీమణి తాళ్ళపాక తిమ్మక్క నన్నయ విరచిత మహాభారత ములో 'సుభద్రార్జునుల' వివాహ ఘట్టమును ఆధారముగా 'సుభద్రా కళ్యాణ' మను రసవత్తర ద్విపద కావ్యమును 'కడుమంచి తేట పలుకుల' రచియించి, చేమకూర వేంకటకవి వంటి మహామహునికి మార్గ దర్శకురాలై ప్రథమాంధ్ర భాషా రచయిత్రి యను ఖ్యాతిని తాను మెట్టినింటికి తెచ్చినది. తాళ్ళపాక వారి కుటుంబమున పేరు మోసిన కవులు పదిమందికి పైగా కలరు. అందరూ సాహితీపరులే. అందరూ కావ్యముల రచించుటలో దిట్టలే. ప్రతి ఒక్కరూ పదరచన చేసి పాడగల ప్రతిభాశాలురే. వీరు రచయితలేగాక పైసెచ్చు లాక్షణి కులు కూడ. తాళ్ళపాక కవులను వారి బహుముఖ పాండితీ ప్రతిభను, వారి సమకాలికుడగు తెనాలి రామకృష్ణ కవి చంద్రుని ముఖమున వినిన వారిగొప్పకు అది ఆమోద ముద్రగ అందరు అంగీకరించెదరను భావముతో దానిని క్రింద పొందు పరచుచున్నాను.

చిన్నన్న ద్విపద కెరగును
పన్నుగ బెద తిరుమలయ్య పదమున కెరగున్
మిన్నంది మొరసె నరసిం
గన్న కవిత్వంబు పద్య గద్యశ్రేణిన్.

ఈ కుటుంబము కవులంతా బహు గ్రంథకర్తలు, బహుముఖ ప్రజ్ఞాశాలురు. బహుభాషావేత్తలు. కవి పండితులు, పండితకవులు. చదువుల సరస్వతులు. పదములకు పద్యములకు సమమైన ప్రతిపత్తి నిచ్చిన ప్రముఖులు. 'తాళ్ళపాక వారిని చదవందే తెలుగు రాదు' అనిన వేటూరి ప్రభాకరశాస్త్రిగారి మాట మననము చేసికొంటూ, వారి సంగ్రహ చరిత్రను, వారి కవితల్లోని కమ్మదనమును మీా ముందుంచుచున్నాను.

# తాళ్ళపాకవారి పుట్టు పూర్వోత్తరాలు

సస్యశ్యామలమై, నవరస ఫలభరితమై, పాడిపంటల నొప్పారు

నట్టి పొత్తపినాఁటి యాదల సిరుల
పట్టుగొమ్మై తాళ్ళపాక చెన్నొందు
అపురిఁ గేశ వుండను రమావిభుడు
చేపట్టి జనుల రక్షించుచుండ

అని అన్నమయ్య మనుమడు చిన్నన్న తాళ్ళపాకవారి చరిత్రమునకు మూలాధారమగు 'అన్నమాచార్య చరిత్రము'న వర్ణించినారు. అట్టి పొత్తపినాటిలో కడపజిల్లాకు చెందిన రాజంపేటకు ఉత్తరమున పరుగు దూరమునగల తాళ్ళపాక గ్రామమే వీరి జన్మస్థలము. వీరి కుటుంబీకులు మంచి ఉన్నత స్థితిలోనుండుట వలన ఆ గ్రామమునకు వారి పేరు వచ్చినదో లేక ఆ గ్రామ వాసులగుట కతన వారి యింటికా గ్రామము పేరు నిలిచినదో చారిత్రకులే నిర్ణయించవలెను. ఏది ఎట్లైనా ఆ ఊరికి పేరు ప్రతిష్ఠలు వీరివలననే వచ్చినవనుట నిజము.

అన్నమయ్య ఆ గ్రామములో జన్మించినారు. తాళ్ళపాక వారిది అప్పటికి యిప్పటికి భూజీవనమే. అన్నమయ్య పూర్వీకులంతా మామూలు రైతులే. వారు భూమిని దున్ని, కష్టించి, పండించి జీవనము గడిపేవారట. వారికి చదువుపైన ధ్యాస తక్కువ. కావున అన్నమయ్య పూర్వీకులకు చదువులు అబ్బలేదు.

వీరి తాతగారగు నారాయణుడు నిరక్షరాస్యుడుగనే బాల్యము గడుపుచుండ, వారి మాతాపితలు అతనికి విద్యాబుద్ధులు గఱుప ఒక ఒజ్జను కుదిర్చిరి. ఆయన చేసిన ప్రయత్నములు నిష్ఫలముకాగా, ఇక అక్కడుండిన లాభములేదని తలచిన తల్లి దండ్రులు సమీపమున గల ఊటుకూరికి నారాయణసూరిని బంధువుల యింట చదువ పంపిరి.

ఆకొమరుండు నారాయణాహ్వయుడు
చక్కగాఁ దమవద్దఁ జదువకయున్న
నూటుకూరను పొరుగూరఁ జుట్టముల
చాటునఁ గొనిపోయి చదువఁ బెట్టుటయు

అక్కడ వారు ఇతనిని తగుశ్రద్ధతో చదివించ ప్రయత్నించిరి. ప్రయోజనము లేక పోయెను. నానా బాధలు పెట్టించి చదువు చెప్పించినను ఏడుపు తప్ప ఒక అక్షరము రాదాయెను. బాధలు భరించ లేక ఆ ఊరి చింతలమ్మ గుడిలోని పాము పుట్టలో చేయిపెట్టి చావ సాహసించిన సూరిని ఒక యిల్లాలు వచ్చి ఓదార్చి మీ ఊరికిపోయి, అందుండు దేవాలయములోని కేశవస్వామిని ప్రార్థించి, చదువు ప్రసా దించమని కోరుము. ఆ దేవుడు నీకు తప్పక విద్యాదానము చేయును అని చెప్పినది.

బడిబడి పెట్లను బడిచాల బడలి
ఆ యూర నొక చింతలమ్మను శక్తి
పాయనిగుడిఁ దాచుపాముండు ననుచు ...
కఱవనీ నా బాధకంటె నా పాము
కఱచిన నెగులెల్లఁ గడకేగు ననుచు
కోపంబుతోడ నా గుడిలోన కరిగి
ఆ పుట్టలోఁ దన హస్తంబు నిడిన

ఈమె చింతలమ్మ దేవతయా యని అతని అనుమానము.

ఆ విధముగనే కేశవస్వామిని ప్రార్థించెను.

**ఆ తాళ్ళపాకకు నరిగి వేవేగ**
**జాతరూపాంశుఁ గేశవుగాంచి మ్రొక్క**
**స్వామి గేహములకు వలచుట్టి కేలు**
**దామరల్ మొగిచి యత్తఱి శరణొంది**
**స్వామి కేశవ సరస్వతిమామ విద్య**
**తామసింపక నాకు దయసేయుమనుడు**
**ఆ మాధవుని కృప నంబుజాసనుని**
**భామ యాతని జిహ్వపైఁ బాదుకొనియె.**

అప్పటినుండి బుద్ధి కుదిరి శ్రద్ధగా చదువుకొని విద్యాధికుడయ్యెను. ఘన, జట మొదలైన వేదపాఠములను అవలీలగ అభ్యసించినాడు. క్రమేపి నారాయణుడు అన్ని విద్యలందు అందెవేసిన చేయియై సర్వజ్ఞుడైనాడు. అన్నమయ్య యీయన మనుమడే. మనుమడికి తాతగారి గుణగణములే కాక పోలికలు కూడ వచ్చినవి.

'ఆకల్పకము లాక యగు తాళ్ళపాక'లో సంసారము సాగించుతూ, ఆ తత సకల విద్యాధురంధరుడగు నారాయణ సూరి యను సుపుత్రుని బడసెను. ఆ నారాయణ సూరి లక్కమాంబయను భామారత్నమును బరిణయమాడెను. ఈ పుణ్యదంపతులకు అన్నమయ్య అను పరమ భాగవతుడు ప్రభవించెను.

**చక్కని గ్రహము లుచ్చమున మూడలర**
**అనుపమ లగ్నంబు నందు వైశాఖ**
**మున విశాఖను జగంబున నుల్లసిల్ల**
**జనియించె నన్నమాచార్యుండు శక్తి**
**మునికిఁ బరాశరముని పుట్టునటులు.**

తేజంబు మఱియు నెంతే విస్తరిల్ల, రాజీవనయను వరప్రసాదమున హరి నందకాంశమున అన్నమయ్య లక్కమాంబయను పుణ్యలావణ్య నిధికి పుట్టినాడని చిన్నన్న చెప్పినాడు.

తాతకు మనుమడికి జీవితములో దగ్గఱ పోలికలు కలవు. తన తాతగారు బాల్యములో ఊటుకూరికి పారిపోయిన విధముగ అన్నమయ్య పిన్నవయస్సుననే తిరిపెమెత్తుకున్నా పర్వాలేదని తిరుపతికి పారిపోయినాడు. అది ఒక విచిత్ర సంఘటన. పూర్వజన్మ సుకృతమో లేక తల్లి వద్ద తర్ఫీదో, పుట్టినప్పటి నుండి అన్నమయ్యకు పాటలంటే బహు పిచ్చి.

తల్లి లక్కమ్మ దైవభక్తురాలు. ఆమె పుట్టిన ఊరు కడపజిల్లా సిద్ధవటంలో మాడుపూరు. ఆ ఊరిలోని మాధవస్వామి అంటే ఆయమకు అమిత భక్తి. ఎప్పుడు ఆ దేవునిపై పాటలు పాడుతూ, ఆ దేవునితో మాట్లాడుచుండెడిదని అక్కడి ప్రజల నమ్మకము. ఆ తల్లి గొంతుకలో ఎంత మార్దవమున్నదో, భక్తిలో ఎంత పారవశ్యమున్నదో, అన్నమయ్య పాలుత్రాగుతున్నా, ఉగ్గు పోసుకుంటున్నా, ఉయ్యాల ఊగుతున్నా ఆమె పాటలలో పరవశుడయ్యెడివాడు. ఆమెకు తిరుపతి వేంకటేశ్వరులనిన యెనలేని భక్తి. అన్నమయ్య ఆ దేవుని ప్రసాదమని ఆయమ్మ నమ్మకము. బిడ్డకోసము నోము నోచి తిరుపతి కొండనెక్కి గరుడస్తంభానికి దండముపెట్టి సంతానము కోరుకొన్నది.

**చనుదెంచి వేంకట స్వామి సన్నిధికి**
**దండిమై గరుడ స్తంభంబు దండ**
**దండంబు లిడుచు సంతానంబువేడ.**

ఆ రాత్రి కలలో దేవుడు ప్రత్యక్షమైనాడు. అటుపిమ్మట అన్నమయ్య పుట్టినాడు. అందుకే ఆ దేవుడంటే ఆమె కంతభక్తి. ఏడుకొండల వానిపై పారవశ్యముతో పాటలు పాడుతూవుంటే పాపాయి శ్రద్ధతో వినేవాడు.

అన్నమయ్యకు తల్లి మూలముననో, తన అభిరుచి వలననో, పిల్లతనమునుండి పాటలు పాడుట పరిపాటి అయినది. వెంకన్నమీద వింత వింత పాటలు కట్టి పాడసాగినాడు. పాడిన పాటెల్ల పరమగానమైనది.

ఆ పిన్నప్రాయంబునందు నామేటి
యే పారఁ దనమది కిచ్చయైనట్లు
ఆడిన మాటెల్ల నమృత కావ్యముగ
పాడిన పాటెల్లఁ బరమ గానముగ

తాను పుట్టినది వేదము చెప్పుకునే బ్రాహ్మణ కుటుంబములో. చేయుచున్నదా తెలుగులో పదములల్లి కూనిరాగాలు తీస్తూ ఉండడము. ఇది యింటిలోని వారికి విపరీతముగానూ, ఏహ్యముగను తోచుట సహజమే. అయితే అతడెందుకు అట్లా పదములు కట్టి పాడడం! అది అతనిలో ఒక అవ్యక్త చేష్టయై కూర్చున్నది. దీనికి కారణం 'ఏల సలిలంబుపాఱు; గాడ్పేల విసరు' అని కృష్ణశాస్త్రిగారు నుడివినట్లు ఒక స్వాభావిక చేష్ట అయినది. ఇంటిలోని వారా బాలుని వింత చేష్టకు విసిగి, వేసారి యీసడించుకొనసాగిరి. అందరూ అతనికి ఏదో ఒక పని చెప్పి బయటికి పంపేవారు. ఎవరేమి చెప్పినను చేసుకుంటూ పోయే సాత్త్విక స్వభావము కలవాడు అన్నమయ్య. వదినగారు సరిదిద్ద వలెనను సదుద్దేశముతోనేమో అడ్డమైన పనులు చెప్పేది. అందులో పశువులకు గడ్డి కోసుకరమ్మనుట అతనికి కష్టముగా నుండెడిది.

ఒకరోజు అన్నమయ్య గడ్డి కోస్తూ పాట జ్ఞప్తికివచ్చి పరవశు డైనాడో ఏమో కొడవలితో గడ్డికి బదులు వేలు కోసుకున్నాడు. బాగా తెగింది. రక్తము చిమ్మసాగింది. నెత్తురు చూచుకొన్నాడు. శరీర బాధకంటే మానసిక బాధ ఎక్కువ కాగా తన నికృష్ట జీవితమును మననము చేసికొన్నాడు.

కసవు గోయగఁబోయి కడవ్రేలు సోకి
వడియునెత్తురు సూచి వాఁకుచ్చి శౌరి
యడుగులదలచి శ్రీహరిహరీ యనుచు
నీ కోఁత కొలది నా దెటిగిన వదినె
చేకోఁత పడగాదు చీరోత యనుచు........

తన్ను అర్థముచేసికొని ఆదరించు ఆప్తులు అక్కడ లేరనుకున్నాడో, తన స్వామి తన్ను ఆదుకోగలడను ఆశ కలిగినదో, కొడవలి నేల గ్రక్కున పాఱవైచి. కట్టు పుట్టములతో, కిర్రు చెప్పులతో కరుణామయుడున్న కొండవైపు, కలత తేరిన మనసుతో కదలినాడు. దారిలో చిందులు త్రొక్కుతూ, చిద్విలాసుని చూడబోవు భక్తులను గూడి వారితో గొంతు కలిపి, పరమ పావనుని పాటలు పాడుకొంటూ, తిరుపతి చేరి తరించినాడు తాళ్ళపాక అన్నమయ్య. వదినగారి కాఠిన్యమే కారుణ్యమై అన్నమయ్యను ఆ దేవుని పదసేవాతత్పరునిగ చేసిన దేమో!

16/4/87

# అన్నమాచార్యులు

'జో అచ్యుతానంద! జో జో ముకుందా!' అని ఆ దేవునీ, ఆంధ్రజాతినీ జో కొట్టించిన దెవరు? తాళ్ళపాక కవులలో మకుటాయమానమై విలసిల్లు సంకీర్తనాచార్యులు, పదకవితా పితామహులు, అన్నమాచార్యులు. వీరికే అన్నమయ్య, అన్నమయ్యంగారు, అన్నయ్యగురువు, అన్నయార్యుడు అను నామాంతరములు కలవు. ఇతడు నందవరీక బ్రాహ్మణుడు. ఆశ్వలాయన సూత్రుడు. భారద్వాజ గోత్రుడు.

తాళ్ళపాక వారు స్మార్త బ్రాహ్మణులయ్యును, తిరుమల శ్రీ వెంకటేశ్వర భక్తులై, తిరుపతి యందుండి పండితులై, గురుపతము నొందిన వారగుటచే, అచ్చటి శ్రీ వైష్ణవులతో పాటు వీరికిని పేరుకు చివర 'ఆచార్యులు', 'అయ్యంగారు' అనుపదములు చేరినవి. వీరు స్మార్తులయ్యును, వైష్ణవమతము నందభిమానులై నందున వైష్ణవాచారములు కొన్ని వీరికి అలవడినవి.

అన్నమయ్య శ్రీ వెంకటేశ్వర భక్తుడై ఆంధ్రమున 'ఆధ్యాత్మ సంకీర్తనలు, శృంగార సంకీర్తనలు, శృంగారమంజరి, శృంగారలక్షణము' అను గ్రంథములను రచియించిరి. ఈయన ఉభయభాషా ప్రవీణుడు,

పంచరాత్రాగమ సార్వభౌముడు. ఈయన సంస్కృతములోని సంగీత రత్నాకరాది అనేక పదలక్షణ గ్రంథములను చదివి, వానిని కూలంకష ముగా నాకళించుకొని, సంస్కృతములో 'సంకీర్తన లక్షణము'ను గ్రంథ మును వ్రాసి, తదను గుణముగా కీర్తనలు వ్రాసెను.

భగవత్సాన్నిధ్యము పొందుటకు భక్తి, శృంగారములు అవసర మను నమ్మిక తాళ్ళపాక కవులందరిలో కలదు. ఈ ధృఢ విశ్వాసము అన్నమయ్యలో అందరికన్న యెక్కువ. అందుకే భగవంతుని విలాస పురుషునిగా భావించి, భక్తిశృంగార రసములు మేళవించి, కీర్తనలను రచియించిరి. ఐహిక సాధనములతో భగవత్సాన్నిధ్యము సాధ్యము కాదని, ఆధ్యాత్మ సంకీర్తనలు రచించి, ముక్తికి, భక్తియే సాధనమని చాటిన మహనీయుడు అన్నమయ్య. శ్రీ వెంకటేశ్వరస్వామికి అత్యంత ప్రియభక్తుడై తను సాధించిన రచనలనేకాక, సంపాదించిన ధనమును ఆ దేవుని కర్పించుచు, తన జీవితమంతయు ఆ స్వామి సేవలో గడుపుచు యిహపర సౌఖ్యములను పొందెను.

అన్నమాచార్యులు 1408 సంవత్సరమున జనియించి, తొంబై అయిదు సంవత్సరములు జీవించి, పూర్ణాయుష్కుడై, 1503 సంవత్సరమున సిద్ధిపొందినట్లు, తిరుపతి దేవస్థానమువారు ప్రకటించిన గ్రంథములలో పేర్కొనబడినది. వీరు తన రచనలను పదునారవ యేటనే మొదలిడి, సుమారు యెనభై వత్సరములు నిరాటంకముగా సాగించుటవలననే ముప్పది రెండువేల కీర్తనలు, అనేక కావ్యములను సాధించగలిగిరి. ఇతర కావ్యము లటుండనిచ్చి, సంగీతసాహిత్య ప్రధాన మైన యీ కీర్తనలు ప్రతిరోజు ఒకటి, రెండైనా వ్రాయకున్న యెడల వీరింతపనిని చేసియుండలేరని గణితము చెప్పుచున్నది.

అన్నమయ్య యింటినుండి పారిపోవుటకు ఇంటిలో యిక్కట్లు కొంతవరకు కారణమనుట సత్యము. తన కుటుంబమువారు తనను వగల బెట్టిరని ఒక కీర్తనలో గలదు.

తగు బంధులా తనకుఁ దల్లులునుఁ దండ్రులును
వగలఁ బెట్టుచుఁ దిరుగు వారే కాక
మిగుల వీరల పొందు మేలనుచు హరినాత్మఁ
దగిలించలేక చింతాపరుఁడనైతి
అంత హితులా తనకు నన్నలునుఁ దమ్ములును
వంతు వాసికిఁ బెనగు వారే కాక
అంతరాత్ముడు వెంకటాద్రీశుఁ గొలువ కిటు
సంతకూటముల యలజడికి లోనైతి.

ఏది యెటులైన తన మంచికో, మనమంచికో, ఊరువదలి, భక్తుల చేరి, తిరుపతికిపోయి, అక్కడి గ్రామదేవతలకు పూజసలిపి, అలిపిరి దగ్గర కొండయెక్కి, కనబడిన దేవుళ్ళను పూజించుచూ, మోకాళ్ళ పర్వతమును చేరుకున్నాడు. అప్పటికి పూర్తిగా అలసిపోయినాడు ఆకలితో సొమ్మసిల్లి అట్లనే నిద్రపోయినాడు. అప్పుడు కలలో ఒక తల్లివచ్చి అతనిని లేపి పరామర్శించినది. ఆ బాలుడు మేల్కాంచి, 'ఆకలి అవుతున్నది. అన్నము పెట్టి ఆ దేవుణ్ణి చూపించ మ'ని ప్రార్థించినాడు. చెప్పు కాళ్ళతో కొండ యెక్కకూడదు. అందులకే ఆ నీరసమని ఆయమ చెప్ప, అన్నమయ్య జోళ్ళు విడిచెను. ఆ సాధ్వి ప్రసాదాన్నమును కడుపునిండ పెట్టినది. ఆకలి పోయినది. అలసట తీరినది. గొంతు పీడినది. ఆమెనే ఆ అలిమేలుమంగగా భావించి, ఆశువుగా కవనమల్ల సాగినాడు. సరస కవిత్వ వాచాప్రౌఢిలో సాధించినాడు ఒక శతకమును.

"పరమ సారస్వత పారీణుఁడగుచు
సరస కవిత్వవాదా ప్రౌఢిమెఱసి
అలిమేలు మంగకు సాహు మార్గమున
సలలితంబుగ నొక్క శతకంబు సెప్పె"

అదియే ప్రఖ్యాతి గాంచిన వెంకటేశ్వర శతకము. అందులో మంగతాయారును భూషిస్తూ ఆ తల్లిని 'నీ విభునకించుక మాదెస జూపు' మంచుచేసిన చనువుతో కూడిన ప్రార్థన యీ మహాపదకవి తాను చేయబోవు శృంగార ప్రధానమైన భక్తిభావములు గల కీర్తనలకు నాందిగా తోచుచున్నది. చెప్పదగ్గ చదువు, చేసినకృషి లేకయే ఛందోబద్ధమైన పద్యరాజములు ఆ చిన్నారి నోట ఆశువుగా పలికించినది ఆ ఆలిమేలుమంగయా? ఆయమ భర్త తిరుమలేశుడా! యను అనుమానము కలుగక మానదు.

అన్నమయ్యకు అలిమేలు మంగమ్మ అనిన అమితమైన భక్తి. అంతకు మించిన అభిమానము. ఈ శతక ప్రథమ పద్యములోనే యీ తల్లియందు తనకుగల భక్తి ప్రపత్తులను ప్రదర్శించినాడు. శ్రీసతి నుండి యిళాసతి వరకు తనకు చేసిన సేవలకు తక్కువగాని పరిచర్యల శ్రీ యలమేలుమంగ చేయుననియు, ఆయమ 'మూసిన ముత్యమై యురము ముంగట చెంగటు చేర్చికో'మను వెంకటేశ్వర ప్రార్థనలోగల దీకవివరునికి తన తల్లిపైగల పక్షపాతము సాంప్రదాయసిద్ధమైన పద్ధతిలోనే శ్రీకారముతో శతకరచన మొదలిడినాడీ కవిచంద్రుడు. పద్మభవాదులే ఆ విధముగా ప్రార్థించిన మన బోటులమాట యేమని మనవి చేసికున్నాడు.

ఓ లలితాంగి! యోకలికి! యోయులజవ్వని! యోవధూటి! యో
గోల! మెరుంగుజూపు కముగోపల నోయలిమేలుమంగ! మ

మ్మలిన తల్లి! నీవిభునకించుక మాదెస చూపుమంటు నీ
పాలికిఁజేరి మ్రొక్కెదరు. పద్మభవాదులు వెంకటేశ్వరా!

వీరికి తొలుత దర్శన మిచ్చినది అలిమేలు మంగమ్మయను అభిప్రాయము గాఢముగా మనసులో నాటుకున్నది. అందులకే ఆ శతకములో ఆయమకే ప్రాముఖ్యతనిస్తూ, ఆమెనే సంబోధిస్తూ, చనువు తీసికుంటూ, ఆయమకు దేవునిపై గల ప్రేమ పలుకుబడులను ఉపయోగించి దైవ సాన్నిధ్యము చేర తలపెట్టిన సాధకుఁడు అన్నమయ్య. ఆయమ మఱుఁగు సొచ్చి, కరుణాకటాక్షముల వేడుటలో కలదాతనిలోని యుక్తి, కవిత లోని శక్తి.

చొచ్చితిఁ దల్లి నీమఱుగు సొంపుగ నీ కరుణాకటాక్ష మె
ట్లిచ్చెదొ, నాకు నేఁడు పరమేశ్వరి! యోయల మేలుమంగ, నీ
మచ్చిక నంచు నీ తరుణి మన్నన నేనిను గంటి, నీకు నా
బచ్చెన మాటలేమిటికి బ్రాతివి చూడఁగ వేంకటేశ్వరా.

తనపరిస్థితిని దాపరికము లేక చెప్పికొనినాడు. గర్భ నిర్భాగ్యుడగు తనను భాగ్యవతి శిరోమణి యగు ఆమె ఆదుకొనగలదను ఆశను వెలి బుచ్చిన విధము చూడుడు —

యోగ్యత లేని కష్టుడ, నయోగ్యుడ, నన్నిటఁజూడ గర్భని
ర్భాగ్యుడ, నీ కృపామతికిఁ బ్రాప్తుడ, నోయలమేలుమంగ! నా
భాగ్యము నీకృపాగరిమ, బ్రాప్యముకావుమటంచు, సారె నీ
భాగ్యవతీ శిరోమణిని బ్రస్తుతిచేసెద వెంకటేశ్వరా!

వీరి కవిత ఈ తొలికావ్యము లోనే పోతన కవితాధారతో అంత్యాను ప్రాసలతో అలరారుచు పరిపక్వమొందినదనుట అతిశయోక్తి కాదు. ఇందుకుదాహరణమే యీ పద్యము.

**చక్కని తల్లికిన్, నవరసంబుల వెల్లికి, బుష్పవల్లికిన్**
**జక్కనిమోవి ముత్తియపుజల్లికి, శ్రీయలమేలు మంగకున్,**
**జెక్కులమించుటద్దములు, చేతులు, క్రొత్తమెఱుంగుదీగ**
**లాక్రికిఱి గుబ్బలే, పసిడికిన్నెరకాయలు – వెంకటేశ్వరా!**

'అన్నమిచ్చినవాని, ఆలినిచ్చినవాని' మరువకుండుట మర్యాద. అపహసించుట హాని. తానావిధముగా కొండనెక్కుతరి, ఆకలితో, నీరసముతో సొమ్మసిలి పడియుండినపుడు, ఆమెయే ఆదరించి ఆదుకొనకుండిన, జీవించి యుండువాడు కాడేమో! ఆంధ్ర సారస్వతమునకు యీ వన్నెచిన్నెలు ఒనగూడెడివి కావేమో! మన అదృష్టము బాగున్నది. అన్నమయ్య తన కృతజ్ఞతను తెలియజేయు యీ పద్యమును శతకమున చేర్చినాడు. ఇవన్నియు నాకు పెట్టినది నీకు కూడ తప్పక పెట్టునను నమ్మకము కనపరచినాడు.

**అరిసెలు, నూనె బూరియలు, నౌగులు, జక్కెరమండిగల్, వడల్**
**బురుడలు, పాలమండిగ, లపూపములయ్యలమేలుమంగ నీ**
**కరుదుగ విందుపెట్టు పరమాన్నచయంబులు, నూపకోటియున్**
**నిరతవినిర్మలాన్నములు, నేతులసోనలు వేంకటేశ్వరా!**

అన్నమయ్య యీ శతకము చెప్పుటలో తన్నుతానే మరచిన తన్మయత్వములో వేంకటేశ్వరుని, అలిమేలుమంగను అనేక సన్నివేశాలలో ఊహించుకొనుచు, ఇతరులకు తెలియని "దేవరహస్యాలు" తనకు తెలియునను భావనను కనపరచు పద్యమిది.

**"ఒప్పగు తూగు టుయ్యెలల నూగుచు, నీ వలమేలు మంగతో**
**నప్పుడు కౌగిటన్నతుల నాకటి పెల్లున నప్పళించుచున్**
**రెప్పల నవ్వులో, మనసురిచ్చలతో నరగన్నులార్చుచున్,**
**దెప్పలదేలు సౌఖ్యమిదె దేవరహస్యము వెంకటేశ్వరా!"**

ఇందున్న వృత్తములన్నియు చంపక ఉత్పలమాలలు. 'వెంకటేశ్వరా' మకుటము గల యీ శతకము వెంకటేశ్వరుని గుణగణములు పొగడుటకు బదులు అలిమేలుమంగపై చెప్పినదే అని, కృతి ఆమెకే అంకిత మివ్వబడినట్లు యీ శృంగార శతకాంత పద్యమున తేటపడుచున్నది.

**అమ్మకు తాళ్ళపాక ఘనుడన్నడు, పద్యశతంబు చెప్పగా**
**కొమ్మని వాక్ప్రసూనముల గూరిమితో నలిమేలుమంగకున్**
**నెమ్మది నీవు చేకొని, యనేక యుగంబులు, బ్రహ్మకల్పముల్,**
**సమ్మద మంది వర్థిలను జవ్వన లీలల వేంకటేశ్వరా।**

ఈ శతకమునేకాక యిటువంటివి మరి పదునొకండు వ్రాసినట్లు ప్రతీతి. తక్కిన శతకములు యింకను లభ్యము కాలేదు. ఈశతకము మోకాళ్ళ ముడుపుదగ్గర అమ్మపై చెప్పినదని యెరుగనగు. అటుపైన కొండపైకి పోయి అక్కడ దివ్యస్థలాలు చూచినాడు. స్వామి పుష్కరిణిలో స్నానంచేసి, గుడి ప్రదక్షిణచేసి, గుడిలో ప్రవేశించి 'పంచకొంగు కడ నున్నదొక కాసు కానుకపెట్టి', స్వామిని తనివితీరచూచి, కరువుతీరా తన సంకీర్తనలతో సేవించినాడు. తాను తొలుత చేసిన శేషాద్రి దర్శనమును అప్పుడో, బహుశః అటుతరువాతనో శ్రీరాగములో ఆబాల గోపాలము నోట అప్పటికి యిప్పటికి మరి యింకెప్పటికి పలికిస్తూ మరువరాని, మరువబోని యీ మహాకీర్తనను మనకు ప్రసాదించిన పరమ పావనుడు.

పల్లవి:- **అదివో అల్లదివో హరి వాసము**
**పదివేల శేషుల పడగల మయము**

చరణము:- **అదె వేంకటాచల మఖిలోన్నతము**
**అదివో బ్రహ్మాదుల కపురూపము**
**అదివో నిత్యనివాస మఖిల మునులకు**
**నదె చూడు(డదె మ్రొక్కు(డానందమయము** **॥అది॥**

చెంగట నల్లదెవో శేషాచలము
నింగినున్న దేవతల నిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్న ధనము
బంగారు శిఖరాల బహుబ్రహ్మమయము ॥అది॥

కైవల్యపదము వేంకటనగ మదివో
శ్రీ వెంకటపతికి సిరులయినది
భావింప సకల సంపదల రూపమదివో
పావనములకెల్లఁ బావన మయము ॥అది॥

తరువాత విడిదికిపోయినాడు. మరుదినము పాపవినాశములో స్నానమాడి కట్టుగుడ్డను ఉతికి ఆరవేసి, అదియెండ నారెడునంతలోపలనే 'కుతుకంబు సమకూర శతకంబు' ఒకటి చెప్పినాడని చిన్నన్న విరచిత 'అన్నమాచార్య చరిత్ర' వలన తెలియుచున్నది.

అటుపైన దేవతాదర్శనమునకు వచ్చిన దేవాలయము తలుపులు మూయబడి బీగాలు వేయబడి యుండెను. తన దైవాన్ని చూడవలయునను తహతహ పీడలేక వెంకటేశ్వరునిపై మరియొక శతకము చెప్పినాడు. నూరోపద్యము పూర్తియగునంతలో గుడి తలుపులు తెరచుకొన్నవి. అక్కడ ఉన్న అర్చకులు ఆశ్చర్యపరవశులై ఇంత చిన్న బాలుడు ఆశువుగా కీర్తనలు, శతకములు రచియించినాడనిన యీతడు వరప్రసాదుడని గుర్తించి చందన, తీర్థ, ప్రసాదముల నిచ్చి సత్కరించిరి. అన్నమాచార్యులు శ్రీ వెంకటేశ్వరస్వామివారి నందకము నంశమున అవతరించిరని ప్రతీతి గలదు. శ్రీ వెంకటేశ్వరుని ఖడ్గము పేరు నందకము.

ఈ విషయములన్నియు తెలిసిన తిరుపతిలోనున్న 'ఘనవిష్ణువు' అనే వైష్ణవ యతి యీ నల్లని చిన్నవానిని శ్రీవైష్ణవుని చేయవలయు నని సంకల్పించి అన్నమయ్యను 'ముద్రాధారణ చేయించుకొనెదవా!' యన సంతోషముతో అంగీకరించెను. వైష్ణవయతి చక్రాంకితాలు వేసి వైష్ణవ పంక్తిని భుజింపఁజేసినాడు. ఇట్లు వైష్ణవము పుచ్చుకొని అన్నమాచార్యులను నామాంతరము పొందెను. తమ కులములో యెన్నడులేని వైష్ణవాన్ని అన్నమయ్య స్వీకరించి తామసులుగా నుండిన తమ వంశాన్ని పరమ సాత్వికులుగా చేసినాడని వీరి పౌత్రుడు చిన తిరుమలాచార్యులు ఈ కీర్తనలో చెప్పియున్నారు.

పల్లవి:- ఎట్టి హితోపదేశకుండెటువంటి దయాళువు
అట్టి తాళ్ళపాక న్నమాచార్యుఁడు

చరణము:- పచ్చితామసులమమ్ముం బరమసాత్వికులఁగా
నిచ్చటనే చేసినాడు యెంత చిత్రము
ఇచ్చగించి మా కులాననెన్నడు లేని వైష్ణవ
మచ్చముగాఁ గృపసేసి నన్నమాచార్యుడు ॥ఎట్టి॥

ముదిరిన పాపకర్మములు సేసినట్టి మమ్ము
యెదుటఁ బుణ్యులఁ జేసె నెంత సోద్యము
కదిసి యే జన్మానం గానని సంకీర్తన
మదన నుపదేశించె నన్నమాచార్యుడు ఎట్టి

గడుసుందనపు మమ్ముఁగడు వివేకులఁ జేసి
యిడుమ లెల్లాఁ బాపెనే గురుడు
నడుమనే యెన్నడు గానని శ్రీ వెంకటనాథు
నడియాలముగ నిచ్చె నన్నమాచార్యుఁడు.

అన్నమయ్య అట్లు భగవద్భక్తిలో పరవశుడై, ఆశువుగా శతకములు కీర్తనలు చెప్పుకొనుచు తిరుమలపై బ్రహ్మచారిగా ఎంతకాలము గడిపినాడో తెలుపుటకు తగిన ఆధారములు లేకున్నవి.

గడ్డి కోయబోయినబాలుడు తిరిగి రాకపోవుటకు కారణము తెలియని తల్లిదండ్రులు, బంధువులు తల్లడిల్లి, చుట్టుపట్ల గల పల్లెలలోను, పరిసరప్రాంతములలోను వెదకి, వేసారి, నిరాశ చెందిరి. తనయుని మనసు తెలిసిన తల్లి తిరుపతిలో నుండునను తలంపుతో తనవారిని తోడ్కొని అక్కడికి పోయినది. కొంత మారియున్నను కొడుకును గుర్తించి యింటికి రమ్మని వేడుకొన్నది. వినలేదు. తిరుపతి వదలడం యిష్టములేక, తల్లినికాదని బాధించుటకు పాలుపోక డోలాయమాన మానసుడై యున్న అన్నమయ్యకు ఆరాత్రి దేవుడే కలలో కనిపించి 'జనని వాక్యము త్రోయజనదు పోయిరమ్మని' ఆనతిచ్చినట్లు చిన్నన్న అన్నమయ్య చరిత్రలో పేర్కొనినాడు.

అన్నమయ్య జీవితములో ఈ కల ఒకముఖ్యమైన మలుపు. ఆయన సంకీర్తనల సంపుటములను ఈ కల వచ్చిన తారీఖునుండి, అతని సంతతివారు భద్రము చేసినారు, 'స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు 1346 అగు నేటి క్రోధిసంవత్సరమందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదునారేళ్లకు, తిరువేంగడనాథుడు ప్రత్యక్షమైతేను, అది మొదలు ఆ దేవునిపై కీర్తనలు చెప్పి అంకిత మొనర్చినాడ' ని యాతని సంతతివారు రాగిరేకుల మీద చెక్కించి పదిలపరచినారు. ఇదియే ఆయన జననమును నిర్ణయించుటకు ముఖ్యాధారము.

అన్నమయ్య తల్లితో తాళ్ళపాక చేరినాడు. తనయునికి పెళ్ళి చేయవలెనని తల్లి భావించుట సహజమే. అంతటితో పెండ్లి అయిపోదు కదా! అయ్య వేషాన్ని 'గోవిందా। హరీ!' అంటూ గొణుగుకొను వానిని ఎప్పుడూ ఆలోచనా ఆందోళనలో ఉంటూన్న 'దాసరయ్య'ను చూచి తమ బిడ్డను ధారబోయుట కెవరు ఒప్పుకొందురు? వచ్చినవారు మరలిపోసాగిరి. తల్లియు తనయునికి పెండ్లికాదని తల్లడిల్లుచు, వేష భూషలు మార్చుకొనుమని వేడుకొన్నది. లాభములేక పోయినది. ఏడుకొండలవాని పైని మనసును మానవులు మార్చగలరా! అన్నమయ్యలోని ఆకర్షణ యెటువంటిదో కాని ఒక బంధువు తనకై తానే ముందుకువచ్చి యిద్దరు అమ్మాయిల నిచ్చి పెండ్లిచేసినాడు. వారే తిమ్మక్క అని కవయిత్రిగా పేరుగాంచిన తిరుమలమ్మ, అక్కలమ్మ. కూతురికి తిరుమలమ్మ యను పేరు పెట్టుటవల్ల బహుశః ఆ మామగారు వెంకటేశ్వర భక్తుడై యుండనోపు. ఆ దేవుని ఆదేశానుసారమే ఆయన వచ్చి కూతుళ్ళ నిచ్చి, ఆ వంశ వృద్ధికి, మహనీయులగు పుత్రపౌత్రులు కలుగుటకు కారకులైరి.

తరువాత కొంతకాలమునకు అన్నమయ్య అహోబిలం వెళ్ళి, అక్కడ పీఠాధిపతియగు 'ఆదివణ్ శఠగోప' మునీశ్వరుల వద్ద వేదాంత శాస్త్రమును అధ్యయనంచేసి, గొప్పపండితుడైనాడు. అన్నమయ్య యీ క్రింది భైరవిరాగములోని సంకీర్తనలో తన గురువగు శఠగోప యతని స్తుతియించిన విధమును పరిశీలించిన గురువుయొక్క ఔన్నత్యమును, శిష్యుని గౌరవ, భక్తి, శ్రద్ధలు విదితమగును.

పల్లవి:- **చూడుఁడిందఱకు సులభుఁడు హరి**
**తోడు నీడ యగు దొరముని యితఁడు**

చరణము:- కైవల్యమునకుఁ గనకపుదాపల
త్రోవై శ్రుతులకుఁ దుదిపదమై
పావన మొక రూపమై విరజకు
నావై యున్నాఁడిదె యితఁడు ॥చూడు॥

కాపాడంగ లోకములకు సుజ్ఞాన
దీపమై జగతికిఁ దేజమై
పాపాలదపఁగ భవపయోధులకు
తీపై యున్నాఁడిదె యాతఁడు ॥చూడు॥

కరుణానిధికి రంగపతికిఁ గాంచీ
వరునకు వేంకటగిరిపతికి
నిరతి నహోబల నృకేసరికిఁ ద
త్పరుఁడగు శఠకోప ముని యితండు

అహోబిల నారసింహుని భక్తితోఁ గొలిచి, ఆయనను అనేకము లగు కీర్తనలతో పొగడి, ఆ స్థల ఔన్నత్యమును, ఆ దేవుని మహిమను ప్రపంచమునకు చాటినాడు. నరసింహావతార ఘట్టాన్ని పదునొకండు చరణములతో హృద్యముగా వర్ణించినాడు. అప్పటికే సహజకవిగాక, కృషితో పండితుడైన అన్నమయ్యకు కవితలో పదలాలిత్యమే కాక, కమ్మదనమేగాక, పాండిత్యప్రకర్షపాడ కట్టుచున్నది. ప్రహ్లాదుని వలన హరి యా స్తంభమున కూడ కలడని విని కోపాద్రిక్తుడైన హిరణ్యాకశిపుడు స్తంభమును అరచేత చరచెను. ఆతని ప్రేటునకో లేక అందుండి హరి ఉద్భవించుట వలననో ఆ స్తంభము పగిలినది. ఆ చెయిదమున కనువుగనో లేక ఆ భయంకరావతారమును తెలుపుటకో, అపుడు పుట్టిన శబ్దముతో లయకలుపుతున్నదా యన్నట్లు వీరి యీ పదము కుదిరినది.

"ఆటమరి పెట పెట మని బేట్లెగసి
చిట చిట రవముల జిరుత పొగ లెగసి
తట తట మనుచును తరలి వ్రయ్యలై
పట పట మనుచు పగిలె కంబము"

అందుండి వెడలిన విజయ సింహము, వీర సింహము, భయదసింహమును విపులముగా వర్ణించి, హిరణ్యకశిపుని మరణానంతరము శాంతించి, అహోబలనారసింహమైన విధమును రసవత్తరముగా రచియించి భక్తిని ప్రకటించి, ముక్తిని సాధించిన మహనీయుడు. శేషాద్రిని వెలసిన మూర్తి, యీ అహోబల నారసింహుడేయని అన్నమయ్య తలంపు ఆభావమునే వీరు ఆధ్యాత్మ సంకీర్తనలలో పొందుపరచినారు.

అన్నమయ్యకు తన తాళ్ళపాక గ్రామమునకు చేరువనగల టంగుటూరును పాలించుచుండిన సాళువ నరసింహరాయలు బాల్య స్నేహితుడు. అన్నమయ్య జగన్మోహనమైన కీర్తనల ప్రతిభా ప్రతిపత్తులు తెలిసికొనిన రాయలు మిత్రుని తనపూరి కాహ్వానించి పూజలు చేసి కానుక లర్పించి ఆశీస్సు లిమ్మని ప్రార్థించెను. పరాక్రమశాలియగు నరసింహరాయలకు అన్నమయ్య ఆశీస్సులతో రాజ్యము సంపాదించ వచ్చునను నమ్మకము కుదిరినది. అన్నమయ్య దీవెన ఫలితమాయని కొంతకాలమునకు రాయలు పెనుగొండలో పట్టము కట్టుకొనెను. ఐశ్వర్యానికి అన్నమయ్య దీవెనయే కారణమని నమ్మిన రాయలు వారిని పెనుగొండకు రప్పించి, ఉచిత రీతిని సత్కరించి, వారు దేవునిపై ప్రతిదినము రచియించే పాటలు వినిపించ వేడుకొనెను. అన్నమయ్య తేనెలూరు తియ్యని పాటలు వినిపింప రాయలు, వారి ఆస్థానకవులు అందలి మధురామృతము గ్రోలుచు పరవశులగుచుండిరి. అందలి

శృంగారభావములు కాళిదాసాదులలో కానరాకుండెను. నరసింహ రాయలు తగు రీతిని కనకవస్త్ర వాహనములతో, వింజామరలతో కవి మిత్రుని సత్కరించుచు, సంతోషపరచుచు మహదానందముతో కాలము గడుపుచుండెను. అన్నమయ్య ఇట్లు పెనుగొండలోను, తన ఊరైన తాళ్ళపాకలోను, తన ఆరాధ్యదైవముండు తిరుపతిలోను, తదితర పుణ్యక్షేత్రములలోను కాలము గడుపుచుండెను. ఈయనకు ఇరువురు భార్యలవలన ఇద్దరు కొడుకులు, ఒక కూతురు గలిగిరి. తిమ్మక్కకు నరసింగన్న, అక్కమాంబకు పెదతిరుమలయ్య, తిరుమలాంబ జనియించిరి. వీరికుటుంబములోని వారందరు కవులు, కవయిత్రులగుచు పేరు ప్రఖ్యాతులతో ప్రసిద్ధిపొందిరి. వీరంతా సంకీర్తనలు చేయుచు సాహిత్యసేవ గావించుచూ సానందముగా కాలము గడుపుచుండిరి.

సాళువ నరసింహరాయలు తన మిత్రుడు, పదకవి, దైవభక్తుడగు అన్నమయ్యను మరలా పిలిపించి నిండోలగమున శృంగార కీర్తనలు గానముచేయ వేడికొనెను. వారపుడీ కీర్తనను రాగయుక్తముగా, అర్థవంతముగా, వీనుల విందగునటుల, కవులెల్ల చేమెత్తి మ్రొక్కునటుల ఆలాపించెనని చిన్నన్న చెప్పిన విధము చూడుడు.

తేనెలపై తేట తిన్నని చెఱకు
పానకముల నేరుపఱిచిన మేలు
చక్కెరలో తీపు చల్ల దెమ్మెరలు
చిక్కని కపురంపు జీవరత్నములు
కల యమృతంబు మీగడ మీది చవులు
చిలుకుచు గవులెల్ల జేయెత్తి మ్రొక్క

దీనిని పెదతిరుమలాచార్యులు నుతించిన విధము -

సురలకు నరులకు సొరిది వినవిన
అరుదు తాళ్ళపాక అన్నమయ్య పదములు
చక్కెరలై చవిచూపి జాలైతావి చల్లి
నక్కజపుమాతు, వజ్రాలై మెరసని
నిక్కుటద్దములై మానిలువు నీడలుచూపి
నక్కర తాళ్ళపాక అన్నమయ్య పదములు

నాద నామక్రియలో వారు పాడిన పాట

పల్లవి:- యేమొకో చిగురుట దరమున నెడనెడంగస్తూరి నిండెను
భామినీ విభునకు వ్రాసిన పత్రికగాదు కదా?

చరణము:- కలికి చకోరాక్షికింగడగన్నులు గెంపై తోచిన
చెలువం బిప్పుడిదేమో చింతింపరు చెలులు
నలువున ప్రాణేశ్వరుపై నాటిన యా కొనచూపుల
నిలువున బెరుకగ నంటిన నెత్తురుగాదుగదా?

పడతికి చనుగవ మెరుగులు పైపై బయ్యెద వెలుపల
కడుమించిన విధమేలా కనుంగొనరే చెలులు
వుడుగని వేడుకతో ప్రియుడొత్తిన నఖ శశిరేఖలు
వెడలగ వేసవికాలపు వెన్నెలగాదు గదా?

ముద్దియచెక్కులకెలకుల ముత్యాలజల్లుల చేర్పుల
నొద్దికలాగులివేమో ఊహించరే చెలులు
గద్దరి తిరువెంకటపతి కౌగిట యధరామృతముల
అద్దిన సురతపువేళల అందముకాదుగదా?

ఈ పదము భావసౌందర్యము పరాకాష్ఠ నందుకొన్నది. అలిమేలు మంగమ్మ కడకన్ను కెంపొటకు కారణ మామె చెలులు ప్రాణేశ్వరుపై నాటిన యాకొనచూపులు నిలువున పెరుగక నంటిన నెత్తురు కాదా ? యను ప్రశ్న వేసినాడాపదకవి. అన్నియు అపూర్వోహలే! సునిసిత శృంగారమే. తన్మయత్వములో తన మనోఫలకముపై సృష్టించి కొనిన శృంగారమూర్తుల వర్ణనయే. రాయలు తన్మయుడై పదేపదే ఆ పదమును పాడించుకొనినాడని చిన్నన్న వ్రాసినాడు.

**నలువున ప్రాణేశునాటిన చూపు**
**నిలువున బెరుకనూనిన శోణితంబు**
**తలపోయ గాదుగదాయన్న పదము**
**పలుమరు బాడించి పాడించి చొక్కినా**

తృప్తి కలుగలేదు. తనపైన ఇటువంటి కీర్తనలు చెప్పించు కొనిన బాగుండునని భ్రమసి అన్నమయ్యను రాయలు ఆశతో అడిగినాడు. ఆయనకది అసహ్యముగను, అసహజముగను తోచినది. 'నరహరి కీర్తన నానిన జిహ్వాబరుల నుతింపగనోపదు,' హరిని కొనియాడు నా జిహ్వ నిను కొనియాడనేరదని దిగ్గున లేచిపోయినాడు. అంతరులెంచక, ఆ విధముగ అలిగిపోయిన అన్నమయ్యపై ఆగ్రహించిన రాయలు తలపోసిన విధమును చిన్నన్న అన్నమాచార్యచరిత్రలో చక్కగా సంతరించినాడు.

**తన బాల్య సంఖ్యంబు తలచి సంపదల**
**దనయంత వానిగా దనర చేసితిని**
**గబ్బిమై నొకమాట కావలెనన్న**
**గొబ్బున కోపించు కొననేలవచ్చె**

భటుల పంపించి పట్టించి చెరసాలలో పెట్టించినాడు. అన్నమయ్య అదర లేదు. బెదరలేదు. అన్ని వేళలలోను ఆపత్సమయములలోను హరి నామమే దిక్కని నమ్మిన అన్నమయ్య ఆవేశముతో పాటలు పాడసాగి నాడు.

పల్లవి:– ఆకటివేళల నలపైన వేళలను
లేకువ హరినామమే దిక్కు మరిలేదు.

చరణము: కొఱమాలి వున్నవేళ కులము చెడినవేళ
చెరపడి ఒరులచే చిక్కినవేళ
వొరపైన హరినామ మొక్కటే గతిగాక
మరచి తప్పిననైన మరిలేదు తెరగు ॥ఆకటి॥

నాపదవచ్చినవేళ నారడి బడినవేళ
పాపపువేళల భయపడినవేళ
వోపినంత హరినామ మొక్కటే గతిగాక
మూపుదాకా బొరలిన మరిలేదు తెరగు ॥ఆకటి॥

సంకెల బెట్టినవేళ చంప బిలిచినవేళ
అంకిలిగా నప్పులవారాగినవేళ
వెంకటేశునామమే విడిపించగతిగాక
మంకుబుద్ధి బొరలిన మరిలేదు తెరగు ॥ఆకటి॥

పాట పూర్తిఅగుసరికి సంకెలలు తమంతట అవియే త్రెంచుకొనినవి. భటులు రాయల కావిషయము విన్నవింప నమ్మజాలనివాడై, రాయలు మరలా సంకెలలు వేయించి, ఈ సారి ఊడిన నీవే నాదైవమను కొంటాను అనినాడు. అన్నమయ్య ఆ పాట మరల పాడినదే తడవుగా సంకెలలు ఊడిపడినవి. సాళువ నరసింహరాయలు అన్నమయ్య కాళ్ళ

మీద పడి క్షమాపణ కోరినాడు. అన్నమయ్య మనస్కరించి మన్నించినాడు. రాయలే ఆయనను పల్లకి యెక్కించి మోసినాడు. అన్నమయ్య అతనిని ఆశీర్వదించినాడు. రాయలు కర్ణాటక రాజ్యానికి సామ్రాట్టు అయినాడు. అన్నమయ్య కర్ణాటక సంగీతానికి మూలవిరాట్టుఅయినాడు.

అన్నమాచార్యుల కీర్తనలు ఆంధ్రదేశమంతటా వ్యాపించి పేరు ప్రతిష్టలు పొందినవి. వాగ్గేయ కారులనేకులు వారిదర్శనార్థమై, అన్ని ప్రాంతములనుండి వచ్చిపోవుచుండెడివారు. కర్ణాటక భాషలలో వేల కొలది సంకీర్తనలువ్రాసి వాసిగాంచిన పురందర దాసు వచ్చి, అన్నమయ్యను చూచి, వారి కీర్తనలువిని, పులకాంకితుడై, ఆయన వెంకటేశ్వరుని అవతారమని నుతించినాడనిన వాని పలుకుబడి ప్రాభవములు చెప్పనక్కరలేదు.

అన్నమాచార్యులు పురందరు దాసుకీర్తనలు విని విస్మయుడై ఆయనను శ్రీ పాండురంగ విఠలుని అవతారమని పొగడెను. పదకవి ప్రభావము, ప్రాభవము పురందరదాసుల వారిపై ప్రాకినది. వారు అన్నమయ్యను అనుసరించి కొన్నికీర్తనలను అల్లినారు. అందులో నొకటి పరిశీలింతము. అన్నమయ్య భజనపద్ధతిలో మాళవి రాగములో సాగించిన ఈ సంకీర్తనమును చూడుడు.

పల్లవి:- శరణు శరణు సురేంద్ర సన్నుతశరణు శ్రీసతి వల్లభా
శరణు రాక్షస గర్వసంహర శరణు వెంకటనాయకా.

చరణము:- కమల ధరుఁడును కమల మిత్రుడు కమల శత్రుడు పుత్రుడు
క్రమముతో మీ కొలువుకిప్పుడు కాచినారెచ్చరికయా ॥శర॥
అనిమిషేంద్రులు మునులు దిక్పతు లమరకిన్నర సిద్ధులు
ఘనత తో రంభాది కాంతలు కాచినారెచ్చరికయా ॥శర॥

ఎన్నఁగల ప్రహ్లాద ముఖ్యులు నిన్ను గొలువగవచ్చిరి
విన్నపము వినవయ్య తిరుపతి వెంకటాచల నాయకా ॥శర॥

పురందర దాసులవారు అన్నమయ్యాయొక్క యీ సంకీర్తన విని ఆనందించి తన్మయుడై తచ్ఛాయలలో తనకీర్తనను దొరలించినట్లున్నది.

పల్లవి:– శరణు శరణు సురేంద్ర వందిత శరణు శ్రీపతి సేవిత
శరణు పార్వతీ తనయ మారుతి శరణు సిద్ధివినాయకా
నిటలనేత్రన దేవిసుతనె నాగభూషణ ప్రియనె
తటిల్ల తాంకిత కోమలాంగనె కర్ణకుండలధారనె ॥శర॥

సిటువుముత్తిన పదకహారనె బాహూహస్త చతుష్కనె
ఇట్టి తోడగియు హేమ కంకణపాశ అంకుశధారనె ॥శర॥

కుక్షి యొళు మహాలంబోదరనె ఇక్షు చాపగెలిదనె
పక్షి వాహన నాదపురందర నిట్టలన నిజదాసనె ॥శర॥

అన్నమయ్య ప్రభావము అందరిపైన పడిన అది ఒక మెత్తు. పురందర దాసుని ఆ కట్టుకొని అనుసరింపజేసినదన అది ఒక మెత్తు. అన్నమయ్యలో మరియొక సుగుణమున్నది. పురందరుదాసు తన పేరును తన కీర్తనల అంత్యములో 'పురందర విఠ్ఠలన నిజదాసనె' అని చెప్పుకొనినాడు. త్యాగరాజు కూడ తన కీర్తనల తుదిన 'త్యాగరాజ నుత' అని చేర్చుకొనినాడు. అన్నమయ్య వేలకు వేలు కీర్తనలు వ్రాసిన తన పేరును తడవని నిరాడంబరుడు. ఇది వారి సంస్కృతిని చాటుచున్నది.

ఈ గాయక శిఖామణి కీర్తనలు వ్యాకరణ నియమములకు లోబడవు. వీరి కీర్తనలు భక్తి రసముతో పొంగి దేవునితో ఈయన మాట్లాడుచున్నాడా! యనునట్లుండును. వీరి కీర్తనలకు భక్తి భావమే

ప్రధానముకాని వ్యాకరణము, ఛందస్సుకాదు. ఈ పద కవితాపితామహుడు తరువాతి సుప్రసిద్ధవాగ్గేయ కారులగు త్యాగరాజు, క్షేత్రయ్యలకు మార్గదర్శకుడై పేరుగాంచెను. అందరు విష్ణుభక్తులే. అయితే అన్నమయ్య వేంకటేశ్వర భక్తుడు. త్యాగయ్య శ్రీరామభక్తుడు. క్షేత్రయ్య వేణుగోపాల భక్తుడు. వీరందరు తా మారాధించిన రూపములలో పరమేశ్వరుని ప్రత్యక్షము చేసికొని తన్మయులై తరియించినవారే. అన్నమయ్యగారి శృంగార సంకీర్తనములలోని భావాభావములు, తరువాత యిన్నూరు సంవత్సరములకు వచ్చిన క్షేత్రయ్య కీర్తనములకు దోహదకారిమైనవి. వీరి అధ్యాత్మిక సంకీర్తనముల ప్రాతిపదికపై మరి రెండు వందల సంవత్సరములకు వచ్చిన త్యాగయ్యగారు కీర్తనముల సాగించిరి. ఈ యిరువురికేగాక రామదాసని ప్రఖ్యాతిగాంచిన కంచెర్ల గోపయ్యకు అన్నమయ్యయే ఆదర్శము.

అన్నమయ్య కీర్తనలలో మేలుకొలుపులు, ఉయ్యాలపాటలు, జోలపాటలు, తలుపుదగ్గర పాటలు, లాలిపదాలు, తుమ్మెదపదాలు, చిలుకపదాలు, కోకిలపదాలు, మంగళహారతులు మొదలు గాగల అనేక విధములగు పాటలను రచియించి అనేకులకు మార్గదర్శకులైరి. ఇట్టి వీరిని వ్రాయవలయుననిన వీలుపడునదికాదు. అన్నమయ్య పౌత్రుడు చినతిరుమలాచార్యులు తన 'సంకీర్తన లక్షణ' మను గ్రంథమున తాత గారి పదముల నుతించుచు వ్రాసిన ఒక పద్యమును ఇచట ఉటంకించిన దేశములో వాని ప్రాశస్త్య ప్రాభవములను తెలియజేయును.

**శ్రుతులై, శాస్త్రములై, పురాణకథలై, సుజ్ఞానసారంబులై,**
**యతిలోకాగమవీధులై, వివిధమంత్రార్థంబులై, నీతులై,**
**కృతులై, వేంకటశైలవల్లభ రతి క్రీడారహస్యంబులై,**
**నుతులై, తాళ్ళపాకయన్నయ వచో నూత్నక్రియల్ చెన్నగున్.**

ఇక వారి కార్యములను, కీర్తనలను పరిశీలించి వానిలోని కమ్మదనమును చవిచూతము.

అన్నమాచార్యులవారి రచనలు లభ్యమగుటకు వానిలో ముఖ్యముగా కీర్తనలు, వీరి పుత్రులు పేరుప్రఖ్యాతులు పొందిన కవి, గాయకుడు పెద తిరుమలయ్యచే రాగిరేకులపై చెక్కింపబడి ఆలయములో నొక గదిలో పదిలపరచుటయే ముఖ్యకారణము. వీరు రచియించినవి ముప్పది రెండువేల కీర్తనలు. అందులో రెండువేలు మాత్రమే లభ్యమై ప్రకటింపబడినవి. ఈయన తన జీవితమంతయు కీర్తనలు రచియించుచూ, వానిని తన్మయత్వంతో గానము చేయుచు తనస్వామిని సందర్శించుకొనుచుండువాడని ప్రతీతి. వీరి కీర్తనలలోని ఆ భక్తి తత్వమును పరిశీలింతము.

అన్నమయ్య సగమునకు పైగా మధురభక్తిపరమైన శృంగార సంకీర్తనములు వ్రాసెను. శృంగారరసము లౌకికమైనదియు, లైంగికమైనదియు అయినను, భక్తియుక్తమై దైవపరమైనపుడు పారమార్థికము నాధ్యాత్మికము నగుచున్నది. అన్నమాచార్యుల శృంగార కీర్తనలు శ్రీవెంకటేశ్వరుని దివ్యనామమున జొప్పించి తత్పరముగా కీర్తించి అలమేలు మంగను శృంగార రసమున స్తుతించుట దైవికమైన భక్తిపారవశ్యమున లభించు శృంగార భావము. సమకాలికుడైన పోతన శృంగారరసపోషణ వలె దైవపరమైనది. కాని పోతనది భాగవత భక్తి. అన్నమయ్యది గోపికాభక్తి. ఉత్తర దేశమున శ్రీచైతన్యస్వామి, శ్రీరూపగోస్వామి, మీరాబాయి, శ్రీలీలాశుకుడు, శ్రీజయదేవుడు మొదలగువారి రాధా మాధవ తత్వము వలె దక్షిణమున అన్నమయ్య కీర్తనలు ఆ కోవలో సాగినవి. వారి ఒకకీర్తనలో ఈ భావము వెలిబుచ్చినారు.

'రాధామాధవ రతి చరిత మతి
బోధావహం శ్రుతి భూషణం'

మాధవునందు రాధికకువలె శ్రీ వేంకటేశ్వరునందు అలమేలుమంగ ప్రదర్శించిన భక్తి ఒక విధముగనేయున్నది. ఇది స్వప్రయోజనమై, స్వార్థమై, క్షణికమై, అనిత్యమై, దుఃఖాంతమగు కామముకాదు. నిత్యమై, నిత్యానందమై, ఇంద్రియాతీతమై, ఆత్మార్పణమైన పరమ ప్రేమ. ఇది మధురమైనది. ఇది భక్తిమార్గముల ఐదింటిలో ఉన్నతమైనది. ఉత్తమమైనది. దీనినే కాంతాభావ భక్తియందురు. తన సర్వస్వమును విభుని ఆనందపరచుటకై యుపయోగపడి, పతియానందమే సతియానందమను మధురభక్తి. పరమాత్మ పతిగను, ఆత్మ సతిగను, ఆత్మ పరమాత్మను చేరుటకు చేయు ప్రయత్నమునకు మధురభక్తి యందురు. ఇట్టి భక్తిని మృదుమధుర పదములతో నతిశృంగారముగ అన్నమాచార్యులు తన గేయములలో జొప్పించిన విధము చూడుడు.

ముఖారి

పల్లవి:- ఇదిగాక సౌభాగ్యమిదిగాక తపము మఱి
యిదిగాక వైభవంబిక నొకటికలదా

చరణము:- అతివ జన్మము సఫలమై పరమ యోగివలె
నితర మోహాపేక్షలన్నియును విడిచె
సతికోరికలు మహాశాంతమై యిదెచూడ
సతత విజ్ఞాన వాసిన వోలెనుండె ॥ఇదిగాక॥

తరుణి హృదయము కృతార్థతబొంది విభుమీది
పరవశానంద సంపదకు నిరవాయ
సరసిజానన మనోజయమంది యింతలో
సరిలేక మనసు నిశ్చల భావమాయ ॥ఇదిగాక॥

శ్రీ వేంకటేశ్వరుని జింతించి పరతత్వ
భావంబు నిజముగా బట్టైజెవియాత్మ
దేవోత్తముని కృపాధీనురాలై యిపుడు
లావణ్యవతికి నుల్లంబు దిరమాయె.

వీరి శృంగార సంకీర్తనములు తెలుగుననే కాక సంస్కృతమున కూడ కలవు ఆదేవభాషలోని ఒక కీర్తన నిందు పొందుపరచిన దాని హావభావములను, అందులోని యింపు సొంపులను, ఆ భాషలో చొరవ గల అదృష్టవంతులు ఆస్వాదించెదరు.

ముఖారి — జంపతాళం.

పల్లవి:- జానామ్యహం తే సరసలీలాం
నానావిధ కపటనాటక సఖత్వం ॥

చరణము:- కింకరోమి త్వాం కితవ పరకాంతాన
ఖాంకుర ప్రకటనమ తీవ కురుషే
శంకాం విసృజ మమ సర్వం నకరుణం
కింకారణం తైః ఖేలన మిదానీం ॥

కింభాషయ సిమాంకి తవమాన స తనయా
డాంబిక తయా విడంబయసి కిం
గాంభీర్య మావహసి కా తరత్వేన తవ
సంభోగ చాతుర్యసాదర తయా కిం

కిమితిమామను నయసి కృపణ వేంకటశైల
రమణ భవదభిమత సురత మనుభవ
ప్రమదేన మత్ప్రియం ప్రచురయసి మానహర
మమతయా మదన నిర్మాతాన కింత్వమ్ ॥

[5]

వీరి శృంగార కీర్తనల నుండి యీ పదమును తీసికొందము. ఇందులోని శృంగార రసపోషణ, అది ఊహించుకొనువిధము, చెప్పెడి పద్ధతి, ఆ దేవరహస్యము తెలిసిన అన్నమాచార్యులే చెప్పగలరు. పదముల సరళత, భావకాఠిన్యము, చెప్పుటలోని నూతనత్వము ఈ పాటకు సొంపును చదువరులకు ఇంపును కలిగించుచున్నది.

## కాంభోజి.

పల్లవి:- తరువాతిమాట లెల్ల దయ్యీ మెఱుంగు
యెఱుంగని దానంగాను యేమనందు నేను ॥

చరణము:- మంతనము లాడుకొంటా మంచముపై గేరుకొంటు
యంతతడవు నుండరా యిద్దరు మీరు
అంతలో నేరాగాను ఆఘెంజూపి యెవ్వతంటు
యెంతకెంత నన్నడిగే వేమందు నేను ॥

అంగము లొరసుకుంటా, నాయములు ముట్టుకొంటా
యెంగిలి పొత్తందుకోరా యిద్దరు మీరు
సంగడి నేగూచుండరా సతి నాచెలియనుచు
యింగితానం బేరడిగేవేమందు నేను ॥

రమ్మికౌంగిలించు కాయము లుబ్బించుకొంటా
యిమ్ములం గూడి యుండరా యిద్దరు మీరు.
పమ్మి నేదగ్గరగాను పైకొనికూడితి విట్టె
యెమ్మెల శ్రీవెంకటేశ యేమందు నేను.

ఈ పదము కాంభోజరాగములో సంగీతసాహిత్య సంగమమై సొంపుకులుకుచున్నది. పల్లవిలోని రెండు పాదములకు యతిప్రాస నియమములు కుదిరినవి. అటులనే తరువాత పంద్రెండు చరణములలో ప్రతి

నాలుగుంచరణములకు పల్లవి జోడించుచు వానికి యతిప్రాసలు చక్కగా పాటించుట వలననే ఆ పదమున కానడక కుదిరినది.

వీరి శృంగార కీర్తనలు కాయజోపనిషత్తు, మన్మథ వేదము. ఇందులోని రచన ప్రబంధశృంగారములలో వలె కొంత మోతాదు మించియుండినను, వీరిభావములు, కల్పనలు, చమత్కారములు, శిల్పములు, ముఖ్యముగా జాతీయములు ప్రత్యేకములు. శృంగార, వైరాగ్యములకు పొత్తు కుదురదు. ఒకదానికి మరియొకటి విరుద్ధమైనది. వీని రెంటివి మచ్చికచేసి ఒకదాని ప్రక్కన మరియొకటి నిలుపగల శక్తి అన్నమయ్యకు కలదు. ఈ గేయమే దానికి తార్కాణము.

పల్లవి:- ఫూరులేని పొలిమెర పేరు పెంపు లేని బ్రతుకు
గౌరవంబు లేని ప్రియము కదియ నేటికి ॥

చరణము:- ఉండరాని విరహవేదన వుండని సురతసుఖ మేల
యెండలేని నాటినీడ యేమి సేయునే
దండికలుగు తమక మనేటి దండలేని తాలియేల
రెండు నొకటిగాని రచన ప్రియము లేటికె ॥

మెచ్చులేనిచోట యెంతమేలు కలిగి నేమిశెలవు
మచ్చికలేనిచోట మంచిమాటలేటికి
పెచ్చుపెరుగలేనిచోట ప్రియము గలిగి యేమిఫలము
ఇచ్చలేనినాటి సొబగు లేమిసేయునే

బొంకులేని చెలిమిగాని బొందులేల మనసులోన
శంకలేని గదియలేని చనువులేటికె
కొంకుకొసరులేని మంచి కూటమలర నిట్లుగూడి
వేంకటాద్రి విభుడులేని వేడుకేటికి.

తమ ఇంటి ఆడపడుచుగా భావించి, చనువు తీసికొని అలమేలు మంగమను ప్రణయమూర్తిగా, వేంకట భర్తయెడ గల ఆమె గాఢాను రాగమును, దేవరహస్యమును తెలిపిన యీ కవి అనేక విధములైనవారి ప్రణయ సన్నివేశములను ఊహించి తనివితీర వర్ణించుటలో కలదా తనయుని తన్మయత్వము. కామశాస్త్రములోని వనితల జాతిలక్షణము లన్నియు అలమేలుమంగకు ఆపాదించి అభివర్ణించినాడు అన్నమయ్య. అంతటితో వదలక అన్నిరాసులు ఆమెవేయని ఆమెలోని గుణగణము లను, ఇంపుసొంపులను రాశులకు సమన్వయించి చెప్పిన విధములోగలదా కవిభావ సౌష్ఠవము, పదముల సమన్వయశక్తి.

పల్లవి:— ఇన్నిరాసుల యునికి ఇంతిచెలువపురాశి
కన్నె నీరాశికూటమి కలిగినరాశి

చరణము:— కలికి బొమవిండ్లు గల కాంతకును ధనురాశి
మెలయు మీనాక్షికివి మీనరాశి
కులుకు కుచకుంభముల కొమ్మకును కుంభరాశి
వెలుగు హరిమధ్యకును సింహరాశి ॥

చిన్నిమకరాంకపు బయ్యెద ఛేడెకు మకరరాశి
కన్నెప్రాయపు సతికి కన్నెరాశి
వన్నెమై పైడితులదూగు వనితకుం దులరాశి
తిన్నని వాడిగోళ్ళ సతికి వృశ్చికరాశి.

ఆముకొనినొరపుల మెరయు నతివకు వృషభరాశి
గామిడిగుట్టుమాటల సతికి కర్కాటకరాశి
కోమలపు చిగురుమోవి కోమలికి మేషరాశి
ప్రేమ వెంకటపతి కలిసె ప్రియ మిధునరాశి.

కడపటి చరణము కమ్మగా కుదిరినది. అలమేలుమంగ ఆమె భర్తతో కలిసి మిథునరాశియైనదట!

భూపాళరాగములో సాగించిన యీ సంకీర్తన స్వామివారి మేలుకొలుపు. అనేకులైన నీ ఆశ్రితులు రాత్రి యంతయు వేచి, తెల్లవారగనే వింత వింతలైన విన్నపములుచేయ వేచియున్నారు. పన్నగపు దోమతెర పైకెత్తి అలమేలు మంగను రెప్పలు విచ్చి తొలుతచూచి **తరువాత** తక్కిన వారిని చూచుట శుభప్రదమని సలహాయిచ్చి తమ ఆడబడచుగా తలంచిన ఆయమపై గల భక్తిప్రీతులను ప్రదర్శించినాడు. అన్నమయ్య కాలములోకూడ దోమతెరలున్నవేమో! ఆదిశేషుడు తన దైవము వెంబడే ఆయన అవతారములలో **నుంటూ** అన్ని విధములా ఆదుకొనుచుండెనని యీ ముఖాచార్యులవారు చెప్పిరి 'అలర్ మేల్ మంగై' అను తమిళపదమునకు తెనుగున 'అలమేలు మంగ' అను రూపము వచ్చినది. తమిళములో 'మంగై' అను పదమునకు 14-18 సంవత్సల మధ్యవయసు గల స్త్రీ యని పేరు. ఆ పేరునకు అర్థము పూవుమీద స్త్రీ యని. లక్ష్మి తామరపై స్త్రీ కదా! అందులకే ఆమెను 'పద్మావతి' అనెదరు. భారతీయ సాంప్రదాయము ప్రకారము నిద్ర లేచిన వెంటనే తనయిల్లాలిని కాని, గోవును కాని, తన చేతిలోని రేఖలను గానీ చూచుట పరిపాటి. 'సిరిమొగము దెరచి చిత్తగించవేలయ్యా?' అనుటలో శ్రీమంతమైన మీ మొగమును దోమ తెరతీసి దర్శనమిమ్మని ప్రార్థన. పొంకపు శేషాదులు, తుంబురు నారదాదులు, పంకజభవాదులు నీపాదాల చేరియున్నారు మేలుకొనమని మొరలిడిన అన్నమయ్య వేడికోలు వినిన వేంకటేశుడు వేడుకతో మేల్కాంచియే యుండును

**భూపాళరాగం – రూపకతాళం.**

**పల్లవి:–** విన్నపాలు వినవలె వింతవింతలు
**పన్నగపు దోమతెర పైకెత్త వేలయ్యా!**

చరణం:- తెల్లవారె జామెక్కె దేవతలు మునులు!
అల్లనల్ల నంతనింత నదిగో వారే
చల్లని తమ్మిరేకుల సారసపుఁ గన్నులు।
మెల్లమెల్లనె విచ్చి మేలుకొన వేలయా ॥విన్న॥

గరుడ కిన్నర యక్ష కామినులు గములై
విరహపు గీతముల వింతలాపాల
పరిపరి విధములఁ బాడేరు నిన్నదివో
సిరిమొగము దెరచి చిత్తగించ వేలయ్యా ॥విన్న॥

పొంకపు శేషాదులు తుంబురు నారదాదులు
పంకజభవాదులు నీ పాదాలు చేరి
అంకెల నున్నారు లేచి అలమేలు మంగను
వేంకటేశుఁడా రెప్పలు విచ్చి చూచి లేవయ్యా ॥విన్న॥

అన్నమయ్యగారి దంపుడుపాట అతి మనోహరముగా నున్నది. కష్టమైన పనులు చేయునపుడు వానిని మరచుటకు, లేక పనిచేయునపుడు మనసుకు ఉల్లాసము కలిగించుటకు పాటలు పాడుకొనుట పరిపాటి. అందరు కలిసి బృందగానము చేయుదురు. ఈ పాటలనే రోకలిపాటలని కూడ అనెదరు. 'సువ్వి, సువ్వి' అను మాటలు దంచుటవలన కలుగు శబ్దమో లేక వారి యూర్పుల శబ్దమో అగును. 'ఓల, ఓలాల' శబ్దములు జలకమాడునపుడు చేయు శబ్దములుగా మనకు తెలియును. ఓలాల, అను శబ్దములు చరణముల అంత్యములనుండుటవలన ఈ పాటకు శబ్దరామణీయకత నిచ్చుచున్నది. యువతులు శృంగారమును ఒలక బోయుచు దంచుట మొదలిడినారు. వారి మనసులు కుందెనచేసి చూపు లనెడి రోకళ్లతో దంచుటకు మొదలిడినారు. 'బంగరు సరిగెపట్టు చీరల పైటకొంగులు ఊగులాడగా దంచినారట. వారి కురులు వీడగా' చను

గుబ్బలపై సరులు నాట్యమాడగా అతివలు అందముగా ముద్దులు గురిపించుతూ దంచినారట. గాజులు ఘల్లుమన, రోకలి బరువుకు హరిమధ్యల నడుములు అసియాడ సతులు దంచుట ముగించి పూల పందిండ్లలో రతిపారవశ్యములో కోనేటప్పని పాడుతూ తెప్పలు తేరినారట.

### కేదార గౌళరాగము – మిశ్రచాపుతాళం.

పల్లవి:– సువ్వి సువ్వి సువ్వి సువ్వని
సుదతులు దంచెద రోలాల

చరణము:– వనితల మనసులు కుందెన చేసిటు
వలపులు తగ నించోలాల
కనుచూపు లనెడు రోకండ్లను
కన్నెలు దంచెద రోలాల ॥సువ్వి॥

బంగరు చెఱఁగుల పట్టు పుట్టములు
కొంగులు దూలఁగ నోలాల
అంగనలందరు నతివేడుకతో
సంగడి దంచెద రోలాల ॥సువ్వి॥

కురులు దూలఁగ మంచి గుబ్బచనులపై
సరులు దూలాడఁగ నోలాల
అరవిరి బాగుల నతివలు ముద్దులు
గురియుచు దంచెద రోలాల ॥సువ్వి॥

ఘల్లుఘల్లుమను కంకణరవముల
పల్లవపాణుల నోలాల
అల్లన నడుములు ఆసియాడుచు సతు
లొల్లనె దంచెద రోలాల ॥సువ్వి॥

కప్పురగంధులు కమ్మనిపువ్వుల
చప్పరములలో నోలాల
తెప్పలుగా రతిఁ దేలుచుఁ గోనే
టప్పనిఁ బాడెద రోరాల ॥సువ్వి॥

ఈ పాటలోని 'చాంగు - భళా' అను రెండు మాటలు అమ్మ వారి అసాధారణ సౌందర్యమునకు మురిసిన అన్నమయ్య వాడిన భళిరా! లాంటి ప్రశంసావాచకములు. ఆయన మెచ్చులు ఆ మాటలలో ధ్వనింప చేసినాడు. వీని అర్థమును వెలికితీయ ప్రయత్నించుట కన్న వానిని విని ఆ హాయిని అనుభవించుట మంచిది. ఆయన అందచందములను వర్ణించుచు 'చాంగు, భళా' యని ప్రశంసించినాడు. అయ్యగారు యేమి చేసినారోగాని అమ్మవారి కులికెడి మురిపెపు తీవ్రచూపులకు చాంగు భళా. ఆమె కసరినను అందముగా నున్నదట. పతిప్రక్కన కిన్నెరతో నిలిచిన ఆమె చన్నుమెఱుగులు, ఉన్నతిన్ పతిపై న్వొరగి నిలిచినపుడు సన్నని నడుము మనోహరముగా నున్నవట. ధరించిన ముత్యముల హారములకు చాంగు భళా వెంకట విభుని పెనవేసికొన్న ఆమె సందిదండలకు చాంగు భళా. ఈ పాటలోని సంగీతమునకు తీసిపోని సాహిత్యము వీని రెంటిని మించిన భావమధురిమ కాననగును.

## పాడిరాగము - ఆదితాళం.

పల్లవి:- చక్కని తల్లికి - చాంగు భళా తన
చక్కెర మోవికి - చాంగు భళా.

చరణము:- కులికెడి మురిపెపు కుమ్మరింపు తన
సళుపు జూపులకు చాంగు భళా
పలుకుల సొలపులఁ బసతోఁ గసరెడి
చలముల యలుకకు చాంగు భళా ॥చక్కని॥

కిన్నెరతో పతి కెలన నిలుచు తన
చన్ను మెఱుఁగులకు దాంగు భళా
ఉన్నతి బతిపై నొరగి నిలుచు తన
సన్నపు నడిమికి దాంగు భళా ॥చక్కని॥

జందెపు ముత్యపు సరుల హారముల
చందన గంధికి దాంగు భళా
విందయి వేం టవిభుఁ బెనఁచిన తన
సంది దండలకు దాంగు భళా ॥చక్కని॥

అన్నమయ్య కీర్తనలు యెక్కువగా శ్రీ వెంకటేశ్వరునిపై చెప్పబడినవే. కొన్నిమాత్రము పాండురంగ విఠలుని, కోనచెన్నరాయని, అహోబిల నరసింహుడు, కృష్ణుడు మొదలగువారిపై గూడ కలవు. కాని అన్నియు శ్రీ వేంకటేశ్వరునికే అంకితముగాబడినవి. కృష్ణునిపై సాళంగనాటరాగమున పాడిన యీ పాటలో భాషా భావములలోనిసరళత్వము, అంత్యానుప్రాస వలన కలిగిన శబ్దరామణీయకత హృద్యము.

గోవిందుఁడీ బాలుడు గోపాలుఁడు
కావింప రేపల్లెలోని కాంతాలోలుడు ॥పల్లవి॥
జనియించెఁ గృష్ణుఁడు సర్వలోక జిష్ణుడు
దనుజాంతకుఁడు యీతఁడే విష్ణుఁడు
పనివడి సజ్జనుల పాలికి వర్ధిష్ణుడు
సనకాదులమతుల సంచరిష్ణుడు ॥గోవిందు॥

పెరిగెఁ గంసశత్రుఁడు భీషణతేజ మిత్రుఁడు
వరవసుదేవ దేవకీపుత్రుఁడు
వరుస భావించిచూడ సర్వజీవగాత్రుఁడు
పరగ రుక్మిణీ సత్యభామా కళత్రుఁడు ॥గోవిందు॥

వెలసె భూధరుఁడు విశ్వలోక గురుఁడు
సులలిత బలభద్ర సోదరుఁడు
కలితనిశ్చల శ్రీవేంకటగిరి సంచారుఁడు
కలసిన యలమేల్మంగా మనోహరుఁడు ॥గోవిందు॥

అన్నమయ్యగారి ఆధ్యాత్మ సంకీర్తనములు భాషాభావములలో, శృంగార సంకీర్తనల మించినవిగా నున్నవి. ఇవి వైరాగ్య భావములు కలిగినవైనప్పటికిని, జుగుప్సాకరములుగాక, వినుటకింపై, ఆత్మపరిశోధిత ములై, ఐహికములోని అస్థిరతను, ఆముష్మికములోని శాశ్వతను చూపుతూ ముక్తికి భక్తియే సాధనమని చాటుచున్నవి. మచ్చునకొక కీర్తనను తీసికొని దానిలో గుణగణములను పరిశీలింతము.

మొదట వీరు సంస్కృతమున సామంతరాగములో విరచించిన ఆధ్యాత్మిక సంకీర్తన నొకదానినిందు పొందుపఱచిన యీ కవి శక్తి యుక్తులు, ఆభాషలో వీరికిగల చొరవ ప్రతిభ ఆ భాష యెరిగినవారు గ్రహించగలరు.

పల్లవి:— ఏవం శృతిమత మిదమేవ త
ద్భావైతుమతః పరం నాస్తి
అతులజన్మభోగ సక్తానాం
హితవైభవ సుఖమిదమేవ
సతతం శ్రీహరి సంకీర్తనం
తద్వ్యతిరిక్తసుఖం వక్తుం నాస్తి॥

బహుళ మరణ పరిభవ చితానాం
ఇహపర సాధన మిదమేవ
అహిశయన మనోహరసేవా
తద్విహారిణంవినా విధిరపి నాస్తి॥

సంసారదురిత జాడ్యపరాణాం
హింసా విరహిత మిదమేవ
కంసాంతక వేంకటగిరి పతేః
ప్రశంసైవ పశ్చాదిహ నాస్తి ।

ఈ లోకములో సుఖములు క్షణికములు. అవి యన్నియు ఫలితములు లేక వృథాయగునట. కాముకపు మనసునకు అది అంతులేదట. వత్తిలోపలి నూనెవంటిది జీవనమట. నూనె అయిపోగానే దీపమారిపోవును. విత్తుపైన పొక్కవంటిది దేహము. విత్తు మొలకెత్తినవెంటనే పొక్క రాలిపోవునట్లు, జీవము పోయిన వెంటనే దేహమంత మొందును. జీవాత్మకు చావులేదనియు, ఆయుర్దాయము తీరిన దేహము నుండి జీవాత్మ పరమాత్మలో చేరు విధముగ విత్తు మొలకెత్తి వృద్ధిపొందినను విత్తు పైపొట్టు వీడి నశించునని భావము. ఇందులోని సాదృశ్యములు చక్కనివి. అన్ని విధముల అమరినవి. తినబోతూ రుచియడుగుట యెందులకు?

పల్లవి:- ఏమి గలదిందు నెంత పెనంగిన వృథా
కాముకపు మనసునకు కడమొదలు లేదు ॥

చరణము:- వత్తిలోపలి నూనెవంటిది జీవనము
విత్తుమీదటి పొల్లువిధము దేహంబు
భక్తిసేయుట యేమి పాసిపోవుట యేమి
పొత్తుల సుఖంబులకు వరలుటలుగాక ॥ ॥ఏమి॥

ఆకాశపాకాశ మరుదైన కూటంబు
లోకరంజకము తమలోని సమ్మతము
చాకి మణుగులజాడ చంచలపు సంపదలు
చేకొనిననేమి యివి చెదిరిననేమి ॥ ॥ఏమి॥

**గాదె పోసిన కొలుచు కర్మసంసారంబు**
**వేడివిడువనీకూడు వెడమాయె బ్రతుకు**
**వేదనల నెడతెగుట వేంకటేశ్వరు కృపా**
**మోదంబు వడసినను మోక్షంబుగనుట.** ॥ఏమి॥

అన్నమయ్యగారు గొబ్బి పాటలను కూడ రచియించిరి. గొబ్బి నృత్యమును పది పదునై దేండ్ల బాలికలు సంక్రాంతి పండుగ సమయమున మా ప్రాంతమున చేయుదురు. వీరు గొబ్బి తల్లిని ఒక తట్టలో నునిచి పూవులతో నలంకరించి, వాడవాడకు, ఇంటి యింటికి పోయి బృంద నృత్యగానములతో తృప్తిపఱచుతూ, తృప్తిపడుతూ, ధనధాన్యములను సేకరించుతూ, కడపటి దినమున గుజ్జనకూళ్లు వండి మేళతాళములతో గొబ్బెమ్మను జలధిలో కలుపుట పరిపాటి. ఈ పాటల చరణములు 'గొబ్బిళ్లో' అను పదముతో అంత్యమగును. ఈ గొబ్బి శబ్దము బహుశ 'గోపి' నుండి వచ్చినది. ఈ గొబ్బి నృత్యము గోపికల రాచ క్రీడవంటిది. ఈ గొబ్బి పాట తాళయుక్తమై ఆ బాలికలుచేయు వలయాకార నృత్యమునకు అనువుగా నుండవలయును. అచిన్ని బాలలు పాడుటకు అనువుగా సరళముగను, సంగీత యుక్తముగను ఉండవలయును. అన్నమయ్య యీ కీర్తన కృష్ణావతార వర్ణనచేయు గొబ్బి పాటలకు ఆదర్శవంతమైనది. వీరి రచనలలోని భావము గంభీరముగ నుండును. కొలని దోపరికి గొబ్బిళ్లో' అను పదములలో కృష్ణుడు 'కొలని దొంగ' అని అర్థమిచ్చును. ఇది యే గోపికా వస్త్రాపహరణము. ఈ గొల్లెతలకు కాత్యాయనీవ్రతము పేరిటి కొలనులో నగ్నముగా స్నానముచేయు వెఱ్ఱికలదు. ఒడ్డున పెట్టిన వలువలను దొంగిలించి చెట్టు ఎక్కిన కృష్ణుడు వారిని యేడ్పించి సిగ్గును దోచుటలోకల దాశృంగారము. అందుకే ఆయనను కొలనిదోపరియని, యదుకులస్వామి యని పల్లవిలోనే

ప్రస్తావించి, ఈ చరణములు మరిమరి పాడుటకు ఆస్పదము కల్పించినారు అన్నమయ్య. తక్కిన పాదములు కృష్ణావతారములోని పురణాంశములే. ఈ పాటలోని అందచందములు విని ఆనందించండి.

యదుకుల కాంభోజి – ఆదితాళం.

పల్లవి:- కొలని దోఁపరికి గొబ్బిళ్ళో యదు
కులస్వామికి గొబ్బిళ్ళో

చరణం:- కొండగొడుగుగా గోవులఁగాచిన
కొండుక శిశువుకు గొబ్బిళ్ళో
దుండగంపు దైత్యుల కెల్లను తల
గుండు గండడికి గొబ్బిళ్ళో ॥కొలని॥

పాపవిధుల శిశుపాలుని తిట్టుల
కోపగానికి గొబ్బిళ్ళో
యేపునఁ గంసుని యిడుమల బెట్టిన
గోప బాలునికి గొబ్బిళ్ళో ॥కొలని॥

దండివైరులను తఱిమిన దనుజుల
గుండె దిగులునకు గొబ్బిళ్ళో
వెండిఁ బైఁడియగు వెంకటగిరిపై
కొండలయ్యకును గొబ్బిళ్ళో ॥కొలని॥

ఇక వీరి ఆధ్యాత్మిక సంకీర్తనలు సమీక్షింతము. హరిని సేవించుటలో వచ్చు పుణ్యముకన్న హరిదాసును పూజించుటలో వచ్చు పుణ్యము మిన్నయని వీరి కచ్చితమైన అభిప్రాయము. విశిష్టాద్వైతాన్ని పుచ్చుకొన్న అన్నమయ్య తమికకవితలోని యీ అద్వైత సంబంధము

లగు మధురభావములను అవగాహనము చేసికొని, ఇవన్నియు పదముల రూపములో ఇంపుసొంపులు కూర్చుకొని యుండుట గ్రహించి, తానును పాటల రూపమున వ్రాయతలంచి, పద్యగద్య కవితకు తీసిపోని విధముగా, పాటలలో రచించిన సాహసికుడు.

**మూదివిటులు, విధవలంజలు,**
**పదకవితలు మారుబాస బాపనవారల్**
**చదువని పండిత వర్యులు**
**కదనాస్థిర వీరవరులు కడిది పురమునన్.**

'ముదివిటులు, విధవలంజలు, పదకవితలు' అని వీనిని ఒక కోవకు తెచ్చిన ఒక చాటువును శ్రీనాథ మహాకవికి అంటగట్టి 'పదకవిత' చేయుట పనికిమాలిన, ప్రయోజన కారికాని నీచ రచనమని తలంచిన రోజులు. శ్రీనాథుడే పల్నాటి యుద్ధమును ద్విపదలో రచియించినందున ఆయన అట్లు వ్రాసి యుండడనుట నిర్వివాదము. ఏది యెట్లైన యిటువంటి నగబాట్ల పాలైన పదకవితను సజీవమైన వాడుక భాషలో, దేశీయమైన పదములలో, 'సుప్రసిద్ధమైన దేశిరాగములలో, సుగ్రాహ్యమైన లయ తాళములలో నిబంధించి వాణీవీణా నినాదాలుగా పలికించిన సాహసి.

ఆ రోజులలో పదకవిత్వమంటే పామరులుచేయుపని. పండితులు పద్యగద్యములలో సంస్కృత పదభూయిష్ఠముగా, పాండిత్య ప్రకర్ష ప్రధానముగా రాజసభలకు చేయుచున్నదే కవిత్వమని కచ్చితాభిప్రాయముండెడిది.

పదకవిత ప్రత్యేకించి బ్రాహ్మణులుచేయుట పరిపాటికాకుండెను. వైష్ణవాన్ని ముమ్మరముగా ఆంధ్రులకు అందించిన ఆంధ్రకవులలో ముఖ్యులు పోతన, అన్నమయ్యలు. పోతన పద్యగద్యములలో చెప్పినాడు. అన్నమయ్య పదములలో పాడుతూ, పద్యమునకు పదమునకు సమాన

ప్రతిపత్తిని కలిగించి, తరువాతి కవులకు పదకవిత చేయుటలోని కించను, భీతిని తొలగించి సులభగ్రాహ్యమగు పద, ద్విపదకావ్యములను రచియించుటకు ప్రోత్సాహమిచ్చిన ఆద్యుడు తమిళములోవలె ఆంధ్రమునను పదకవితకు సాహిత్య గౌరవమును సంతరించి, దానికి ఒక విశిష్టస్థానము సంపాదించిన సాహితీవేత్త. భగవంతుని ప్రార్థించుటకు కావలసినది భక్తిభావము లేగాని అవిచెప్పెడి తీరుకాదు, అర్థముకాని, అందుబాటులో లేని పద్యగద్యములకన్న సులభగ్రాహ్యమగు సరళపదములే మిన్నయని వీరినమ్మకము. తామనుకొనిన పనిని జంకు, గొంకులేక చేపట్టగల దిట్టలు తాళ్ళపాకవారు. అన్నమయ్య అంతపనిచేసినాడు. పదకవితకు ప్రాధాన్యమిచ్చి, ప్రశస్తికి తెచ్చి పదకవులకు మార్గదర్శకుడై, పద కవితా పితామహుడయినాడు.

ఇక వీరు రచించిన 'శృంగార మంజరి' యను ద్విపదకావ్యమును పరిశీలింతము. ఇది ఒక శృంగార కావ్యము. ద్విపదను నడుపు గౌరవము గౌరనకు దక్కినది. అన్నమయ్యగారి ద్విపద ఆఫక్కిలోనే సాగి, గౌరన ద్విపదలకు తీసిపోకున్నది. శృంగార రసపోషణలో ప్రబంధ కవులకు మార్గదర్శకమైనది. ఇది ప్రబంధములలోవలె గద్యపద్యములలో గాక సరళద్విపదలలో సాగినది. శ్రీ వేంకటేశునిపై ఒక బాలమరులు కొనినది. ఆమె విరహమును హృద్యముగ వర్ణించిన విధము చూడుడు.

**చూడదు తలయెత్తి శ్రుతి దండెఁగూర్చి**
**పాడదు చెలులెల్లఁ బైగొన్న సరస**
**మాడదు చిలుకతో నందంపుమాట**
**లాడదు వెడమాట లాడెడిగాని........**

కొంచదు ప్రాణంబు గురుతుగాఁ జేసి
యెంచదు వీణవాయించదు పరిణ
మించదు మది సంభ్రమించదు చెలియ
కిందుకేనియు సయించదు గాని

కప్పదు చనుదోయి కనుఁగవ రెప్ప
విప్పదు తనప్రాణ విభుమీది మనసు
త్రిప్పదు మదిలోన దీకొన్న ప్రేమ
చెప్పదెవ్వరి తోడ చెప్పునోగాని ....

పెట్టదు కస్తూరి పేర్కొని, చేత
బట్టదు సేవంతిబంతి నెత్తమ్మి.
ముట్టదు సిగ్గుల మొదలించుకైన
బట్టదు తలపెందు బట్టునోగాని

తాపంబు మేనఁ బ్రతాపింపఁ దొడగె
నూర్పులు మిగుల నిట్టూర్పులై నిగిడెఁ
బగలె మృగాక్షికి వగలుగాఁ జొచ్చె
రాత్రులింటికి శివరాత్రులై తోచె.

ఇందులోని ప్రాసలు పోతన పోకడలు పోయినవి. సరళపదము లతో సులభ ఛందోపద్ధతిలో ఆమె విరహాము అభివర్ణించి ఆ దేవునికి జాలి పుట్టించి కరుణింపజేసినాడు అన్నమయ్య. ఇక ఆ కన్యను లాలించి, పాలించి, చిత్తజసామ్రాజ్య సింహాసనమున పట్టముకట్టుటలో గరుడ వాహానుని గడుసరి తనమును కడురమ్యముగా వర్ణించినాడీ కవిశేఖరుడు.

భామినియున్న పూఁబానుపు చేరి
చిట్టింటు చేతల సేదలు దీర్చి

చెదరిన యలకల చిక్కెల్లదీర్చి
యెడలేని పులకల యింపు పుట్టించి
కళల మర్మంబుల కడగానుపించి
యాలింగనాది సౌఖ్యముల నొందించి
కరగించి మరగించి కలికిగావించి
యుడివోని సురతాబ్ధి నోలలాడించి
చిత్తజ సామ్రాజ్య సింహాసనమున
బాలికారత్నంబు బట్టంబు గట్టి.

ప్రథమాంధ్ర సంకీర్తనాచార్యులు కృష్ణమాచార్యుల వైరాగ్య సంకీర్తనలు వీనుల విందుగా విని వివశుడైన వేంకటేశ్వరుడు విరక్తుడైనట్లు, తరువాత నూరేండ్లకు స్వామి నందకాంశమున జన్మించిన అన్నమాచార్యుల శృంగార సంకీర్తనములు విని తన్మయుడై మరల శృంగార పురుషుడుగ వెలసినాడని ప్రతీతి.

ఆడుచుఁబతక మా కన్నులజోల
పాడగ నాడెల్ల పసిబిడ్డనైతి
నా కృష్ణమాచార్య నధ్యాత్మవినుతి
రాక గొన్నాళ్ళు విరక్తుండనైతి
జగతి నీ శృంగార సంకీర్తనముల
కగపడి మంచి ప్రాయపు వాఁడనయితి.

శృంగార కీర్తనలు వినియో, శృంగారమంజరిని వినియో మంచి ప్రాయపు వాడై శృంగారపురుషుడైనాడనుట నిర్వివాదము.

అన్నమయ్య శృంగారమంజరిలోను, శృంగార కీర్తనలలోను, శృంగారము విచ్చలవిడియై మోతాదు మించినను అతడు నిజమైన వైష్ణవుడు. వైష్ణవము పుచ్చుకొనినప్పటి నుండి స్మార్తులలోని తామసము

వీడి వైష్ణవులలోని శాంతమును అలవరచుకొని, వారి సాంప్రదాయ ములననుసరించిన అన్నమయ్య హరిసేవ, హరిదాసు సేవ సమానమనినాడు. భాగవతునిపైని భక్తి భగవంతునిపై భక్తి కన్న శ్రేష్ఠమైనదను వైష్ణవ సాంప్రదాయమును గట్టిగ నమ్మినవాడు అన్నమయ్య. 'బహ్మమొకటె పరబ్రహ్మమొకటే' అని చాటినాడు. అందరికి శ్రీహరే అంతరాత్మ అని ప్రబోధించినాడు. బ్రాహ్మణుడు మెట్టు భూమి చండాలుండుండేటి భూమి ఒకటియే. ఏనుగుమీదపడు ఎండ, శునకముపై బడు ఎండ ఒకటే.

కడుపుణ్యులను పాపకర్ములను సరిగాన
జడియు శ్రీవేంకటేశ్వర నామ మొకటే

అని భిన్నత్వములో ఏకత్వమును చాటిన మహనీయుడు. విచక్షణలేని చదువు వృథా. వైష్ణవము భక్తికి భక్తులకు ఇచ్చు ప్రాముఖ్యత ప్రత్యేకము. చదువునకు సంస్కారమునకు చాల అంతరువు గలదు. వీని రెంటిని మించినది భక్తి. చదువురావచ్చును. పోవచ్చును. హరిదాసులోని భక్తి అచంచలము. కావున చదువుకన్న భక్తిగొప్పది. శాశ్వతమైనది. ఈ వైష్ణవాద్వైతమును చాటుచున్నదీ సంకీర్తన.

చదివితి దొల్లికొంత చదివే నింకాకొంత
యెదిరి నన్నెఱుగను వింతైన నయ్యో
నాటికి నాడే నా చదువు
మాటలాడుచును మరచేటి చదువు
యెనయ నీతని నెరుగుటకేపో
వెనకవారు చదివిన చదువు
మనసున నీతని మరుచుట కేపో
పనివడి యిప్పటి ప్రౌఢల చదువు"

భక్తి భగవంతుని మరువనివ్వదు. ఇప్పటి ప్రౌఢ చదువు మనసున 'నీతని' మరచుటకే అని చాటి నాస్తికత్వమునకు చదువు కొంత కారణమను అభిప్రాయము వెలిబుచ్చినారు.

పూజలు, పునస్కారములు, ఆచారములు, సంస్కారములు అన్నియు ఆ దేవుని సేవకేనని వానిని సాధించి సిద్ధిపొందుటయే మానవ లక్ష్యమనిన అన్నమయ్య దృష్టిలో హరిదాసు ఎట్లుండవలయునో విపులముగా విమర్శించినారు. తాను నమ్మిన సత్యాన్ని స్పష్టముగా చెప్పినారు. ఈయన ముక్కుసూటి మనిషి. చెప్పదలచినది జంకు గొంకు లేక కుండ బ్రద్దలు కొట్టిన నట్లు చెప్పు సాహసి.

పల్లవి:- **అటువంటి వాడు వో హరిదాసుడు**
**అటమటాలు విడిచి నాతడే సుఖి**

చరణం:- **తిట్టేటి మాటలును, దీవించేటి మాటలును**
**అట్టే సరేని తలచి నాతడే సుఖి**
**పట్టి చంపేవేళను, పట్టము కట్టేవేళను**
**అట్టు నిట్టు చలించని యాతడే సుఖి** ॥అటు॥

**చేరి పంచదారిడిన, చేదు దెచ్చి పెట్టినాను**
**ఆరగించి తనివొందే యతడే సుఖి**
**తేరకాండ్లజూచిన తెగరాని చుట్టముల**
**నారయ సరిగాజూచే యాతడేసుఖి** ॥అటు॥

**పొంది పుణ్యము వచ్చినా, పోరిపాపము వచ్చినా.**
**అందలి ఫలమొల్లని యాతడే సుఖి**
**విందుగా శ్రీవెంకటాద్రి విభుని దాసులు జేరి**
**అందరాని పదమందిన నాతడే సుఖి** ॥అటు॥

చదువు సంధ్యలు ప్రతివారికి అవసరమని ఆదినుంచి వస్తున్న సత్సాంప్రదాయము. ఇవి జంటపదములై ఒక దానిని విడిచిమరియొకటి యుండ లేకున్నవి. చదువును గురించి చక్కగ చెప్పినట్లే, సంధ్యను గురించి వారి దృక్పథమును తెలియచేసినారు రామానుజ మతములోని తన నమ్మికను, వైష్ణవాచార వర్తనులతో సహవాసము, హరికీర్తనల లోని హాయి, తిరుమంత్ర పఠనములోని తీపిని కోరి ధన్యుడైన పరమ భాగవతుడు అన్నమాచార్యుడు.

**సహజవైష్ణవాచార వర్తనుల**
**సహవాసమే మా సంధ్య**

**అతిశయమగు శ్రీహరి సంకీర్తన**
**సతతంబును మా సంధ్య**
**మతి రామానుజ మతమే నాకును**
**చతురత మెరసిన సంధ్య** ॥సహజ॥

**పరమ భాగవత పద సేవనమే**
**సరవి నెన్న మా సంధ్య**
**సిరువరు మహిమలు చెలువొందగ నే**
**సరక వినుటే మా సంధ్య** ॥సహజ॥

**మంతు కెక్క తిరుమంత్ర పఠనమే**
**సంతతమును మా సంధ్య**
**కంతు గురుడు వేంకటగిరి రాయని**
**సంతర్పణమే మా సంధ్య** ॥సహజ॥

ముక్తికి భక్తియే మార్గమని నమ్మిన వైష్ణవమును పొందిన అన్నమయ్య శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య, మధురభావములనెడి

పంచవిధభక్తి రూపములతో తన దైవాన్ని వేలగేయములతో తనివి తీర గానముచేసి తరియించిన పుణ్యుడు. భగవంతుని ఆత్మగా గ్రహించి అద్వైతానంద నిమగ్నుడైన బ్రహ్మజ్ఞానిని శాంతభక్తుడనెదరు.

**నిత్యాత్ముడైయుండి నిత్యుడైవెలుగొందు**
**సత్యాత్ముడైయుండి సత్యమై తానుండు**
**ప్రత్యక్షమైయుండు బ్రహ్మమైయుండు సం**
**స్తుత్యుడీ తిరు వెంకటాద్రి విభుడు.**

దాస్యభక్తిలో భక్తుడు భగవంతుని దాసుడని తలంచి సేవకునికి ప్రభువు నందు గల అణకువ అనురాగముల వెల్లడించునదే. దీనినే సేవ్యసేవక భావమనెదరు. వీరి 'శక్తియుక్తులు లేని దీనుని పాలింపవే' యను ప్రార్థన చూడుడు.

శక్తి గలిగితే నీ సరస దేవుండగానా
యుక్తి గలిగితే నేనొడలు మోతునా
శక్తియు యుక్తియు నొకటిలేక నీ
భక్తుండనైతి నన్ను పాలింపవే.

ప్రతివాడు తానొకపని చేయలేని అసహాయస్థితిలోనో, చేసి విఫలుడైన పరిస్థితిలోనో కర్మసిద్ధాంతములో పడును. కర్మయను మాయ ఆ దేవుని కల్పితమేనని ఖచ్చితముగా చెప్పి కడతేర్చవలెనను ప్రార్థన చూడుడు.

కర్మమంటాను మాయకప్పేవు గాని
కర్మము ధర్మము నీకల్పితమే కదా?

సఖ్యభక్తిలో భక్తుడు దేవుని ప్రాణమిత్రుడుగా భావించి, చనువుతో విన్నపము చేయుటయే. దీనినే 'సఖ్యభావ' మనెదరు.

"చెలిమిసేయంగరాదు చేసి విడువంగరాదు
తలచి బాసలీరాదు, తప్పగరాదు
మలసి మన్నింపరాదు, మన్నించి చెరుపరాదు
వలవరాదు వలచి వదలరాదు."

వాత్సల్యభక్తిలో భక్తుడు భగవంతుని పుత్రభావముతో ప్రేమించడము లాలించడము. యశోద తనబిడ్డ కృష్ణుని దైవముగా ఊహించి ప్రార్థించడము దీనికి చక్కని తార్కాణము.

"జో అచ్యుతానంద ! జో జో ముకుందా !
రావె పరమానంద ! రామగోవింద ! "

'మూసిన ముత్యము ముంగట చెంగట' చేసిన అకృత్యాలను, ఆగడాలను యశోదమ్మతో ఫిర్యాదు చేసినారా గోపకాంతలు. ముద్దుగానే మందలించింది యశోద మాతృహృదయము. తనయుని తప్పులను కప్పిపుచ్చినది. బాల్యచేష్టలని సమర్థించినది. దేవుని తప్పులను మభ్యపెట్టి నిందించ వచ్చిన గోపికలనే నిందించినారు అన్నమాచార్యులవారు.

కానరటె పెంచరటె కటకటా బిడ్డలను
నేను మీవలెనె కంటిని నెయ్యమైన బిడ్డను
బాయిం పారవేసిన పాలువెన్నయును
చేయి పెట్టకుందురా చిన్నిబిడ్డలు
మీ యిండ్లు జతనాలు మీరు సేసుకొనక
పాయక దూరేరేమే ప్రతిలేని బిడ్డను.

భగవంతుని భర్తగా భావించు మహాభావమే మధుర భక్తి. ఈ భక్తి మార్గములో ఆధునిక కవులు అనేకరచనలు సాగించినారు.

సాగించుచున్నారు. దీనినే 'వైష్ణవ కవిత' యందురు. వెంకటపార్వతీశ్వరకవుల 'ఏకాంత సేవ' యిటువంటి భక్తి భావములతో విరాజిల్లు విశిష్టకవిత. రవీంద్రనాథుని గీతాంజలి అట్టిదియే, ఈ భక్తిభావము సొంపైనది. శృంగార రసపోషణకు నెలవైనది. ఈ భక్తిమార్గములో వేనకువేలు శృంగార సంకీర్తనలు వ్రాసినారు అన్నమయ్య. సగమునకు పైగా యీ భక్తిభావముతోనే వారి రచనలు సాగినవి. తనే నాయికగా, అలమేలుమంగగా చెప్పుటకు జంకని, గొంకని పరమభాగవతుడు. తనే ప్రేయసిగా, అష్టవిధనాయికలుగా ఊహించి, ఊహించరాని విధముగా వర్ణించి, తన్మయుడైన భక్తుడు. ఉపమాన, ఉత్ప్రేక్షలాదిగాగల వివిధాలంకారములతో అనేక ముగ్ధ మోహనమూర్తులను మన మందుంచి, మనముందుంచి, మురిపించిన మహాకవి. అటువంటి దివ్యనాయిక రూపమును దర్శింతము.

లలిత లావణ్య విలాసము తోడ
నెలంత ధన్యత గలిగి నేటితోడ
కుప్పలుగామైన సలుకొన్న కస్తూరితోడ
తొప్పదోగేటి చెమటతోడ

కులుకు కబరి భరము కుంతలంబులతోడ
దప్పి దేరేటి మోము దమ్మితోడ
మొలక నవ్వుల దొలకు ముద్దుచూపుల తోడ
పులకలు బొడుమైన పొలుపుతోడ

తిరువేంకటాచలాధిపుని మన్ననతోడ
సరిలేని దివ్యవాసనల తోడ
పరికించరాని అరవిరి భావముతోడ
సిరి దొలంగెడి చిన్ని సిగ్గుతోడ.

అన్నమయ్యది అనుసరణ యోగ్యమైన అసలు కవిత. ఇందులోని దేశీయములు, సామెతలు, పలుకుబడులు యీాయన రచనలో కోకొల్లలు. వీరిరచనలలో తెలుగుతనము ఉట్టిపడుచుండును. మచ్చునకీ చరణము చూడుడు.

**"ఆలకించి వింటేను అన్నియు నీ పలుకులై**
**వేలసంఖ్యాపై తోచె వీనులకు"**

అన్నమాచార్యులు శతకములను, సంకీర్తనములనే కాక శృంగారమంజరి అను ద్విపద కావ్యమును. రామాయణమును నవముగ మరల తెలుగులో ద్విపదరూపమునను, సంస్కృతములో వెంకటాచల మాహాత్మ్యమును రచియించి ఉభయభాషా కోవిదుడై విరాజిల్లెను.

పూర్ణాయుష్కుడై, కర్ణాటక సంగీతాధినేతయై, కర్ణాటక సామ్రాజ్యాధినేతలగు దేవరాయలు, మల్లికార్జునరాయలు, విరూపాక్షరాయలు, సాళువనరసింహరాయలు, తుళువనరసింహరాయలు, వీరనరసింహరాయలు, శ్రీకృష్ణదేవరాయలకు సమకాలికుడై తన దేవుడైన శ్రీ వెంకటేశ్వరునికి సాహిత్యసేవ చేయుచు, తన వంశమువారికి, తదితరులకు మార్గదర్శకుడై, ఐహిక ఆముష్మికముల సాధించిన మహనీయుడు

అన్నమయ్య కడప, చిత్తూరు, కర్నూలు, అనంతపురము. బళ్ళారి, చెంగల్పట్టు, ఆర్కాడు, నెల్లూరు, గుంటూరు, తంజావూరు, తిరుచినాపల్లి మండలములలో సంచారము చేసినట్లు తెలియుచున్నది.

అన్నమాచార్యుల సంకీర్తనముల భాష, భావములు రాయల ఆస్థానకవుల రచనలలోనికి యెక్కినవి. కవితా పితామహ అల్లసాని

అన్నమయ్యది అనుసరణ యోగ్యమైన అసలు కవిత. ఇందులోని దేశీయములు, సామెతలు, పలుకుబడులు యీాయన రచనలో కోకొల్లలు. వీరిరచనలలో తెలుగుతనము ఉట్టిపడుచుండును. మచ్చుసకీ చరణము చూడుడు.

"అలకించి వింటేను అన్నియు నీ పలుకులై
వేలసంఖ్యపై తోచె వీనులకు"

అన్నమాచార్యులు శతకములను, సంకీర్తనములనే కాక శృంగారమంజరి అను ద్విపదకావ్యమును. రామాయణమును నవముగ మరల తెలుగులో ద్విపదరూపముననను, సంస్కృతములో వెంకటాచల మాహాత్మ్యమును రచియించి ఉభయభాషా కోవిదుడై విరాజిల్లెను.

పూర్ణాయుష్కుడై, కర్ణాటక సంగీతాధినేతయై, కర్ణాటక సామ్రాజ్యాధినేతలగు దేవరాయలు, మల్లికార్జునరాయలు, విరూపాక్షరాయలు, సాళువనరసింహరాయలు, తుళువనరసింహరాయలు, వీరనరసింహరాయలు, శ్రీకృష్ణదేవరాయలకు సమకాలికుడై తన దేవుడైన శ్రీ వెంకటేశ్వరునికి సాహిత్యసేవ చేయుచు, తన వంశమువారికి, తదితరులకు మార్గదర్శకుడై, ఐహిక ఆముష్మికముల సాధించిన మహనీయుడు

అన్నమయ్య కడప, చిత్తూరు, కర్నూలు, అనంతపురము. బళ్ళారి, చెంగల్పట్టు, ఆర్కాడు, నెల్లూరు, గుంటూరు, తంజావూరు, తిరుచినాపల్లి మండలములలో సంచారము చేసినట్లు తెలియుచున్నది.

అన్నమాచార్యుల సంకీర్తనముల భాష, భావములు రాయల ఆస్థానకవుల రచనలలోనికి యెక్కినవి. కవితా పితామహ అల్లసాని

పెద్దన కవితలోనె యీ కవి పలుకుబళ్ళు 'చిగురు గొమ్మైనఁ జేవ. మీసాలపై తేనియల్. తంగేటిజున్ను, చిందువందు'' కనబడినవన్న యితరులమాట చెప్పనేల! ఇక వేమనరచనలలో తరచుగ కానబడును.

తులసి తోటలో దొరికిన గోదాదేవిని, తన యిష్టదైవమున కర్పించిన విష్ణుచిత్తునికి, పద్మ వనములో దొరికిన అలిమేలుమంగను శ్రీ వేంకటేశ్వరస్వామి కర్పించిన అన్నమాచార్యులకు దగ్గరపోలికలు కలవు. వెంకటేశ్వరస్వామి పెండ్లి తిరునాళ్లు అన్నమాచార్యుఁడే తొలుత యేర్పరచినట్లు తోఁచుచున్నది. ఆగమశాస్త్రమున వివాహోత్సవము చేయు మాన్యుడే కన్యాదాతగా వర్థిల్లనగునని కలదట. అందులకే శ్రీ పాదరేణు మహాత్మ్యమున యీయన మనుమడిట్లు చెప్పియున్నాడు.

**శ్రీలలరంగ మంగమను శ్రీహరి కెన్నడు దార వోయు చో**
**దాళులపాక యన్నమయ దాఁగడిగెఁ బదముల్, ధరిత్రి మా**
**తాళులపాక చిన్నన పదంబులు పాడిన నాడె సర్పరాట్**
**శైల విభుండు తత్పద రజంబును మాకు నొసంగఁ జెల్లదే!**

ఈ క్రింది కీర్తనలో పై భావములున్నవనుట గమనార్హము.

రామక్రియ

పల్లవి:- గరుడ ధ్వజం బెక్కి కమలాక్షు పెండ్లికి
పరుషలదివో వచ్చెఁ బైపై సేవించను
పాడిరి శోభాన నదే భారతియు, గిరిజయు
ఆడిరి రంభాదులైన అచ్చరలెల్ల
కూడిరి దేవతలెల్ల గుంపులై శ్రీ వెంకటాద్రి
వేడుకలు మీఱఁగ శ్రీ విభుని పెండ్లికి ॥గరుడ॥
కురిసెఁ బువ్వులవాన కుప్పలై యెందు చూచిన
మొరసె దేవదుందుభి మ్రోతలెల్లను
బెరసె సంపదలెల్ల పెంటలై శ్రీ వెంకటాద్రి
తిరమైమించిన దేవదేవుని పెండ్లికిని ॥గరుడ॥

**వేసిరి కానుకలెల్ల వేవేల కొప్పెరల**
**పోసిరదే తలఁబ్రాలు పుణ్యసతులు**
**అసల శ్రీ వేంకటేశుఁ డలమేలు మంగఁదాను**
**సేసలు వెట్టిన యట్టి సింగారపు పెండ్లికిని."**

వీరి సంస్కృత భాషా పరిచయము వీరి లక్షణయుక్తమగు సంస్కృత గేయముల వలన తేటతెల్లమగుచున్నది. అయినను వీరు సంస్కృత పదభూయిష్టమైన ప్రౌఢ రచనచేయక పోవుటకు కారణము ఆ కాలములో చదువరులు తక్కువగుటయే.

చక్కగా గ్రాంథికభాషలో చెప్పనేర్చిన అన్నమయ్య అందరికి అందుబాటులోని వాడుక భాషలో చెప్పుట శక్తిలోపము కాదు. శక్తి లోపము కలుగ కూడదని ఆయన ఒక ఆధ్యాత్మిక కీర్తనములో చెప్పి నట్లు 'ఎన్నఁగ శ్రీ వేంకటేశుఁ దాళ్ళపాక అన్నమాచార్యులు అఖిల దిక్కులు మెచ్చ ఉన్నతితో బాడిరట, ఇకవీరి కవితను తడవి కీర్తన ముల ఉటంకించ బూనిన, 'బీరకాయపీచు' వలె యెడతెగక, అది అంతు లేకుండ సాగిపోవుచుండును. అన్నమయ్య లేకున్న ఆ దేవునికి అంతకీర్తి రాదేమో నను సంశయము రాకపోదు. అన్నమయ్య ఆ మాట ఒక కీర్తనలో సగర్వముగా చెప్పుకొనినాడు.

**"నే నొక్కండ లేకుండితే నీకృపకు పాత్రమేది**
**పూని నావల్లనే కీర్తిఁ బొందేవు నీవు."**

అందరి అందుబాటులోని వ్యావహారిక భాషలోనే అనేక అచ్చ తెనుగు పదములతో సులభ గ్రాహ్యమగు పదకవిత చేసినారు అన్న మయ్య. వీరిపదములలో యేమి, యెక్కడ యను 'య' డాగమములు, వూరు, వునిక అను 'వ' కారములు పదాదిని యుపయోగింపబడినవి.

ఇవి అన్నియు తెలుగు పదస్వరూపమునకు వ్యతిరేకమైనప్పటికిని అప్పటి ప్రజల వాడుకలో ఉండుట వలన తెలిసి ఉపయోగించిన సాహసి. ఇవి గాక అప్పటి యితర వాడుకపదములను అదేపనిగ వాడిన పదకవి. ఈయన దైవమునకు దయ్యము, వద్దుకు వొద్దు, నోటిలో బదులు నోరిలో, సింహాసనమునకు సింహ్వాసనము వాడినాడు. ఈ పదములను వాని ప్రక్కన కుండలములలో ఇచ్చిన అర్థములో వాడినాడు. అప్పసము (సతతము). ఆముకొని (క్రమ్ముకొని), కైపు (మత్తు), కాంతాళము (కోపము), ఓగ్గన (ప్రకాశముగా) ఈ పదములన్నియు ఈ అర్థములలో మా ప్రాంతమున వాడుకలో కలవు.

అన్నమాచార్యులు సుమారు యనభై రాగములలో తమ కీర్త నలు గానము చేసెను. ప్రతి కీర్తనకు వీరు రాగము చాలా వాటికి తాళము తెలిపినారు. కాని పూర్తిగా స్వరకల్పన చేయలేదు. అందు ఎక్కువగా పాడిన రాగములు శంకరాభరణము, శ్రీరాగము, సామంతము అహిరి, దేసాళం, నాదరామక్రియ, భైరవి, ముఖారి. కాని యిప్పుడు వాడుకలో ఆనాటి రాగములు లేనందున వీనికి స్వరకల్పన చేయుట కష్టముగా నున్నది. అయినను పూజ్యులు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు, శ్రీ నేదనూరి కృష్ణమూర్తిగారు వీనిలో కొన్నింటికి పరి శ్రమ పరిశోధన పూర్వకముగా స్వరకల్పన చేసినారు. ఇందుకు తిరుపతి తిరుమల దేవస్థానమువారు బాధ్యత వహించి ముద్రణ చేసినారు.

ఈ పదకవితా పితామహుని గురించి వ్రాయుటకన్న చదువుట సులభము. చిన్నన్న వీరిరచనల శ్లాఘించుతూ వ్రాసిన ద్విపదలను ఉదహరించుట సమంజసము.

"యోగమార్గంబున నొక కొన్ని బుధులు
వైరాగ్యరచనలో వాసింపఁగొన్ని

సరసత్వమునఁదాళ్ళ ప్రముఖముల్ గాగ
ప్రవిమల ద్విపద ప్రబంధరూపమున
నా వెంకటాద్రి మహాత్మ్య మంతయును
శతకముల్ పదిరెండు సకలభాషలను
రాగిల్ల శృంగార రసరీతిఁ గొన్ని
సారస నేత్రుపై సంకీర్తనములు
పరతంత్రములు ముప్పదిరెండువేలు
నవముగా రామాయణము దివ్యభాష
గావించి రుచుల శృంగారమంజరియు
ప్రతిలేని నానాప్రబంధముల్ చేసి"

యోగ, వైరాగ్య, శృంగార మార్గములలో ముప్పదిరెండువేల కీర్తనలతో ముక్కోటి ఆంధ్రుల ముద్దు మురిపెము తీర్చిన మహనీయుడు. పదునారవయేడు మొదలు దివ్యధామ మందువరకు పట్టుదలతో, ప్రజ్ఞతో, పండిత పామరప్రీతి కరమగు పదములను ప్రసాదించి యిహపరముల సాధించిన పదకవితా పితామహుని వర్ణిస్తూ చిన్నన్న వ్రాసిన అన్నమాచార్య చరిత్ర శృతిఫలమును తెలుపుచు ముగించెదను.

మనసున గపటంబు మానిసభక్తి
ననఘమౌ నీ యన్నమాచార్య చరిత
వినిన వ్రాసినఁ బేరుకొనినఁ జదివిన
జనులకు నిష్టార్థ సౌఖ్యంబు లొదవు
నని యలమేలు మంగాధీశు పేర
నిన మండలాంత రాహిత మూర్తిపేర
హరిపేర దరచక్ర హస్తునిపేర
ధరనెన్న మాకుల దైవంబుపేర
నీలీలఁ దాళ్లపాకాన్నమాచార్యు
నేలిన శ్రీ వేంకటేశ్వరు పేర.

# తాళ్ళపాక తిమ్మక్క

'ముగుదల్ నేర్వగరాని విద్య కలదే ముద్దార నేర్పించినన్' అను నానుడి ననుసరించి, అన్నమాచార్యుల అర్ధాంగి తిమ్మక్క భర్తవలన తనకు లభించిన తరిఫీదువలననో, ఆయనకు చేదోడు వాదోడుగా ఉంటూ, ఆయన రచనలలోని రమ్యతను గ్రహించి, భాషా భావములను జీర్ణించుకొని, శబ్దార్థ శుద్ధిని అవగాహనము చేసికొని, శృంగార కీర్తనములలోని సింగారమును సంతరించుకొని తద్రస ప్రధానమైన 'సుభద్రాకల్యాణమ'ను రసవత్తర కావ్యమును రచియించి, తనకు, తను మెట్టినింటికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన కవయిత్రి తాళ్లపాక తిమ్మక్క.

తాళ్లపాక అన్నమాచార్యుల మొదటిభార్య తిమ్మక్క. ఈ మెకు తిరుమలాంబ, తిమ్మాంబయను నామాంతరములు కలవు. తెనాలి రామకృష్ణునిచే 'పద్య గద్య శ్రేణిన్ మిన్నంది మొరసె నరసింగన్న' అని పొగడ్తలు పొందిన కవి నరసింగన్న యీ యమ కొమరుడుడే.

ఈయమ నన్నయ విరచిత మహాభారత ఆదిపర్వ అష్టమాశ్వాసములోని 'సుభద్రార్జునుల వివాహ ఘట్టము'ను ఆధారముగ 'సుభద్రాకల్యాణమ' ను కావ్యమును ద్విపదలో, చక్కని శైలిలో, మనోహరముగ రచియించి ఆంధ్రభాషలో ప్రథమ కవయిత్రి అను పేరు, ప్రఖ్యాతులు సంపాదించుకొన్నది. నన్నయ్య తన రచనలో విజయునికి

ప్రాముఖ్యత నిస్తూ ఈ ఘట్టమును నూటామూడైదు అయిదు పద్యగద్యము లలో వర్ణించెను. ఈయమ 'సుభద్రాపరిణయము' లో సుభద్రను కథానాయికగ కమ్మని కవితను కావించిన తొలి కవయిత్రి. పేరు పెట్టుటలోనే స్త్రీ పక్షపాతము చూపిన పడతి. ద్విపద కావ్య మగుటచే దీనిని కావ్యమనక 'పాట' యని కడుమంచి తేటపలుకులతో తెలిపెద ననినది. గద్యపద్యములలో తేటపలుకులకు చోటు తక్కువని తలంచి, గేయకవనము గావించి యుండవచ్చును. భర్త పద కవితలోని భక్తితో నేమి, అందరికి అందుబాటులో నుండు ఉద్దేశముతో నేమి, తెలుగుతనము నుడికారము తెలుపు తలంపుతోనేమి 'తేట తెలుగు పలుకుల' వెయ్యిన్నూట అరవైమూడు పాదాల ద్విపద కావ్యము వ్రాసి వన్నెకెక్కినది తిమ్మక్క.

ఈ కావ్యమును ఈమె 1450 ప్రాంతమున, తన యావదనశలో వ్రాసియుండవచ్చును.

తిమ్మక్క సుభద్రాకల్యాణాంతమున, తనను గురించి. తన కావ్యము తీరును గురించి, శ్రుతిఫలమును గురించి యీ విధముగ చెప్పు కొనినది.

**అవనిలో తాళ్ళపాకాన్నయ్యగారి**
**తరుణి తిమ్మక చెప్పె దానసుభద్ర**
**కళ్యాణమనుపాట కడుమంచి తేట**
**పలుకుల, నీపాట పాడినా విన్న**
**శ్రీహరి వారికి చేరువైయుండు**
**నానాట పాపములు నాశనం బౌను**
**ఆప్తులు బంధువులను నొందగలరు**
**సప్తసంతానములు సమకూరగలవు.**

విజయుడు ఉత్తరదేశము వాడనియు, హస్తినాపుర నివాసి యనియు, తత్ప్రదేశములలో తీర్థయాత్రలు చేయుచు, ద్వారకను చేరినాడని వ్యాసవిరచిత సంస్కృత భారతమున కలదు. ఆంధ్రమహాభారతమున మూలము నతిక్రమించి. విజయుని వింధ్యను దాటించి, దక్షిణాపథమునకు తోడ్కొనివచ్చి, దక్షిణగంగయన నొప్పు గోదావరిలోను, దురితహారియైన కావేరిలోను స్నానము చేయించి ప్రాంతీయాభిమానమును ప్రకటించి, తమ వేంగీదేశాన్ని చూపించిన ప్రథమకవి నన్నయ్య. వీరి గద్య పద్యముల నిట ఉటంకించినవారి మాటలలోనే ఈ సత్యము తెలియనగును.

బ్రాహ్మణ సహాయుండై పార్థుండరిగి పూర్వ సముద్రతీరంబున, బురుషోత్తమ దేవరకు నమస్కరించి, మహేంద్రపర్వతము చూచుచు-

దక్షిణ గంగనాదద్దయు నొప్పిన
గోదావరియు నగదాదియైన
భీమేశ్వరంబును బెడగగుచున్న
శ్రీపర్వతంబును జూచి యుర్విలోన
ననఘమై శిష్టాగ్రహార భూయిష్ఠమై
ధరణీ సురోత్తమాధ్వర విధాన
పుణ్యసమృద్ధమై పొలుచు వేగీదేశ
విభవంబు జూచుచు విభుడు దక్షి
ణాంబురాశి తీర్థంబు కరిగి దురిత
హారియైన కావేరి మహాసముద్ర
సంగమంబున భూసురేశ్వరుల కభిమ
తార్థదానంబు జేసి కృతార్థుడగుచు.

నన్నయ్య విజయుని వింధ్య దాటించి పుణ్యక్షేత్రములు, తీర్థములు కొన్నిటిని చూపించితే, రాకరాక యింతదూరము వచ్చిన విజయుని తిరుపతి చూడకుండా తిమ్మక్క పోనిస్తుందా? అనుకున్నంత పనీచేసినది. విజయునికి వెంకటపతి దర్శనము చేయించినది.

అమర నహోబళం బా వెంకటాద్రి
వరుస నాపై కంచి వరదుల గొలిచె
క్రమమున కావేటి రంగనాయకుల
ప్రేమను దర్శించి పిదప తానంత.

అర్జునుడు తీర్థయాత్రా నెపమున పయనము సాగిస్తూ, వీలైన చోట్లలో వివాహము లాడుతూ, గదునిచే కన్య సుభద్ర సౌందర్యరాశి యని విని ఆమెపై కోరిక లేరికలెత్తి కృష్ణుడున్న ద్వారక ప్రాంతమునకు వచ్చినాడు. యాదవులకు యతి యనిన వెఱ్ఱినమ్మకమని, వేషము మార్చి కపటయతియై కరుణామయుడైన కృష్ణుని తలంచినాడు.

**యాదవులు**

యతుల బూజింతు రన్ మతిగల్గి కపట
యతివేషధారియై యలరి యర్జునుడు
భుక్తిముక్తిప్రియు పుండరీకాక్షు
భక్తవత్సలు కృపు పరమాత్ము కృష్ణు
తత్తరపడక చిత్తములో నునిచె.

అతని ఉనికి తెలిసి ఆ ప్రభాసతీర్థమునకు వచ్చిన అబ్జనాభునకు అర్జునుడు నమస్కరించి, 'ద్వాదశమాసిక వ్రతము చేయుచున్నాను'. అనిన కృష్ణుడు నగుచు కుశలప్రశ్నలు వేసి, అతని తీర్థాభిగమన నిమిత్తము, సుభద్రయందాతని బద్ధానురాగతను గమనించి రైవతకపర్వత

మునకు తోడ్కొనిపోయెను. నన్నయగారి కృష్ణుడు సౌమ్యుడు. మాట కారికాదు. తన నవ్వుతోనే అర్జునునకు అంతయు అర్థమగునట్లు చేసిన మితభాషి.

తిమ్మక్క ఆధారగ్రంథములోని మూగనోమును మెచ్చికొనలేకపోయినది. బంధువులు, బావమరదులు, సమవయస్కులు, ప్రాణమిత్రులు, ఒకరి మనసు ఒకరికి తెలిసిన కృష్ణార్జునులు దారిపొడవునా రైవత పర్వతమునకు పోవువరకు మాట్లాడకుండుట మనస్కరించని మానిని. బావమరదుల పరిహాసముతో ఫక్కున నవ్వించిన విధము చూడుడు.

**అత్తఱి శౌరి సర్వాత్మకు డగుట**
**అంతనా నరునితలం పంతయు దెలిసి**
**యొక్కరుండేతెంచె నొనర నచ్చటికి**
**నరుడు నచ్చెరు వంది నారాయణునకు**
సరగున ప్రణమిల్లి సద్భక్తి మ్రొక్క
వనమాలి కెదురుగా వచ్చి యర్జునుడు
దండప్రణామమ్ము తగ నాచరించె
నారాయణా యనుచు నవ్వుచు నరుడు
కరము బట్టుక వాని కడు లేవనెత్తె
హరియు నవ్వుచుఁ బల్కె నర్జును జూచి
నిన్ననే సుతుల గని నెఱతనమ్మనను
యింతలో సన్యాసి వెట్లయితి వయ్య
మెరుగుదుము మీవిద్య లెల్లను మేము
గరిమ వేసాలెల్ల గ్రాసాలకొఱకె
అని గేలి సేయుచు నతనితో ననుచు
చనుదెంచె రైవత శైలమ్ము కడకు
అచట నర్జును నుంచి హరియు నంతటను
నడనడచి ద్వారకా నగరి కేతెంచె.

'నన్నయ అర్జునుడు అతి సంభ్రమమున' నమస్కరించితే తిమ్మక్క అర్జునుడు 'దండప్రణామమ్ము తగ నాచరించినాడు.' నన్నయ కృష్ణుడు మాత్రము 'నగుచు' కుశలంబులడిగినాడు. మరి తిమ్మక్క అర్జునుడు నవ్వినాడు. కృష్ణుడు నవ్వుతూ పరిహాసములతో కలుపుగోలు తనముతో కలిసిపోయినాడు. అయితే నన్నయ్యగారు కృష్ణుని మూగవానిగా నుంచక చమత్కారిగను, గంభీరుడుగను యీపద్యములో సాక్షాత్కరింప జేసినాడు. అన్నియు నెరిగిన ఆ కృష్ణభగవానుడు, సుభద్రార్జునుల కల్యాణాభిలాషి యగుచు, అర్జునుడు కపట యతిగా విశ్రాంతి తీసికొను చున్న రైవతశైలమ్మునకు వినోదార్థులై ద్వారకపురవాసులు పోవ నవకాశము కల్పించి, అందు సుభద్ర చెలియలతో ఆ యతికి సమీప ప్రదేశమున పర్వతవినోదముల విలోకించుచు కవ్వడి కంటబడుటయు, ఆయమ మనోహర ముగ్ధ మోహనాకారమునకు మురిసిన విజయుని విపరీతమైన చంచల మానసమును గమనించిన కృష్ణుని సునిశిత హాస్యమును చూచెదము.

**దాని సుభద్రగా నెరిగి తత్క్షణజాత మనోజసంచల**
**న్మానసుడైన యవ్విజయు మానుగ జూచి మునీంద్ర నీకు జ**
**న్నే న లిణాక్షులందు మదినిల్పగ నంచును మందహాస గ**
**ర్భాననుడై రథాంగధరు డాతని కిట్లనియెన్ ప్రియంబునన్.**

తిమ్మక్క ఇవి అన్నియు చదివియే యుండును. ఆదికవిలోని అరమరికలు అర్థము చేసికొనినది. 'మందహాసమ'ను మాటను విడిచినా దానిలో ఇమిడియున్న మధురభావములను వదలక, తికమక పడక, తిమ్మక్క సాగించిన తీరులోని తీపిని పరిశీలింతము. తిమ్మక్క అర్జునుడును ఆయచలమునకు మ్రొక్కి మగువ రూపమ్మునకు ముగ్ధుడై, మరుని బారికి చిక్కిన

కవ్వడి గనుగొని కమలాక్షు డనియె
కనుచూపి నంతలో కాంక్షింప తగున
మొదల సుభద్రపై మోహంబు నీకు
వదలక యుండుట వడి యెఱుంగుదుము
తలపు నీకీడేరు తలకకు మనుచు
జలజాక్షు డావేళ చెలిని రప్పించి
వందనము జేయించె వరమునీంద్రునకు.

మూలములోనివి కొంత తమది కొంతగా రచియించి తిమ్మక్క 'తమది కొంత తాళ్ళపాకవారిది కొంత'యను నానుడికి కారణభూతురాలైనదా యను సహజ సందేహము కలుగుచున్నది.

నన్నయగారు వ్యాస విరచిత సంస్కృత భారత మూలమునుండి యితివృత్తమును గ్రహించి తనకు తోచిన విధముగా కాలానుగుణముగ కావ్యరమ్యతకై అనుకూలముకాని కొన్ని విషయముల పోనాడి, రసపోషణకై అవసరమైనచోట కొన్ని వర్ణనాకల్పనల జొప్పించి, మూలమునందలి ఉత్కృష్ట భావముల నెంతమాత్రము వదలిపెట్టక స్వతంత్ర కావ్యముగ తీర్చి దిద్దిన దిట్ట. అట్టి మహాకావ్యము మూలముగ, మహాకవిని ఆదర్శముగ గొనిన తిమ్మక్క అదృష్టవంతురాలు. అయినా ఆమె ఆయన కుదింపును ఒప్పుకొనలేదు. కొన్ని సునిశిత శృంగార వర్ణనలలో ఆమె స్త్రీ హృదయము చొరువచేసికొన్నది. కపట సన్యాసికి కన్నెపిల్ల పరిచర్యలు ఏర్పాటుచేసినాడు బలరాముడు. సుభద్ర భక్తితో భోజనములు పెడుతూ యుండెడిది. కాని కామవిలాసము నానాటికి, అర్జునునిలో అగ్గలమైనదనినాడు నన్నయ. తిమ్మక్క సుభద్రచేత యీడుకు తగిన బొమ్మల పెండ్లిండ్లు చేయించినది. అర్జునునకు అందు పాలు కలిపినది. అదనుకు వేచిన అర్జునుడు అంతులేని చొరవతీసికొని

'చెలియ లక్షణములు చెప్పెదననుచు' చెయ్యి పట్టుకొనినాడట. 'పద్మ రేఖలు నీకు భాసిల్లుననుచు పద్మాక్షి పాదముల్ భావించి' చూచినాడట. 'వియ్యమ్ము లందగా వెలదిరో గురుతు ముడివడి హారముల్ చిక్కు విడిపింతునే చేడె సుభద్ర' యనియు, 'నాలవ దినమున నాగవల్లికిని శోభనంబగు గదే సుదతి యిద్దరకు' అని అనేక ప్రకారంబుల మనసు లోని కోర్కెలను మర్మము విడచి మనవి చేసుకొనినాడా రసికావతంసుడు. సుభద్ర వెరగంది నిస్సహాయతతో చూస్తూ ఉండిపోయినది.

ఇందు పురోహితుండెవ్వరె నీకు
అందమైనట్టి ఘడియారమ్ము నేడె
అన్నియు నేల నీ యాశ్రితుడ నేనె
యున్నాను నీపెండ్లి నొనర జేయించ
పప్పు బూరెలు మంచి పాయసాన్నములు
వొప్పెన భిక్షమా కొనరగా గద్ద
పన్నారు గురుగుల పంచ భక్ష్యములు
నెన్నిక భుజియించె నెలమితో నగుచు
తెరయొద్ద నిలుచుండి దేవేంద్ర సుతుడు
సరసిజ వదనతో సరసమ్ములాడు
భావగర్భితముగా పలుకు మర్మములు
భావించి, సతిజూచి పరగ తమకించు
చెలియ లక్షణములు చెప్పెద ననుచు
కలికి నొయ్యెన లేమ కరము చేబట్టి
అక్షీణ జృంభణం బది యొంట గద్దు
అక్షయ సౌభాగ్య మదియింట గద్దు
పద్మ రేఖలు నీకు భాసిల్లు ననుచు
పద్మాక్షి పాదముల్ భావించి చూచె
వియ్యమ్ము లందగా వెలదిరో గురుతు

ముడివడె హారముల్ ముద్దుల గుమ్మ
చిక్కు విడిపింతునే చేడె సుభద్ర
మక్కువ నామీద మరవకు మనెను
వేదోక్త యుక్తిని వింత పెండ్లిండ్లు
కావించవలె నంద్రు ఘనశాసనమున
నాలవ దినమున నాగవల్లికిని
శోభనంబగునదే సుదతి యిద్దరకు
పానుపు టింటికి పరగ బొమ్మలను
కడువేగ నంపుదమ కమలాయతాక్షి
అనుచు కందువమాట యతి తను బలుక
నివ్వెరపడి యుండె నెలత సుభద్ర
మరి యెన్నోరీతుల మాయల తపసి
వెరువక తనుజూడ వెరగందె నబల

సుభద్రకు చురుకుతగిలినదో, సుఖమేదొరికినదో ఆప్తుడగు చిన్నన్నకు చెప్పుకొన్నది. పెద్దన్నతో ఫిర్యాదుచేసియున్న బలరాముడా కపటసన్యాసి డొక్కచీల్చి డోలుకట్టించి యుండేవాడు. అది సుభద్రకు తెలిసి, తన అంతరంగము తెలిసిన చిన్నన్న దగ్గరకే పోయి

ఎక్కడి యతివరుం డితడు వోయన్న
చూడ సంయమిగాడు చూబకాడితడు
ఆడెడిమాట లిట్లని పల్కరాదు
సరసమాడగ వచ్చు సారె నాతోను
ఎంతజేసిరి మీరిటువంటివాని
నంతఃపురంబులో నర్థమాయుంచ
కటకట యిటువంటి కపట సన్యాసి
నెటువలె బూజింతు నిందిరారమణా !

'చూరకాడు' అను జాతీయమును ఉపయోగించి తిమ్మక్క తెలుగు తీపిని యినుమడింప చేసినది.

కృష్ణుడే సుభద్రార్జునుల వివాహమునకు సూత్రధారి. ఆ దేవుని అభిమతానుసారమే ఆ కపటయతికి సుభద్రచే సపర్యలు యేర్పాటు గావింపబడినవి. అనుగు చెల్లెలు చెప్పినవన్నియు వినినాడు. నాటకము రక్తికట్టుతున్నందుకు నవ్వుకొనినాడు. చెల్లెలిని దగ్గఱకు తీసి శిరసును పైకెత్తి, చిరునవ్వుతో ఓదార్చుచూ, తానుపోయి కపట సన్యాసిని మందలించిన విధమును తిమ్మక్క మాటలలో చూడుడు.

**ముద్ద రాలోర్చునా మొప్పమాటలను**
**అని మట్టుపెట్టి యిపుడాడి వచ్చితిని**
**రమణి నీజోలికి రావెఱచు సింక**

అంతటితో వదలక, ఆయమతో కపట యతివరునికి కొద్దినాళ్లు భిక్ష కొనసాగించమని, ఉన్న విషయము కుండబ్రద్దలు కొట్టినట్లుచెప్పి, చెల్లెలి మనసు స్థిమిత పరచినాడు.

**సుదతి యాతనిచూడ సురపతి సుతుడె**
**మనసులో నీ కనుమానమ్ము వద్దు**
**అన్యులచే భిక్షమందుకో బోడు**
**దానిచే నీకు నింతగ చెప్పవలసె.**

బొమ్మల పెండ్లి, అర్జునుని అఘాయిత్యము, సుభద్ర అన్నతో చేసిన ఫిర్యాదు, కృష్ణుని సమాధానము – ఇవి తిమ్మక్క చేసిన కల్పితములు. ఇవి సహజముగను, సుందరముగను, సునిశిత శృంగారముతోను కథలో కలిసిపోవుచూ, కావ్యప్రశస్తికి, కవితాశక్తికి దోహదకారులగుచున్నవి. ఈ వర్ణనలను ఇంతరక్తిగ, స్త్రీ కావున, యీ యమ చేయగలిగినది.

'విజయ విలాసమ'ను రసవత్తరమైన శృంగార ప్రబంధమును రచియించి, మహాకవియను పేరుగాంచిన 'చేమకూర వెంకటకవి' ఒక విధముగా అదృష్టవంతుడనవలయును. వీరి రచనలో పద్యములు పొట్టివైనను, భావములు బరువైనవి. శృంగారవాహినిలో వీరు కవితా విజయ విహారము సాగించి, పేరులో 'సస' ఉన్నను, కవితలో 'పస' గలదను ప్రఖ్యాతిపొందిన మహనీయుడు. ఇతడదృష్టవంతుడని యెందు కంటినన, తిమ్మక్కకు నన్నయ్య భారతమొకటియే ఆధారము. మరి యీాయనకు మూలగ్రంథములు రెండు. నన్నయ భారతమేగాక, తిమ్మక్క సుభద్రాకల్యాణము. చేమకూర వెంకటకవి కవితలోని కమ్మదనమునకు, అందులోని భాషాభావములకు, యీాయమ ఎంతవరకు దోహదకారియో పరిశీలింతము. నన్నయ, తిమ్మక్క, చేమకూరలు చేపట్టిన ఒక ఘట్టమును తీసికొని, దానిని స్థూలముగా పరిశీలన చేసిన, ఎవరెవరి నెంతవరకు అనుసరించి, అనుకరించిరో అర్థమగును. దీనివలన యీా కవయిత్రి ఘనత పెరుగునని పెరుగవలయునని నా సదుద్దేశము. ఇందువలన పూజనీయుడు, మహాకవి చేమకూర వెంకటకవిగారి పేరు ప్రతిష్ఠలు, వారి మహత్తర కావ్యము 'విజయ విలాసము' ఘనత తరగదనియు, తరగకూడదనియు, తరగబోదనియు మరిమరి మనవిచేసి కొంటూా యీా సమీాక్ష గావించెదను.

కపటయతి కవ్వాడి యని విరించివలన వినిన సుభద్ర అతనిరూపు రేఖలను, హావభావములను గమనించి, తలపోసిన దానిలో నన్నయ అర్జునుని వర్ణన చేసిన విధము

**అలినీలకుంతలుండనియును హరినీల**

**సమవర్ణుడనియు నాజాను లంబి**

తాయతస్థిర బాహుఁడనియు నారక్తాంత
నలినదళాకార నయనుఁడనియు
నుత్తుంగ ఘనవిశాలోరస్కుఁడనియును
గవ్వడియనియును గరమువేడ్క
వివ్వచ్చునిప్పుడు వినియుఁడునది దస
వినినట్ల యతిజూచి వీఁడువిజయు

డౌకొ్క యనుచు సంశయోపేత చిత్తయై
యుండియుఁడనోప కొక్కనాఁడు
భోజనావసానముననున్న యమ్ము
ఖేందువదన ప్రీతి నిట్టులనియె.

తిమ్మక్క యీపద్యభావము ననుసరించి అనుకరించిన విధము చూడుడు. విజయుని రూపురేకలు, వివేక సంపదలు కృష్ణుని చేతనే విన్నట్లు వ్రాసినది. కాని పదములు వేరు. పాదములు వేరు.

ఈ చూపులీతమక మీ విలాసములు
యేతాపసులయందు నెరుగమెన్నఁడును
విజయుని రూపవివేక సంపదలు
గజరాజవరదుచే గరము' నేవిందు
తెగవాలుకన్నులు దీర్ఘ బాహువులు
పగడంపు వన్నెగల పాదపద్మములు
చూడగా నీతండు క్రీడియేగాని
వాలాయముగ యతీశ్వరుడు గాబోడు
కపట సన్యాసిగా కల్పించి యిచట
వుపమున శ్రీకృష్ణుడు డునిచినాడేమొ
అని మనంబున జాల హర్షమ్ము నొంది.

నన్నయ భోజనావసానమున సుభద్రచేత మాటలు మొదలు పెట్టించి నాడు. ఈ విధముగా సాగించినాడు. 'మునీంద్రా! నీయాడని తీర్థంబులు జూడని పురంబులు, నెఱుంగని రాజకులంబును లేదని విచారింతు'

అమరావతికి నెనయనగ నివ్వసుమతి
బరగు నింద్రప్రస్థపురవరంబు
చూచితిరే పాండుసుతులందు
సుఖమున్నవారె మాయత్తయం భోరుహాక్షి.

కుంతీమహాదేవికుశలమే? యమ్మహావీరుడర్జునుడు జతారితీర్థగమనోద్యు తుండయ్యె గ్రమ్మరివచ్చెనే యెఱుగుదు రేని నాకెఱుగ జెప్పుడనిన

నేన చూవెయయ్యర్జునుండనీ
యొద్దనివ్విధమున నున్నవాడ
దరుణి నీకు నాకుధరణి ధరుండును
జలజభవుడు సేసె సంధమంబు.

ఇందు అర్జునుడును అడగగనే అంతా చెప్పిన అమాయకుడు ఆత్రగాడు.

తిమ్మక్కగారి సుభద్ర కొంత గడుసరిగాను అర్జునుడు అంత ఆత్రగాడు కాకుండ వారిరువురిచేత నొకరి నొకరు రుమెచ్చించిన విధము చూడుడు. సుభద్ర ప్రయాణమై తోటలోనికి పోవుటకు ముందుపడిన జాగ్రత్తలు, చేసిన అలంకరణలు, తోడుగా తీసికొని పోయిన ముంజేతి చిలుక ఇవన్నియు అర్జునునితో నామె జరిపించపోవు సంభాషణకు పూర్వ ప్రయత్నములు, మాటవరుసకు మాట్లాడిన మగువకాదు. మనసులో మర్మము విడిచి మనసిచ్చిన వానితో తేనెలొలుకు తీయని పలుకులతో మనసార మాట్లాడినది.

అయ్యామీరేదేశ మరసిచూచితిరొ
యెయ్యదిమీనామ మెచటనుండుదురొ
పరగ నింద్రప్రస్థ పట్టణమ్మనను
బహుళ సంపదలతో బరగుచున్నార
ధీరమానసులు కుంతీసుతుల్ వారు
అరయగడు సుఖులైయున్నవార
కోరి మా మేనత్త కొడుకులైదుగురు
వారికి కుశలమా వరమునిచంద్ర
ఆ రాజవరులలో నర్జునుండెలమి
ధారుణితీర్థముల్ దరిసింపనేగె
తీర్థముల్ క్షేత్రముల్ తిరుగుచో మీరు
ఇంద్రనందను నెందు నేజూడ లేద
జగతి నంతట మీరు చరియింతురనగ
అరసి మిమ్మిప్పుడు అడుగంగ వలసె.

అంతయు ఆకర్ణించిన అర్జునుడు అమితానందముతో ఆమె తృప్తి పడు నటుల అంతరార్థములు గల మాటలతో నిట్లనియె.

పద్మాక్షి నీతోను పలుకంగ వెరతు
పలికిన పలుకులు పాపమేర్పరచి
దూరులెక్కించదో తోయజాక్షునకు
వలపు గల్గకయుండ పలుకకల్గుదునెడ
పడుచుదనమున నేను పలుకు పల్కులను
మనసులో నుంతువా నను రాజఋషిని.

చేమకూరవారి సుభద్రార్జునులు వీరికి భిన్నులు కారు. వీరి సుభద్ర యతికి యాహారమిడ నావనంబునకు చెలియలితో, ముంజేతి రాజిలుకతో కూడివచ్చి, వడ్డింప నారాజసుతుడు రమణి మొయ్యారములపై పరాకు

చేత చవియెఱుంగక, వడ్డించినవి యెఱుగక భోజనముచేసి లేచినాడు. సమస్త భూములు గనిన స్వాములవారు సంక్రదననందను నేమైన చూచి నారేమో యను ఆశతోఁగూడిన కౌతుకముతో నా మానిని ప్రశ్నించిన విధము.

మీరింద్రప్రస్థము గని
నారా ? పాండవులజూచినారా ? సుఖులై
వారందరు నొకచో ను
న్నారా ? వీరాగ్రగణ్యునరు నెరుగుదురా ?

తెలిసినవాడు, తెలిసికొన్నవాడగు కపటయతి చూచినామని తెలియ జెప్పినాడు. సుభద్రతో కోరిక తీరిక లెత్త రసోక్తిబలికె. 'ఎచ్చట గంటిరో విజయు నిక్కువ, మానె; రాడుగా యిచ్చటకంచు.' కపట వటుండు ప్రత్యుత్తరంబుగా, కన్నమాత్రమే కాదు, అయనే మేమై యున్నవాడమని నర్మగర్భంబుగాఁ బలికి మఱియు నమ్మగువతో నా మహీధరుండిట్లనియె.

వేమారు గ్రుచ్చి గ్రుచ్చిపు
డేమీ వడిగెదవు, మనసోకించుక నీకా
భూమీశుమీదఁ గలదో
తామరసదళాక్షి ! నాకు దాపక చెపుమా ?
ఆ కవ్వడి యతివేషముఁ
జేకొని యున్నాడు, నీకుజెంతనె యెన్నా
ళ్ళో కలదు వచ్చి, యింకను
నీ కీలకమించుకైన నీ వెఱుగవుగా !
నీకైతపంబుఁ జేసెద
నీకైవడి డాపనేల, యేనర్జునుఁడన్
లోకోత్తర శుభలగ్నం
బో కోమలి ! నేడుకోర్కెలొనగూర్పగదే.

చేమకూరవారి అర్జునుడు, పై రెండు అర్జునుల మేలికలయిక.

నన్నయగారు వీరిరువురుని యిక ఆడించక పెండ్లిపీటల మీాదికి పంపినారు. చిలుకను ప్రవేశపెట్టిన తిమ్మక్క, ఆమెను అనుకరించిన చేమకూర, చిలుకరాయబారము లేక పెండ్లి కానివ్వరనుట నిర్వివాదము. తిమ్మక్క సుభద్రం చూడగా నీతండు క్రీడియేయని, కపట సన్యాసిగా కల్పించి యచట కృష్ణుడు నిలిపినాడని హర్షము నొంది శృంగారమమరించి చిలుకతో కూడ సిద్ధముగా వచ్చినది. ఇక్కడి అలంకరణాలలో తిమ్మక్క వర్ణన చాల సొంపుగ కుదిరినది.

'ఈ మ్మెత్తపువ్వువలె నుతికిన మడత
నఖముల గొనితెచ్చి నాతియిచ్చినను
చెంగావిపావడ రంగుమీఱంగ
చుంగు విడిచికట్టె సుదతి సుభద్ర
పాలిండ్లవలను కన్పడగ నొకవింత
లీల పయ్యెదకొంగు లేజాఱవిడిచె
నటనతో పైనము నడచేటి మగువ
రమణబాగుగ కొంగు రంగుగా జెలగె.

ఇంకా కురులు దువ్వి, పాపిటదీర్చి, కొప్పునించుక జాఱముడిచి, మల్లెలు మొల్లలుతీర్చి, 'విటులమన్మథుడేయు విరిమొగ్గతూపునటన గుమ్మడిగింజ నామమ్ము తీర్చి, మూడువేల్ వెలసేయు ముక్కర బెట్టి. కమ్మనకపురంపు పీడెమ్ము గావించి

ఆ రామచిలుక భుజాంగదమ్మునను
రాజసమ్మున నునిచె రమణి సుభద్ర
ఝుణ ఝుణత్కారముల్ సలుపసొమ్ములును
పచ్చలరు చుల స్తంభమ్ము మాటునను
మత్తాక్షి నిలుచుండె మౌనిజూచుచును.

సుభద్ర మూపున మోసుకొని వచ్చిన తిమ్మక్క ముంజేతి చిలుక మాటకారి. అర్జునుని ఆకతాయి మాటలలోని అంతరార్థము లెరిగిన సుభద్ర నవ్వుకొన్నది. ఆ నవ్వుతో కామతంత్ర రహస్యములు పుష్పింపచినవట. మన్మథుడు బాణము వేసినాడు. ఆ మాటలకే మూర్ఛపోయిన అబలుడు తిమ్మక్క అర్జునుడు.

ఓ ముద్దు చిలక! నేనుల్కితిని
వలదింక వలదని వ్యవహరింపుచును
బడలిక గొని మౌళి పవలించెనంత
నారామచిలుక పక్కన నేగుదెంచె
పసిడిరెక్కలు సొంపులెసగి యాడగను
మాణిక్యపుంగంద మాలికల్ మెరయ
పార్థుని భుజములపై నిల్చి యపుడు
నయభయములతోను నరునకిట్లనెను
బావ లే లెమ్మని బడలికల్ తెలిపి
మోవిగంటిని చేసి ముద్దులు పెట్టె.

ఈమె చిలుక లోకజ్ఞానము, లౌకికము ఎరిగిన జాణవలె ప్రవర్తించినది. సిగ్గుతో సుభద్ర పలుకని వరుసను 'బావా! లెమ్మని' బ్రతిమాలినది. వారి సమక్షముననే వారికి రాయబారము జరుపుటలో తిమ్మక్క రచనలో రహస్యము కలదు. స్త్రీ సహజమైన సిగ్గుచేత హైందవ సాంప్రదాయమైన అణకువచేత, సుభద్ర యీ మాటలు చెప్పలేదు. చెప్ప కూడదు. చిలుకపలుకులను చిలుకచే చెప్పించినది తిమ్మక్క.

ఇదియేమి విజయుడా యీరీతినుండ
అన్నిట గుణశాలివాదువు నీవు
అర్జుననీ మనమలరు చుండగను
నిర్జరీగతి నాతినిన్నేతా నడిగె

నెలమి దుర్యోధనునకిచ్చెద ననిన
కడుతాపమును బొంది కాంత నిన్నడిగె
ఇరువురి మనసులో నెల్లతాపములు
నెరిగియు నెరుగని తెరుగుండవలెను
ఇంతిని తోడ్కొని యింద్రప్రస్థమున
కెంతో వేడుకలనీ వేగుదువుగాని
కమలాక్షి పెంచిన కడుముద్దుచిలుక
నడుగవలెనా నీకు అన్ని బుద్ధులకు
మందె మేలమ్ములకు మరి వేళగాదు
అనుచు మంజేతి కంకణముపై వ్రాలె.

చేమకూర వెంకటకవి ఇటువంటి చిలుకను విడువలేక విజయవిలాస ములో సుభద్రార్జునుల నర్మ గర్భిత సంభాషణలలో ఉపయోగించు కొనివాడు. తానర్జునుడని తెలిపి ఆమెను పొదివిపట్ట నుంకించిన పార్థుని చెయిదమును తిమ్మక్క వర్ణించిన విధము

అనుచు తమకమ్ముతో ఆతడు చేయిచాప
ఘనమైన సిగ్గుతో కాంత యిట్లనియె.

అదే సందర్భమున చేమకూరు వెంకటకవి వర్ణించిన విధము గమనార్హము.

తనుకమునలేచి, మరిలేచి, తత్కరాంబు
జంబొడిసిపట్టఁ జేసాచి సవ్యసాచి

రెండింటిలోని భావములు ఒకటే. పదములలో కూడ పోలికలు కలవు. తిమ్మక్కకు రెండు వందల సంవత్సరముల తరువాత వాడగు వెంకటకవి కవితలో ఆమె భాషాభావములు కనుపడిన ననిన ఇది తిమ్మక్క ప్రతి భకు తార్కాణమగును. నలుని హంస దూత్యములో రాయబారము

నాయికానాయకుల పరోక్షమున జరిగెది. ఇందు వారిరువురి ముందే చిలుక దౌత్యము చేయుట ఒక ప్రత్యేకత. చేమకూర వారి అర్జునుడు తాకవ్వడినని చెప్పవినిన యావినీల కచనవ్వ మొగంబటు కొంత వంచి మెంతే నెఱనివ్వెఱన్ మునిగి, సిగ్గున దిగ్గున లేచిపోవ, తమకమున లేచి, చేసాంచి, సవ్యసాచి తత్కరాంబుజం బొడిసిపట్టె, వేదికపై రాదిగిచి నమ్రవదనమైయున్న యామె భావమును గ్రహించి, ముంజేతి చిలుకను ద్దేశించి యిట్లనియె.

**చిలుకల కొలికి దినాతోఁ**
**బలుకంగా గొంతసిగ్గు వడియెదు, ముంజే**
**చిలుకా! నీతోనైనను**
**బలుకంగారాదె పలుకు బంగారటనే?**

ప్రేమోన్మాదియై మరుని బారికిఁ జిక్కిన యర్జునుని బాధ్యతారహితమైన ప్రసంగమునకు, బాధ్యతాయుతమైన యామె యుచిత ప్రత్యుత్తరము ఆమె శీలమును, వంశగౌరవమును జాటుచున్నది.

**మేరలాయివి మీ యంతవారలకును?**
**పెద్దలున్నా, రెఱిగి వారి పెండ్లి సేయ**
**గలరు, వేగిర పాటింత వలదటంచు**
**విన్నపము సేయరాదె యోచిన్ని చిలుక,**

ప్రేమ మగ్గలమై పెనంగ నా కిరీటి యామె మనవిలోని మర్మ మెఱుంగ లేక బేలమై మా 'వారెఱుగుట యెన్నడు? కావించుట యెన్నడింకఁ గళ్యాణంబున్' అని తాలిమిలేనివాడై యనేక ప్రకారంబుల మనో రాగంబు తేటవడ బల్కిన జఱుచెమట గ్రమ్ము మొగంబు మకరంద బిందు కందళితార విందంబు చందంబునఁ దనర, నొక్కింత జాఱు పయ్యంట జక్కం జేర్చుచు, తిరిగి చూచుచు, వ్రీడాభరం బిడిచికొని

ఆఘనుని బాసిమంజీ
రాఘోషము మెఱయనరిగె నంతఃపురికిన్
వేఘన బఘన తళుక్కన
మేఘము నెడబాసిపోవు మెఱపోయనగన్.

చేమకూర, తిమ్మక్కల సుభద్రార్జునుల విరహములోని హావభావములు ఒకటిగనే యున్నవి. తిమ్మక్క అర్జునుడు తప్పించుకు పోయిన సుభద్ర తిరిగి రాకుండుటకు వగచిన విధము.

ఇంతికి నాపే రదేల చెప్పితిని
కాంతయు లోనికి గ్రక్కునపోయె

'పేరు వివరించి నేనేల బేలనైతి?' నని వాపోయినాడు చేమకూరవారి అర్జునుడు.

తిమ్మక్కగారి సుభద్ర చెక్కిట చెయిబూని చింతించిన విధము

చేరి వినయమ్మున చెట్టబట్టెనను
విడిపించుకొని మఱి వేగబోయితిని
ఎలమినాతని మనసెట్లుండె నొక్కొ
కాక దానొడబడి తెకడు చుల్కదనము
యీకత నెందఱకెన్నిక కాద
యెఱుగడా నాకేల యింత చింతింప

'ఆతని మనసెట్లుండెనొక్కో' యని మదనపడిన మానిని యీ సుభద్ర. స్త్రీ సహజమైన సందేహములు కలిగినవి. మరి వెంకటకవిగారి సుభద్ర కుసుమశరార్తిన్ బెటిలిపడి పాన్పుపై నట్టేటు వడి తనలోన తలపోసిన విధము.

నేఁగోరిన చెలువుడెనను
దాఁగావలెనంచు వచ్చి తమితో వేడన్
గౌగిలి యీయక వచ్చితి
నే గాదని పెనగితెంత యవివేకమయో.

తిమ్మక్క చేమకూర సుభద్రార్జునులు ఇంచుమించు ఒకే మనస్తత్వము కలిగి ఒకే పంథాలో పోయినట్లు కనబడెదరు. ఇందులోని అర్జునునివర్ణనను పరిశీలించిన కొలది మార్పులతో ఒకేవిధముగా కన్పట్టెదరు. ఆమె అన్న చేత వినినట్లు కపటమునికోరికపై తిమ్మక్కగారి సుభద్ర అర్జునుని వర్ణించిన విధము.

ఎగు భుజంబులవాడు మృగరాజునడుము
నడచి పుచ్చుకొను నెన్నడుము గలవాడు
గరగరనివాడు చక్కనివాడు నతడు
గొప్పకన్నులవాడు కోదండగుణి కి
ణాం కంబుశాఖాహుల మరినవాడు
వెన్నున మచ్చగల విభవంబువాడు
బవిరి గడ్డమువాడు పన్నిదంబిడిన
వెన్నుపగడసాల వెసనాడ వచ్చు
చిగురొత్తు చెంద్రిక చెలగు పాదములు.

చేమకూరివారి విజయుడు సీసములో నించుమించు ఇదే రూపములో ఇదే పదములలో సాక్షాత్కరించుట చూచెదము.

ఎగు భుజంబులవాడు మృగరాజమధ్యంబు
పుడికి పుచ్చుకొను నెన్నడుమువాడు
నెరి వెంద్రుకలవాడు నీలంపు నికరంపు
మెరుగు జామనచాయ మేనివాడు

గొప్పకన్నువాడు కోదండ గుణకిణాం
కములైన ముంజేతుల మరువాడు
బవిరి గడ్డమువాడు పన్నిదంబిడి డాగ
వచ్చు నందవు వెన్నుమచ్చవాడు

గరగరనివాడు నవ్వుమొగంబువాడు
చూడగలవాడు మేలైన సొబగువాడు
వావిమేనత్తకొడుకు గావలయు నాకు
నర్జునుండు పరాక్రమోపార్జునుండు.

దీనినిబట్టి చేమకూర వెంకటకవి చేతిలో తిమ్మక్క సుభద్రాకల్యాణముండి ఉండవచ్చును. ఆయనకా గేయ కావ్యములోని పదములు భావములు మనసుకు హత్తుకొని యుండవచ్చును. ఆ కవి యిదేకథను ప్రబంధ ఫక్కీలో వ్రాయుతరి, యీ వర్ణనలు, పదములు, భావములు దొరలి ఉండవచ్చును. దీనిని బట్టి తిమ్మక్క రచన చేమకూరవంటి మహాకవిని ఆకర్షింపజేసి, ఆమోదింపజేసినదన నా కావ్యప్రాశస్త్య మెట్టిదో పఠితలే భావింపవలయును.

వీరిరువురు కూడ సుభద్రార్జునుల పెండ్లి కృష్ణుని అభిమతానుసారము వేదోక్తముగా, అగ్నిసాక్షిగా, అందరిపెద్దల యెదుట, సాంప్రదాయ సిద్ధముగా జరిపిరి. తిమ్మక్క అంతటితో వదలక సుభద్ర బాగోగులలో భాగస్వామివలె పాలుపంచుకొనినదాయను ప్రశ్న వచ్చుచున్నది. పెండ్లి అయినతోడనే సుభద్రను, అర్జునుని వెంట పంపుటకు ముందు రుక్మిణిచేత అప్పగింతలు పెట్టించినది. కొంచక కృష్ణకు కూర్మితో నుండమని సలహా యిచ్చినది. సవతితో సంసారము చేయుటలోని కష్టసిష్ఠూరము నెరిగిన రుక్మిణి అనుభవముతో ననిన మాటలు. 'కృష్ణ సర్పంబులు' అనుమాటపైన ద్వంద్వార్థము కలదు. కృష్ణయన ద్రౌపది లేక 'నల్లని' అను రెండు అర్థములు ధ్వనించుచున్నవి. కృష్ణవీరాంగన, వీరపత్ని, వీరమాత. చలపెట్టినదానల్ల త్రాచువలె కాటేయకమానదు. తన్ను చెనకిన కౌరవులను కాటేయక మానని మానిని. సత్యభామతో

పువ్వులనుండి పరమ పురుషునివరకు ప్రతి విషయమును గిల్లి కజ్జాలు పెట్టు కొనుట మనసుకురాగ రుక్మిణి అనిన మాటలివి.

చను విచ్చినాడని సకియరో నీవు
పలుమాటలకు నెట్లు పొలుపడవద్దు
పొలతినమ్మగ పురుషుల నెపుడు
పలురీతి కృష్ణ సర్పంబులై యుంద్రు
కొంచక కృష్ణకు కూర్మితోనుండు
వంచన చేయకు వనిత నెప్పుడును
అనుచు బుద్ధులు చెప్పి అనుగు మరదల్ని
అర్జునుచేతికి నొయ్యన నప్పగించె.

ఇది దూరదృష్టితో వదిన మరదలుకు చేసిన మహోపకారము. సుభద్రార్జునులు సత్యభామకు మ్రొక్క ఆమెయు వీర పుత్రుని కన దీవించినది.

అన్న అర్జునుడ యీ అతివతో గూడి
ఘనవీరు పుత్రుని గాంచు వేగముగ

సవ్యసాచి సుభద్రను రథమ్ముపై నిడికొని పయనమై పోవుతరి పురిగాచి యున్న ప్రవరసేనుడు కృతవర్మయాదిగాగల యాదవనాయకులు

మా రామకృష్ణులు మ టిలేమిఁజూచి
యీ లేమతోడ్కొని యెందుపోయెదవు

అని అడ్డగించి యుద్ధమునకుఁ గడంగ

రమణి సుభద్ర సారథ్యంబు సేయ
అమరేంద్ర నందనుడా సమయమున
కడుకోపమున దన కాండములచేత
వెనకి వారలనెల్ల చీకాకుజేసె.

వైరిని జయించిన విజయుడు సుభద్రతోగూడ ఇంద్రప్రస్థాన్ని చేరినాడు.

వదిన సలహాను 'తు. చా' తప్పకుండా పాటించింది సుభద్ర. ఇంద్ర ప్రస్థానికి పోయినతోడనే ద్రౌపదికి మ్రొక్కినది. అతివ పాంచాలిని అక్కున చేర్చినది. ఆమె ఆదరాభిమానాన్ని చూరగొన్నది. సుభద్రార్జునుల శోభనానికి ద్రౌపదే అన్ని ఏర్పాట్లు చేయించినదన రుక్మిణీదేవి 'చిట్కా' యెంతపనిచేసినదో చూడుడు. ద్రౌపదియే శయ్యాగృహాన్ని అలంకరించిన విధము

ఒప్పైన బంగారు టుప్పరిగలోను
కప్పురవాసనల్ గ్రమ్ముకొనంగ
సాంబ్రాణి ధూమముల్ సఖితానువేసి
చిత్రముల్ నిర్మించె చెలియయంతటను
దిక్కుల మాణిక్య దీపముల్ వెలుగ
నిలువుటద్దముల నెలతచెక్కించె
వెయ్యి దీపంబులు వెలుగంగ నందు
గవు సెనల్ దీయించె గాజుకంబముల
బంగారు జేరికోళ్ల పట్టె మంచమ్ము
అంగన వెలయించి యమరించె సెజ్జ
సన్నవిరిమల్లెలు జాజి మల్లెలును
బొండు మల్లెలు చాల నిండబరపించి
యిరు దెసల్ తలగడ లిమ్ముగా దాపి
బంగారు సురటితా పణతి పెట్టించె
పంకించి బాగాలు బరణులం బోసి
గావించి సున్నము కాయబెట్టించె
పండు టాకులు దెచ్చి పణతి ముడిపించి
మదిరాక్షి యునిచెను మఱియునచ్చటను

తిమ్మక్క తన కాలములోని ఆచారములు, శోభనపు గది అలంకరణమునకు కావలసిన పరికరములు సూక్ష్మముగా పరిశీలించి పెట్టించినది.

ద్రౌపది సుభద్రచేత పన్నీటిస్నానము చేయించి, శ్రద్ధగా అలంకరించి "ఘుణ ఘుణత్కారమై పణతు లిద్దరును జోడు చిల్కల" వలె శోభిల్లిరపుడు. ధర్మరాజు అర్జునునికి అలంకరణలుచేసి శయ్యాగృహమునకు వెళ్ళమని సంజ్ఞ చేసినాడు. అన్నకాళ్ళకు మ్రొక్కి పార్థుండు పాన్పుదగ్గర చేరి పడతి రాకకు యెదురు చూచుచుండెను. ద్రౌపది సుభద్రను పడకటింటికి పొమ్మనినది. సిగ్గు భరముతో సుభద్ర వెళ్ళలేదు.

సజ్జకు జను మన్న సకియ యప్పుడును
సిగ్గున మురిపెమున చెలియ సుభద్ర
అడుగు లాడకయుండి అటు కొంత సేపు
కూరిమి గలవాడు కొమరాలనీకు
మేలిమి గలవాడు మేనత్తకొడుకు
నాల్గునెలలు భిక్ష మేల్గలవెట్టి
యిప్పుడిటువలె సిగ్గు లేటికే సుదతి
అనుచు సుభద్రను అతివతోడ్కొంచు
విజయుని పాన్పున వేడ్కతో నుంచె
తలుపులు మూసికొని తరుణి మేతెంచె

అంతా సంతోషముతో అమర్చిన ద్రౌపది బయటికి రాగానే బాధపడినది.

తలపోసె మనసులో తాళంగ లేక
యేమి వస్తువులైన నియవచ్చుగాని
ప్రాణేశు నిచ్చి మఱి బ్రతుకంగరాదు

తిమ్మక్క ద్రౌపది త్వరలోనే సర్దుకున్నది.

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుని
చెల్లెలు గనకనే నొల్లననరాదు

అని తలపోసి అతివ ఆమోదించినదట. సుభద్రా ద్రౌపదుల పాత్ర పోషణలో తిమ్మక్క స్త్రీ హృదయము అడుగడుగున కాన నగును. పదునైదవ శతాబ్దములోని ఆచార సాంప్రదాయములను విశదముగ వివరించి, ఆనాటి సాంఘిక జీవనములను కరతలామలకము చేయు చున్నది. ఈ యమకావ్యము వెలుగులోనికివచ్చి ప్రజాబాహుళ్యము మన్ననల పొందగలదని నా పూర్ణ విశ్వాసము. పొందవలసినంత గుర్తింపు పొందక పోవడము విచారకరము.

# తాళ్ళపాక పెద తిరుమలాచార్యులు

" Pitt, the younger, was not only the chip of the old block but the old block itself." అని ఒక చరిత్రకారుడు- ప్రతిభావంతుడు, పరిపాలనాదక్షుడు అయిన రెండవ 'పిట్టు' ప్రభువును బ్రిటీషు ప్రధానిని శ్లాఘించి వ్రాసిన విషయము, ఆ పెదతిరుమలాచార్యుల వారిని గురించి చదువునప్పుడు జ్ఞప్తికి వచ్చును. తండ్రియైన మొదటి 'పిట్టు' దొర, బ్రిటీషు ప్రధానిగానుండి మేధావియై చక్కని పరిపాలనను సాగించి సుస్థిర ప్రభుత్వమును నెలకొల్పి పేరు ప్రతిష్ఠలు సంపాదించిన ప్రతిభావంతుడు. తండ్రివలె కొడుకు అన్నిరంగములలో ఆరితేరినవాడై తానును బ్రిటీషు ప్రధానియై వన్నెకెక్కి 'తండ్రిని మించిన తనయుడ'ను పొగడ్తల నందుకొనెను. పెద తిరుమలాచార్యులు తండ్రివలె బహుభాషావేత్త, బహుముఖప్రజ్ఞాశాలి, శ్రీ వేంకటేశ్వర భక్తుడు. తండ్రివలె పూర్ణాయుష్కుడు. అన్నమాచార్యులు క్రీస్తు శకము 1408 నుండి 1503 వరకు జీవించియుండెను. కుమారుడు తిరుమలయ్య 1460 ప్రాంతమున జనియించి 1547 ప్రాంతమున సిద్ధి పొందినాడని తెలియుచున్నది. తండ్రివలె యీయన అనేక అగ్రహారములను, ధనమును సంపాదించి దైవ కైంకర్యములకు తదితర ధర్మకార్యములకు సద్వినియోగము కావించిన ధర్మపరుడు. వీరి చరిత్ర ఆమూలాగ్రముగా పరిశీలించిన 'ఎలమి నాతనికన్న యితడు ఘనుడా!' యను జిజ్ఞాస పొడమక తప్పదు.

పెదతిరుమలాచార్యులు, అన్నమాచార్యుల రెండవ భార్యయగు అక్కలాంబకు జన్మించెను. ఈయనకు నరసమ్మ, తిరుమలమ్మయను చెల్లెండ్రు కలరు.

**అక్కలాంబకు సుముఖాబ్జ బింబకును**
**గరిమ నంబుధి సుధాకరుడు జన్మించు**
**సరళిమై తిరుమలాచార్యుండు వొడమె**
**సరసతి సన్నిభ నరసమాహ్వయును**
**స్థిరకార్య కీర్తియౌ తిరుమలాంబయును**
**జనియించిరి..........**

పాలసముద్రమున చంద్రుడుదయించినట్లు తాళ్ళపాక వంశవార్నిధిలో తిరుమలచంద్రుడుద్భవించెనని చిన్నన్న 'అన్నమాచార్యుల చరిత్ర'లో చెప్పియున్నాడు.

ఈ మహాకవికి పెదతిరుమలయ్య, పెద తిరుమలయ్యంగారు, అన్నమ తిరుమలార్యుడు, అన్నమ తిమ్మనార్యుడు, పెరిమ తిరుమలయ్యంగారు, తిమ్మయ, తిరుమల తిరుమలాచార్యుడు, తిమ్మయార్యుడు, తిరుమల గురుడు, తిరుమలరాయ దేశికుడు, తలవాక తిరుమలయ్య అను పేర్లుకూడ కలవు. వీనిని పరిశీలించిన అవి యన్నియు యీ కవికి గల పలుకుఁబడినే కాక సాధించిన అనేక విషయములను తెలుపునవిగా నున్నవి.

పెద తిరుమలాచార్యుడు గొప్ప కవుల కుటుంబమున జన్మించిన అదృష్టశాలి. తండ్రి పదకవితా పితామహుడు. సవతితల్లి తిమ్మక్క రసవత్తర శృంగార కావ్యము, 'సుభద్రా కళ్యాణము'ను రచియించి పేరు గాంచిన కవయిత్రి. ఆమె కుమారుడు నరసింగన్న గద్య పద్యరచనలో మిన్నంది మెరసిన కవి. ఇటువంటి వాతావరణములో పుట్టి పెరిగిన

పెదతిరుమలయ్య మహాకవియై అనేక గ్రంథముల రచియించి, అనేకా గ్రహారములు దానముగా గొని తన దేవునికి కైంకర్యములకై విని యోగించి, ఇహపరములు సాధించిన మహనీయుడు. అన్నమయ్య గర్భ నిర్భాగ్యుడై, అలమేలుమంగ కృపకు పాత్రుడై పైకివచ్చిన ప్రతిభా శాలి. ఆయన అష్టకష్టములు అనుభవించి, స్వయం కృషితో ఐహిక మును, ఆముష్మికమును సాధించినదిట్ట. కటికదరిద్రము ననుభ వించి, ఐశ్వర్యమును పొందినవాడు అన్నమయ్య. చీకటి నుంటి వెలుగునకు వచ్చి, కష్ట సుఖములను పాలుపంచుకొనినవాడు. కాని పెద తిరుమలయ్య జన్మించునప్పటికి తాళ్ళపాకవారి కుటుంబము ఉన్నతస్థితిలో నుండెడిది. బీదరికము తెలియనివాడు పెద తిరుమలయ్య. చీకుచింతలేని బాల్యమును గడిపినవాడు. వారి జీవితము 'వడ్డించిన విస్తర' వలె సాగి నది. ఆ పరిస్థితులలో ఆ పరిసరములలో హాయిగా చల్లగా తిరుపతిలో కాలము గడుపుచు కవనము సాగించి అనేకములగు గ్రంథములను రచి యించి, అగ్రహారములను సంపాదించి అష్టైశ్వర్యములతో కాలము గడిపి, ఆర్జించిన విత్తమును స్వామిపూజలకు తదితర సత్కార్యములకు సద్వినియోగము చేయించి, తండ్రిగారివి, తనవి అయిన రచనలను సాగి రేకులపైన వ్రాయించి, వానికి శాశ్వతమును కూర్చి, తమకీర్తికి కావ్య ములకు శాశ్వతను చేకూర్చుకొనిన ఉత్తముడు. ఉదాత్తుడు. ఇక వీరి అయిదుగురు కుమారులు పేరుమోసిన కవులనిన అబ్బురమేమి కలదు! ఇక యీ కవిశేఖరుడు వ్రాసిన గ్రంథములను, సాధించిన సత్కార్యము లను స్థూలముగా పరిశీలించినగాని, ఆయన ప్రతిభావిశేషములు బయట పడవు.

ఈయన శృంగార కీర్తనలు, ఆధ్యాత్మకీర్తనలు, శృంగారవృత్త శతకము, శృంగారదండకము, వైరాగ్యవచన గీతములు, చక్రవాళమంజరి,

వేంకటేశోదాహరణము, వేంకటేశ నీతిశతకము, సుదర్శనరగడ, రేఫఱ కార నిర్ణయము, ఆంధ్రభగవద్గీత, ఆంధ్రహరివంశము, మేలుకొలుపు ద్విపద, ఆంధ్రవేదాంతము అను అనేక ఉద్గ్రంథములను రచియించి మహాకవి పండితుడని పేరుగాంచెను. చిన్నన్న తన అష్టమహిషీకల్యాణము లోని యీ క్రింద పేర్కొన్నవాని వలన తొలుత ఆంధ్రవేదాంతమును కృష్ణమాచార్యులు, తరువాత తాతఅన్నమయ్య, తదుపరి తండ్రి తిరుమలయ్య రచియించిన సంకీర్తనాత్మకమని తెలియుచున్నది.

వేదంబు తెనుఁగు గావించి సంసార
ఖేదంబు మాన్పిన కృష్ణమాచార్యు
ఘనతర పంచమాగమ సార్వభౌము
ననఘు శ్రీ తాళ్ళపాకాన్నమాచార్యు
దలచి........................................
ఉరుయోగ సామ్రాజ్య విభవ
జనకుండు తిరుమలాచార్యవర్యుండు
వేదాంత విద్యాప్రవీణుడై యాంధ్ర
వేదాంతమొనరించి ద్విపద రూపమున
హరివంశ కావ్యమాయత రసస్ఫూర్తి
హరివంశ మిగురొత్త ననువొందజేసి.

ఈ హరివంశము ఇంకను లభ్యము కాలేదు. హరి వంశము ఎపుడు లభ్యమగునో, ఆ అదృష్టము ఆంధ్రులకు ఎపుడు కలుగునో కాలమే నిర్ణయించవలయును.

తాళ్ళపాక పెద తిరుమలాచార్యులవారికి శ్రీమద్వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్య, శ్రీరామానుజ సిద్ధాంతస్థాపనాచార్య, కవితార్కిక కేసరి, శరణాగత వజ్రపంజర బిరుదములు కలవు.

ఇతడు తండ్రివలె శ్రీ వేంకటేశ్వర భక్తుండై ఆ దేవుని సన్నిధానమున సంకీర్తనలు పాడుతూ, పూజలు చేయిస్తూ, తన ధనమునే స్వామి కర్పిస్తూ, అన్నవస్త్రములకు కొదువలేక పుత్రపౌత్రాదులతో జీవితమును సుఖముగా గడిపిన మహానుభావుడు. తండ్రిగారి తరము నుండి అలమేలుమంగ "తాళ్ళపాకవారి యాడపడుచు' అను నమ్మకమును పోనివ్వక, శ్రీవేంకటేశ్వరుని కల్యాణోత్సవములో తనవంశీయులే పీటలమీద కూర్చొని కన్యాదానము గావించు సంప్రదాయిమును విడువక, ఆకార్యమును నిర్విఘ్నముగా నెరవేరుటకు తగిన నిధులను చేకూర్చి శాశ్వతహక్కు నేకాక, దూరదృష్టితో దానిని నెఱవేర్చుటకు తగిన యేర్పాట్లు చేసిన ఉదారుడు. శ్రీ వేంకటేశ్వరుని తన యిష్టదైవముగా ఆరాధించుతూ, సేవించుతూ ఆ దేవుని అండదండలు గల అదృష్టవంతుడని ప్రతీతి. ఈయనకు శ్రీ వేంకటేశ్వరస్వామి త్రిపురుష పర్యంతము ప్రత్యక్షమును, సప్తపురుష పర్యంతము మోక్షమును ఒసంగెదనని వరమిచ్చెనట. 'గుడిపాడైనా గూబవదలదు, గుడిపోలాల పూజారి వదలడు' అను నానుడికి వ్యతిరేకముగా తన ద్రవ్యమును వెచ్చించి స్వామిని సేవించి, పూజించి తరియించిన పరమభాగవతుడు.

పెద తిరుమలాచార్యుల శాసనములు 1517 మొదలు 1546 వఱకు కన్పించుచున్నందునను, తదితర విషయ పరిశీలన వలనను వీరు 1460 నుండి 1547 వరకు జీవించియుండ నోపునని భావింపబడుచున్నది. వీరు శ్రీ కృష్ణదేవరాయలు, అచ్యుతరాయలు, సదాశివరాయలు, అళియరామరాయల కాలములలో నున్నవారు. వీరి శాసనముల వలననేమి, గ్రంథస్థము కాబడిన విషయముల వలననేమి, వీరు యీ క్రింద కనిన పదమూడు గ్రామములను శ్రీ వేంకటేశ్వర స్వామికి అర్పించినట్లు అప్పుడు లేక, తిరుపతిలోనుండుట వలనను, ఆ గ్రామముపై వీరికి

గలదు. అవి యేవన:- కావనూరు, మరువాకరై, కుప్పము, కీళంగుంనము, మన్నసముద్రము, పూండి, సంగమకోట, రాయలపాడు, సోమయాజుల పల్లె, కత్తమువారిపల్లె, ఎఱ్ఱగుంటపల్లి, పల్లివరము, గండలిమ్మాపురము పైకనిన గ్రామములు ఎగువ, దిగువ తిరుపతులలో వెలసిన దేవత లకు, వారి ఉత్సవములకు, అనేక విధములగు కైంకర్యములకు వంశ పారంపర్యముగా తమపేర జరిపించుటకు చేసిన శాశ్వత ఏర్పాట్లుగా శాసనముల వలన తెలియనగును. ఇందులో పూండి, సంగమకోట గ్రామములను తామ్రశాసన పూర్వకముగా అచ్యుతరాయలు పెదతిరుమలయ్యకు దానము చేయగా, వానిని అచ్యుతరాయల జన్మనక్షత్రమునాడు స్వామికి కైంకర్యముల సేయుటకై సమ ర్పించెను.

పెద తిరుమలయ్య తన జీవితకాలములో కట్టించిన కట్టడములలో ముఖ్యమైనవి; స్వామి పుష్కరిణి జీర్ణోద్ధరణ, మెట్లు, మంటపములు, నీరాడు మండపము, కొండమీద తాళ్ళపాకవారి యింటిముందు మండ పము, సంకీర్తన భండారము మొదలైనవి. ఈ సంకీర్తన భండారము ననే సంకీర్తనములు చెక్కిన రాగిరేకులు దాచి ఉంచబడినవి. దీనినే 'తాళ్ళపాకవారి అర' అందురు. ద్వారమున కిరువైపుల అన్నమా చార్య, తిరుమలాచార్య విగ్రహములు చెక్కబడియున్నవి. ఈ భండా రము దగ్గర సేవచేయు వైష్ణవులు ఇరువురు, సంకీర్తనలు పాడేవారు కొందరు, వీరందరికి జీతము లిచ్చుటయేకాక ఆ భాండారము ముందు స్వామిని వేంచేపు చేయించి, ప్రసాద వినియోగములు, కైంకర్యములు, దీపారాధనలు జరిపించు మొదలగు వ్యయములు భరించుచుండిరి.

శ్రీ కృష్ణదేవరాయలకు ఈ కవులు సమకాలికుల య్యు, శ్రీ రాయలు తన జీవితకాలములో ఏడుమార్లు తిరుపతిని సందర్శించి, అనేక దానములు పూజలు స్వామివారికి చేయించి, అనేక కవులను పోషించి పేరు ప్రఖ్యాతులు గాంచినప్పటికి, తాళ్ళపాక కవులను తలంచకుండుటయు, ఈ తాళ్ళపాకకవులు రాయల ప్రసక్తియే తమ కీర్తనలలోను, కావ్యములలోను చేయకుండుటయు చోద్యముగా నున్నది. అందులో పెదతిరుమలాచార్యులు కొండమీదను దిగువ తిరుపతి లోను తమ గృహములముందు మంటపములు కట్టించి అక్కడ స్వామిని వేంచేపు చేయించి యుత్సవములు జరిపించుచుతూ, అక్కడనే నివ సించుచు, ప్రతిదినము స్వామి పూజ కైంకర్యాది కార్యములలో ప్రధాన భూమిక వహించుచుతూ, కల్యాణోత్సవములలో కన్యాదాతలుగా పీటలపై కూర్చొని కార్యనిర్వాహకులుగానున్న వీరు రాయలు ముఖా ముఖి కలసియుండుటకు బోలెడు అవకాశములు కలిగి ఒకరి నొకరు తమ శాసనములలోనేమి, కావ్యములలోనేమి తడవకుండుటచే రాయల కుటుంబీకులకు తాళ్ళపాక వారికి సరిపడుట లేదను ఊహ పొడమవచ్చును. ఇదిగాక ఒక శాసనములో రాయలవారు వీరి నివాస గ్రామమైన తాళ్ళ పాకను వ్యాసరాయతీర్థులకు అగ్రహారముగా నిచ్చివేసెనని యుకలదు. ఇది యీ ఊహను బలపరుచుచున్నది. దీనికి తోడు పెద తిరుమలా చార్యులను మండెము కోటలో ఎవరో కత్తితో పొడిచినట్లును, ఆ కత్తిప్రేటు కలువదండ అయినట్లు చిన్నన్న చెప్పినాడు.

**మండెము కోటలో మండలంబెరుగ**
**మండాలాగ్రాహతి మహనీయ పుష్ప**
**దామమై ధర్మాంగద స్థితిఁ బొలిచె**
**నే మహామయుని యహీన గాత్రమున**

పెద తిరుమలయ్య కూడ తన కీర్తనలో యీ విషయమును చెప్పి యున్నాడు.

సిరుల రుక్మాంగదు చేతి కత్తి ధారదొల్లి
వరుస ధర్మాంగదుపై వనమాలాయ
హరి నీకృపకలిమి నట్లనే యగుటచే
కర ఖడ్గధార నాకుఁ గలువ దండాయ

ఈ ఉదంతము నిజమైయుండవచ్చును. కాని దీనిని శ్రీకృష్ణదేవరాయల దండనాయకునికి ముడిపెట్టి రాయలను యీ రగడలోనికి తెచ్చుట అసహజము. రాయలవారి ఉత్తమ భావములను, ఉదాత్త గుణములను ఎరిగిన ఎవరును దీనిని అంగీకరించరు. అయినను తాళ్ళపాక వారికి రాయల కుటుంబమునకు ఉండవలసిన సన్నిహిత సంబంధములు లోపించుటకు కారణము లివిగా నాకు తోచుచున్నవి.

తాళ్ళపాక అన్నమాచార్యుల కాలమునుండి అనేక అగ్రహారములు కలిగి ఐశ్వర్యముతో దైవ సాన్నిధ్యములో కీర్తనలు వ్రాయుచు పాడుచు భక్తిపారవశ్యములో కాలము గడుపు యీ వంశీయులకు, ఇతరులను ఆశ్రయించు అవసరముగాని తృప్తిపరచవలయునను దలంపుగాని లేకుండవచ్చును. పెద తిరుమలయ్య కాలములో ఈ స్థితి యింకా ఉచ్చదశలో ఉండెను. ఆయన చేయి క్రిందైనరోజులే లేకుండెను. శ్రీ రాయలవారిని ఆశ్రయించి, అదే పనిగా పొగుడుచు జీవితములను వెడలబుచ్చు మహాకవులనేకులు వారివెంబడి ఉండుటవలన, తాళ్ళపాకవారు పదకవులై తమ దగ్గఱకు రాకపోవుటవలన, వీరిరువురికి తగిన సంబంధము కుదరకపోయి యుండవచ్చును. దీనిని ద్వేషముగా తీసికొనుట కన్న ఉదాసీనతగా తీసికొనుట సహజము. రాయలవారు తాళ్ళపాకను ఇతరులకు దానమిచ్చుట వీరిపై ద్వేషమనుటకన్న, ఆగ్రామములో వీరెవరు

హక్కు, శ్రద్ధ లేకుండుటవలన వీరి ప్రమేయము లేకనే ఆదానము జరిగి యుండవచ్చును. లేక తాళ్ళపాక వీరి గ్రామముకాక మరియొకటై యుండవచ్చును. రాయలవారుకూడ ధనరూపములో యీ కవులకు తాను తిరుపతిని దర్శించినపుడు దానముచేసి యుండవచ్చును. అటు వంటివి శాసనములలో లేకపోవుటకు అవకాశము కలదు. తాళ్ళపాక పెద తిరుమలాచార్యులకు అచ్యుతరాయలవారు రెండు గ్రామములు దానమివ్వగా దానిని తిరిగి స్వామివారికి తిరుమలయ్య దానమిచ్చినాడ నిన, దానము పొందు అవసరము తాళ్ళపాకవారికి లేకుండెను. ద్వేష ముండిన అచ్యుతరాయలవారు దానమిచ్చి యుండరు.

పెద తిరుమలయ్య అప్పాజీ అవసానదశలో ప్రసాదము హక్కును కొని ఆయనకు సహాయము చేసి ఆదుకొనినాడనిన రాయలకు వారికి ద్వేషము లేదనుటకు మరియొక తార్కాణము. దీనిని పీడకలవలె వదలి, పెద తిరుమలాచార్యులవారి కవితారీతులు పరిశీలించి, అందులోని తీపిని ఆస్వాదించెదము.

పెద తిరుమలయ్య తండ్రి వలె శబ్దార్థశుద్ధిగల కవి. తండ్రివలె సంస్కృతాంధ్రముల విద్వాంసుడు. ఉభయభాషాకోవిదుడు. అన్నమయ్య సంకీర్తనముల వలె వీరి కీర్తనములు హాయిగా, తీయగా ద్రాక్షపాకమున బడి పండితపామరులు నాస్వాదించి, ఆనందింపబడునవిగా నుండును. వీరి రచనల భాషాభావములు సరళమై శ్రోతలకు హృదయోల్లాసి యగు చున్నవి. అయినను వీరికవిత కొన్నిచోట్ల పాండిత్య ప్రకర్ష గలిగి జిగి బిగి తనముతో రాణించునదిగా నున్నది. వీరు కవియేగాక, మంచిపండి తుడు, మధురగాయకుడు. ఇక వీరి కావ్యములలోని కమ్మదనమును చవి చూచెదము.

వీరి శృంగార సంకీర్తనము నొకదానిని తీసికొని పరిశీలించిన వీరును తండ్రివలె మధుర భక్తిభావములో తన్మయులై దేవుని శృంగార చేష్టలను ఊహించి వర్ణించినారు. కామించి యాతండు కడుంజవి చూపిన వేడుకలు ఏమని చెప్పుదు'నని సిగ్గు అభినయించినను. విపులము గనే విమర్శించినారు.

పల్లవి:- ఏమని చెప్పుదునే యిటువంటి వేడుకలు
కామించి యాతండు నాకు కడుంజవి చూపెను.

చరణము:- తెరదీసి యాసలతో దృష్టించి చూచిన చూపు
వరుస నవ్వలిమోము మివ్వలైన నవ్వు
పరువము దప్పకుండా పాచికూడిన కూటమి
సరుగ నిండు సిగ్గులు జారినప్పటి రీతి ||ఏమని||

కొంచక వొట్లు పెట్టుకోగా వేడుకొనుటలు
మించి యలుక దేరిన మీదిమాటలు
అంచ వసంతము లెట్లాడి కౌగిలి
యెంచి నాల్గునాళ్ళుచేసి యెనయు నాటితమి ||ఏమని||

జడియక సురతము సలిపిన మీది నిద్ర
యెడమాటల దించె వొడంబాట్లు
అడరి శ్రీవేంకటేశుండన్నిటా నన్ను నేలి
యెడయని వలపుల యింపులు పుట్టించెనె || ||ఏమని||

వీరి ఆధ్యాత్మ సంకీర్తనలు తండ్రి పోకడలు పోయినను, పదముల పొందికలోను, బిగింపులోను, కొన్ని ప్రౌఢముగ నుండును. చాలవరకు సరళ పదజాలముతో, తాను కూడ తన దేవునితో మాట్లాడుచున్నాడా యను ధోరణి సాగించిన కవిత లెక్కువ. ఇవి వ్యాకరణము నతిక్రమించినను, చంధస్సునకు లొంగక పోయినను, మనోల్లాసియై, హాయిని

కూర్చునవిగానున్నవి. తన యిష్టదైవమైన వెంకటగిరి వాసునికి అనేక అవతారములలో సేవచేసి, ఒప్పించి, మెప్పించిన అనేక పురాణ పురుషులను తడవి, వారి శక్తియుక్తులను పొగడి, తనకాశక్తిలేదని తెలిపి, తనకు మార్గముచూపి రక్షించి, తరియింపజేతుమను మనవిలోని మధురిమను చూతము.

పల్లవి:- రామ రామ రామ కృష్ణరాజీవలోచన నీకు
దేముకంటి ఒంటననే తేజము నాది

చరణము:- వారిధిదాటి మెప్పించవాయుజుఁడనేగాను
పారెఁజవుల మెప్పించ శబరిఁగాను
బిరాన సీతనిచ్చి మెప్పించ జనకుండఁగాను
యేరీతి మెప్పింతు నన్ను యెట్లుగాచేవో ॥రామ॥

ఘనమైన మోచి మెప్పించ గరుడుండ నేఁగాను
నొనఁ గామసుఖ మియ్య గోపికంగాను
వినుతించి మెప్పించ వేయినోళ్ల భోగిఁగాను
నినునెట్లు మెప్పింతు నను గాచెదెట్లో ॥రామ॥

నవ్వుచుఁబాడి మెప్పించ నారదుఁడనేగాను
అవ్వలఁ బ్రాణమియ్య జటాయువుంగాను
యివ్వల శ్రీ వెంకటేశ నీకే యిటుశరణంటి
అవ్వలనా తెరువేదో రక్షించే దెట్లో ॥రామ॥

వినుతించి మెప్పించగల శక్తి, నవ్వుచు పాడి మెప్పించ గల యుక్తికలిగియు ఎట్లు మెప్పించెదనో, ఎట్లు కాపాడెదవో అని తన దైవమునకు మొరపెట్టుకొనుటలో కలదాతని సాత్వికభక్తి, అణకువలు.

వీరు రచియించిన నీతిశతకము సీసపద్యములలో సాగినది. అందు లోని నీతులు, సులభగ్రాహ్యములై సామాన్యులకు అందుబాటులో నున్నవి. దినచర్యలలో పనికివచ్చునవియై యలరారు చున్నవి. ఏయే పనులు ఎప్పుడు చేయవలెనో, చేయకున్న కలుగు దుష్ఫలితములను కంటికి కట్టినట్లు యీ పద్యములో వర్ణించుట గమనార్హము. కడపటి రెండు చరణములలో తన దైవమును హృద్యముగా వర్ణించుతూ, దానినే మకుటముగా గ్రహించుట ప్రత్యేక విశేషము.

**అడుసుచేతులఁ దివియంగ వచ్చు నొకవేళ**
**బలిసి యెండిన గడ్డపారవలయు**
**నాఁకటివేళనే యన్నంబు రుచియగు**
**దనిసేనే నోకివింతలు గడంగుఁ**
**దటితోడ విత్తినఁ దఱచుగాఁ బండు జే**
**నెపుడైన విత్తిన నీచపోవు**
**బంటు నాయావేళ షునిఁగొనవలె గాని**
**యలవాటు దప్పిన నడిచిపడును**
**వేళవేళలఁ గార్యముల్ వెలయఁ జేయ**
**వలయు నొకయింత దప్పిన వశముగావు**
**కవితలక్ష్మీశ! సర్వజగన్నివేశ!**
**విమలరవికోటి సంకాశ! వేంకటేశ!**

ఈ పద్యములో శైలి, శృంగారము, పదములలో జిలిబిలితనము లేకపోయినా, సరళపదములు, సామాన్యుని జీవితములోని నిత్యకృత్యములగుట వలన మనసున నాటుకొని మరపురాకున్నవి. మనకు తెలిసిన విషయములనే, మనకు తెలిసిన పదములతో మనసుకు హత్తుకొను విధముగా చెప్పించి, యొప్పించి, మెప్పించుటయే యీతని ప్రత్యేకత. ఇటువంటి రచనలనే వేమనకవిగారు సాగించిరి. తన పద్యశతమును

తన దైవమునకే అంకితమిచ్చినాడు. ఈ కడపటి పద్యమున ఆ దేవున్ని అనేక పేరులతో స్తోత్రము చేసి తనభక్తి ప్రపత్తులను ప్రదర్శించుకొనినాడు.

మాధవ గోవింద మధుసూదనాచ్యుత
వామన ప్రద్యుమ్న వాసుదేవ
కృష్ణ దామోదర కేశవ శ్రీధరహరి
విష్ణు పురుషోత్తమా నిరుద్ధ
సంకర్షణాధోక్షజ త్రివిక్రమప
పద్మనాభ జనార్దన నారసింహ
శౌరి హృషీకేశ నారాయణోపేంద్ర
తాళ్ళంకముఖనామ తాళ్ళపాక

యన్నమాచార్యసుత తిమ్మయాహ్వయుండఁ
బ్రణుతి చేసితిఁ జేకొమ్ము పద్యశతము
కలిత లక్ష్మీశ ! సర్వజగన్నివేశ !
విమల రవికోటిసంకాశ ! వేంకటేశ !

పెద తిరుమలయ్య శ్రీ వెంకటేశోదాహరణము అను పద్యకావ్యములో పదములపొందిక, బిగువు, బింకము ఇతరకవులకు తీసిపోని విధముగా సాగినవి. భాషాభావములు ఒక దానితో నొకటి పోటీపడుచున్నవి. వీనిలోని శబ్దార్థశుద్ధి పరాకాష్ఠనందుకున్నది. కవితలను తరువాతి కవులు తమ కావ్యములలో పొందుపరచుకొని కూడా, వీరిని పూర్వకవుల ప్రార్థనలలో పలుకకుండుట దురదృష్టకరము. దీనిలోని ఒక ఉత్పలమాలను, ఒక కళిక, ఉత్కళికలను ఉదహరించిన వీని నడక, అందులోని అల్లిక, శబ్దలాలిత్యమును చూడనగును.

కోరి పదాఱువేలయిన కొమ్మల నెమ్మదిఁ బెండ్లియాడియున్
ధారుణి బ్రహ్మచారినని తప్పక పల్కి, పరీక్షితున్ మహో
దారతఁ బ్రాణమెత్తుచుఁ బ్రతాపము మీఱగఁ బ్రోచుమోహనా
కారునియందు వేంకట శిఖామణియందు మనంబు నిల్పెదన్.

### కళిక

మరియు శోభి గుణాభిమానియందు
దళినాభి జనుతాభి దానియందు
శతపత్ర సమనేత్ర శౌరియందుఁ
దత చిరగోత్ర ధారియందు
శతకోటి శతకోటి సారియందు
గ్రతువాటి రిపుదాటి కారియందు
భుజగేంద్ర ఘనసాంద్ర భుజునియందు
రజనాంద్ర రుంద్ర గోత్రజుని యందు

### ఉత్కళిక

భువియుఁ భవనంబు దివియు భువనంబు
రుచులు పచరంబు ఖచర నిచయంబు
నలరు బలుసొంపు గలుగు చెలువంపు
ధరణి ధరునందుఁ బరమ గురునందు.

వీరి యీ కావ్యములో నిటువంటివి యెనిమిది ఉత్పలమాలలు, 8 కవితలు, 8 ఉపకలు ప్రచురింప బడినవి. గ్రంథాంతమున మఱి రెండు పద్యములు గలవు. అందొక దానిలో నిన్నే పూజించి వరముల్ చేకొందునని, తన సేవ వలన మహాయశము దేవునికి కలిగెనని తండ్రి విధముగనే చెప్పికొనినాడు.

**నీ వీశుండవు నిన్నుఁగొల్తు వరముల్ నీచేతఁ గైకొందు నేఁ**
**గై వారం బొనరింతు నీకొఱకు సంకల్పింప నీడేఱ మ**
**త్సేవల్ నీవలనన్ మహాయశము నిల్చెన్ నీకు నీయందు ల**
**క్ష్మీవాల్లభ్యము గంటి భక్తవరదా! శ్రీ వేంకటాద్రీశ్వరా!**

కడపటి పద్యమున (శ్రీ) వేంకటేశోదాహరణమును తన దైవమునకు అంకితమిస్తూ తాళ్ళపాక పురశాసనుడని ఆ గ్రామముల తమకు గల హక్కు అధికారమును వెల్లడించినాడు. బహుశా వారు ఆ గ్రామ కరణములుగా నుండనోపు. ఇప్పుడు తాళ్ళపాక వంశీయులే ఆ గ్రామ కరణములు. కడపటి చరణములలో కవిత అంత్యాను ప్రాసలతో పోతన రచన పోలియున్నది.

**అరవి తారకంబుగ నుదాహరణంబు రచించె భక్తివి**
**స్తారతఁ దాళ్లపాక పురశాసనుఁ డన్నయ తిమ్మనార్యుఁ డిం**
**పారగఁ జక్రనందక గదాంబుజ ధారికి శ్రీ వధూమనో**
**హారికి వేంకటాచల విహారికి శౌరికి నంకితంబుగన్.**

తాళ్ళపాకవారు కవులేకాక లాక్షణికులు కూడ అన్నమయ్య సంస్కృతమున లక్షణగ్రంథమును రచియించితే, కుమారుడు పెద తిరుమలయ్య 'రేఫ ఱ, కారములు, రేఫ ఱ, కారనిర్ణయ' మను లక్షణ గ్రంథమును రచియించి, మొదటితూరిగా తెలుగుభాషలోని బండిరాల జాబితాను యిస్తూ ఎక్కడ సాధు రేఫమును వాడవలయునో, యెక్కడ శకట రేఫమును ఉపయోగించవలయునో నిర్ణయించి, రేఫలను 55 గీతముల లోను, 'ఱ' కారములను 53 గీతములలోను అకారక్రమమున వ్రాసి, తరు వాతి లాక్షణికులకు మార్గదర్శి యగుటయే కాక, వారికి ఉపయోగపడినారు. ఇట్టి గ్రంథమును మొదట ఊహించి, వాని ప్రయోగములను, ఉప యోగములను గుర్తించి, శ్రమించి, సేకరించి, అక్షరక్రమమున పద్య

రూపముల క్రోడీకరించుటకు కావలసిన సూక్ష్మపరిశీలనాశక్తి, అవగాహనాశక్తి, సమన్వయ శక్తి, అందిమిడియుండు శ్రమతో కూడిన కృషి శ్లాఘనీయము. ఇందుండు పద్యములన్నియు కందములే. అందుండు మొదటి పద్యముననే అటు తరువాత అదనుదొరుకునో లేదో యను అనుమానముతో తన దేవునికి అంకితమిచ్చినాడు. తిరుమలయ్య దీనిని 'శ్రీ' కారముతో మొదలిడి సాంప్రదాయమును పాటించినాడు. కృష్ణామకుటముతో వీనిని చెప్పినాడు,

**శ్రీ వెంకటేశ నీకుం**
**గావించెద నంకితముగా ఱారేఫల్**
**వావిరి నేపఱచిన కృతి**
**శ్రీవనితానాధరామ చేకొను కృష్ణా**

చూచుకొనుటకు సులభముగా నుండునట్లు అక్షరక్రమము వానిని ఆది కవీశ్వరులగు కవిత్రయము మొదలుగాగల కవిపుంగవుల కావ్యములలోని రేఫ ఱకారము లేర్పరచి చెప్పెదననినాడు.

**అచ్చులు హల్లులు వరుసనె**
**వచ్చిన రేఫలను, ఱాలువర్ణించెమెన్**
**మెచ్చుగ నాది కవీశ్వరు**
**లచ్చుపడం గృతుల జెప్పినటువలె కృష్ణా.**

ఈ రేఫ ఱకారనిర్ణయములో ఒక్కొక్కదానికి రెండు ఉదాహరణ పద్యములు తీసికొనిన వానిలోని యింపు సొంపులు వానిని బిగించుట లోని భింకము కాననగును.

**కోరవు నమనఁగా జే**
కూరుట యనఁ దక్కిరనగ గోరికలనఁగా

గూరిమి యనఁగా నతనికిఁ
గూరుతునన రేఫలయ్యె గుణనిధి కృష్ణా.
పుట్టిరి తిట్టిరి కూలిరి
నెట్టిన భూపాలురనగ నెయ్యురు లేరే
గట్టిఁగ గందరు లెప్పము
నెట్టినఁ బోటరియు రేఫ నెలవులు కృష్ణా.

'ఱ' కారమును ఎక్కడ వాడవలయునని ప్రతివారికి సందేహమే. ఇది తరువాత కవులకు చాల ఉపయోగకారి యయినది.

అఱవఱలై యఱుకలును
క్కఱ యతిమఱి యఱచు ననగ నఱుపుడు జోళ్ళే
పఱ నఱుమెడలక పోల్పఱి
యఱువది కోట్లనఁగ ఱాలనమరెను కృష్ణా!

ఱఱిగొని యొకచో ఱాఱఱ
ఱఱఱఱ నొక జెట్టిపోతు ఱాఱెననంగా
ఱఱుపుచ్చ ఱఱభి ఱూఱఱూఱ
ఱిఱఱిఱ యనఁ బెద్దఱాలు చెలువుగఁ గృష్ణా.

ఇక వీరి శృంగారదండకములోని ఒరవడి ఒక ప్రత్యేకత గలది. తరువాతి వారికి మార్గదర్శకమైనది. అంత్యానుప్రాసలతో అలరారుచు శబ్దార్థములతో వీనుల విందై విరాజిల్లుచున్నది.

వాడి పూఱాంపముల్ వేఁడి క్రొవ్వెన్నెలల్
క్రూరముల్ కరముల్ ఘోరముల్ భృంగ ఝుంకారముల్
దీపితా రోపముల్ కోకిలా లాపముల్
విస్ఫురత్కోపముల్ చిత్ర పాంచాలి కారూపముల్
ఱాలముల్ మందవా తూలముల్

సంతతా భీలముల్ సారికాజాలముల్
వీనినే నెట్లు సైరింతు, జేతోభవా స్త్రంబు, లేరీతి వారిం
తోయంచుఁ జింతఁగా గవో లోపరిన్యస్త హస్తాబ్జయై
దుస్తర స్వేదయై యావమన్మస్తయై మోము వాడంగఁ
బెన్గొప్పు వీడంగ జన్గప్పు జారంగ నిట్టూర్పు
మీఱంగ బెట్టాస లూరంగమైఁ బారవశ్యంబు దేరంగ.

ఇట్టి శృంగారరస ప్రధానమైన దండక రాజమును రచియించి, దానిని వెంకట భర్తకు అంకిత మొనర్చిన విధము చూడుడు.

సన్నుతిఁ దాళ్లపాక పురశాసనుఁ డన్నయ తిమ్మనార్యుఁ డ
త్యున్నతిఁజెప్ప దండకము దుగ్ధపయోనిధి కన్యకారతి
స్పన్నమృగీ మతాంకునకు, వేంకట భర్తకు నిత్యభోగ సం
పన్నన కారవిందు కుల పర్వత తారకమై చెలంగఁ గాఁ.

సుదర్శన మనునది, శ్రీ మహావిష్ణువు చక్రాయుధము. దానిపై చెప్పిన రగడ సుదర్శన రగడయని పెద తిరుమలయ్య ఆ చక్రపు ప్రతిభా విశేషములను ప్రస్ఫుటము చేసినారు.

ఓంకారాక్షర యుక్తము చక్రము
సాంకమధ్య వలయాంతర చక్రము
సర్వఫల ప్రదసహజము చక్రము
పూర్వకోణ సంపూర్ణము చక్రము.

మంత్రాధిరాజ మానిత చక్రము
యంత్ర పీఠమధ్యాసిత చక్రము
కుంజరపాలన గుణయుత చక్రము
రంజిత పుష్పపరాగము చక్రము

వంధ్యేతర గర్వస఼్ుట చక్రము
సంధ్యారుణపటసంవృత చక్రము
మిథ్యావాద తిమిరహర చక్రము
తథ్యామృత సంతర్పిత చక్రము
నరసింహమంత్రనామవుఁ జక్రము
ధర్మనక్షరముల దామిన చక్రము
మహా సుదర్శన మంత్రము చక్రము
విహారితవజ్ర విధముల చక్రము
అంబర నరసింహాక్షర చక్రము
సాంబుజాక్ష పాశాంకుశ చక్రము
మానితదిక్కృతిమంత్రము చక్రము
నానావిధ హరినామవుఁ జక్రము.
వేయు విధంబుల వెలసిన చక్రము
వేయంచులు గల విశ్వపు చక్రము
ఖావించు సుజనపాలన చక్రము
శ్రీ వేంకటపతి చేతిది చక్రము.

'వేంకటేశ్వరా' అను మకుటముగల వీరి శృంగారవృత్తశతకమును పరిశీలింతము. ఆ పద్యముల నడక, హావభావములు హాయిగా సాగినవి. నిర్దుష్టమగు పద్యకావ్యములను కావించుశక్తి సామర్థ్యములు గల కవులు తాళ్ళపాకవారని తేలుచున్నది. వారికి నచ్చినది, వారి దేవుడు మెచ్చినది, పదకవిత కావునను, వారి కవితలు రాజసభలకుఁ జేసి, రాజాదరణ పొంది, పండితామోదము కలుగవలయునను యుద్దేశములు లేక, ప్రజాప్రాంగణమునకు, దైవామోదమునకు, ఆత్మసంతృప్తికి చేసిన అమరగానముగా తెలియనగును. ఈ పద్యపాటవములను పరిశీలింతము.

తిరుమలయ్య జీవితము అష్టైశ్వర్యములతో హాయిగా జరిగిపోయినది. ధన ధాన్యాది వస్తు వాహనముల కొరత ఆదినుండి ఆవంతయు లేని అదృష్టవంతుడు. శ్రీగల తన దైవము తొలుతనే దానిని ప్రసాదించినాడని కృతజ్ఞతతో తెలుపుకొనుచున్నాడు.

శ్రీగలవాడవేయనినఁ జెల్లును నేనిక నడ్డమాడినన్
బాగులుగావు మౌనమునఁ బంతముదక్కను మీరిపలికి-నం
దీగెలు సాగి యారొకటిదీయగఁజే నటువచ్చునంౘడు నీ
భోగము నాకు నిచ్చితివి పొందుగఁదొల్తనే వేంకటేశ్వరా.

అలమేలుమంగకు అలుక యెక్కువ. అది శృంగారపరమైనది. ఆలస్యముగా ఆమె భర్త వచ్చినను, అంతకు యింతకు మొగము త్రిప్పుట, ఆయనను చూచినతోడనే సర్దుకొనుట ఆమెకు అలవాటు. అటువంటి అరమరిక నొకదానిని యీ కవి పొందుపఱచి అద్దమే అలుక తీర్చినట్లు చమత్కరించినారు.

అలుగుచుఁగాంత మాఱుమొగమైయటు చూచిన దర్పణంబునం
బెళకకనీ మొగంబు ప్రతిబింబము గానగవచ్చె నంతలో
గలకల నీవు నవ్వితివి కాంతయునవ్వెను, మీకు నద్దమే
యలుకలు దీర్చెఁదోడిచెలు లచ్చెరువందగ వేంకటేశ్వరా !

ఈ పద్యమున వెంకటేశ్వరుని శృంగారమును ప్రకృతితో మేళవించి, సరళపదములతో, శబ్దరామణీయముతో, అంత్యాను ప్రాసలతో హాయిగా సాగించినారు తిరుమలయ్యగారు, ఈ రచన పోతన పోకడలు పోయినది.

మొదలన్ పూఁబొదలన్ మరుండు రొదలన్ ముందాడి పెందోడిగా
గదలన్ తుమ్మెదలంగెరల్చి మెదలంగా గాలిసంసీలియై

యెదలన్ గ్రెక్కదలంగఁజేసి దుదలన్ హేలాంక బాలాలికిన్
పొదలఁ సంపదలన్ వరించు మనిశంబున్ వేంకటాద్రీశ్వరా !

పెద తిరుమలయ్యగారు వ్రాసిన వేంకటేశ్వర వైరాగ్య వచన మాలికాగీతములు చాల వరకు గేయముల వలె నుండి, పాడుటకు అనుకూలముగ నున్నవి. వీనికి రాగతాళములను పొందుపరచినారు. ఇంత వరకు నూటఅరువది ఆరు వచన గీతములు ప్రకటింపబడినవి. మానవునికి మనస్థిమితము లేదనియు, తానొకటి తలచిన దైవమొకటి తలచి, మాయలో భ్రమియింప చేయుచున్నదనియు, తన దేవుని వశపరచుకొను ఉపాయము చెప్పమని వేడుకొనుటయే యీ వచనములోని ముఖ్యాంశము.

## సారంగనాట (పల్లవి)

నిగమగోచరా నామనంబు యోగంబు సేయం గడంగిన,
చండాలగార్ధభ శునక కాంతాదులు తలంపునం బారెడిని
యంతటనది విడిచి పురాణంబు చదువంజూచిన
శూర్పణఖా విరాధ కబంధ రావణ కుంభకర్ణాదుల
నామంబులు నోరం దొరలెడిని
అదిమాని జపంబు సేయంబూనిన నావలింతయు
నిద్రయు నలసత్వం బొదిలెడిని
యది చాలించి తీర్థయాత్రా కుతూహలుండనైన
తురుష్కచోర వ్యాఘ్ర మకరాది భయంబులు పడఁకం
జేయఁ దొడంగెడిని
యీ రీతుల నా ప్రయత్నంబు లెకడికెక్క
నేనొక్కటి దలంచిన వేఱొకచందంబున నీమాయభ్రమయింపుచున్నది
యే యుపాయంబున నిన్ను నావశము సేసుకొనియెద
నాచందంబు నాకు బోధింపవే నీవు జగద్గురుండవు నారహ
స్యము నీ చేత నున్నది, శ్రీ వెంకటేశ్వరా !

వీరి మఱియొక గీతములో మానవుడు తనచేయు నిత్యకృత్యములలో, ఉద్యోగ వ్యాసంగములలో తెలిసియో తెలియకయో అనేక పాపకృత్యములు చేయుచున్నాడు. అవి అన్నియు చిత్రగుప్తుడు చిట్టాకు ఎక్కించుచున్నాడు. ఇన్ని అపరాధములు చేయువాడు భయము నివారింతువని శరణుజొచ్చి విన్నవించు భక్తుని ఎట్లు కాపాడెదవో యని ప్రార్థించుచున్నాడు.

## అహిరినాట (రూపకం)

**నందనందనా సేయంగల పాపము లన్నియుంజేసితి**
**నాకర్మం బేమనుచున్నదియో యెఱుంగను**
**యెక్కడలేని యుద్యోగంబులు నే జేయుచున్నవాడను**
**విధి యేమనుచున్నదియో యెఱుంగను**
**బాల్య కౌమార యౌవన గతులం బెరుగుచున్నవాడను**
**కాలం బేమనుచున్నదియో యెఱుంగను**
**అన్నపానాది భోగములన్నియు ననుభవింపుచున్నవాడను**
**చిత్రగుప్తు లేమని వ్రాయుచున్నవారలో యెఱుంగను**
**ఇన్ని యపరాధంబులకు గురియైన వాడనగుట**
**నా భయము నివారింతువని నీమరంగుజొచ్చి సేయంగల**
**విన్నపంబులెల్లఁ జేసుకొంటిని**
**నీచిత్తం బెట్లున్నదియో యెఱుంగను శ్రీ వేంకటేశ్వరా!**

వీరి గొప్పలు చెప్పబూనిన గ్రంథ విస్తృతమగునను భీతిచే 'చంద్రునికి నూలుపోగను' సరిణి వారి బహుగ్రంథములనుండి ఒక్కొక్క చిన్న అంశమును తడివి, అందులోని అందమును, ఆనందమును చవి చూపించి, (పఠితల) దృష్టిని వారి ఉత్కృష్ట రచనలపైకి మరలించుటయేనా ముఖ్యోద్దేశము.

# తాళ్ళపాక చిన తిరుమలాచార్యులు

'అచటఁ బుట్టిన చిగురు కొమ్మైనచేవ' అని ఆంధ్ర కవితా పితామహుఁడు అల్లసాని పెద్దన మనుచరిత్రమున నుడివినాడు. 'చిగురు కొమ్మైన చాఁగ' అను ప్రయోగమును పదకవితా పితామహుఁడు తాళ్ళపాక అన్నమాచార్యులు తన సంకీర్తనలలో తొలుత ప్రవేశ పెట్టినాడు. 'చిగురు' అను పదమునకు 'చివురు' గా గూడ నామాంతరము కలదు. ఒక చెట్టుగాని దాని కొమ్మకాని ముదరినకొలది గట్టిపడి ఒకవిధమైన ఒక నలుపు తేరును. ఈ చేవ బలమైనదిగను చెదలు మొదలైన దానిని చేరువకు రానివ్వక గట్టిగను శాశ్వతముగా నుండును. ఈ చేవ లేతకొమ్మలలో నుండదు. కాని 'చివుడు' అను చెట్టులోని లేత కొమ్మలకు కూడ చేవ ఉండునని ప్రతీతి.

చిన తిరుమలాచార్యులు పెద తిరుమలాచార్యుల కొడుకు. అన్నమాచార్యుల మనుమడు. వీరందఱు పేరు ప్రఖ్యాతులు కాంచిన పద కవులు, గాయకులు. అందరు శ్రీ వేంకటేశ్వర్ల భక్తులై, తమ ధనముతోను, కీర్తనలతోను స్వామిని సేవించి పూజించి, తరించిన ధన్యులు. ఆ వంశములోని పిన్నా, పెద్ద అందరు కవులనిన, 'అచటఁ బుట్టిన చిగురు కొమ్మైన సేవ' అనునానుడి యీ కుటుంబము పట్ల సార్థక మగుచున్నది.

పెద తిరుమలాచార్యులకు తిరుమలాంబయందు అష్ట భాషాకవి చక్రవర్తియైన చిన తిరుమలాచార్యులు కలిగెను. వీరికి నలుగురు పేరు మోసిన తమ్ములు గలరు. వారు అన్ని విద్యలందు ఆరితేరినవారు. వారు అన్నమయ్యను బోలు అన్నమాచార్యుడు, సంగీత సత్కవిత్వాధికుడు తిరువెంగళాహ్వాయుడు, ఉషాకల్యాణ, పరమయోగి విలాస, అష్ట మహిషీ కల్యాణాదుల రచియించి స్వామి కంకితమిచ్చి వారిచే మకర కుండలములు గొనిన తిరువేంగళనాథుడు, విద్యా విశారదుడు లోకవి దితుడు కోనేటి వెంకటనాథుడు. వీరందరు పం'చ కల్పతరువు లన నొప్పు తనయ రత్నము' లని చిన్నన్న చెప్పినాడు.

ఈ కవికి చిన్నతిమ్మన్న, చిన్నతిరుమలయ్యంగారు, సిరుతిరుమ లయ్యంగారు, తిరుమల అను పేర్లుకూడకలవు. ఈయనకు పెద్దమంగమ్మ వలన జన్మించిన తిరువెంగళప్ప గొప్పకవి, పండితుడు. ముమ్మటుని కావ్యప్రకాశికకు దేవభాషలో 'సుధానిధి' యను వాఖ్యను వ్రాసినట్లు తెలియుచున్నది. ఈ విషయమును శ్రీ ఆఫ్రెచ్ గారు కూడ తెలిపిరి. అమరమునకు 'బాలప్రబోధిక' యను సటీకవ్యాఖ్య వ్రాసి ప్రసిద్ధి పొందిరి. అమరుకాన్ని వీరే తెనిగించిరని వినికిడి. ఇవి లభ్యము కాకు నికి వీరినిగురించి వ్రాయుటకు వీలుపడకున్నది. వీరు 1553-54 ప్రాంతపు వాడని వీరిశాసనము మూలమున తెలియనగును. కాని వీరు, తండ్రి, తాత, ముత్తాతల సంకీర్తనల విషయములో చాల శ్రద్ధ తీసికొని, వాని పలుకుబడి ప్రాబల్యములకై చాలపాటు పడుతూ, అనేకదానములు చేసి నట్లు తెలియనగును. ఈ మహనీయుని గ్రంథములు బయటపడి, వీరు వెలుగునకు వచ్చు రోజులుకలవో లేవో కాలమే నిర్ణయించవలెను.

చిన తిరుమలాచార్యులు తండ్రి తాతలవలె శ్రీ వేంకటేశ్వరులపై శృంగార ఆధ్యాత్మిక సంకీర్తనలు అనేకములు రచియించి, వానిని వారి

వలె గానము చేయుచు, రాగిరేకులపైకి యెక్కించి వారికి, వారి కీర్తనలకు, తన కీర్తికి స్థిరత్వము కల్పించి తరియించిన చారిత్రక పురుషుడు. ఇవికాక వీడు తన తాతగారు అన్నమయ్య సంస్కృతమున రచియించిన లక్షణ గ్రంథమును తెలుగులో సంకీర్త లక్షణమను పేరహృద్యముగను అందరి అందుబాటులోనికి తెచ్చి, తాత కీర్తిని, తన పేరును నిలుపుకొనినదిట్ట. దండకము నొకదానిని యెనిమిది భాషలలో రచియించి దానికి 'అష్ట భాషాదండకమ' ని పేరిడి బహు భాషావేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలియని పేరుగాంచెను.

తండ్రి తాతల సత్కవితా సంగీత సాంప్రదాయము, వెంకటేశ్వర భక్తినిష్ఠా, సంస్కృతాంధ్ర ప్రాకృతాది భాషావైదుష్యము కలిగిన చిన తిరుమలయ్యకు అష్టభాషాకవిచక్రవర్తి, శ్రీరామానుజసిద్ధాంత స్థాపనాచార్య, వేదాంతాచార్య, కవితార్కికకేసరి యను బిరుదములు కలవు.

వీరు రచియించిన గ్రంథములు ఆధ్యాత్మిక సంకీర్తనలు, శృంగార సంకీర్తనలు, అష్టభాషాదండకము, సంకీర్తన లక్షణమను పద్యకావ్యము.

వీరు బహుశ క్రీ శ. 1485-1550 న జీవించియున్నట్లు భావించుటకు తగిన ఆధారములు గలవు. వీరి శాసనములు 1540 నుండి 1547 వరకు గలవు. వీరికి ఉపనయినమును తాతగారకు అన్నమాచార్యులు చేసినట్లు గలదు. అన్నమాచార్యులు 1503 లో సిద్ధి పొందినట్లుగలదు. వీరు ఈ కార్యములను 1500 ల ప్రాంతములో చేసియుండవచ్చును. అప్పటికి చిన తిరుమలయ్య 15 సంవత్సరములవాడై యుండవచ్చును.

చిన తిరుమలాచార్యులు వారి అధ్యాత్మిక, శృంగార సంకీర్తనలు, తాత తండ్రుల సంకీర్తనలవలె భాషాభావములలోను శబ్దార్థశుద్ధిలోను

ఉత్కృష్టములై యున్నవి. వానిలో కొన్ని ఆ వంశీయుల గుణగణములను జీవితాంశములను కొంత తెలుపునవిగా నున్నవి. వీరు రచియించిన వానిలో అరువది ఆధ్యాత్మిక సంకీర్తనలు, నూటాపందొమ్మిది శృంగార కీర్తనలు గ్రంథస్థమై తిరుమల తిరుపతి దేవస్థానమువారిచే ప్రకటింపబడినవి అందులోని మొదటి ఆధ్యాత్మిక కీర్తనను తీసికొనిన వీరివయసును, ప్రతిభను కొంతవరకు కనుగొనవచ్చును.

రామ రామచంద్ర రాఘవా రాజీవలోచన రాఘవా
సౌమిత్రి భరత శత్రుఘ్నులతోడ జయమందు దశరథరాఘవా ॥రామ॥

శిరసు కూఁకటుల రాఘవా చిన్నారిపొన్నారి రాఘవా
గరిమ నా వయసున తాటకిఁ జంపిన కౌసల్యానందన రాఘవా
అరిది యజ్ఞముగాచి రాఘవా యట్టె హరునివిల్లు విరిచిన రాఘవా
సిరితో జనకునియింట జానకిఁ జెలఁగి పెండ్లాడిన రాఘవా ॥రామ॥

మలయు నయోధ్యా రాఘవా మాయామృగాంతక రాఘవా
చెలఁగి చుప్పనాతిగర్వ మడఁచి దైత్యసేనలఁ జంపిన రాఘవా
సొలసి వాలిఁజంపి రాఘవా దండి సుగ్రీవునేలిన రాఘవా
జలధి బంధించిన రాఘవా లంకసంహరించిన రాఘవా ॥రామ॥

దేవతలుచూడ రాఘవా దేవేంద్రురథమెక్కి రాఘవా
రావణాదులనుఁజంపి విభీషణు రాజ్యమేలించిన రాఘవా
వేవేగ మరలి రాఘవా వచ్చి విజయపట్టమేలి రాఘవా
శ్రీ వెంకటగిరిమీఁద నభయములు చెలఁగి మాకిచ్చిన రాఘవా ॥రామ॥

ఇందులో వీరు రామాయణగాథలో ఆద్యంతములు ముఖ్యఘట్టములను తడవినారు. ఈ కీర్తనను తన పదునారవయేట వ్రాసినట్లు తెలియనగును 'గరిమ నావయసున తాటకిఁ జంపిన కౌసల్యానందన

రాఘవా' అనుచరణమును బట్టి ఆ శ్రీరాముడు తాటకిని జంపిన వయసులో నతడు కీర్తనలు వ్రాయ మొదలిడెనను కొనవచ్చును. రంగనాథ రామాయణమున తపసియాగముగాయ జను రాముని వయస్సు పదునైదు సంవత్సరములని దశరథుని మాటవలన తెలియుచున్నది.

**రాముడు ముగ్ధుండు, రాముడు నిసువు;**
**రాముఁ డెఱుంగడు రణకౌశలంబు;**
**పదియును నైదేండ్ల ప్రాయంబువాడు;**

తాతగారివలె చిన తిరుమలయ్యాయు పదునైదు సంవత్సరములు దాటి పదునాఱవ యేట కీర్తనలు వ్రాయ మొదలిడినట్లు విదితమగుచున్నది.

చిన తిరుమలయ్య తండ్రి పెద తిరుమలయ్య బహుముఖ ప్రజ్ఞాశాలియై తాతవలె అన్నిరంగములలో ఆరితేరిన దిట్టయైనప్పటికి, మన మడికి తాతపై నున్న మమకారము, భక్తిశ్రద్ధలు, తండ్రిపై లేకుండుట ఒక విధముగా విపరీతమైనను సకారణమైనవే. తన వంశమునకు పేరు ప్రఖ్యాతులు తెచ్చిన మూలవిరాట్టు, తండ్రికి తనకు కవితా ఒరవడి పెట్టిన ఒజ్జ, అదినారాయణుని అంతరంగమున నిలిపిన ఆర్యుడు, బిరుదుటెక్కములుగాఁ బెక్కు సంకీర్తనలు హరిమీద నిలిపిన ఆద్యుడు, రామానుజాచార్య మతమున రాణించిన రమ్యుడు, అందరిలో విందువోలె మాకును శ్రీ వెంకటనాథునిచ్చిన మహనీయుని మరువకుండుట మర్యాదయని మనమందుంచి మనముందించిన మహితాత్ముడు.

## సారంగ నాట.

అప్పని వరప్రసాది అన్నమయ్యా
అప్పసము మా కెకలఁడన్నమయ్యా ॥పల్లవి॥

అంతటికి నేలికైన ఆదినారాయణుఁ దన
యంతరంగాన నిలిపీ నన్నమయ్యా
సంతసానఁ జెలువొందె సనకసనందనాదు
లంతటివాఁడు తాళ్ళపాకన్నమయ్యా ॥అప్ప॥

బిరుదుటెక్కెములుగా బెక్కు సంకీర్తనములు
హరిమీఁద విన్నవించె నన్నమయ్యా
విరివిగలిగినట్టి వేదముల యర్థ మెల్లా
అరసి తెలిపినాఁడు అన్నమయ్యా ॥అప్ప॥

అందమైన రామానుజాచార్యమతమున
అందుకొని నిలిచినాఁ డన్నమయ్యా
విందువలె మాకును శ్రీ వెంకటనాథుని నిచ్చె
అందరిలోఁ దాళ్లపాక అన్నమయ్యా ॥అప్ప॥

వీరితల్లి తన ముప్పదియవ యేట చనిపోయినట్లు తెలియుచున్నది. తనకు తల్లి, తండ్రి, గురువు, దైవము తాతగారేనని యీకీర్తనలో తెలిపినాడు. గురుడవై బ్రహ్మోపదేశము చేసినావని, పరమబంధుడవై చెడకుండ కాపాడితివని తల్లివై పల్లదాన పడకుండ బ్రతికించితివని, తోడునీడవైు చిల్లరమాయలలో చెడకుండ, దాతవై వెంకటనాథుని తలపులో నిలిపితివని ఎటు చూచినా ఏడుగడ నీవేనని, ఆ తలనీతల తన్ను ఆదుకొని కాచితివని తాతనే తలంచి తరించినాడు.

## లలిత

తాళ్లపాకన్నమాచార్య దైవమను నీవు మాకు
వేళమె శ్రీహరిఁ గనే వెర వానతిచ్చితివి ॥పల్లవి॥

గరుడవు నీవె సుమ్మీ కుమతి నైననాకు
సరవి బ్రహ్మోపదేశము సేతివి
పరమబంధుఁడ వైనా పరికింప నీవె సుమ్మీ
పరుస నేఁ జెడకుండ వహించుకొంటివి ॥తాళ్ళపాక॥

తల్లివైన నీవె సుమ్మీ తగిన విషయాలలో
పల్లదానఁ బడకుండా బ్రతికించితి
అల్లుకొని తోడునీడ వైనా నీవె సుమ్మీ
చిల్లరమాయలలోనఁ జెడకుండాఁ జేసితి ॥తాళ్ళపాక॥

దాతవు నీవె సుమ్మీ తగు శ్రీ వెంకటదాథు
నాతలఁపులో నిలిపి నమ్మఁ జేసితి
యేతలఁ జూచినా నాకు నేడుగడయు నీవె
ఆతల నీతల నున్న నాదుకొని కాచితి ॥తాళ్ళపాక॥

తాళ్ళపాకవారు తొలుత స్మార్త బ్రాహ్మణులు. నందవరీకులు. తామస ప్రధానమైన చౌడేశ్వరీ ఉపాసకులు. చౌడేశ్వరికి బలి వగ్గెరాలు సమర్పించుట ఆచారముగా నుండెడిది. పచ్చి తామసులను పరమ సాత్త్వికులుగాఁ జేసి తమకెన్నడు లేని వైష్ణవమును ప్రసాదించిన తాతను తలచిన విధము.

పచ్చితామసుల మమ్ముఁ బరమ సాత్త్వికులుగా
యిచ్చటనె సేసినాడు యెంత్ర చిత్రము
యిచ్చగించి మా కులాన నెన్నడు లేని వైష్ణవ
మచ్చముగాఁ గృపజేసె నన్నమాచార్యుడు.

తండ్రి తాతలవలె చిన తిరుమలయ్య మేలుకొలుపు కీర్తనములు వ్రాసి పాడిన పరమభక్తుడు. తాళ్ళపాకవారి సుప్రభాతము కీ. శ. 1480

నుండి స్వామిసన్నిధిని గానము చేయుచున్నట్లు తెలియనగును. చిన తిరుమలయ్య తన సంకీర్తనలో శృంగారము రంగరించినను 'వేళాయను శ్రీ వెంకటనాథుడ పాలించి దాసుల బ్రతికించగనూ' మేలుకొనుమని మనవిచేసినాడు.

భూపాళవి.

గోవిందా మేల్కొనవయ్యా
కావించి భోగము కడమా నీకు ॥పల్లవి॥

కమలజ చల్లనికౌఁగిటఁ దగిలి
సమరతిఁ బాయఁగఁ జాలవూ
కమలభవాదులు కడు నుతియింపఁగ
విమలపుశయనము విడువఁగ లేవు ॥గోవిందా॥

భూసతి తోడుత పొందులు మరిగి
వేసర విడె నీవేడుకలా
వాసవముఖ్యులు వాకిట నుండఁగ
పాసి వుండ నని పవళించేవూ ॥గోవిందా॥

నీళామనసిజలీలలఁ దగిలి
నాలితోడ మానఁగ లేవు
వేళాయను శ్రీ వెంకటనాథుఁడ
పాలించి దాసుల బ్రతికించఁగనూ ॥గోవిందా॥

వీరికాలములో ఏవో ఆపదలు కలుగగా ప్రజలు అనేకములగు శాంతులు చేసినట్లు కనబడుచున్నది. వారుచేసిన శాంతుల నన్నిటిని పేర్కొని, వీనిని చేయుటకన్న శ్రీహరి సంకీర్తనలను పాడుట పరమ పావనమనినాడు.

## మలహరి.

సంకె లేక తలచిన జాణలకు
సంకీర్తనమె పో సర్వశాంతి ॥పల్లవి

భవహర మగు శ్రీపతినామమె
జవకట్టి తలంచితే జన్మశాంతి
తవిలి హరిపూజ తాఁ జేయుటే
కువలయమున నిదిగో గృహశాంతి ॥సంకె॥

అంధ్రిభువవరదుఁడ యనినదె
కందువైన సర్వగ్రహ శాంతి
యిందురవినయనుని నెరుఁగుటె
చందమైన దిదివో నక్షత్రశాంతి ॥సంకె॥

భావించి యనంతునిఁ బలుకుటె
కావించిన దిదివో కాలశాంతి
శ్రీ వెంకటనాథునిఁ జేరుటె
దేవమానవులకును దేహశాంతి ॥సంకె॥

తాతగారగు అన్నమాచార్యులు తన దేవుని వేనకువేలు కీర్తనలు వ్రాసి, పాడి ఆదేవుని కీర్తి నలుదెసల ప్రసరింపజేసిన పరమభాగవతుడు. తాను లేకుంటే దేవునికృపకు పాత్రము లేదని, తనవలననే తన దేవుడు కీర్తి పొందినాడని నిర్మొగమాటముగా, సగర్వముగ చెప్పికొనినాడు.

"నే నొక్కఁడ లేకుండితే నీ కృపకు. బాత్రమేది
పూనినావల్లనే కీర్తిఁ బొందేవు నీవు"

తాత కీర్తనలు చదివి, జీర్ణించుకొనిన చిన తిరుమలయ్యవారి భాషాభావములను చిత్తశుద్ధితో అలవరచుకొని అనుసరించి అనుకరించినారు. తాళ్ళపాకవారిలో తక్కువ తినినవారు లేరు.

## దేసాళం.

ఏలికవై నన్నొకని నేలఁగాను నీ
లీలావిభూతి కొకలేశము దక్కువా ॥పల్లవి॥

పని పూని నాయొకని పాదము మానుపఁగా నీ
ఘన సంకల్పమునకుఁ గడమా
చెనకి నేనె పూజ సేయఁగా మెచ్చే నంటె
కనుకొనే వం దేమి కండ గట్టుకొంటివో ॥ఏలి॥

దేవుఁడవై నామనసు దెరిచి రక్షించఁగాను
గోవింద నీమాయ కేమి గొఱతా
సోవల నాలోని భక్తి చూచి కాచే నంటివా
కావలసి నీవెంత గాదెఁ బోసుకొంటివో ॥ఏలి॥

అలరి నా హృదయమందుఁ గానుపించితేను
వెలయు నీమహిమకు వెలితా
కలిమితో నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
యిలమీఁద నీకు నిప్పు డెంత కీర్తి గూడెనో ॥ఏలి॥

తాత కనీసము 'నావల్ల నీకుఁ బుణ్యము నీవల్ల నే బ్రదుకుదు' నని పరస్పర లాభములను చెప్పినాడు. అంతకన్న ఆరాకు లెక్కువ చదివిన చిన తిరుమలయ్య ముక్తసరిగా తన కూటమితో ఇల మీఁద దేవునికి ఎంతో కీర్తి గూడినదని చాటినాడు.

చిన తిరుమలయ్యగారి శృంగార కీర్తనముల కొన్నింటిని పరిశీలింతము. వీనిలోని మధురభక్తి, మధుర భావములు మహదానంద కరముగానున్నవి. తాను సతిగా, దేవుడు పతిగా భావించి భాషించిన దీపదము. ఇది తిరుపతి వెంకటనాథునిపై గాదు చెప్పినది, కడపలోని వేంకటేశ్వరుని స్తుతి. కడప అనద్వారము లేక గడప. 'తిరుమలలో వేంచేసియుండు' శ్రీ వేంకటేశ్వరుని చేరుటకు కడప ప్రవేశద్వారముగ భావించ బడినది. కనుక కడప పట్టణములో నుండు శ్రీ వేంకటేశ్వరుని 'తొలి' దేవునిగా తిరుమలలో నుండు స్వామిని 'మలి' దేవునిగా అనగా మూల విరాట్టుగా భావించబడుచున్నది. తాళ్ళపాక కవులు, తమ గ్రామమునకు మూడామడల దూరమున గల కడపకు తరచుగా పోవుట తటస్థించుచుండెడిది. ఎందుకన యిది అహోబిలమునకుపోవు దారిన కలదు. ఆ దేవుని పూజిస్తూ ప్రార్థించుచుండుట వీరికి పరిపాటి. ఇప్పటికి తిరుపతికి వచ్చు ఆ ప్రాంతపు భక్తులు తొలుత కడప వెంకటేశ్వరుని ప్రార్థించి తరువాత తిరుపతికి వచ్చెదరు. కడప దేవునిపై శంకరాభరణ రాగమున సాగించిన శృంగార కీర్తనలో ఆ దేవుని మొదటి నుండి యెరిగినట్లు చెప్పబడుట గమనార్హము.

చాలుఁ జాలునే నెరంగనా నాఁడు నాఁడె
ఆలరి నీసుద్దులెల్ల నవీఁ గంటిని ॥పల్లవి॥

సారె సారె నన్ను నేల పిలిచేవు
యేరా నీ వలపు నే నెరఁగనిదా
వూరకె యింకా నేలరా మాఁటలనె
దూరేవు నీ సుద్దు లెల్ల తొల్లె కంటిమి ॥చాలు॥

సన్నలు సేసే వేమిరా యెరఁగనా
చిన్ననాఁడె నీచేఁత లెల్లాను
చన్నులుముట్టే వేమిరా నాలికాఁడ
వున్నతి నీ సుద్దు లెల్లా నిన్ననే కంటిమి ॥చాలు॥
దగ్గరి చేయి వట్టేవురా యెప్పుడును
నిగ్గుల నీ చల మెల్లా నే నెరఁగనా
అగ్గమై శ్రీ వెంకటనాథ కడఫలో
దగ్గరి నన్నుఁ గూడఁగా తలఁ పెల్లాఁ గంటిమి ॥చాలు॥

ఈ శృంగార కీర్తనములో చిన తిరుమలయ్య తన తాళ్ళపాకకు సమీపమున బాహుద ఆవలిఒడ్డున గల నెలదలూరి లేక నెందలూరిలో వెలసిన పురాతన సనాతన దేవాలయములోని సౌమ్యనాథస్వామిని 'చొక్కనాథుడ'ని సంబోధిస్తూ సాగించిన శృంగారము సొంపుగ నున్నది. ఈ ఆలయము పురాతనమైనదని, ప్రశస్తమైనదని, దీని నిర్మాణములో ఒక ప్రత్యేకత కలదనియు, సూర్యోదయమగునపుడు, సూర్యకిరణములు స్వామివారి పాదములపై పడునని ప్రశస్తి. ఈ పవిత్రాలయ ప్రాకారములు పడి, శిథిలావస్థలో నున్నవి, దీని జీర్ణోద్ధరణ అత్యావసరము. తిరుపతి దేవస్థానమువారు ఈ పనిని చేపట్టడము అవసరము.

## మలహరి.

చుల్లర వెట్టుఁ జేఁతల చొక్కనాథుఁడు
వుల్లములో నీ నెలఁదలూరి చొక్కనాథుడు ॥పల్లవి॥

అద్దమరాతిరికాడ నంటువడి వచ్చి తాను
సుద్దు లేమి పచరించీఁ జొక్కనాథుఁడు
వద్దు వొమ్మనవె రేపువచ్చుఁ గాని యివుడేల
వొద్దిక వచ్చీ నెలఁదూరి చొక్కనాథుఁడు ॥సుల్ల॥

మిక్కిలి దా నెక్కడనో మీఁదువోయి వచ్చి నేఁడు
చక్కటు లేమి చెప్పినె చొక్కనాథుఁడు
పెక్కుశేల నేనె పిలిపించఁగా వచ్చి
వొక్కటిగా నీ నెలఁదలూరి చొక్కనాథుఁడు ॥చుల్ల॥

యిప్పుడె తా నెవ్వతెకో యెంగిలియై వచ్చి యిట్టె
చొప్పులు మాప వచ్చినె చొక్కనాథుఁడు
కప్పురపుమోవి శ్రీ వెంకటనాథుఁడె నన్ను ॥చుల్ల॥
వొప్పుగాఁ గూడె నెలఁదలూరి చొక్కనాథుఁడు.

ఊటుకూరి చెన్నరాయనిపైన జెప్పిన యీ శృంగారగీతము హృద్యముగా నున్నది. ఊటుకూరు తాళ్ళపాకకు అర ఆమడదూరమున గలదు. ఇక్కడ తాళ్ళపాకవారి బంధువులు ఉండిరి. అన్నమయ్య తాత నారాయణసూరి విద్య నభ్యసించుటకై వచ్చిన గ్రామ మిదియె. ఇది రాజంపేటకు పరుగు దూరమున తిరుపతిరోడ్డుపై గలదు. తాళ్ళ పాక రాజంపేటకు పరుగు దూరమున ఆవలివైపున గలదు. ఊటు కూరు తమ బంధుగ్రామ మగుటచేతను, సమీపమున నుండుట వలన తాళ్ళపాకవారు తఱచు ఆ గ్రామము పోతూ అందలి చెన్నరాయని దర్శిస్తూ సేవిస్తూ ఉండి ఉండవచ్చును. తరువాత ఆ దేవునిపై భక్తిని యీ కీర్తనల రూపమున వెల్లడించి యుండనోపు.

## రామక్రియ

తియ్యని మాటలఁ దేలించేవూ
వొయ్యారపు వూటుకూరి చెన్నరాయ ॥పల్లవి॥

పిలచే వూరకె పిన్ననాఁటి పొందు
గలవానివలెనే యాఁకటతోడ
చలిమినె నన్నింత సందడి సరసాల
పులికించకు వూటుకూరి చెన్నరాయ ॥తియ్య॥

చెనకే వూరకె చేవమీరి కడు
చనవరి వలెనె ముచ్చటతోడ
పెనగుచు నీ విట్టె ప్రియములు నెరపేవు
వునుపుఁజేతఁల వూటుకూరి చెన్నరాయ ॥తియ్య॥

వీరికి కడపరాయలపై మక్కువ యెక్కువ ఉన్నట్లున్నది. శ్రీ వెంకటనాథుని ఆతని చెలులు మన్మథకేళిలో పెట్టిన పాట్లను కంటికి కట్టినట్లుగా వర్ణించి అందులకు చింతించి సానుభూతి కనుపరిచి, చెలుల నిందించి, తానును 'నినుమించగలనా' యని ఆత్మార్పణ ఆ ప్రభువునకు కావించుకొనిన పరమ వైష్ణవుడు.

## అహిరి.

పల్లవి:- అయ్యో దయ వలదా అంటదానికి
చయ్యాట మాడినాను సంగతి గావలదా

చరణము:- జీరల నీ మేను చూచి సిగ్గయ్యో నాకైతె
ఆరడి నీ కెట్లితవాయనో కాని
కూరిమితో నాపెకు నీ కుందణమువంటి మేను
యీరీతిఁ జేయఁగఁ జేతు లెట్లాడెనో ॥అయ్యో॥

గంటైన నీ మోవి చూచి కనికర మయ్యాని
కంటకము నీకెట్లా గాదో గాని
గొంటరియాపె దానె చిగురువంటి నీ మోవి
అంటి యింత సేసె నెంత అగ్గలికో కాని ॥అయ్యో॥

కురులు నలఁగిన నీకొప్పు చూచి వెరగయ్యో
శిరసు నీ కెట్టోరిచెనో కాని
గరిమఁ గూడితి శ్రీ వెంకటనాథ నను నిచె
నిరతిఁ గడపరాయ నిను మించఁగలనా ॥అయ్యో॥

ఆ దేవుడు అలమేలు మంగమ్మతో యిదే పస్తానని మెక్కడికో పోయినాడు. మగువకు యిచ్చిన మాట తప్పి, వేళకాని వేళలలో తిరుగ రాని చోటులలో ఆమని కోవిలవలె, జంటియీగవలె, కొలకుల సీఁదే రాయంచవలె ఏల తిరిగేవని ప్రశ్నించుటలో ఈ కవికి ఆయమ్మపై గల భక్తి శ్రద్ధలు బహిర్గతమగు చున్నవి. ఇందలి భావములు మధురమైనవై భాష సరళమై సెలయేరు వలె చల్లగా జోరుగా సాగినది. 'కొండంత వలపు, చినుకుఁ జీకటి పొద్దు, నాడానీడా, గాఁదారి మాఁదారి పొద్దున తాచుఁబాము వంటి దేవర, కోడె కాఁడ' మొదలగు దేశీయములతో కవిత కమ్మగ సాగించినారు.

తాత అనిన ఆయన సంకీర్తనలనిన వల్లమాలిన అభిమానము చిన తిరుమలయ్యకు, ఆయన కీర్తనలు పాడిపాడి ఆయన వరవడిని తెచ్చుకొనినాడు. తాతకు తన దైవము శ్రీ వేంకటేశ్వరులు కలియుగ దైవమని గట్టి నమ్మకము. ఈ భావమును చేయెత్తి చూపినాడు. ఎలు గెత్తి చాటినాడు.

రా మ క్రి య.

చాటెద నిదియే సత్యము సుండో
చేటు లే దీతని సేవించినను ॥పల్లవి॥

హరి నొల్లనివా రసురలు సుండో
సుర లీతనిదాసులు సుండో
పరమాత్ముఁ డితఁడే ప్రాణము సుండో
మఱుగక మఱచిన మఱి లే దిఁకను ॥చాటెద॥

వేద రక్షకుండు విష్ణుఁడు సుండో
సోదించె శుకుఁ డదె్పుగ సుండో
ఆదిబ్రహ్మ గన్నాతఁడు సుండో
యేదెస వెదకిన నతఁడే ఘనుఁడు ॥చాటెద॥

యిహపర మొసఁగను యీతఁడె సుండో
వహి నుతించెఁ బార్వతి సుండో
రహస్య మిదివో రహి శ్రీవెంకట
మహీధరంబున మనికై నిలిచె ॥చా పెద॥

ఆ భావములే అచ్చుపడునట్లు అంతకు మించిన విధముగా శ్రీ వేంకటనాథుడను సంజీవి సర్వరోగ నివారిణియని చాటి కలియుగ వైకుంఠుని నుతించుటలో కలదు చిన తిరుమలయ్య సంగ్రహణా, సూక్ష్మ పరిశీలనాశక్తి.

### మాళవి.

నూరవద్దు తాగవద్దు నోరు చేఁదు గావద్దు
చేరువ నొకచోట సంజీవి వున్న దిదివో ॥పల్లవి॥

పొలమెలాఁ దిరిగాడి పొడిఁబడనె వద్దు
తలఁకక గడ్డపారఁ దవ్వవద్దు
వలవని వాఁగుల వంకల వెదక వద్దు
చెలఁగి వొకచోట సంజీవి వున్న దిదివో ॥నూర॥

మొక్కలానఁ జెరువులో మునిఁగి చూడవద్దు
నిక్కిన పుట్టలమీఁద నెమక వద్దు
వెక్కసానఁ జేతిపైఁడి వెలవెట్టి కొనవద్దు
చిక్కు లెల్లాఁ బాపెటి సంజీవి వున్న దిదివో ॥నూర॥

దీవులను నోడ లెక్కి తిరుగాడనే వద్దు
సోవల బిలములోనఁ జొరవద్దు
కావించి గ్రహణాదికాలము వెదకవద్దు
శ్రీ వెంకటనాథుఁడై సంజీవి వున్న దిదివో ॥నూర॥

ఇక వీరి సంకీర్తనములన్నియు శబ్దార్థ శుద్ధితో విరాజిల్లునవి యగుట వలన, వానిని తడవుచుపోయిన యీ గ్రంథమునకు ఆది అంతు లేకుండఁనను గ్రంథవిస్తరణ భీతితో ఈ ఒక కీర్తనతో చాలించి తదితర గ్రంథములను పరిశీలింతము.

కేదారగౌళ

నిండుదొర వౌదు నీగుణము మేలు నిన్ను నమ్మవలెఁబో
పండినమామిడిపై చిలుకవలె పచ్చిదేర నేల తిరిగేవయ్యా ॥పల్లవి॥

వనిత కొండంత వలపుతో నీ వరుసకుఁ గాచుకుండగా
చినుకుఁ చీఁకటి ప్రొద్దున నీ వేడ చెలితో నవ్వేవయ్యా
మనసార నీవే నిప్పువంటిబాస మగువకు నిచ్చి వచ్చితి
అనుగు నామనికోయిలవలె నాడా నీదా నేల తిరిగేవయ్యా ॥నిండు॥

యింతి సముద్రమువంటి తమకాన యెదురెదురె చూడఁగా
యింతలోఁ గాఁదారి మాఁదారి ప్రొద్దున నెవ్వెతెఁ జూచేవయ్యా
వంతదీరఁ దాఁచుఁబాముపంటి దేవర మీద నానవెట్టితి
వంతుకు నీవిట్టె జుంటియీఁగపలె వాడ వాడ నేల తిరిగేవయ్యా ॥నిండు॥

చెలిచుక్కలన్ని కోరికలతోడ చిత్తము నీకిచ్చు కుండఁగా
పొలసి ముచ్చిమి ప్రొద్దున నెడపూఁబోఁడిఁ బిలిచేవయ్యా
కలికి శ్రీ వెంకటనాథ నీవె గారవించి సతిఁ గూడితి
కొలఁకుల నీఁదేరాయంచవలె కోడెకాఁడ యేల తిరిగేవయ్యా ॥నిండు॥

వీరి సంకీర్తనములను, శాసనములను సూక్ష్మముగ పరిశీలించిన వీరు తిరిగిన ప్రదేశములు కీర్తించిన దేవతలు చాల మంది కలరు. కడప జిల్లా కడపగ్రామములోని శ్రీ వెంకటేశ్వరుని, నెందలూరిలోని సౌమ్య నాథస్వామిని, ఊటుకూరి చెన్నరాయని, చినమండెము నరసింహ

స్వామిని, జమ్మలమడుగు తాలూకాలో 'కోసనేపల్లె' లేక 'కోసువాని పల్లె' దైవమును, నందిమండలము దగ్గర పాలకొండలోని కోనలోని చెన్నకేశవస్వామిని, కోనచెన్నరాయుడిని, కడప తాలూకాకు చెందిన చిన్నదాసరిపల్లె సమీపమున గల లోయలో వేయినూతలకోన లేక వోగునూతల కోనలోని జంగునూతల నరసింహస్వామిని, అనంతపురము జిల్లాలో కదిరినరసింహ్మస్వామి, కర్నూలుజిల్లా కోవిల కుంట్లలోని పండరంగవిఠలుని, గోపాలకృష్ణుని, తిరుపతిలోని రఘురాముని తన సంకీర్తనములలో స్తుతియించెను. రాయలసీయ జిల్లాల నన్నిటిని విరివిగా సంచరించి నట్లున్నది.

ఇక వీరి 'సంకీర్తనలక్షణ' మను పద్యకావ్యమును పరిశీలింతము. దీనికి మూలము తాతగారగు అన్నమాచార్యులు సంస్కృతమున రచియించిన సంకీర్తనలక్షణము. తాతగారి కావ్యము అందరికి అందుబాటున లేని సంస్కృతమున నుండుటవలన దానిని తెనుగించి తాత ప్రతిభను తన శక్తిని నిరూపించుకొన్నాడు. ఈ అనువాదగ్రంథమును వారే పద్యకావ్యముగా కవనమల్లినట్లు యీ క్రింది వానివలన తెలియనగును.

ధరలోఁ దాళ్ళపాక యన్నయ గురూత్తంసుడు సంకీర్తనా
పరిశుద్ధిన్ మనుజేయఁబూని తగనుత్పాదించెఁ దల్లక్షణం
బరుదైమించిన సంస్కృతంబునఁ గవీంద్రానంద సంధాయియై
పరిపూర్ణాఖిలశాస్త్ర సమ్మతముగా భావజ్ఞులౌ నౌననన్

అలరు దాళ్ళపాక యన్నయార్యసుతుఁడు
తిరుమలార్యుఁ డఖిల దేశికుండు
తత్పుత్రాగ్రజుండ ధరలోనఁ జినతిమ్మ
యాహ్వయుండఁ దంౘ్రడియను మతమున

**పరమామ్నాయ సమానమై వెలయు మత్పైతామహ గ్రంథమున్**
**పరచాటూక్తి మదీయ పుణ్యజనక వ్యాఖ్యాతమున్ వేడ్కదా**
**చరణాంభోరుహముల్ మదిందలంచి సద్భాత్రజ్ఞ లింపొందఁగా**
**వరుసం జెప్పెదఁ బద్యరూపమునఁ దద్వాక్యాను సారంబుగన్.**

అన్నమాచార్యుల పదముల నుతించుచు మరి పదిపద్యములను వ్రాసినారు. అందులో ఒకదానిని యిట పొందుపరచిన వీరికి వారి యెడ గల గౌరవము, కీర్తనల యెడగల ప్రశంస, తన్నకు గల అవగాహనశక్తి ద్యోతక మగుచున్నది,

**శ్రుతులై శాస్త్రములై పురాణ కథలై సుజ్ఞాన సారంబులై**
**యతిలోకాగమ వీథులై వివిధ మంత్రార్థంబులై నీతులై**
**కృతులై వేంకటశైల వల్లభ రతిక్రీడారహస్యంబులై**
**నుతులై తాళ్ళపాక యన్నయవచో నూత్నక్రియల్ జెన్నగున్.**

సంకీర్తనలక్షణములు జయదేవ కవివరేణ్యుని గీతగోవిందము లోని అష్టపదులవలె రాణించవలెనట. విదితార్థ గ్రామ్యోక్తులతో పొంక మెరిగి పలికినపుడే "శృంగార వధూ మృదుమధుర మనోజ్ఞ వాక్య మిశ్రమములు" అర్థమగునని పదముల రచించుటను సమర్థించినాడు. నిస్సార పదబంధ కవిత పనికిరాదని బూరుగకాయను గొట్టికిన నీరస తూలంబు దిశలనిండినగతి హాస్యాస్పదమగునని సంకీర్తనపదలక్షణమును తాతగారి భావములను తెనుగును చేసిన మహోపకారి.

**ఘనత మీఱంగ జయదేవ కవివరేణ్యుఁ**
**డందమైనట్టి గీత గోవిందమందు**
**నంచితాష్టపదులు వల్కెనట్ల పదము**
**పరఁగ నెనిమిది పదములు పల్లవియును**

పదములు శృంగార వధూ
మృదు మధుర మనోజ్ఞవాక్య మిశ్రములైనన్
విదితార్థ గ్రామ్యోక్తులు
పదిలముగాఁ బొంక మెఱిగి పలుకఁగఁ జెల్లున్

బూఱుగు కాయల గొఱికిన
నీరస తూలంబు దిశల నిండినగతి ని
స్సార పదబంధ కవితా
పారీణుల పదము హాస్యపదమై యుండున్

వీరు అష్టభాషాదండకమును రచియించుట వలననేమో వీరికి 'అష్టభాషాకవి చక్రవర్తి' అను బిరుదు వచ్చియుండును. ఇది సంస్కృతము, ప్రాకృతము, శౌరసేని, మాగధి, పైశాచి, ప్రాచీ, అవంతీ, సార్వదేశి అను ఎనిమిది భాషలలో రచియించిన యీ దండకమును ప్రతిభాషలో కొంత భాగమును ఉదాహరించిన వారి ఊహాతీతమైన యీ కార్యము, ఆ భాషలలోని యీ కవి శక్తియుక్తులు కరతలామలక మగునను తలంపుతో యిందు పొందు పఱచు చున్నాను.

## సంస్కృతము

సంస్కృతము-సంపూర్ణతే జోల్ల సచ్చంద్రికావ్రాత బర్హోర్ధ్వ దీప్తిచ్ఛటా
సంశయాపాదనాధిక్యనానామణిశ్రేణి కోణప్రభాజాల
చంచత్కిరీటస్థితే గండకస్త్వం కథం ఖండితారి పురా
కూర్మరూపీ మహత్కర్మకారీ కథం ధీరభూమిస్తు భూ
ధారపూర్వం........

ప్రాకృతము:- గోవద్ధణత్తాణ గోగొత్త అపోత్తు యేదెత్త దపొవిసే
సేణ భప్పేకియోకింయ సేయేయళావాస అప్పాయిదా
తుర్ఘ్హ అప్పియ్యలీలాసుక మ్మోకయో జమ్మజమ్మం
తరే ॥

సూరసేని:- సూరగ్గ తుం సూరసేణేన సేణేన పక్షిససేనాదిదాసావళిసెవ్వ
మాణో మణూసోతు మం కింతి చింతేది తుర్ఘు వ్వణ్కిరార
ణౌబంధుదాపుణ్ణభత్తిప్పహోజుణ్ణ దుద్దోస అంద్దార యంద్ధా
సళోయంక్క రేదిద్ధిరాహార దేయక్క దాసామి........

మాగది:- నాలాయణే మాగాధాలాపశంశోశ ణగ్గిశమగ్గోలు కంశాశి
శంశాల మేహాణి ళేతుమ్మ హాశేశ శేశమ్మి కణ్ణచయే
ణంప యిణ్ణాహాళా శేశు కోలాహలాధాళ కోళచ్ఛహళ్లేణ
ఖగ్గోలుగోయణ్ణా గంధచ్ఛజుత్తే చ వోళజ్జళంతోలు చక్కం
గకాదంబ ఖిం।గాతి సక్లోయ........

పైశాచి:- అచ్ఛినిజేసో పిసాసేససంసెవ్వ గోవీసఘూసాయ మాణంగిఘి
జాతావగానీరసాళప్పహా యేవిసాళత్త ణేణం యరచ్చాచ
యేసుంసరిచ్ఛప్ప వాహింయళీళాఘు రేహంవిరాయంతర
క్ణేహి వాతాయణాయాతవాతబ్భయానీత సౌరబ్భ సంపత్తి ........

ప్రాచీ:- దేనాహసచ్ఛూళి కాకిన్నతానప్పవాహోలు మాతంతకవాలో
ద్ధుతా ఉప్పలాసేనసీలొహ పిచ్ఛింకలింతా చ సవ్వంవహంత్తో
విరాయాహితస్సింతుహం నిచ్ఛనియ్యాత। తుచ్ఛాతివైలొక్క
నానామియాకేనసప్పణ్ణసాలా........

అవంతీ:- వెహ్లూశిరీగంతు నానా అబభ్భంగురాహిత్త వాణీ ససవ్వాణీసం
ఘూయమాణుప్పహోజుత్తు ఘూళోయవైగుంఠ శ్రీవేంకటద్దిమ్మి
సాహిత్తు హేచారు నానావిధానేహి రాజంతరచ్చాసు అబ్భం
లిహేవుప్ప కేగోరడాదంస........

సార్వదేశ:- హేబట్టియోసవ్వదేసేసకం హ్లాకుడుంగేతు మంతత్తియేజు
త్తగోపీజణం ణిచ్ఛ సావుళ్ళత్తణ్ణాయ చిత్తోరుమాహీయ చి

చ్ఛేయ దెత్తేసకాళస్ప చండిక్క నూరద్ధయోచారు ధేరో
సన ద్ధోళతల్లీల్ల సంపండరంగేంద దేరాదిరించోళి....

ఈ క్రింది శ్లోకములో త తను 'వాణీ వీణాని నాద ప్రతిమ చతురవాక్' అని అతని సంగీత సాహిత్య ప్రతిభను తెలుపు, 'తిమ్మయే నారచిత' మని తన గ్రంథ కర్తృత్వమును తెలిపినాడు.

"వాణీ వీణానినాద ప్రతిమ చతురవాక్ తాళ్లపాకన్నయార్య
స్తత్పుత్రస్తిమ్మ యార్యోజిత ఫణిభణితి స్తతు తేనాష్టభాష
క్లప్తోయంతిమ్మ యేనారచితపదగంతిర్వేంకటా ద్రీంద్రభర్తు
స్తస్యోద్యత్కీర్తి కేతుర్జగతివిజయతాం దండకః పండితేద్యః"

చిత్తూరుజిల్లా చంద్రగిరి తాలూకా చంద్రగిరికి సమీపమున గల మంగాపురములోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ద్వారపు కుడి బండపై ఒక శాసనము కలదు. ఇది శాలివాహనశకము 1463 అగు నేటి శార్వరి చైత్రశుద్ధ పౌర్ణమికి సరియగు 22–3–1540 నాటిది. ఈ శాసనమునుబట్టి చినతిరుమలాచార్యులు తాళ్ళపాకవారి అగ్రహార మగు అలమేలుమంగాపురములోని శ్రీ వెంకటేశ్వర ఆలయమును జీర్ణోద్ధరణ చేసినట్లు తెలియనగును. ఇంకను అందున్న శ్రీ వెంకటేశ్వరుల, అలమేలుమంగమ్మ, అనంతగరుడ, విష్వక్సేనాదుల, లక్ష్మీ నారాయణస్వామి, రంగనాథస్వామి విగ్రహములను ప్రతిష్ఠ చేయించుటయే గాక, పన్నిద్దరాళ్వార్లను, రామానుజులను, తాత అన్నమాచార్యుల విగ్రహమును కూడ ప్రతిష్ఠించినట్లు కలదు. కాని వానిలో శ్రీ వెంకటేశ్వర, లక్ష్మీనారాయణ, రంగనాథ, రామానుజ, గరుడ విగ్రహములు మాత్రము కలవు. మిగిలినవి ఏమైనవి తెలియకున్నవి వీరు జీర్ణోద్ధారణ చేసిన యీ దేవాలయపు మొదటి గోపురమున కిరుప్రక్కల అన్నమాచార్య, పెద తిరుమలాచార్య విగ్రహములను చెక్కించినాడు.

లోనికి వెళ్ళునపుడు కుడిభాగమున తన ప్రతిమను చెక్కించి కొనినాడు. ఈ ప్రతిమ తిరుమలలోని స్వామిని కుడిచేతితో చూపుచున్నట్లున్నది. మొదటి ద్వారము దాటి లోపలికి వెళ్ళునపుడు కుడివైపు మొదటి స్తంభమున అన్నమాచార్యుల వారి విగ్రహము, అదే వరుసలో మూడవ స్తంభమున పెద తిరుమలాచార్యుల వారి విగ్రహము తన యెడమచేతితో వెంకటేశ్వరుని చూపునట్లు చెక్కింపబడినది.

పికల్యానదీ తీరమున చిన తిరుమలయ్య నిర్మించిన సంధ్యా వందన మంటపము కలదు. సంధ్యలార్చిన తరువాత వీరు సంకీర్తనలు పాడగా రాళ్లుసైతము దొరలినవను ప్రతీతి యిప్పటికి కలదు. ఆ ప్రదేశమునకు తిమ్మాపురమను పేరుగలదు. తిమ్మాపుర దేవాలయ శిల్పములను శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయము వారు కొని తెచ్చి విశ్వవిద్యాలయ ఆవరణలో ప్రదర్శించుచున్నారు. రాళ్లగరగించు విమల గాంధర్వము విద్యకలిగి, స్వామిని కదలించు సంకీర్తనలు గలిగి, భగవంతుని మెప్పించు భక్తియుక్తులు కలిగిన ప్రతిభాశాలి చిన తిరుమలయ్య.

# తాళ్ళపాక చిన్నన్న

'చిన్నన్న ద్విపద కెఱఁగును, బన్నుగ పెద తిరుమలయ్య పద మున కెఱఁగున్' అని తెనాలి రామకృష్ణకవిచే పొగడబడిన కవివరులు తనయుడు తండ్రియే. చిన్నన్న పెద తిరుమలాచార్యుల నాల్గగపుత్రుడు. అన్నమాచార్యుల మనుమడు. తండ్రి పదరచనలో పేర్గాంచితే కొడుకు ద్విపద రచనలో ప్రఖ్యాతికి వచ్చెను. ఈ కవి తల్లి తిరుమలమ్మ.

ఈ కవిని చినతిరువెంగళుఁడు, చినతిరువెంగళనాథుడు, తిరువేణ ధరుడు, తిరువేనధయ్యారు, తిరువెంగళనాథుడు, తిరువెంగళనాధయ్యాం గారు, తిరువెంకటనాధారు, వెంగళార్యుడు అని కూడ పిలిచెదరు.

ఈ కవి తాళ్ళపాక తిరువెంగళనాథుడను పేర ప్రఖ్యాతిగాంచి నను, ఆయనను అందరు చిన్నన్న అని ముద్దుగా పిలుచుటవలన కడకు ఆ పేరే స్థిరపడి, అసలు పేరు మారుపేరు ఆయెను. ఇతడు తాళ్లపాక కవులలో సుప్రసిద్ధుడు. ఇతఁడు అష్టమహిషీకల్యాణము, పరమయోగి విలాసము, ఉషాపరిణయము, అన్నమాచార్య చరిత్ర యను నాలుగు కావ్యములను నిర్దుష్టమైన ద్విపదలలో మనోహరముగా రచియించి 'చిన్నన్న ద్విపద కెరగును' అను పొగడ్తనందుకొనినాడు. ఈయన రచనలు మృదుమధురమగు తేట తెలుగుపదములలో సాగినవి. వీరి కావ్యములన్నియు తిరుమల తిరుపతి దేవస్థానమువారిచే ప్రచురింపబడినవి.

వీరు 1498-1561 సంవత్సరముల నడుమ నున్నవాడనియు, అష్ట మహిషీకల్యాణమును 1545 లోను, పరమయోగి విలాసమును 1546 లోను, ఉషాపరిణయమును 1547 లోను రచియించినట్లు తెలియజేయ బడినది. వీరు మూడు సంవత్సరములలో మూడు కావ్యములను వ్రాసి, మిగిలిన కాలమును వృథాచేసినాడనుట అసమంజసముగను, అసహజము గను కన్పట్టుచున్నది. అయినను 'దినములోననే వేయి ద్విపదలింపొంద' రచియించు శక్తివంతుడైన యీకవి మూడు సంవత్సరములలో ముచ్చటైన మూడు కావ్యములను ముగించినాడనిన అందులో అబ్బుర మేమికలదు. వీరి శాసనములు క్రీస్తుశకము 1546, 1554 లో నున్నట్లు తేలుచున్నది.

ఇక వీరి కులగోత్రాదులు తండ్రి తాతల ప్రతిభాప్రపత్తులు వంశ వైభవమును పరమయోగి విలాసమున పొందుపఱచినారు.

........ .... పంచమాగమ సార్వభౌమ
హరిసేన కాశ్వలాయనసూత్ర నంద
వర వంశభవ భరద్వాజస గోత్ర
పావన శ్రీ తాళ్లపాకన్నయార్య
ధీవిశారదసూనఁ దిరుమలాచార్య
వినుతనందన తిరువేంగళనాథు.........

చాలవరకు తాళ్ళపాకవారి చరిత్రము, కులగోత్రములు వారి రచనలు, వానిలోని అందచందములు చిన్నన్న వ్రాసిన గ్రంథములలో తడవుటవలనను, ప్రత్యేకించి వారు రచియించిన 'అన్నమాచార్య చరిత్ర' మను గ్రంథము వలనను తెలియుచున్నవి. అందులో అన్నమా చార్య చరిత్రము తాళ్ళపాక కవుల చరిత్రను నిర్మించుటకు ముఖ్యా

ధారము, మూలాధారము. వీరు తాతగారు జీవించి ఉండగనే జన్మించుట వలన, వారి ఘనతను వినియుండుటవలనను, తండ్రి ఘనతను చూచిన వాడగుటవలనను, సవతితల్లి తిమ్మక్కను గురించి తమ వారివలన తెలిసికొనిన వాడగుట చేతను, అన్న చినతిరుమలయ్య, మేనత్త కుమారుడు రేవణూరు వెంకటాచార్యులు వీరికి యించుమించు ఒకే కాలమువారై ఒకరినొకరు బాగుగ నెఱిగిన వారగుట చేత, చిన్నన్న వీరందరిని గురించి తన గ్రంథములలో వ్రాసిన విషయములు సరియైన వనుటకు సందియము లేదు వీరు దూరదృష్టి గలవారుగా కాననగును. వీరు తాళ్ళపాక కవులను వారి గుణగణములను, కావ్యములను, జీవిత విశేషములను మోమాటముతో గ్రంథస్థము చేయకపోయిన, వారి చరిత్ర బయట పడక పోయెడిదేమో! తమ చరిత్రను సందర్భానుసారము చెప్పి చరితార్థుడైనాడు.

'జలజాతవాసిని చనుబాలపుష్టి'తో కవిత్వమును చెప్పెదనని అన్నమాచార్య చరిత్రలో సగర్వముగా చెప్పుకొనినాడు.

**జలజాతవాసిని చనుబాల పుష్టిఁ**
**బలికెద నానేర్పు పరిపాటి నిపుడు.**

ఈ కవి తన కావ్యములందు సంస్కృత కవిప్రశంసయేగాని ఆంధ్ర కవులను నుతింపలేదు. వీరీపనిని కావలసియే చేసినట్లున్నది. తమ తాత గారగు అన్నమాచార్యులు, తండ్రి పెద తిరుమలాచార్యులు అనేక సంకీర్తనలు వ్రాసినను, బహుగ్రంథకర్తలై యున్నను, వారి భాషా భావములను తరువాతికవులు ఉపయోగించుకొనియు, వారిని తమగ్రంథ ములలో ప్రశంసించ కుండుటకు కినిసి కావలసిచేసినపనియే. ప్రబంధ కవులు వీరి భావములను, పలుకుబళ్లను ఉపయోగించుకొని వారిని

పేర్కొనకుండుట కరివేపాకు సామెతవలె నున్నది. ప్రతి కూరలోను 'కరివేపాకు' వేయక మానరు. నోటిలోనికి వస్తే ఊయకమానరు, వీరిని అందరు ఉపయోగించుకున్నవారే. వీరిమాట చెప్పినవారు లేరు.

చిన్నన్నను వాగ్గేయకారుడుగా పేర్కొనిన ఆంధ్రకవులు లేరు. వీరిని ద్విపద కవిత్వమున గొప్పకవి యని తెనాలిరామకృష్ణుడు చెప్పి నాడు. ఇదిగాక రాజలింగకవి 'కూర్మపురాణమున,' కాణాదపెద్దన 'ముకుందవిలాసము'న వీరిని కవివరులలో చేర్చిరేకాని సంగీతాచార్యు లుగా జెప్పరైరి. కాని వీరి మేనత్తకొడుకు రేవణూరు వేంకటాచార్య కవి వీరిని మహాభక్తుడనియు, భక్తిపారవశ్యమున పదములు పాడినపుడు శేషాద్రిశయనుడు మెచ్చి సాక్షాత్కరించి నృత్యము చేయుచుండెనని వర్ణించెను. వారి 'శ్రీపాదరేణు ప్రభావము'ను గ్రంథములోని యీ పద్యము వలన పై విషయము తెలియనగును.

శ్రీలలరంగ మంగమను శ్రీహరికన్నటు ధారవోయుచో
తాళులపాక యన్నమయ తాఁగడిగెన్ పదముల్ ధరిత్రి, మా
తాళులపాక చిన్నన పదంబులు పాడిన నాడె, సర్వరాట్
శైలవిభుండు, తత్పదరజంబును మాకొసగంగఁ జెల్లదే.

చిన్నన్నకు సమకాలీకుడు, బంధువైన వేంకటాచార్యుల మాటలను సులభముగా త్రోచిపుచ్చరాదు. వానిని అంగీకరించి, చిన్నన్నను పద కవిగను, గాయకుడుగను గుర్తించి, వారు రచియించిన సంకీర్తనలేమైనా దొరకునేమో నని వేచియుండుట సమంజసము.

చిన్నన్న కీర్తనలు రచించినాడని అవి యింకా లభ్యము కాలే దను భావమును వేటూరు ప్రభాకరశాస్త్రిగారు వెలిబుచ్చినారు. ఇవి

కాక (శ్రీ)పాదరేణు ప్రభావములోని తృతీయోల్లాసములోని మరియొక పద్యములోకూడ తిరువెంగళనాథుడు పాడ, 'నాడు దర్వీకర రాడ్గిరీశ' అని చిన్నన్నను మంచిగాయకుడుగనే వర్ణించినాడు వెంకటాచార్యుడు.

నాకమునందు గల్గు సుమనస్సుల తావులమించి నేడ దే
యాకమేమొ తత్పరిమళాయితమయ్యె సురేంద్ర ! రంభనాన్
వేకువ(.దాళ్ళపాక తిరువేంగళనాథుడు బాడ నాడు ద
ర్వీకర రాడ్గిరీశ పదరేణువు లెల్లను గప్పబోల్ జుమీ !

ఇతడు (శ్రీ)వేంకటేశ్వరస్వామి వలన మకరకుండలములను బహుమతిగా పొందితినని పరమయోగి విలాసమున చెప్పికొనియున్నాడు,

.......... .......... శ్రీ వేంకటాద్రీశ దత్తా
మకరకుండలయుగ్మ మండిత కర్ణ

ఈ పరమయోగి విలాసము ప్రతియొకటి లండనులోని 'ఇండియా ఆఫీసు'లో కలదట. దానిని శ్రీ సి. పి. బ్రౌను దొరవారు పరిష్కరించినారు. దానితో నేడు ముద్రితమైన ప్రతిని పోల్చిన క్రొత్తపాఠములేమైనా లభించునేమో ! ఇతర దేశములందును తాళ్ళపాకవారి రచనలు వ్రాకినవన వాని పలుకుబడి ప్రాబల్యమున కిది ఒక నిదర్శనము.

తన అష్టమహిషీకల్యాణములో ద్విపద లక్షణమును ఇరువది ద్విపదలతో నిర్దుష్టముగ నిర్వచించినాడు. ఆ గ్రంథములోనే కవిత్వమెట్లుండవలయునో తెలిపినాడు. దానిని యిందు పొందుపరచుచున్నాను.

అలఘు శబ్దార్థ
సారసరీతిరస ప్రభావముగఁ
గులికి కస్తురి వీణె, గోసిన కరణిఁ
దెలికప్పురపుఁ గ్రోవి దెఱచిన సరణి
విరవాది పొట్లంబు విడిచిన మాడ్కిఁ
బరిమళించుచుఁ గవుల్ బళిబళి యనఁగ
గవిత చెప్పిన సులక్షణునిఁ గవీంద్రుఁ
డవునందురే నేర్చినట్లు చెప్పెదను.

కవితాలక్షణములను, ద్విపద లక్షణములను తెలిపియుండుటచే అష్ట మహిషీకల్యాణము వీరి ప్రథమ గ్రంథమై యుండవచ్చును. కావున మొదట యీ గ్రంథములోని అందచందముల పరిశీలింతము.

'అష్టమహిషీకల్యాణము' చిన్నన్న మొదటి కావ్యము. ఇది అయిదాశ్వాసముల గ్రంథము. శ్రీకృష్ణుడు రుక్మిణి, జాంబవతి, సత్యభామ, కాళింది, మిత్రవింద, సత్యకీర్తి, భద్ర. లక్షణ అను ఎనమండ్రు గురు పట్ట మహిషుల పరిణయ మాడుట యిందు అభివర్ణితమగుటచే దీనికా పేరు వచ్చినది. ఇందు మొదటి మూడు ఆశ్వాసములలో శ్రీకృష్ణుని బాల్యక్రీడలు, చతుర్థాశ్వమున రుక్మిణీకల్యాణమును, పంచమాశ్వాసమున తక్కిన యేడుఁగిరి వివాహములు వర్ణితములు. ఇందు శ్రీ కృష్ణభగవానుని బాల్యక్రీడలకు, లీలలకు ప్రాధాన్యమిస్తూ, రుక్మిణీ కల్యాణమునకు తగిన స్థానమిచ్చినాడు తిరువెంగళనాథుడు ఇందు ప్రథమ పట్టమహిషి రుక్మిణీకల్యాణమును రమ్యముగ వర్ణించినాడు. దానిలోని కొన్ని భాగములిందు పొందు పరచి పోతన రుక్మిణీకల్యాణముతో పోల్చిన అందులోని అందచందములు అగపడును.

చిన్నన్న రుక్మిణి జననము కొంత చోద్యముగా నున్నది.

ధరణిజ యను పేర ధరణి జన్మించి
యారాముడీ రామునను జన్మఁడైన
నారామ రుక్మిణి యను పేరఁబరఁగి
జనకసమాన భీష్మక మహీపతికిఁ
దనుభవాభావంబు దాల్చిననాట
నిండు గాలాముల నిజపోషణముల
రెండవ తరుణేందు రేఖయో యనగ
నొకనాఁటఁ బెరుగుట యొకపూటఁ బెరిఁగి........
బాలయై యలకాప్తఁ పాలయై బద్ధ
చేలయై శుభగుణ శీలయై........

వీరు కడపటి యంత్యాను ప్రాసలను బట్టి పోతన పోకడలు పోయినాడాయనిపించును. కాని పోతన చెప్పిన రుక్మిణి జన్మవృత్తాంతము వేరు విధముగనున్నది. చిన్నన్న బీష్మకుని 'జనకసమాను' డనినాడు. రామావతారములోని సీత రుక్మిణియై భీష్మకునికి తనూభవ భావమున నున్నదట. రాముడు బలరామానుజుండైన కృష్ణుడట. పోతన రుక్మిణి భీష్మకుని కూతురని కచ్చితముగా చెప్పినాడు.

వినుము విదర్భదేశమున వీరుడు కుండిన భర్త భీష్మకుం
డనునొక దొడ్డరాజు గలఁడాతని కేవురు పుత్రు లగ్రజుం
డనఘుడు రుక్మి నాఁబరగు నందఱకుఁ గడగొట్టు చెల్లెలై
మనుజవరేణ్య! పుట్టె నొకమానిని రుక్మిణి నాఁ బ్రసిద్ధయై

రుక్మిణీదేవి దిన దిన ప్రవర్ధమాన యగుచు పెరిగి పెద్దదై యుక్త వయసు వచ్చుసరికి ద్వారకాపురి నుండి వచ్చిన వారలవలన వారి జాతుని గుణగణములు, రూపురేకలు విని

ప్రతిలేని యారమాపతి పతికాఁగఁ
గుతుకంబులో నాత్మఁ గోరినిచ్చలును
గురుభక్తితో మరుగురుఁ గూర్చియాత్మ
గురుతర వ్రతము గైకొని సేయుచుండె........

చెలువొందు రుక్మిణీ శీతాంశువదన
విభుని గానాత్మ శ్రీవిభుని గోరుచును
శుభగుణ యౌవన స్ఫురితయైయుండె

భీష్మకుడు తనయ నెఱజవ్వనము నీక్షించి, 'యీచంద మీఅంద మెందును గానమని వనజాస్త్రకోటిలావణ్యుడైనట్టి వనజోదరున కేయీ వామాక్షి దగునని' తనయులకుఁ దెలుప అవివేక చిత్తుడైన రుక్మి అక్షేపించుతూ తండ్రి కిట్లనియె.

అవునౌనె యేమంటివయ్య యోయయ్య
యతడెవ్వ డెందుండు నతనికి మనకు
క్షితి నెంత దూరంబు క్షితినాథ వాడు
నెట్టన నీకన్య నృపవంశజాత
పుట్టుగొల్లలలోనఁ బుట్టినవాడు
కులమెన్న విపు డధికులనెన్న విట్టి
తలఁ పెట్టు తలఁచెదు తగునె యీ తలపు
నీమదిఁ గలిగెనా నిఖిలంబులోన
భూమీశ చైద్యుఁ డిప్పుడు గలవాడు
అతనితోడనె వియ్య మందుదు గాని
యితరుల కొసగనే నీను నీయాన

భీష్మకుఁడు భీష్మించిన కొడుకు మాట కాదనలేక మిన్నకుండెను. శిశుపాలునికి చెల్లెలి నిచ్చెదనని చెప్పినాడు రుక్మి బలము మీరగ తన

బలగంబు గూర్చి పెండ్లి ప్రయత్నములు చేయు అన్నపై కినిసిన రుక్మిణి తలపోసిన విధము.

కుటిలాత్మ రుక్మి నాకును నన్నగాఁగఁ
గటకట నేరీతి గావించె నజుఁడు
శౌరినొల్లనివారు జగతి గల్గినను
వారినేనొల్ల మావారైన నేమి
యీ మేని దీనతలెల్ల మాన్ప
నేమందుకలదింక నేమందు ననుచు

ఇట్లు చింత గుందుచు నున్న రుక్మిణికి చెలుల సలహాపైన హితుడైన కుల పురోహిత సుతు బిలిచి యంతరంగమున అతని కిట్లనియె

పరమ నిశ్చయముగా భావించి యేను
హరికిఁ గట్టితిమున్న నాత్మకంకణము
రేపె లగ్నము సిఁరిరేఁడు రంజిలగ
నీపని యెఱిగింపు మీ ప్రొద్దు పోయి
దిక్కెవ్వరును లేరు దేవరే కాని
దిక్కు రుక్మిణికని తెలియంగ ననుము
తలి దండ్రి నాయన్న దమ్ములు నాదు
తలపెరుంగరు శౌరి తానేగుదెంచి
తను గన్నవారలఁ దను నిమ్మటన్నఁ
దనకన్న వారలెంతటి వారు కినియఁ
గాదేని ననుఁబల్మిగైకొని యచట
చేదీశుఁ బట్టి నిర్జించి పొమ్మనుచు
వాని దార్చుటకు భవాని నోమనుచు
వేయి లాగులనాదు విధమెల్ల జెప్పి
తోయజాక్షునివేగఁ దోడి తెమ్మనుచు
నే నిల్లు వెలువడి యేతెంతు ననుచు

అనేక ప్రకారంబుల నావైదర్భి విప్రవర్యునికి విన్నవించి మరియు 'పన్నగ శయనుండు ఆపన్న శరణ్యుడను మాట సత్యము చేయు'మనిన పురోహితుడు 'తల్లినీపనుపున దానవారాతి నెల్లియెల్లుండి లోనే తోడితెత్తు' నని బయలు దేరిన బ్రాహ్మణుని వర్ణన చిన్నన్న చేసిన విధము.

ఉరుతరా యతమైన యుపవీతజాల
మురముపైఁ బెనగొని యుబ్బూతలూఁగ
వెడజాఱు జుట్టు చెర్వైన శిఖాశాఖ
మెడలపై నొకయింత మిటిమిటి పడఁగ
మిగులు నీర్కావితో మించు పింఛియలు
జగజంపు దోవతి చరణంబు లొరయ
నొఱవుఁగా బెట్టిన యూర్ధ్వ పుండ్రంబు
చిఱు చెమటలతోడఁ జిప్పిరి జాఱ
పొడవుగా నిక్కి యుప్పొంగి నర్తించి
యడుగడుగునకు శ్రీహరి హరి యనుచు

పయనించి పురోహితుఁడు పురుషోత్తముని ద్వారకలో నిండోలగమున దర్శించిన, యా దేవుడు భూదేవుని నిశాంతంబునకు దోకొని 'చుట్టును మున్నీరుచుట్టిన యట్టి పట్టణమునకు రాగతంబేమి' యన, విషయము నెఱింగించి, వైదర్భి రూపగుణ శీలంబు సొంపు వెలయవి తర్కించి, ఆమెను తెచ్చుటకై తెలిపిన యొక యుపాయమును విన్నవించెను.

జనకుని యింటిలో జలజాక్షి నెట్లు
కొనివత్తుననుచు సంకోచింప వలదు
అల పెండ్లి తొలినాఁడె యన్న పంపునకు
వలగొన ముత్తైదువులతోడఁ గూడి

ధరణీశ్వరులు గొల్వ తనయంతిపురము
పురము వెల్వడియేను బొత్తు కత్త్రియులఁ
గడువేడ్కతో నోము గలదని గౌరి
గుడికేఁగి మఱలి గ్రక్కున నేగుదెంచు
సమయంబు నీకును సమయంబటంచు

పోతన విరచిత శ్రీమహాభాగవతమున కూడ యీ విధముగనే యున్నది.

లోపలి సౌధంబులోన వర్తింపంగఁ
దేవచ్చునే నిన్నుఁ దెత్తునేని
కావలివారలఁ గల బంధువుల జంపి
కాని తేరాదని కమలనయన!
భావించితేని నుపాయంబు చెప్పెద
నాలింపు కులదేవ యాత్రజేసి
నగరంబు వెలువడ నగజాతకును మ్రొక్కఁ
బెండ్లికి మునుపడఁ బెండ్లికూఁతు

నెలమి మావారు పంపుదురే ననట్లు
పురము వెలువడి యే తెంచి భూతనాథు
సతికి మ్రొక్కంగ నీవు నా సమయమునకు
వచ్చి కొని పొమ్ము నన్ను నవార్యచరిత!

తరువాత రుక్మిణి యిచ్చిన ముద్దుటుంగరమును ధరించిన కృష్ణుఁడు వేళకు తగిన వేషభూషలతో, విప్రులు గోవిందాష్టకములు చదువ, శంఖుచక్రాంకితుఁడై, చతుర్బలసమేతుఁడై, రథారూఢుఁడై, విదర్భదేశమునకు వెడలి, వైదర్భిని చేపట్టెను. యాదవసైన్యమును, శిశుపాలపక్షరాజన్యులు అడ్డగించి హతులైరి. బ్రతికి బయటపడినవారు బలరామాదుల

బలపరాక్రమములను శాశపురములో చీకు చింతలతో మునిగియున్న శిశుపాలునితో చెప్పి, 'నీవురాక మేలుచేసికొంటివి. యుద్ధము మాని యింటికి పొమ్మని ఆలేమ పట్టుదయ్య మెరుంగునని' సలహానిచ్చి చనిన విధము చూడుడు.

చెలగిఁ యేనుఁగు చేతి చెఱకు గైకొనగ
నలవియే యెవ్వరికైన నాకరణి
నాదానవారికి నగపడినట్టి
వైదర్భిఁ గైకొన వశమె యివ్వేళ
యుద్ధంబనెడుమాట యుడిగి మామంచి
బుద్ధి చేకొని నీదుపురమునకరుగు

చైద్యుడు చేయునది లేక చేదిపురము చేరెను. కనలి రుక్మియు దురాగ్రహ వృత్తిఁబొదలి, కనుగవ విస్ఫులింగములుప్పతిలగ

పసులకాపరిసని పరికింపకెట్లు
కుసుమ కోమలి నెత్తుకొని పోయెవీడు
చుట్టంబు గతివచ్చి సూడుబంటయ్యె

అనిహరిని ఆక్షేపించుచుతూ యుద్ధమునకు గడంగెను. శౌరియు రోషారుణ నేత్రుడై విజృంభించి యొనర్చిన యుద్ధమును సరళ ద్విపదలో భీకరము గనే వర్ణించినాడు చిన్నన్న.

వ్రాలు గాత్రములు పత్రములు ఛత్రములు
గూలు నక్కలును ముక్కలును జెక్కలును
గ్రుంగు నూరులును శూరులును నారులును
బ్రుంగు మూఁపులును గోపులును దూపులును

తుదకు రుక్మిని యుద్ధమున నోడించి పట్టి, కట్టి కృష్ణుడు

ధళధళమనుడాలు ధరియించి వాని
తలఁద్రేయఁ బూన వైదర్భి యత్తఱిని
వన్నచందముఁ గృష్ణుఁడడిదంబు కేలఁ
గొన్న చందముఁ గనుగొని యాత్మలోనఁ
గనికరింపుచుఁ గరకమలములోడ్చి
పెనగొన్న సిగ్గును బ్రియము రెట్టింప
ముంగురు లల్లాడ మోమింత యెత్తి
తొంగలి ఱెప్పల తుదఁజాలఁ జూచి
చనుదోయిడాయు వాసన నించు కదిమి
నునుపు కస్తురి పూఁత నూగుగారాలఁ
గుచ్చులు మెఱయంగఁ గొనకొన్న సరులు
తచ్చరలాడ బిత్తరముట్టి పడఁగ
బాలేందు రేఖకుఁ బ్రతివచ్చునట్టి
ఫాలేందు రేఖ శ్రీపాదంబు నొఱయ
జొటజొట తేనియ లొనగాఁగ గుఱియ
గుటిల కుంతల పల్కె గోవిందు తోడ
ప్రాణేశ నామాట పాటించి వీని
ప్రాణముల్గొన కింకఁ బాలింపుమనిన

పోతనామాత్యుడు ఈ సందర్భమును వర్ణించిన విధము చూడుడు. రుక్మిణీదేవి మత్తకోకిలలో మనోహరునికి మనవి చేయుట మనోహరముగా నున్నది.

కల్లలేదని విన్నవించుట గాదు వల్లభ యీతనిన్
బ్రల్లదుం దెగజూచి తేనియు భాగ్యవంతుల మైతిమే
మల్లుఁడయ్యె ముకుందుఁ డీశ్వరుఁ డంచు మోదితు లైన మా
తల్లిదండ్రులు పుత్రశోకముఁ దాల్చి బిక్కుదు రీశ్వరా !

అని డగ్గుత్తికతో, మహాభయముతో నాకంప తాంగంబుతో
వినత శ్రాంత ముఖంబుతో శ్రుతిచల ద్వేణీ కలాపంబుతోఁ
గనుదోయిన్ జడిగొన్న భాష్పములతోఁ గన్యాలలామంబు మ్రొ
క్కిన రుక్మిం దెగ వ్రేయఁ బోక మగిడెన్ గృష్ణుండు రోచిష్ణుండై.

తోయజాక్షుణ మాట తోయజాలక తోయజాక్షుడు దుష్టమానసుడగు రుక్మి తల నాలుగు పాయలుగా గొరిగి పంపెను. తరువాత రుక్మిణీ కల్యాణము మహావైభవముతో జరిగినది.

తాళ్ళపాక తిరువెంగళనాథసూరియను చిన్నన్న పన్నిద్దరాళ్వారుల, నలుగురు మతగురువుల జీవితములను పరమయోగివిలాసమను కావ్యమును ద్విపదరూపమున తెనుగున రచియించి, తన కంకితమిమ్మని శ్రీవెంకటేశ్వరుడు వైష్ణవాకారంబున కలలో కనుపించి ఆనతిచ్చినట్లు చెప్పికొనినాడు.

……………. తనకు నీవంకితముగను
బనుపడ ద్రవిడ ప్రబంధంబు చూచి
తెనుగున రచియింపు ద్విపదరూపమున

ఆద్దేవుని ఆదేశానుసారము ద్రవిడ ప్రబంధమును చూచి అందులోని ముఖ్యమైన అంశములను విడువక, కావ్యప్రశస్తికై అనవసరమైనవి పోనాడి, కావ్యరమ్యతకై కొన్ని వర్ణలను జొప్పించి మూలమునకు మెరుగు పెట్టుచు పంద్రెండువేల ఏడువందల యాభైనాలుగు ద్విపదలలో విస్తృత గ్రంథమును విరచించి వైష్ణవభక్తిని విరాజిల్లచేసిన విజ్ఞుడు. ఈమెని మదాశ్వాసముల గ్రంథములో ప్రతి అశ్వాసాంతమున

సకల వైష్ణవనాదసం సేవకాబ్జ
వదనావధూలబ్ధ సరసకవిత్వ
విదిత మానస తిరువేంగళనాథ

యని తన వైష్ణమతాభిలాషను. తన సరళ ద్విపద కవిత్వమును తెలిపినాడు.

ఇందులో వివరించి వర్ణించిన ఆళ్వార్లు పండ్రెండుగురు. 'ఆళ్వార'న తెనుగున యోగి యనెదరు. ఇందు వారిని పరమయోగులుగ వర్ణింపబడిరి. వారు కాసారయోగి, భూతయోగి, మహాయోగి, భక్తిసారయోగి, శఠకోపయోగి, మధురకవియోగి, కులశేఖరయోగి, కవియోగి, విప్రనారాయణయోగి, విష్ణుచిత్తయోగి, గోదాదేవి, పరకాలయోగి. వీరిలో పదునొకండుగురు యోగులు. గోదాదేవి లేక 'ఆండాల్' మాత్రము యోగిని. వీరుగాక మరి నలుగురు మతగురువులు ఇందభి వర్ణితులు. వీరిని ఆచార్యులనెదరు. శ్రీరంగంనాథమునిగళ్ అను నాథముని, 'అలవందార్' అనబడు యమునాచార్యుని, భాష్యకార యనబడు శ్రీ రామానుజాచార్యుని, పరాశరభట్టును కూడ నీగ్రంథములో వర్ణించెను.

ఇది వైష్ణవభక్తిని, వైష్ణవౌన్నత్యమును చాటు గ్రంథరాజము. ఇందు దక్షిణదేశమున గల అన్ని వైష్ణవాలయములను, అందుండు దేవుళ్లను వర్ణించి, వారి గొప్పను చెప్పుటయే గాక, ఆపరిసరప్రాంతములను, అందుండుప్రజలను. వారి వేషభూషలను, కట్టుబొట్టులను, ఆచారవ్యవహారములను వర్ణించుటలో వీరి సూక్ష్మపరిశీలనాశక్తి, తద్వర్ణనలకు కావలసి భాషాభావములు, శబ్దార్థశుద్ధి అమోఘములు. అనుపమానములు. ఈప్రదేశములన్నిటిని కన్యాకుమారి నుండి కాంచీపురము వరకు చిన్నన్న పయనించి, అందుండు వైష్ణవాలయముల దర్శించి, ఆ దేవుళ్ళను భక్తితో పూజించి, శ్రద్ధతో గమనించి, విపులముగ వారి మహాత్మ్యముల విని తన్మయుడై తాను కనిన, వినిన విషయములను

కన్నులకు కట్టినట్లు విపులముగా విమర్శించిన విధము విస్మయము కలిగించు చున్నది. వీరు చూడకున్న యింతవిపులముగా వర్ణించరు. ఈకావ్యము వైష్ణవమతాభిలాషులకు ఒక 'గైడు' వలె ఉపకరించగలదు. ఇది సరళ ద్విపదలో రచియించినను పేలవముగాక, మృదుమధురమై, కవితాపుష్టి కలిగి రాణించుచున్నది. విస్తృతమైనప్పటికిని, విసుగుపుట్టించక, ఒకేవిధ మైన సన్నివేశములు, సమయములు కలిగినను చెప్పెడిపద్ధతిలో వర్ణించెడి విధములోను భిన్నత్వముకలిగి చదువరుల అభిరుచిని పెంపొందించునదిగా నున్నది. ఇందు 'విష్ణుచిత్తయోగి గోదాదేవి' చరిత్రమును తీసికొనిన పై విషయములు కొంతవరకు నిరూపణ యగును.

శ్రీకృష్ణదేవరాయలు 'విష్ణు చిత్తీయము' అను 'ఆముక్త మాల్యద'ను ఆంధ్రమున ప్రౌఢప్రబంధముగా రచియించి వన్నెకెక్కెను. పరమయోగివిలాసము లోని 'విష్ణుచిత్తు గోదాదేవి' కథయునదియే. వీని రెంటిని పోల్చి చూచిన ఈ కావ్యములోని కొన్ని అంశములు ఆముక్తమాల్యదలో లేవనిన అతిశయోక్తి కాదు. చిన్నన్న 'ద్రవిడ ప్రబంధమును' దగ్గర పెట్టుకొని 'చూచి' వ్రాసినాడట. మొదటిది ప్రబంధము, రెండవది కావ్యము. అయినందున ఆ తేడా ఉండవచ్చుననుట సమంజసము. రెండు భావౌన్నత్యము కలిగినవే. కాని ఆముక్త మాల్యదలోని భావకాఠిన్యము మరి యే తెలుగు ప్రబంధములోను, కావ్యములోను లేదు. కాని ఆ ప్రబంధములోని ప్రౌఢత్వములోని ఠీవితో, యీ కావ్యములోని సరళత్వములోని తీపి పోటీపడునట్లున్నది. ఈ 'ద్విపద విష్ణుచిత్తీయము'ను పరిశీలింతము.

పాండ్య దేశములో శ్రీవిల్లిపుత్తూర'ను నగరముండెడిది. అందు భట్టనాథుండను భూసురుడు గరుడుని అంశమున జన్మించినాడట. అతని జననము వర్ణించిన విధము

సిరిమించుకళలతో జేష్ఠమాసమున
వరలగ్నమున గంధవహతారయందు
నక్షీణ వేదమయాంగుడైనట్టి
పక్షీంద్రునంశంబు ప్రభవించి జగతి
నెట్టన సురగురు నిరసించు పేర్మి
భట్టనాథుండనఁ బరఁగి ………

విష్ణువుకు విరులపూజ యిష్టమని వివరించి తెలిసి 'కావింతు సుమదామ కైంకర్యమనుచుఁ జందన, చాంపేయ, శారద, వకుళ, కుంద, మాకంద, ముకుంద, మందార' మొదలుగాగల వాని పుష్పవనమున పోషించుతూ, 'భక్తితో నరవిరుల్ గోసి, దామముల్గట్టి నిత్యము వటపత్రధామ మూర్తికి నర్పితము చేయుచు' విష్ణుచిత్తుడను నామాంతరము పొందెను.

పాండ్యరాజు 'జనునెల్ల జయలిడ' పరిపాలించుచు, రాత్రుల 'గొంగడి ముసుగిడికొని యిల్లువెడలి' ప్రజల కష్టముల పరికించుచు పాలించిన ప్రభువు. ఒకరాత్రి తానొక విప్రపుంగవుని వలన ఒక శ్లోకమును విని, దానియర్థమిదియని గ్రహించినాడు.

గడు నేర్పుమై వానకాలంబు కొఱకు
గడమ యెన్మిది నెలల్గడియింపవలయు
నగపడు రాత్రికై యాత్మఁజింతించి
పగలె వస్తువుల సంపాదింపవలయు
మును వచ్చు వార్ధకమునకునై నరుడు
తన యౌవనమున యత్నము సేయవలయు
భాజనీయంబైన పరకారణంబు
నీ జననమునందె యెఱుగంగవలయు.

నగరికిపోయి మరుదినము నిండు సభలోని మంత్రి సామంత పురోహిత పండితుల నుద్దేశించి, 'అంతిమ పురుషార్థ సిద్ధియేలీలఁ దెలియుదు నెఱిఁగింపవలయు'నని

కనకముల్ పెక్కు శుల్కంబు గావించి
తన సభా స్తంభ మధ్యమునఁ గట్టించి
యలయంగఁ దనలోని యనుమాన మెడయ
దరనెవ్వరేఁ బరతత్త్వ నిర్ణయముఁ
జేసి యీ శుల్కంబు జేకొనుండనుచు

ప్రకటించి

పనిచినఁ గపిలాక్షపాద భట్టాది
ఘనశాస్త్ర విదులైన ఘనులేగుదెంచి

'ఇదిమృష అదిమృష' యని అన్యోన్యమతాభి దూషణము చేయుచు, ఎదియును తేల్పక 'పెరుగు వడ్లు కలిసిన రీతి' నుండ నరనాథుడు చింతాక్రాంతుడై యుండెను.

శ్రీవిష్ణువు తనకు ప్రతి రోజు పుష్పదామములు కొని తెచ్చు భక్తుని విష్ణుచిత్తుని కనికరించి 'పాండ్య భూకాంతుని సభను గనుపట్టు కనక శుల్కంబుఁగైకొను' మన యరుదంది యయ్యోగివరుడు వినయ మేర్పడ విన్నవించె శౌరికి

వేదమో శాస్త్రమో వివరించిచూడ
వేదార్థ సాధ్యమై వెలియు శుల్కంబు
పాయక గుద్దలిఁ బట్టినకేలి
కాయలచూపి యేఁగైకొనుటెట్టు

నీ పదపద్మములు తక్కతక్కిన లలిత విచారము లేమియు తెలియని వాడనని విష్ణుచిత్తుడు విన్నవింప నీ హృదయ పద్మమున నేను నెలకొని యుండి నిగమంత నిశ్చితార్థంబులు

పలికించువాడను బలికెడువాడ
నల మహాశుల్కంబు హరియించువాడ

నని అభయ మిచ్చిన వెనువెంటనే పయనమై

మధువైరి కుమతుల మర్దించు కొఱకు
మధుర సొచ్చినరీతి మధుర సొత్తెంచి

నా రాజు పేరోలగము సొచ్చిన, 'యభిమన్యుసూతి శుకయోగి కనుగొన్న చొప్పునగాంచిన' రాజు సింహాసనము దిగి సపురోహితముగా నెదురేగి ఆహ్వానించి ఆసీనుని జేసి, అర్ఘ్యపాద్యాది విధుల పూజించిన, పరమత వాదులై పరుగు పాషండ ధరణీసురులు చూపుదాళ కిట్లనిరి.

పట్టె నామంబులు ఫాలభాగమునఁ
బెట్టిన వచ్చునే పెద్దఱికంబు? ... ....
లంపట బడగఁ దాల్లకుఁ దలబంటి
యొంపటి చెట్లకు నిక యెంత బంటి ?
యను నీతిశాస్త్రంబులందలి కొదవ
లొనర దిద్దెడినట్టి యోగ్యులచేత
నెక్కడ దీరని యీ బీరకాయ
చిక్కు దానితనిచేఁ దీరుట యెట్లని

అసూయతో ననుమానముతో నుండిన విప్రులు విస్మయమంద పర మేష్టిని ప్రార్థించి భూపతితో నిట్లు చెప్పెను.

ప్రకృతి జీవులకు లోపలను వెల్పలను
సకలశాస్త్రముల నిశ్చలత దీపింప
నాది యంత్యము లేక యధికుండు సముడు
నేదెస లేక సర్వేశ్వరుండగుచు
సర్వనియంతయై సర్వజ్ఞుడగుచు
సర్వంబుఁ దనకు శేషంబుగా మెలఁగు
కాంతిఁబాయని మణికరణి నా దివస
కాంతుఁబాయని రుచిగతిఁ బ్రదగూడి
మిగులవేదములాడి మిథునంబటంచుఁ
బొగడఁ బెంపొందు శ్రీపురుషోత్తముండు
పరతత్వము

అన్నంతనే ఘనపాశముల గట్టిన ముడుపు తత్సభాస్తంభ మధ్యము నుండి దానంతటనదియే యతని పాదములపై బడినదట. తోడనే దుందుభులు మ్రోగినవి. రంభాదులాడిరి. అఖిలభూసురులు కొనియాడిరి.

విజయుడై విష్ణుచిత్తుడు శ్రీవిల్లిపుత్తూరు చేరి సుమదామములు దామోదరుని పూజించుచూ, ఒకనాడు తులసీవనము నల్గడల గుద్దలితో త్రవ్వుతఁజి

.... .... .... .... .... తన్మధ్యమునను
శుచిమాసమునఁ బుబ్బశుభముహూర్తమున
రుచిరాగరుత్మత రుచిరేఖ వోలెఁ
దోరమౌ నొకమంచి తులసి మూలమున
ధారుణీ యంశ ముద్భవమై చెలంగి
బాలయై యెదుటఁ జూపట్టి నయ్యోగి
చాల నక్కజమంది సంతసింపుచును
బతిలేని శృంగార రాశియో యనగ

శ్రీకృష్ణదేవరాయ విరచిత 'ఆముక్తమాల్యద'లో గోదాదేవి తులసి తోటలోనే దొరికినట్లు చెప్పినారు.

వింగడమైన యొక్క వనవీధిఁ గనుంగొనె నీడ సన్నపున్
రంగుటరంగు పచ్చల యరంగయిపోయిపో వెలదమ్మి బాఁకిం
జెంటగ నల్లసిల్ల తులసీ వనసీమ శుభాంగి నొక్కబా
లం గురువింద కందళ దళ ప్రతి మాంఘ్రిక రోదరాధరన్

ఇందు తెల్లతామర కొలని చెంతగల తులసి తోటలో పాలగచ్చు తిన్నె మీద అంఘ్రిక రోదరాధరన్, ఒక బాలను కనుగొనినట్లు చెపినారు. గుద్దలితో త్రవ్వునపుడు ఒక మంచి తులసిమూలమున 'రుచిరగారుత్మ రుచిరేఖ' వంటి బాలనే చూచినట్లు చిన్నన్న చెప్పినాడు.

తనకు దొరికిన బిడ్డను ఎత్తి ముద్దాడి, 'జానకి సరిఁబోల్ప జనునీ లతాంగి' యని తలపోయ అశరీరవాణి యిట్లు పలికెను. - తొల్లి శ్రీనాథుడు శీతాంశువదన శంకతీర్చుచు 'అలరుల దామంబు నర్పించి పూజించువారు, వారి పూజలు యిష్ట'మని నుడువ తనపతిమాట మనముననాట, ఇలలోన జనియించి యీ పూజ చేయుటకై మహాయోగి వరుడవయిన నీకు నందన నయ్యెదనని

నీతోటలో జనియించెఁ బూర్వము
సీతాంతరంబున సీత వధూటి
జనియించి జనకుని సత్పుత్రియైన
యనువున నీకు నీ యరవిందనయన
నందనయయ్యె నీ నాళీక వదనఁ
బొందుగాఁ గొనిపోయి పోషింపుమింక
నకలంక శుభములు నభిమతార్థములు
సకల సిద్ధులు నీకు సమకూరు ననిన

మాటలు విని ముదముతో ముద్దులపట్టిని గొని యింటికేగి తనభామచేతి కాతన్వంగి నిచ్చి, జరిగిన దంతయు చెప్పిన ఆమెయు పరమానురక్తి ఆబిడ్డను పోషించెను. కన్నియకు జాతకర్మముల్ దీర్చి

ఈ దేవి హరి నెన్ను నిటమీద ననుచు
గోదాభిధాన మాకొమరితె కొసగి

పెంచ దినదినాభివృద్ధిగా పెరగి యింతయై యంతయై యెదిగి నానాట
గుంతలంబులు కురుల్ గూడు ప్రాయమున తన యీడు చెలులతో బొమ్మరిండ్లాటలాడుచు

ఇరుడింపగు రెండు బొమ్మలు దెచ్చి
హరియును వైదర్భి యని సమకట్టి
కూరిమి నేఁ బెండ్లి కొడుకు వారనుచు
గోరిమీరలు పెండ్లికొడుకు వారనుచు

వావి వరుసలెరిగి పిన్నవయసుననే పన్నగశయనుని పతిగా భావించి తలుపుదగ్గర చిక్కినట్లు నటించి పతిపేరు చెప్పిన విధము చూడుడు.

చిక్కతి పతిపేరు చెప్పుమటన్నఁ
ఇక్కని వటపత్రశాయి నామగడు

ఈ విధముగా ఆటలాడుచు ఆస్పదము కల్పించుకొని తనపతి శ్రీపతియని 'మనోవాక్కాయ కర్మల తెలియజేయుచుండెను. అటుల పెరుగుచు ఎలజవ్వని యగుచు భట్టనాథతనూజ తండ్రి వనమాలి కర్పింపగట్టిన వరసుమదామ మాలికను తన కొప్పున నొప్పుగా ముడిచికొని యింటి లోని నడబావిలో నీడచూచి సంతసించి, తిరిగి తొల్లింటి విధమున బువ్వ దండలా కరడిలో నునిచెడిది. విష్ణుచిత్తుడు వేడుకతో వానిని నిష్ఠవున

కర్పించెడువాడు. ఆ దేవుడు ముడిచిన దామములు ముదముతో గ్రహించుచుండెను.

ఈ లీల మఱియు ననేకకాలంబు
బాలిక ముడిచిన ప్రసవమాలికలు
హరిచిత్తుఁ డనిశంబు నాబాల ముడుచు
మరయక శౌరికి నర్పింపుచుండె

శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో నీ విషయమును ఇట్లు చెప్పినాడు. తండ్రి అల్లిన దండలను కొంతసేపు కొప్పున ఉనిచి తీసి వేసినదట. వానిని తండ్రి దేవునికర్పించినాడు.

—……………… పితృబద్ధ లతాంతము లథిన్ గొప్పునన్
బూని యొకింత సేపునిడిపుచ్చి చెలింగని వెచ్చనూర్పుచున్.

యప్పటి యనువున కొప్పులో పూలదండలు నొప్పుగా బెట్టి, బావిలో నీడచూచి భ్రమియించుచున్న బాలను ఏమరిపాటుగా నే తెంచిన తండ్రి గన్గొని

హరి సమర్పణమున కమరించు పుష్ప
సరములు నీకు శేషముఁ జేయదగునె

యని వాపోయి, వేరొక కొన్నివిరులు కోసి దండకట్టి దయామయుని కర్పింప ఆదేవుడు వానిని నొప్పక యిట్లనియె.

కడుఁ బ్రేమ నీ చిన్నకన్నె క్రొమ్ముడిని
ముడవని విరుల నే ముడువ నెంతైన
నీ కన్యకామణి నెరి తావలేని
యీ కుసుమములు నాకితవుగా విపుడు

కువలయనేత్ర కైకొని చేతఁ గొన్న
యవియె తెచ్చితివేని యంగీకరింతు

ఇది వినిన విష్ణుచిత్తుడు వెఱగంది యనురక్తి నరిగి, తనూజ ముడిచిన దామములతో కూడ నామెను దోడ్కొని శ్రీధవుని సన్నిధి చేరి, వాని నర్పించిన ముదముతో గైకొని, కన్నుల నొత్తుకొనుచు, శిరమునఁ జుట్టికొనుచు నిట్లనియె.

నీ మానినీమణి నిటమీద నేన
ప్రేమ దైవాఱంగఁ బెండ్లియాడెదను.

అది మొదలు ఆయమకు 'చూడుకొడుత్త నాచ్చియార్' యను నామము కలిగినది. కాలము గడచుకొలది నెఱజవ్వనియై అపురూప సుందరియై, 'నందందు గోవిందుఁడగు చిదానందునందు మిక్కిలి చిక్కియాసక్తయగుచు కడు మనోహరమగు కమలాక్షు కథలు విన కుతూహలమై' తండ్రిని అడిగినది. ఈ అవకాశమును జారవిడువక చిన్నన్న దక్షిణ దేశమున గల వైష్ణవాలయములను, అందుండు దేవుళ్ళను వారి మహాత్మ్యములను హృద్యముగా వర్ణించినాడు. శ్రీ వెంకటాచల నివాసి వైభవమును యిరువది ద్విపదలలో వర్ణించినారు. మచ్చునకు కొన్ని గీతల నుదహరించెదను.

భూలోక వైకుంఠమున వేంకటాద్రి
నీలోకముల నీడేర్చుకొఱకు
నలమేలుమంగ బాహాంతరసీమ
నెలకొల్పి నిఖిలావనీ స్థలిలోనే
శరణని వచ్చిన జనులకు నిష్ట
వరములిచ్చుచు గారవమున........

తిరువెంగళనాథసూరి నూటయెన్మిది తిరుపతులను వర్ణించినాడు-విష్ణు చిత్తుని ముఖముగా. అందులో ఆమె మెచ్చినది ఆమెకు నచ్చినది ఆ రంగ విభుడు.

రవికాంతి గనిన సారసము చందమున
నవిరళానంద మయాంగయై పొగడి
యంతరంగంబున నా రంగ విభుని
జింతించి ధ్యానంబు సేసి వేమరును

ప్రతిలేని శ్రీపతినిఁ బతిగా వరించి తండ్రి చెప్పిన మార్గశీర్ష వ్రత మాచరించి, రోజునకొక పాశురం చొప్పున ముప్పదియవనాటికొక ప్రబంధము 'తిరుప్పావై' గావించి, మరియు నాతనిమీద మమతలొదవ నూటనలువది పాటల నొక కావ్యమును కూర్చెను. శ్రీరంగవిభునిపై ప్రేమ కొండలై కొల్లలై విశ్వరూపము దాల్చిన విధము చూడుడు.

కనుగొన్న యదియెల్లఁ గావేరియనుచుఁ
గనుగొల నబ్జిపుష్కరణి యటంచుఁ
గనక చేలాంశు విగ్రహముల వేనిఁ,
గనుగొన్న శ్రీరంగ కాంతుడ యనుచు

ఆమెకు అంతా రంగమయమై ఆ దేవుని తలంచుచూ, ఆతనిపొందు గోరి మచ్చికతోడ ముద్దాడి, తన కరముల నింపి, తన్ను

హత్తినా జవ్వనమనునిధానంబు
రిత్తపుచ్చక తనరించి కైకొనునె

యని తదాసక్తమై యలరుల సెజ్జ కనుమూసి నిద్రింప,

శ్రీరంగపతి కృపాసింధుఁడేతెంచి
సారంగనయన ముచ్చట వాయఁ గదిసి

సరస కళావిలాసములఁ బెంపెసఁగ
మరుకేళిఁ దేల్ప నమ్మానినీ మణియు
ననఁగి పెనంగి ప్రత్యక్ష మాదేవు
నొనగూడి నటువలె నుండి మేల్కాంచి

కలగా నెఱింగి మరునిబారికి చిక్కి, నవచంద్ర రేఖచందమున దీపించి, యిజ్జాడ నెఱవార లెఱిగెదరని లజ్జించి అణగియుండెను.

తండ్రితో మాత్రము తాను శ్రీరంగము వచ్చెదనని చెప్పి యుండెను. విష్ణుచిత్తుడు రంగేశు సేవింప నెంచి తనయతో కూడ పయన మయ్యెను. తనయ తండ్రికి శ్రీరంగనాయుని గోపుర గోచరమాత్ర మున తన పల్లకి దించమని ప్రార్థించెను. వల్లెయని శ్రీరంగము వైపు పయనము సాగిస్తూ కావేరినిదాటి శ్రీరంగమును చేరుట వర్ణించుటలో చిన్నన్న శృంగారహృదయము సందర్భానుసారము తొంగిచూచినది.

పస్తనైన తమమించు పాలిండ్లఁబోలు
పసడికుండలు పట్టి పరతెంచు చున్న
ద్రావిడాంగనల నెంతయు నొప్పు నొప్పు
కావేరిదాటి రంగపురంబుఁ జేరి

అంతకు ముందే ఆకాశమార్గమున రంగనాథుని చేరిన తనయ సంగతి తెలియక ఆమె మాటతలచి

పల్లకి దింపించి పరమానురక్తి
నల్లనఁ దనుజాత నంకించి పిలిచి
పంజరం బెత్తిలోపలం జిల్కలేని
పంజరంబును బోలె పట్టి లేకున్న

'హాయనుచు మూర్ఛపోయి తెప్పిరి, ఆపలేని దుఃఖముతో ఆలయమునకు పోయి ఆరంగని దూరిన విధములో చిన్నన్నగారి రచనాశక్తి నాటకీయత, సహజకవితాశక్తి ద్యోతకమగుచున్నది.

అకలంక నిజకీర్తివై నీతిదొరఁగి
యకట! నీకిటు తగునయ్య రంగేశ
యీరీతిఁ దొంగిల నీకొమ్మ గోప
నీరజాక్షుల నవనీతమే తలప!
బలిమిఁ గైకొన రాజబాలికామణులె?
తలపోయ కిటుసేయ తగునె? గోపాల!
మన్నుగా జనని యీ(మచ్చిలు విద్య
వెన్నతో నిడినదే వివరించి చూడ
వనజాక్షి వలసినవాడవై తేని
ఘనతమై మాయింటికడ కరుదెంచి
యడగి చుట్టఱిక మేపారంగ సేయ
యిడి నీవు గొనిపోవు టింతియకాక
జగదేకసాక్షివై సర్వనాయకుఁడ
వగునట్టి నీవ యన్యాయంబు సేయ
మితిలేని మున్నీరు మేఱమీఱంగ
నితరుల వారింప నెట్టులోపుదురు?

అనినాఁడే కాని స్వామిపాదములపై వ్రాలి కన్నీటితో మజ్జన మాచరింప, తండ్రిశోకముఁ ధరియింప తనయ భరియింప లేక

అమలనాగేంద్రశయనుఁడై యున్న
కమలాక్షు వామభాగమునందు నుండి
కడునొప్పు నీల మేఘములోన నుండి
వెడలు శంపాలత విధమున వెడలి

తానున్నానని తండ్రిని ఓదార్చెను. శ్రీరంగనాథుడు తన భక్తుడు కోరిన విధముగనే పసిడితెక్కల తేజినెక్కి, చనుదెంచి నీ పట్టిని చేపట్టెదను, పాలతుక నిప్పుడు తోడుకొనిపోయి రమ్మనెను.

ఆముక్తమాల్యదలో తండ్రితో గూడి రంగనాథుని పద పంకజంబులకు గుసుమాంజలులు సమర్పించు సకలసీమంతినీసీమ ముక్తామణియగు నాముక్తమాల్యదరూపు నెలఁ(బ్రాయంబు సాభి(ప్రాయంబుగాఁ జూచి తనలోన ఉవ్విళులూరి తమక మాపలేక ఆత్మదివ్య శుద్ధాంతసీమ కన్నెలతఁ దార్చినాడట. మాయవధూటిని పల్లికిలో నిలిపినాడట. విష్ణుచిత్తుడు విడిదికి పోయి పంజరంబును (బురకాను) సడలించి పడతి లేమికి వగచిన విధము చూడుడు,

**అబ్రహ్మణ్యము! లోన వైచికొనె నన్యాయంబు న్మత్సుతం**
**దాబ్రహ్మాదుల మేరనిల్పియుఁ బ్రభుత్వంబూది యుంబ్రోతురే**
**యీబ్రక్కన్ ద్విజు జూడరయ్య సభవారీ రంగ భర్తంచు దుః**
**ఖాబ్రాశింబడి బాష్పకంఠుఁడు సముద్యద్గోః పలాలుండునై.**

ఈ బ్రాహ్మణుడు దుఃఖావేశముతో తన కూతును దేవుడు తార్చినట్లు అందరితో చెప్పి గుట్టురట్టు చేయుటకన్న చిన్నన్నవలె కడుపు కోసికొనిన కాళ్ల ముందు పడునని ఆరంగనికే ఆవేశముతో ఆవేదన వెళ్లబుచ్చుట సమంజసముగా నున్నది.

వీరిరువురి విష్ణుచిత్తుడు ఒక విధమైన దృక్పథము మనస్తత్వము కలవాడు. అందులకే ఆవేదనలోని అర్థము పరమార్థము ఒకటిగనే యున్నది. రాయలవారి విష్ణుచిత్తుడు వాపోయిన విధము.

**అంతేవేడుకయైనఁ బెండ్లగుటకీనా, దేహము న్ప్రాణముస్**
**సంతానంబు నిశాంతము న్ధనము సస్యంబు ల్పశుశ్రేణులే**

**కాంతాస్వస్వ జనార్చనంబునక కాదా కూర్పుటే మీకయో**
**వింతే యీ బుడు తెంత నన్నుగఱుచ గావింపం దనున్మెత్తురే.**

నీవడిగిన దేహము, ప్రాణము, సంతానము, గేహమును, ధనమును, పైరులను పశుశ్రేణి యిచ్చుటకు సిద్ధముగానున్న నన్నడిగిన యీబుడుతె నివ్వకుందునా? ఈ విధముగా భక్తుని కుఱుచ గావించినమిమ్ము లోకులు మెత్తురాయని ప్రశ్నించిన భాగవత శ్లోకంబునకు భువన భర్తయు భయంపడి, భవత్తనయను గృహంబున పదిలంబు చేసి బట్టబయల దూర భావ్యమా' యని యతని ఛాందసమునకు గేలిచేయు చున్నట్లున్న భావమాతనికి తోచ సర్దిపంపినాడు శ్రీరంగ నాథుడు. ఇందులోని చమత్కృతిహృద్యము.

ఆ విధముగా జనిన విష్ణుచిత్తుడు వేడుకతో వివాహమునకు కావలసిన వస్తుసంతతిని పొనగూర్చి విష్ణురాకకు వేచియుండెను. శ్రీరంగ విభుడు చెప్పిన మాటప్రకారము మంధిమార్భలముతో వచ్చి విష్ణుచిత్తుని యీప్సితార్థమీడేర్ప కన్యకను చేపట్టి వైష్ణవసాంప్రదాయము ప్రకారము అగ్నిసాక్షిగ వివాహమాడిన విధము.

**వలయు వారికి నిష్ట వరముల నొసగి**
**యలరుచు నుండి నాలవనాటి రాత్రి**
**యురగ తల్పమున నయ్యుడు రాజీవదనఁ**
**దిరమొంద మరుకేళిఁ దేలించి తేలి**
**యోగ నిద్రాసక్తి నుండ……..**

చిన్నన్న తండ్రితాతల వలె మేలుకొలుపు పాడించినాడు. అందులో ఒకటి యిందు పొందుపఱచెదను.

నిధులు నంబుధులును నిర్జర కపిల
బుధులు నచ్చరలుఁ దుంబురు నారదులును
మునులు నీ ముందర మొనసియున్నారు
వనజాప్తకాంతి తీవలువాఱె దెసల
జాలించి కరుణ చొప్పడ యోగనిద్ర
జాలించి శ్రీరంగశాయి! మేల్కనవే

క్రింది రెండు చరణములు మకుటము గల మేలుకొలుపులు ఇందు చాల కలవు.

ఎట్టకేలకు మేల్కాంచిన శ్రీరంగవిభుడు విష్ణుచిత్తుని తనకు మామగ మురిపించి, తరియించి శ్రీరంగము చేరి

అలవిష్ణుచిత్త కన్యక తోడఁగూడ
సరస కేళీలోల సంపత్తి కలిమి
సిరులు దైవాఱంగ శేషతల్పమునఁ
బవళించి నిజభక్తిఁ బరిజనుల్గొలువ
నవిరళ శ్రీమంతుడై యుండె.

తాళ్ళపాక చిన్నన్న రచియించిన రసవత్తర కావ్యమగు పరమయోగి విలాసములోని విష్ణుచిత్తు గోదాదేవుల సంగ్రహ చరితమిది.

చిన్నన్న విరచిత ఉషాకల్యాణమను రసవత్తర ద్విపదకావ్యమును పరిశీలింతము. శ్రీహరివంశములోని సంస్కృత మూలమున 1357 శ్లోకములలో నున్న ఉషాకల్యాణ ప్రకరణమును 1979 ద్విపదలలో బహుసొంపుగా రచియించి చిన్నన్న కీర్తి పొందెను. తిరుమల తిరుపతి దేవస్థానమువారు ఈ కావ్యమును మూలశ్లోకముల తోటి 1938 లో ప్రకటించిరి. ఈ కథనే కవిత్రయములో నొకరగు ఎఱ్ఱాప్రెగ్గడ ప్రణీత

మగు హరివంశమున 321 పద్యగద్యములలో వర్ణింపబడినది. ఈ కథయే నాచన సోమకవి విరచిత ఉత్తర హరివంశములో 791 పద్య గద్యములలో చెప్పబడినది.

తాళ్ళపాక తిరువెంగళనాథ విరచిత ఉషాకల్యాణము రెండు భాగములుగా వ్రాయబడినది. బాణాసురుడు ఈశ్వర వరప్రసాదియై విజృంభించుట మొదలు అనిరుద్ధ ఉషాకన్యల చెలినుంచు వరకు మొదటి భాగముగను, తక్కిన కథాభాగము బాణాసుర గర్వభంగము అనిరుద్ధ ఉషాకల్యాణముతో శుభాంతమగు వరకును రెండవ భాగము. ఈ కావ్యరమ్యతను పరిశీలించి దీనిని తక్కిన రెండు గ్రంథములలోని యీ కథాంశమును పోల్చిన, యీ కవి కవితాశక్తి కొంతవరకు కానవగును.

ఈ కావ్యము తాళ్ళపాకవారి కులదేవత, ఆడపడుచుగా పరిగణింపబడిన అలమేలుమంగమ్మ ప్రార్థనతో మొదలిడి అంత్యాను ప్రాసలతో అలరారుచున్నది.

> అలుమేలుమంగ కృపాజిరాపాంగ
> నలకనిర్జితభృంగ నమితాగమాంగ

ఈ కావ్యము ఆయమకే అంకితమిచ్చినట్లు చెప్పికొనినాడు.

> జలజకంధరకు సజ్జనధురంధరకు
> పొలుపొంద నంకింతంబుగ నాయొనర్చు
> హరివంశమార్గోక్తమగు నుషాకన్య
> కరమొప్ప బరిణయక్రమ మెట్టిదనిన

అని యీ కథాక్రమమును తెలిపినాడు. దీనికి మూలము సంస్కృత హరివంశమని తెలిపినాడు తొలుత కృష్ణుని పట్టణమైన ద్వారకాపురిని వర్ణించిన విధములోని వైవిధ్యమును చూడుడు.

సకల విశ్వంభరాచక్రంబు నడుమ
నకలంకమై మేరువమమరు చందమున
ధారుణీదోష విదారణంబైన
ద్వారకానగరంబు ధరణి చెన్నొందు.

అందుండు ప్రాకార శిఖరములు చాల యెత్తైనవై ఆకాశమును అంటు చున్నవని ఆ పురిలోని స్త్రీలు చదిలేటిలో ప్రతిదినము జలకమాడు చుందురని అతిశయోక్తి అలంకారమున కావించిన వర్ణనము

ముదితలాపురి సౌధముల మీదినుండి
చదలేటిలో డిగ్గి జలకమాడుదురు

బలితనూభవుండైన బాణాసురుని 'మాణిక్యఖచిత హర్మ్యంబులనమరు' శోణితపురిని బహుబాగుగ వర్ణించి, బాణాసురుడు కైలాసవాసుని మెప్పించి పాయక పార్వతీతోడ తన పురద్వారమున కాపుండబెట్టి,

ఫాలాక్షుఁడిట్లుండ బాణుండు తనకు
నీలోకమున నెవ్వడీడు లేదనుచు
నరుల మర్దించి కిన్నరుల గుంధించి
సురల నోడించి భూసురుల బీడించి
బలియుడై యారీతి ప్రబలి ముజ్జగము
గెలిచియు సమరకాంక్షత నుగ్గలింప

మరలా నాదేవుని తన సహస్రకరముల తీటపోవు నొక రణమును ప్రసాదింపుమని ప్రార్థించిన ముక్కంటి యా మూఢాత్మునితో వల్లెయనెను,

కనుపట్టు నీ నీలకంఠకేతనము
తనుఁదాన తెగి వసుంధర గూలునాడు
నినుగెల్చు ననుగెల్చు నిఖిలంబు గెల్చు
ఘనుతోడ కయ్యంబు గలుగు పొమ్మనిన

ఆమూర్ఖుడు అందులోని అర్థమును ఆకళించుకొనలేక మంత్రి కుంభాండాదులతో మహేశుని మాటలు మననము చేయుసమయమున నీల కంధర ధ్వజము పటపటార్భటులతో పృథ్విపై బడెను. అనేకదుర్నిమిత్తములు పొడసూప, కుంభాండుడు వారించినను మానినీయుక్తుడై మధుపాన సక్తుడై దానవేశ్వరుడుండెను.

ఈ బాణాసురునికి ఉషాకన్యయను ఒక కొమరితకలదు. ఆయమ అపురూప లావణ్యవతియని ఆమె అందచందములను చిన్నన్న సొంపుగా వర్ణించినాడు.

**బాణపుత్రిక యుషాబాలిక యనగ**
**యేణాంక బింబాస్య హేమాంగి కలదు**
**తళుకు గన్నులది కుందనపు చెక్కులది**
**మొలక నూఘారుది మురువు వీనులది**
**పొగరు గుబ్బలది యబ్బురపు-లీలలది**
**చిగురు కెమ్మోవిది జక్కలపు జూపులది**
**మెరుగు వన్నెలది క్రొమ్మించు నవ్వులది**
**యొరపు బాగులది మయూరంపు నడది**

ఒకనాడీ ఉషాకన్య పార్వతీపరమేశ్వరులు కేళీవనోర్వి కేగెడువేళ అందముగా అలంకరించుకొని చెలులగూడి ఉద్యానవనమున కరిగినది. ఆమె పన్నీట జలకమాడి, మృగనాభి పుటపూతపూసి, రవలకమ్మలు పెట్టి, రాణించు నొసల క్రొన్నెల నామంబు కొనగోర దిద్ది, సన్నంబు గాఁగ మంజరి కొప్పమర్చి, కనుగొనల్గాడంగ కాటుకనించి, కరమున కేయూర కంకణావళుల్ జోడించి, ఉద్యానవనమును ఉషాకన్య చేరినట్లు చెప్పిన చిన్నన్న ఆమె గిరిసుతాభవులు క్రీడించుట కాంచి, అటువంటి

భర్తను గలిగిన సతులెంత సౌభాగ్యవతులో అని చెలులతో చెప్ప ఆ మాటలు వినిన గట్టురాచూలి నవ్వుచు పలికె.

అల కంతునకు నెక్కుడగు చక్కదనము
గలవాడు సఖి! నీకు గాంతుడై నీదు
తలపు నీడేర్చు నెంతయు సాదరమున

ఆ మాటలు వినిన ఉషాకన్య, ఆత్మ నుప్పొంగి తనకోర్కె ఎన్నడు యీడేరునని అడుగ నగరాజతనయ యిట్లనియె.

సితపక్షగమున భాసిల్లు వైశాఖ
సితపక్షమున ద్వాదశ దినాంతమ్ము
భద్రసౌధాగ్రంబుపై పువ్వుసెజ్జ
నిద్రబోయెడువేళ నీకలలోన
రతికేళి నిను గూడి రమియించువాడు
పతియగు నమ్మ శ్రీపతియాన

ఇంచుమించు ఈ భావములనే ఎఱ్ఱాప్రెగడ తన హరివంశములో కనుపఱచినారు.

బాలా నీతలఁ బొప్పుఁ గన్నియలకున్ భావంబు నిత్యంబుగా
లోలంబై పతిలాభలోభమను కల్లోలంబులం దేలుటల్
రేలెల్లన్ హరుఁగూడి యే నెటులు నిర్నిద్రప్రమోదక్రియా
లీలన్ సోలెదనట్లు నీకును బ్రియాశ్లేషంబు లేచేకుఱున్.

అట్టి కల్యాణంబునకుఁ గారణంబు వినుము మెఱింగించెద. వైశాఖ శుద్ధ ద్వాదశినాటిఁ నిశాసమయంబున సమున్నత సౌధతలంబునందు నీవు నిద్రించియుండఁ గలలోన వచ్చి యెవ్వాండు నిన్ను కలసె నతండు నీకుం బతి యయ్యెడుం బొమ్ము."

నాచనసోమన ఉత్తర హరివంశములోని యీ ఘట్టమును పరిశీలింతము. పార్వతి పరమేశ్వరుల పొందు చూచిన ఉషాకన్య చెలులతో చెప్పిన తీరు

ప్రథమ జన్మంబునం దెంత భాగ్యవతులొ
మగలు మన్నింపఁ బెంపారు మానవతులు

ఈ మాటలు విని చలిగొండచూలు అద్దనుజ తనూజతో

........... నభిమతంబొన గూడెదు నింతనంతకు
బనిగలదే మనోభవుని పట్టము గట్టికొనంగఁ జాలుజా
ణని మగనిం గవుంగిట ననారతముం గొనియాడెదో చెలీ యిట్లనేఁ
తనకావిధ మెన్నడబ్బునో నానతి యిమ్మన దయామతి

కడగి వైశాఖ శుక్లపక్షంబునందు
ద్వాదశి దినాంతవేళ్ల సౌధంబుమీద
మదనకేళికిఁ గలలోనఁ గదియు నిన్ను
నెవ్వడాతండ మగఁడు నీకిందువదన

ఈ మూడు కావ్యములలోను యీ ముఖ్యమైన ఘట్టము మూలమును సుసరించి ఒకే విధముగానున్నది,

ఉషాకన్య కడువేడుకతో శోణితపురమున కలుగుదెంచి కాలము గడుపుచు ఒకరాత్రి సుఖ నిద్రపోవుచు నుండ

కలలోన మన్మథాకారు డొక్కరుడు
కలికిలాగులతన కళలంటి యంటి
కలసి పైకొన మేలుకాంచి బిట్టులికి
కలగా నెరుంగక కళవళింపుచును

వగచెందుచున్న వనితను ప్రియసఖి చిత్రలేఖ ఓదార్చి కారణమడుగ కన్నియ పలికె గద్గద కంఠయగుచు

చేరి యెవ్వడొకాని చిత్తజు కేళి
వలనొప్ప ననుగూడి వంచించి చనియె

అని అతని రూపరేఖలు వర్ణించి తనకిక త్రోవయేదని వాపోవ యాయమకు చిత్రలేఖ యిట్లనియె.

పాతాళ భూస్వర్గ బహువీరవరుల
మీతండ్రి యని గెల్చి మెరసె నెంతయును
యట్టి విక్రమశాలి యాత్మజ నిన్ను
పట్టంగ శక్తుండె పరుఁడిట్లు నిన్ను

అని వితర్కించి మరియు ఉషాకన్య కోరికను మన్నించి మహేశ్వరి యిచ్చిన వరమును మననము చేసికొని

కలలోన నెవ్వండు కరమర్థి నిన్ను
కలయు నాతడె నీకు కాంతుడయ్యెడిని
యనుమాట మరచితె యది నిక్కమయ్యె

వాడెక్కడ నుండిన తెచ్చెదననిన, పేరు చెప్పమనెను. కాదేని తాను 'మానవ దానవామర నాగవరుల చిత్రపటముల చెన్నుమీరంగ చిత్రించి తెచ్చెద వానిలో నీరమణుని చూపించిన పట్టి తెచ్చెదనని చెలిని చెలువు కప్పగించి, చిత్రలేఖనకు పోయినది చిత్రలేఖ మరుని బారికి చిక్కిన ఉషా కన్యకు చైత్రోపచారములు చెలియలు చేసినను విరహార్తి కోర్వజాలక వెన్నెల బయట కూర్చుండి చేసిన చంద్రదూషణ ప్రబంధపు పోకడలు పోయినవి.

వేషంబు సాత్విక వేషంబుకాని
దోషాకరుడు గురుద్రోహి రేగాము
కుడిచి కక్కినకక్కు, గుణహీనుండు
ముడిచినపువ్వు తమ్ముల పగదాయ
వీని చూచుచుట నాకు విహితమేయనుచు

అనేక విధముల చంద్రుని దూషించుతూ మన్మథబాధకు తాళలేని ఉషాకన్య చిత్రపటములతో వచ్చిన చిత్రలేఖ చూచిన విధము

వీడిన నెరిగొప్పు వేడి నిట్టూర్పు
వాడిన కెమ్మోవి వదలిన నీవి
చెదిరిన నునుగురుల్ చిటిలు మైపూత
వొదలిన తాపంబు పురిగొన్న సరులు.

అట్లున్న ఉషకు చిత్రలేఖ లిఖిత చిత్ర పటములను చూపి వారిని వరుసగా వర్ణించిన విధము

వీరి దిక్పాలురు వీక్షింపు మెలల !
వీరె గంధర్వులు వీరె కిన్నరులు
వీరిలో నామేటి వెదకి కనుగొనుము
వీరె కింపురుషులు వీరె చారణులు ........
ఇదె వసుధాలోక మిందు వర్తించు
విదిత భూపతుల వీక్షింపుమనుచు
గౌళ పంచాల బంగాళ నేపాళ
చోళ బర్బర మత్స్య సూరసేనాంగ
కురకుర మహారాష్ట్ర కొంకణ సింధు
శక మద్ర సాముద్ర సావీర మగధ
కురుబోజ కాంబోజ కోసల వత్స

అని భారతావనిలో ధారుణీశ్వరుల చిత్రపటముల జూపి, తుదకు ద్వారకకు తెచ్చి యదువీరుల చూపి, బలరామకృష్ణుల అభివర్ణించి, మురవైరి సుతుని చిత్రపటమును వర్ణించిన విధము.

**సాహస గుణశాలి సౌందర్యరాశి**
**ఉరుకాంతియుతుడు ప్రద్యుమ్నుడు వాడు**
**కరమొప్పుచున్నాడు కనుగొనుమనిన**
**తలయెత్తిచూచి యాతడె యాతడనుచు**
**తలచు తలంపు లీతడు గాడటంచు**
**తలవంచి తలవంచి తలఁచి క్రమ్మరను**
**తలయెత్తి చింతించు తరి చిత్రలేఖ**
**శ్రీకృష్ణ మదనుల చెంత నున్నట్టి**
**యా కుమారకచంద్రుననిరుద్ధు జూప**
**అచ్చెలి మదిలోన హర్షించి వెన్న**
**ముచ్చు మన్మధుడు మునిముచ్చు వీఁడనుచు**
**నా రూపు చనుదోయి నంటినొత్తుచును**
**పారవశ్యము నొంది పలికె ప్రేమమున**
**నిందీవరేక్షణ! యితడెవ్వఁడీత**
**డెందుండె నే నామమెయ్యది యనిన**
**వనజాక్షి! రుక్మిణీ వరపుత్రు పుత్రు**
**డనఘాత్మ! డతని పేరనిరుద్ధుఁ డంద్రు**
**కామునికంటె చక్కని వానిమదిని**
**గామించ తగును నొక్కటియ సందియము**
**బాణు డాసురుడు శ్రీపతి దైత్యమర్ది**
**వీణాంకముఖి! మైత్రి యేరీతిదొరయు**
**నైన గానిమ్ము శ్రీహరియాజ్ఞబోయి**
**వాని దెచ్చెద వలవంత బొందకుము.**

చిత్రలేఖ మాయావిద్యచేత అనిరుద్ధుని తెచ్చుటకు ద్వారకాపురివైపు అంబరవీధి పయనించుచుండ, తంత్రీనినాదంబు తనవీనుసోక నారదుండా

చేరవనుండునని తలంచి తాపసిని గాంచి ప్రణమిల్లిన మానియు ఆ నడు రేయి అక్కడికి రాగతంబేమన ఆ మానినియు బాణనందన కలలో అనిరుద్ధుని కలియుటయు, విరహతాపమున తన్ను వేడ అతనిని తెచ్చుటకు పోవుచున్నట్లు తెలిపి యిట్లనియె.

అనిరుద్ధు దెచ్చును పాయంబు నాకు
ననిమిషమౌని ! నీవానతియిమ్ము
మనమనిగొనిపోవ మాధవుండలిగి
దనుజేంద్రు మర్దింప దండెత్తివచ్చు
యిందుల కిపుడు నాకెయ్యది బుద్ధి
సందేహముడుపుము సర్వజ్ఞ! యనిన
కలహ మౌనను వార్త కర్ణామృతముగ

వినిన కలహభోజనుడు తాపసవిద్య నొసగి పంపించెను. చిత్రలేఖయు కమలేశు సదనమునకు పోయి, మునిచేత గైకొన్న ఘనతరమాయచే

శంబరాహితు పుత్రు జయ్యనగొనుచు
నంబరా ధ్వంబున నతి రహస్యముగ
నరిగి యుషాకన్య యంతఃపురంబు
పరువడి జొచ్చి

బలిపౌత్రికి అనిరుద్ధుని చూపి తాపస విద్యను ఉపసంహరించి మీరు హాయిగ నుండుడని యింటికి చనియె.

బలిపుత్ర పుత్రి యాపాన్పుపైనున్న
వలరాజుపట్టిని వల కేలబట్టి
కలిత వజ్రముల ముక్కలు సేయజాలి
మలియగొడ్డళ్ళకు మారుమలియ చన్దోయి

**గదిమించి ప్రియుని వక్షము గౌగిలింప**
**నుదుటైన చనుమొన లొత్తిన నులికి**
**యులికి మేల్కాంచి ప్రద్యుమ్నసూనుండు**
**కలకలయన నేత్రకమలముల్దెరచి**

అవలోకించినాడు ఆమె అందచందములను. చిన్నన్న యీ అదను తీసికొని ప్రబంధములలో వలె అవయవ వర్ణనను అనిరుద్ధునిచేత చేయించినాడు. కామినీగతి యవయవసమితి మునుకొని వీక్షించి మోహితుడగుచు కలయో నిజమో యని తలపోసి, వనితచేనంతయు వలనుగా తెలిసి వలరాజరతుల నలరించినాడు.

తలవరులైన కాంతలు వారిపొత్తు పొలుపు గనుగొని బాణున కెఱింగించిరి. వాకిలి శివుడు గాయుచుండ, నరుడు నాయిలు నెట్లు చొచ్చె నని అబ్బురపడుచు బాణుడు వానిని పట్టితెమ్మని ఆనతిచ్చెను. అనిరుద్ధుడు అంతఃపురము వదలి బయటికి వచ్చి యుద్ధమున అనేక దైత్య వీరుల సంహరించి, బాణాసురునితో ఘోరయుద్ధము సలిపి యాతని నొప్పించి మెప్పించెను. ప్రతి పన్నగ బాణంబులేసి ప్రద్యుమ్నకుమారు బందితుచేసి బాణాసురుడు కుంభాండమంత్రి అభిమతానుసారము నాతని చంపక, ఉషాకన్యతో కూడ చెఱయందుంచెను. ఇది పూర్వభాగము.

ఇక ఉత్తరభాగమున కృష్ణుడు నారదుని వలన అనిరుద్ధుడు బాణునిచే బంధింపబడినాడని తెలిసి, ఆతనిపై దండెత్తి సహస్రబాహుల త్రుంచి చంపకవదలెను. పరమశైవభక్తుడగు బాణుని పరమేశ్వరుడు తన భక్తుని కృత్యమునకు మెచ్చి కరయుగ్మ మొసగెను. బాణుడు తప్పెఱింగి హరికి

అలరిన భక్తి సాష్టాంగంబొనర్చి
యనియె నే నపరాధినైన నోదేవ!
మనవి చేకొని నన్ను మన్నించి నీదు
మనుమనికీ యుషా మానిని కిప్పుడు
డనుకూల దాంపత్య మగుచు వర్ధిల్ల
నరిచుట్టములు మెచ్చ జగములు పొగడ
కరమర్ధి పెండిలి గావింపవలయు

ఉషాకల్యాణము అందరి అనుమతితో అతివైభవో పేతముగ జరిగినది. చిన్నన్న యీ శృంగార కావ్యమును ద్విపదలో వ్రాసినను, ప్రబంధపోకడలలో ప్రౌఢముగా, శృంగారపరముగా, చంద్రదూషణాది వర్ణనలతో పండితపామరులు మన్ననల నంది 'చిన్నన్న ద్విపద కెరగు' నట్లు రచియించి చరితార్థుడైనాడు.

ఇక వీరి నాల్గవకావ్యము 'అన్నమాచార్యుల చరిత్రము' అను నొక చిన్న ద్విపదకావ్యము. దీనిని ప్రత్యేకించి పరిశీలించు నవసరము నవకాశము లేదు. పిట్ట కొంచెము కూత ఘనమనునట్లు, ఈ కావ్యము చిన్నదైనను ప్రతి విషయము- తాళ్ళపాక కవుల జీవిత విశేషములు, రచియించిన కావ్యములు, చేసినపనులు తెలుపునది కావున ఈ కావ్యము లోని అంశములను విరివిగా ఉటంకించి వారి చరిత్రను సృష్టించుటకు ఉపయోగించబడినవి. ఈ గ్రంథమే లేకున్న ఈ పుస్తకమును నిర్మించుట కష్టముగనుండెడిది. నిర్మించినను తగిన ఆధారము లేక రాణించియుండెడిది కాదు. ముఖ్యముగా అన్నమాచార్యుల జీవితమును సమగ్రముగను

సవ్యముగను సంతరించు సదుపాయము కల్పించినదీ కావ్యమే. తక్కిన తాళ్ళపాక కవులను గురించి అంతో యింతో చెప్పినది యీ గ్రంథము లోనే. ఈ చిన్నపొత్తమే తాళ్లపాక కవుల చరిత్రమునకు ముఖ్యాధారము, మూలాధారము. వీరందరు పదకవులగుటవలన వీరిని యితర కవులు తడవకుండుటవలన ఆ కొరత తీర్చుటకో యనునట్లు వీరి పూర్వీకులను యీ కావ్యమునను తన యితర కావ్యములలోనను సమయములు సృష్టించి, తనవారిని వారి గొప్పలను చెప్పి, వారిని వెలుగులోనికి తెచ్చుటకు చేసిన కృషి, సాధించిన ఫలము అమోఘము, అద్వితీయము. చిన్నన్న చరితార్థుడై నిలిచినాడు.

# రేవణూరు వెంకటాచార్యుడు

'పూవువలన దారమునకు వాసన అబ్బినటుల' తాళ్ళపాకవారితో సంబంధము చేసినవారికి కవిత్వమబ్బినది. రేవణూరు వెంకటాచార్యుడు అన్నమాచార్యులకు దౌహిత్రుడు. పెదతిరుమలాచార్యులకు మేనల్లుడు. వీరి తండ్రి రేవణూరు తిరుమల కొండయ్య. తల్లి తిరుమలాంబ. వీరు నందివరీక వైదిక బ్రాహ్మణులు. శ్రీవత్సగోత్రులు వీరిని వెంకటాచార్యుడనికూడ పిలిచెదరు.

వీరు రచియించిన గ్రంథములు శకుంతలాపరిణయమను మూడాశ్వాసముల శృంగార ప్రబంధము, శ్రీపాదరేణుప్రభావమను నాలుగు ఉల్లాసముల కావ్యము. శకుంతలాపరిణయమును శ్రీ వెంకటేశ్వరున కంకితమిచ్చెను. శ్రీపాదరేణుప్రభావము చివరి భాగము లభించక పోవుటవలన ఆ కావ్యమును ఎవరికి అంకితమిచ్చినది తెలియదు. దానిని బహుశా శ్రీ వెంకటేశ్వరస్వామికో లేక అలమేలుమంగమ్మకో అంకితమిచ్చియుండును. వీరి తండ్రి తిరుమల కొండయ్య కూడ కవియనియు వారు రామచంద్రోపాఖ్యానమను ప్రబంధమును రచియించినటుల వీరి శకుంతలాపరిణయ గద్యమున తెలుచున్నది.

'ఇది శ్రీమత్తిరువెంగళనాథ శ్రీపాదరేణుప్రభావకావ్య కల్పన, నందపురార్యవృత్తిప్రవీణ, రేవణూరివంశ వయఃపాదోది సుధాదామ,

రామచంద్రోపాఖ్యాన ప్రబంధసంధాన విద్వత్ప్రచండ తిరుమలకొండయా బిధ బుధాగ్రణేతనూభవ, భూభుజాస్థాన నిరాతంక చర్య వేంకటాచార్య ప్రణీతంబైన శకుంతలాపరిణయంబను మహాప్రబంధంబు '

వెంకటాచార్యుడు శకుంతలాపరిణయమును సాంప్రదాయసిద్ధమైన శ్రీకారముతో మొదలిడుతూ యీ పద్యములో కులగోత్రాదుల తెలుపుతూ తాను అన్నమాచార్యుల పుత్రవంశోత్తముడ నని తాళ్ళపాక వారితో తనకు గల బంధుత్వమును మొదట తెలిపికొనినాడు.

**శ్రీ వత్సాన్వయు రేవణూరి కులజుఁ శ్రీ పాద రేణు ప్రభా**
**సౌవర్ణ్య స్ఫుటకావ్య కల్పక కవిఁ సంకీర్తనాచార్య పు**
**త్రా వంశోత్తము నంచవైదిక బుధాది ప్రోక్తవృత్తి స్వయం**
**భావుఁ దిర్మల కొండయార్యసుతు శుంభద్వేంకటాభిఖ్యునిఁ.**

తాను అన్నమయ్య కొమార్తె తిరుమలాంబ కొడుకునని తొల్లుత చెప్పి తిరుమలకొండ యార్యసుతుడనని తనుపరి చెప్పుటలో తాను తాళ్లపాకవారికి దగ్గర బంధువునని సగర్వముగా చాటికొనినాడు. వీరు బహుశా తాత, మేనమామ దగ్గర పెరిగి వారివలననే వృద్ధిలోనికి వచ్చి, కవితావాసన పొంది, మేనమామ కుమారులగు చిన తిరుమలయ్య, చిన్నన్న మొదలగువారి సహవాసముతో తన కవితాశక్తిని పెంపొందించుకొని రాణించి ఉండవచ్చును. తాను కవుల వంశములో జన్మించి నట్లు తాతగారి సంబంధమును తడవుటలో తెలిపినారు. తండ్రి కూడ కవియే. విద్వత్ప్రచండుడట.

ఈ కవి గృహనామము రేవణూరు అను గ్రామము కర్నూలు జిల్లా, కోయిలకుంట్ల తాలూకాలో కలదు. వీరు ఆ ప్రాంతమువారై కడపమండలి యందలి రాజంపేట తాలూకా తాళ్ళపాక గ్రామము

వారితో సంబంధము చేసియుండవచ్చును. కడప జిల్లా ప్రొద్దుటూరు తాలూకా రామేశ్వరము అను గ్రామములో రేవణూరు వెంకటశాస్త్రి యను నతడు ఒక బావి త్రవ్వించినట్లు శిలా శాసనమున్నది. ఆ వెంకట శాస్త్రి ఈ వెంకటార్యుడే యుండవచ్చును. క్రోధి సంవత్సరమని యున్నది. శకసంఖ్యనీయలేదు. రేవణూరు వెంకటశాస్త్రి యీ కవియే అయిన ఆ క్రోధి సంవత్సరము శాలివాహనశకము 1466 లేక క్రీస్తు శకము 1544 అగును. కావున వారు 1544 ప్రాంతపు వారగుదురు.

వీరి శకుంతలాపరిణయమున కవిస్తుతిలో యీ క్రింది పద్యము గలదు.

**పరగన్ భారత కల్పనారతులు శబ్దస్ఫూర్తి సంధింప ని**
**ర్భరవృత్తిన్ బరమేశ పోతఘను లాలంకారముల్గూర్పఁ జా**
**పరులై నట్టి పితామహాద్యులు నుతుల్పాటింప నర్థించు నీ**
**సరసాంధ్రోక్తి వధూటి కేను సుమనస్పరిపూర్తి గావించెదన్.**

ఇందులోని కవులు 'పరమేశ'యన ప్రబంధ పరమేశ్వరుడగు ఎఱ్ఱాప్రెగ్గడ పోతఘను అన బమ్మెనపోతనామాత్యులు, 'పితామహాద్యులు' అన ఆంధ్రకవితా పితామహ అల్లసాని పెద్దన, ముక్కుతిమ్మన మొదలగు వారని అర్థము. కావున వెంకటార్యుడు వారి తరువాత వాడగును. అనగా యీ కావ్యము 1530 ప్రాంతములో వ్రాయబడియుండును. వీరు పెద తిరుమాలాచార్యుల మేనల్లుడగుటవలన వారి కాలము 1470-1550 అయినందున ఈ కాలము సరిపోవుచున్నది.

వేంకటాచార్యుడు శకుంతలా పరిణయమను ప్రబంధము రచియించవలయునను ఉద్దేశముతోనున్న సమయమున ఒక ప్రభువు తనకు అంకితము చేయమని కోరినట్లు ఈ క్రింది పద్యగద్యముల వలన తెలుచున్నది.

అపూర్వాపూర్వకవి సుపర్వానుగ్రహంబున బుణ్యాగుణకథా శ్రవణకుతూహలిక బుధసదానుబంధంబగు నొక్క ప్రబంధంబు సరస సుమనోబంధంబుగా నిర్మింపంబూని యున్న సమయంబున నతిప్రభావ సంపన్నుండగు కశ్చిత్రప్రభుండు.

తిర్మలకొండయార్యసుతు శుంభద్వేంకటాభిఖ్యునిన్.

పిలువంబంచి యెదుర్కొని
మిలమిల నలఘు ప్రఘానమిద్ధాస్థాన
స్థలిఁ వాగిలి మ్రొక్కి వటీ
కలిత సుఖాసీనుఁ జేసి కలకల నగుచున్

కనుగొని చండికాభి సుముఖప్రద నందరాగ్రహార పా
వన ఘన పెద్దిభట్టకుల వార్థినిశాకర నీవు శ్రీనివా
సుని యలమేలుమంగ కృపఁ జొక్కిన దిక్కరి వంద్రభూమి రా
ద్వినుత సభాస్థలీవన నవీన పికంబవు కాకలీకృతిన్

సల్లాలిత్య భవత్కవిత్వ పటిమాసందర్భ వైదర్భికా
సల్లాపంబులు మామకీనకులక స్వామీంద్ర కీలాద్రి రా
ణ్మల్లేశుండును మెచ్చ నొక్కకృతి నిర్మాణంబు గావింపవే
మల్లీఫుల్లసుమోల్ల సన్మధురుఖరీ మాధుర్యతే దార్ఢ్యతన్.

ఇందు కవి తన శక్తిసామార్థ్యాలను ఆ ప్రభువు ముఖమున ప్రకటించుచుతూ, ఒక గొప్ప రాజాస్థానమున రాజు తనకు సాష్టాంగ నతులర్పించి, సుఖాసీనుని జేసి, మహానందముతో ప్రస్తుతించినాడట. 'పెద్దిభట్టకులవార్ధి నిశాకర' యనుటలో వీరి యింటిపేరు 'పెద్దిభట్ల'వారై యుండును. వీరు రేవణూరు గ్రామములో నుండుటవలన ఆ ఊరి పేరే యింటిపేరుగా మారియుండనోపు. ఆ ప్రభువు ఈ కవిని శ్రీని

వాసుని, అలమేలుమంగ కృపాపాత్రుడని, ఆంధ్రభూమిలోని రాజసభలను వనభూములలో మధురగానము చేయు క్రొత్త కోకిలవనియు తెగ పొగడినాడు. మల్లెపువ్వుల వలె మనోరంజకముగను, తేనెసోనలవలె తియ్యగ నుండునట్లు కీలాద్రి (విజయవాడ) మల్లేశ్వరుడు మెచ్చునట్లు, శైలి వైదర్భీరీతి నలరారుచు, ప్రసాద, మాధుర్య, ఔదార్యగుణ విలసితమై చక్కని పదగుంభనము కలిగిన కావ్యమును విరచించి తనకు అంకితమిమ్మని వేడినాడట. ఈ కవియు అందుల కంగీకరించి ఆయనవలన హేమాంబర రత్నభూషణాదులు గైకొని కావ్యరచనకు' గడంగినట్లు చెప్పికొనినాడు.

**అని హేమాంబరరత్నభూషణ సుగంధాలంకృతుం జేసి స**
**ద్ఘనసార స్ఫుటవీటికాదు లొసగన్ గైకొంచు వాణీవధూ**
**వన జాతాంఘ్రి ఘల ద్ఘనజ్ఝన జ్ఝిహ్వాస్థానవాగ్గోస్తనీ**
**జనితానంద మరందకందళ నదీజంఘాల వేలాస్యుడై.**

ఈ కవి శృంగారరసప్రధానమైన శకుంతలాపరిణయమను రసవత్తర కావ్యము రచించి, రాజున కంకితమీయ 'బీబినాంచారమ్మ పొంచియున్నా' దన్నట్లు ఒక కరణము కాచుకొనియుండి కార్యవిఘ్నము కావించినట్లు ఈ క్రింది గద్యమున తెలియనగును.

'అమ్మహాకవివరుండును దదీయవంశావతార నిర్ణయ వర్ణనానుపూర్వంబుగాఁ దత్ప్రబంధరానల్ప కల్పనం బొనరించి తత్సముచితకృతి కన్యాకరణంబునకు నవకరణంబుగా నుపకరంబగు నొక్క కరణంబు కృతఘ్నుండై విఘ్నంబు గావించిన దదీయవిఘ్నంబును దత్ప్రభుత్వచ్ఛత్ర చామరాందోళికాది బహుప్రదాన క్రియావిఘ్నంబును మదీయ జానుదఘ్నంబుగా విశంకించి నిశ్శంక బిరుదాంక సంకల్పంబుతో నెంచి సంకీర్త

నాచార్య దౌహిత్ర సంప్రదాయంబు నగు మత్సంప్రదాయంబునకు సకల ఖలనరాధిపాధమ గణగుణస్తోత్రంబ పవిత్రంబగుట తలంచి శ్రీ వేంకట రమణునకు సమర్పణంబుగా సమర్పించెద,

తల్లివంశమువారగు తాళ్లపాక కవులందరు కలియుగ ప్రత్యక్ష దైవమగు శ్రీ వెంకటేశ్వరస్వామికి ఆత్మార్పణముగావించి, చొక్కపు భక్తి సేవించి తరించుట గుర్తించి గ్రహించిన యీ కవి వారివలెనే భక్తుడై యీ కావ్యమును వారివలెనే వెంకటేశ్వరునికే అంకితమిచ్చి తరియించినాడు **All roads Lead to Rome** అనునానుడి ననుసరించి, తమ వారందరి కావ్యములవలెనే, తనకావ్యము తుదకు ఆ దేవుని పాదపద్మములనే చేరెను.

ఈ శకుంతలా పరిణయమను ప్రబంధము అముద్రితముగనే యున్నది. దీని ప్రతి దొరకలేదు. నాకు లభించిన యీ రెండు పద్యము లను బట్టి అది ప్రౌఢప్రబంధముగా భాషాశైలిని బట్టి కానవగును. శృంగారరసము ప్రబంధములకు తీసిపోని విధముగా రెండవ పద్యములో చూడవచ్చును. దీర్ఘసమాసములతో శబ్దరామణీయతకు పాండిత్య ప్రకర్షకు పట్టుగొమ్మై ప్రకాశించుచున్నది. కావ్యములో వీని సందర్భ ములు తెలియకపోవుటచే వానిని గురించి యెక్కువగా ప్రస్తావించు నవకాశము లేక అట్లనే ప్రకటించుచున్నాను.

**అమరానంతలతాంతసాంతరమణీయాకల్పసియ్యామిత**
**క్రమరియ్యావృతకల్పలై బొదలు చంద్ర శ్రీ కళారేఖ నా**
**కొమరై యచ్చట నచ్చకోరదృశదాకుందారవిందాభినం**
**దమిళిందశ్రుతి గీతినుండి శుభ సంతానోత్తమంబాత్మలోన్.**

**పంతములేల! బాల! నవపల్లవగల్లవ హల్లవంపు గో**
**రంతటఁ జేర సైపవు రయమ్మున ఔమ్మనఁ గుమ్మ నీడుకొం**
**డంతటి గుబ్బదెబ్బలకు హాళిని బాళిని దాళ సాదుమ**
**బ్బాంతి కొకింత నీకుఁ గృపరాద పరాధమే మొకో!**

ఇక వేంకటాచార్యుల రెండవ కావ్యమగు 'శ్రీపాదరేణు ప్రభావము' అను చిన్న పొత్తమును పరిశీలింతము. ఇందు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పాదరేణు మహిమ బహు చమత్కారముగా వర్ణింపబడినది. తల్లిగారి వంశీయులందరు కవులే. వెంకటేశ్వరభక్తులే. వారివలెనే వీరికి శ్రీ వెంకటేశ్వరస్వామిపై అమితమైన భక్తికుదిరి, వారి పాదధూళి ప్రభావమునే అనేకరీతుల ఊహించి, అనేకవిధముల వర్ణించి తరించిన భక్తుడు. ఇది నాలుగు ఉల్లాసముల చిన్నికావ్యము. ప్రతిఉల్లాసమునను ఇరువురి సంభాషణములు కలవు. ఈ జంటలను ఏరి కోరి కవిసరిగా కుదిర్చినారు. మొదటి ఉల్లాసములో మన్మథ నారద సంవాదము. రెండవదానిలో దత్తిలతుంబుర సంవాదము. మూడవ దానిలో రంభాపురందర సంవాదము. చివరిదానిలో సరస్వతీచతుర్ముఖ సంవాదము. వీనిలో మొదటివారు ఒక అంశమును తీసికొని దానికి ఐహికసంబంధమైన ఒకలౌకిక కారణమును ప్రతిపాదింపగా, రెండవ వారు ఆముష్మికమైన శ్రీ వెంకటేశ్వర పాదరేణు ప్రభావమని సమర్థించి తుదకు మొదటివారిని తమవైపు త్రిప్పుకొని స్వామి పాదధూళి మహిమలో లీనముచేసి, అత్యుదాత్తముగా కొనియాడి తరించునట్లు చేసినారు. 'గంగగోవుపాలు గరిటడైననుచాలు' నన్నట్లు ఇందులోని కొన్ని పద్యములను పఠించిన ఈ గ్రంథప్రాశస్త్యము తెలియనగును. ఇందులోని ప్రతి ఉల్లాసము మనోల్లాసిని.

ఇందులోని యెనిమిదిపాత్రలు విచిత్రమై విభిన్నమైన వివిధ దృక్పథములు కలవి. ఎవరిధోరణివారిది. ప్రతివిషయమును వారి కోణ

ముల నుండి చూచెడివారే. వారిచ్చు కారణములు వారి మనోభావము లనుబట్టి సక్రమమైనవి, సకారణమైనవి, సమంజసమైనవిగా కానబడును. వీరిసంభాషణము చదువుతుంటే శ్రీ పోతులూరు వీరబ్రహ్మంగారు జ్ఞప్తికి వచ్చినారు. వీరు ఒకనాడు ప్రియశిష్యుడైన దూదేకుల సిద్ధయ్య గారిని 'లోకము ఎట్లున్నదిరాసిద్ధ?' అని ప్రశ్నించెను. లౌకికుడగు సిద్ధయ్య ''ఎవరిలోకము వారిది స్వామీ'' అని టకీమని జవాబిచ్చెను. గురువు అడిగినది దేశము సుభిక్షముగానున్నదా? ప్రజలు కరువు కాట కాలలో బాధపడుచున్నారా! యను భావముతో. కాని శిష్యుడు దానికి జవాబు ఉన్నవిషయమును జంకుగొంకు లేక చెప్పివేసినాడు. లోకోభిన్న రుచిః అని యిదేభావమును పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులవారు తమ 'షాజీ' అను గ్రంథములో నుడివినారు.

నవ్యతరమైన యొక్క గానస్రవంతి
కొకడు తలయూచు, మరియొకడోసరించు
వీణదే దోషమా! లేక వినెడివారి
తప్పిదమ! కాదు భావభేదములె సుమ్ము.

పసరికలు కలవాడికి ప్రపంచమంతా పచ్చగా కనుబడునట్లు, ప్రతివారు ప్రతి విషయమును తమ దృక్పథములో చూస్తూ, దానికి తమకు తోచిన తమ అనుభవములో గల లౌకిక కారణమును చూపుట సహజము. అందులో అనుభవము తక్కువ గలవారు తాము చెప్పినదే సరియను అతిశయము, అహంభావము కలిగియుందురు. విజ్ఞులు అనుభవజ్ఞులు వీరిని సకారణముగ తమవైపు మరలించుటలోనే కలదు వారి ప్రజ్ఞ. వెంకటాచార్యులు మంచి మనస్తత్వవేత్తగా నున్నాడు. ఈ ప్రపంచమున గల అనేక విషయములను ప్రస్తావించి వానికి ఒక లౌకిక

కారణమును కనుబఱచి, మరియొకనిచే దానిని ఖండింపించి, సృష్టిలోని ప్రతిది ప్రభావోపేత మగుటకు శ్రీస్వామివారి పాదరేణు ప్రభావమని చెప్పించి, యొప్పించి మెప్పించిన దిట్ట. ఇందులోని కవితారీతులు, పదముల పొందిక, శబ్దరామణీయత, అర్థగంభీరత, భావౌన్నత్యము అత్యద్భుతము. ఇది దీర్ఘసమాసములతో, సంస్కృత పదజాలముతో, పాండిత్యప్రకర్ష కలది. ప్రౌఢప్రబంధముల పోకడ పోయినది. తినబోతూ రుచి అడిగినట్లు ఇక ఆలస్యముచేయక అందులోని మాధుర్యమును గ్రోలుదము.

మొదటి ఉల్లాసములోని మన్మథుడు మాటకారి. స్త్రీ లోలుడు. ప్రపంచములోని ప్రతి సుందరమైన మధురమైన వస్తువును స్త్రీపరముగ సమర్థించ ప్రయత్నించువాడు. నారదుడు కలహాభోజుడైనా అన్ని డక్కాలు తిని, కడకు హరినామస్మరణతో తరించ దలచిన అనుభవజ్ఞుడు. వీరి దృక్పథములు ఆలోచనాసరిణి వ్యతిరేకములు. ఒకదానికి మరియొకటి అందదు, పొందదు. కవి వీనిని ఊహించి వర్ణించిన విధము ఉల్లాసముగ నున్నది. మన్మథుడు కల్కిమోవి ద్రాక్షపండువలె తియ్యన అంటే, నారదుడు తన పెద్దరికము చూపుతూ 'కుయ్యాకురోరి' అని స్వామి పాదధూళి తీర్థముతో గ్రోలిన వీనికంటె తీపని చెప్పినాడు.

**తియ్యని ద్రాక్షపండురుచి తియ్యనఁదోచెడిఁ గల్కిచొక్కపుం**
**దియ్యని మోవిచక్కెరదె తియ్యని తీపుగదయ్య నారదా !**
**కుయ్యకురోరి ! శేషగిరికూట విహారిపదాబ్జ రేణువే**
**తియ్యనకంటెఁ దియ్యనగుఁ దీర్థము తోడుతఁ గ్రోలుమన్మథా !**

స్త్రీ చెయ్యి తగిలితే శిలలు కూడ పులకించునని మదనుడంటే, వెంకటపతి కాలిధూళి తగిలి రాతి నాతి కాలేదా యని నారదుడు అహల్యా

శాపవిమోచనము శ్రీరామపాదరజముచే చేకూరెనని ప్రబలకారణము కనుపఱచి మన్మథుని ఒప్పించ ప్రయత్నించినాడు.

కలికి కరపల్లవము సోకుఁగన్న శిలకుఁ
జక్కలింతగు నారద సంయమీంద్ర!
వరుస వేంకటపదపల్లవముల ధూళి
శిలకు చైతన్యమొదవి యాఁగలికి మదన!

శ్రీ పాద రేణువునకు కస్తూరి వాసన చక్కని రుక్మిణి చన్నులపత్రములంటిన కలిగెనన, నారదుడు ఆమె చనుగుబ్బ మైపూత కావాసన శ్రీవారి పదద్వయ రేణువు ముద్రితంబగుటవలన నని వివరించెను. ఎవరి కారణము వారిచ్చుచున్నారు. రెండు సకారణములే.

చక్కని రుక్మిణీరమణి చన్నులపత్రము లంటి గాదె యీ
చొక్కపు లేరజంబులకుఁ జొప్పిలె కస్తురి తావి నారదా!
తక్కక వేంకటాద్రిపు పదద్వయ రేణువు ముద్రితంబుచే
నక్కమలాక్షి గుబ్బకవ నంటెను పత్రములోరి మన్మథా!

ఇక మన్మథునితో వాదము పెట్టుకొనిన ఉపయోగము లేదని, చెవిటివాని ముందు శంఖూదినట్లని, వానితో వాదము వక్రమార్గము పట్టించుటకే నని తలంచి నారదుడు శ్రీపాదరేణు మహాత్మ్యమును వేనోళ్ళ పొగడ నారంభించెను.

తొలుతనె యబ్బురంపు తన తొయ్యలి శ్రీ యలమేలుమంగకున్
బలుచని చెక్కుటద్దముల పైఁ జనుగుబ్బల పై మృగీమదా
కలితపు పత్రవాసనలకన్న సువాసన లీనఁజేయుచున్
జిలికిన వేంకటేశ్వరుని శ్రీపదపు రేణువు నాశ్రయించెదన్

అనేక ప్రకారంబుల శ్రీపాదరేణు ప్రభావమును ప్రస్తుతించు నారదుని వలన వినిన మన్మథునిలో మార్పువచ్చినది. మతము మార్చుకొన్నాడు. భక్తిపారవశ్యముతో పాదధూళిని ఆశ్రయించి ప్రశంసించినాడు

ఎంతటిరోగమైన హరియింతునిమేషములోన నంచు ధ
న్వంతరి రూపమైన నెఱవైద్యుఁడు వేంకటనాధుడట్టి శ్రీ
మంతుని పాదరేణు పరమౌషధమౌచు మదీయ రోగమా
ద్యంతముగా నడంచియుఁ జిరాయవొసంగును నాకు నీయెడన్

ఆ దేవుడు ధన్వంతరి రూపమై పాదరేణువను పరమౌషధమును ప్రసాదించి రోగమునాద్యంతము నడచి చిరాయువుగా చేయునని మెచ్చుకొనినాడు మదనుడు. అంతటితో వదలక దేశి ఛందస్సు 'రగడ'లో ఈ పాద రేణువును పొగడిన విధము చూడుము.

కమలాసనుడును గరగినరేణువు
అమరేంద్రుని కనులంటినరేణువు
గరుడుని రెక్కల గరచినరేణువు
వురుడిల లేనిది పుణ్యపురేణువు.

పారవశ్యముతో బమ్మెరపోతన వలె అంత్యాను ప్రాసలతో వీనవింపుగా సాగించినారు వెంకటాచార్యులవారు మన్మథునినోట.

అలఘు స్వచ్ఛములై యభీష్టకములై యత్యంతసాంద్రంబులై
విలసద్ద్రవ్యములై విలక్షణములై విశ్వప్రచారంబులై
లలిదామోదములై లతాంతగతులైలాప్యాధి తత్వంబులై
చెలువందెన్ ఫణిరాజశైల నిలయ శ్రీ పాదభూరేణువుల్.

ఎన్నివిధముల ఆ దేవుని పాదరజమును ప్రార్థించినను, దుర్మాత్ముఁడు, పాపుడు, సత్యహీనుడు, పంచశరవ్రతమత్తచిత్తుడునైన తనకు మోక్షము

లేదని మదనుడు మదనపడుట వెంకటాచార్యుడు హృద్యయముగా వర్ణించినాడు.

శ్రీపవనాశనాద్రిపతి శ్రీపదరేణువు నందెకోరికల్
బైపయిఁబట్టె నాకెటులఁ బ్రాప్తమునౌనది నేను తమ్మిపూ
పాపడనో బలీంద్రుడనో పన్నగనాథుడనో దురాత్ముడన్
బాపుడ సత్యహీనుడను ఱంచ శరవ్రతమత్తచిత్తుడన్

పశ్చాత్తాపమునకు మించిన ప్రాయశ్చిత్తమే లేదు. ఇట్లు కుటిలంబులు మాని దర్పకుడు శ్రీపాదరేణు మహిమ యెఱిగి మోక్షసాధనకు పూను కొనెను.

నారదునిచేత తిరిగి పాదరేణు ప్రభావమును ప్రస్తావించి చిన్నన్న మంచి గాయకుడు సంకీర్తనాచార్యుడని, ఆయన పదములు పాడినపుడు శేషాద్రిపతి నాట్యముఁజేయ ఆ పాదరేణువు వారికి చెందవలయునని వెంకటాచార్యులు చెప్పిరి. చిన్నన్న కవియని విన్నాము. గాయకుడనుటకు ఇది ఒక ఆధారము. ఈ పద్యమును చిన్నన్న చరిత్రలో చెప్పియే యున్నాము.

ద్వితీయోల్లాసములో దత్తిల తుంబుర సంవాదము. దత్తిలుడు నాట్యాచార్యుడు. అమాయకుడు. తనకు తోచినవి, తాను చూచినవి రంభాదులు, వారి నృత్యములు, వారిపై పూతలనుండి వచ్చు వాసనలు. తుంబురుడు సంగీతాచార్యుడు, విష్ణుభక్తుడు. లోకజ్ఞానము కలిగిన అనుభవశాలి. దివిలో ఘుమ్మని (మంచి) వాసన వచ్చుటకు రంభ నృత్యముచేయ వెలువడు పుష్పపరాగమని దత్తిలుని దృఢవిశ్వాసము. ఇది సకారణమే. కుంభిని శేషశైలపతి నటింప పైకెగదన్నిన పాదరజ ప్రభావమే దివిలోని దివ్యవాసనలకు కారణమని తెలిపినాడు తుంబురుడు.

రంభ నటింపఁ గైశ్యభరరంజిత పుష్పపరాగపుంజముల్
గుంభితమయ్యెనేమొ దివి ఘుమ్మని వాసన గ్రమ్మెఁ తుంబురా!
కుంభిని శేషశైలపతి గుప్పఁగఁ గ్రప్పు గుప్పతిప్పలన్
జృంభిలుచు న్నటింపఁ, బదరేణువు లెల్లను గప్పె దత్తిలా!

ఈ విధముగా దత్తిలుడు ప్రతి సువాసనకు, శృంగార చేష్టకు తనకుతోచిన లౌకిక కారణముతో సమస్యలు లేవదీయ, తుంబురుడును తగు విధముగనే దైవపరమైన పాదరేణు ప్రభావమును ప్రస్తావించి విసుగు విరామము లేనివాని ప్రశ్నలకు ప్రతిగా సకలపాపహారియు, సకలరోగ నివారిణియునగు పాదరేణు మహిమను ప్రశంసించిన విధము చూడుము. బ్రహ్మ మహేశ్వరాదులే అద్దానిని సమాశ్రయించి తరియించి రనిన ఇక దత్తిలుడొక లెఖ్ఖయా యని భావము.

చతురాననస్ఫూర్తి బ్రతుకు బ్రహ్మకునైన
సర్వజ్ఞుఁడైన గిరీశునకైన
వాచస్పతిత్వంబు వఱలు గీత్పతికైన
శక్తిఁదాల్చు కుమారస్వామికైన
ధర ననంతఖ్యాతి మెఱయు శేషునకైన
షడబిజ్ఞుడగు గణేశ్వరునకైన
వాగ్దేవతా సార్థవతి సరస్వతికైన
విబుధాఖ్యఁదగు దైవ వితతికైన

సకల పాపక్షయంబును సకలరోగ
హరణమై సర్వశుభదాయియై తనర్చు
వేంకటేశ్వర శ్రీపాద పంకజాత
రేణులేశంబు మహిమ వర్ణింపఁదరమె?

దత్తిలుడు తన దృక్పథమును మార్చుకొనక మెత్తబడక పాదరేణు ప్రభావమును గుర్తెఱుగక ఉండుట గమనించిన తుంబురుడు మాత్రా ఛందస్సున (దేశికవితలో) ఇంపుగా సొంపుగా బహుపసందుగా శబ్దార్థ శుద్ధితో రేణువును పొగడిన విధమును పొందుపఱచిన అందులోని భాషాభావములు తెలియనగును.

**సున్నపొన్నల చిన్నివెన్నెల చుట్టుపట్టుల గెంటు రేణువు**
**కన్న కన్నెల కన్నుసన్నల కాపుదూపుల నెట్టురేణువు**
**గంగగౌరుల కొంగు చుంగుల గట్టిపెట్టిన గట్టి రేణువు**
**రంగుపొంగుల దొట్టు మట్టియరాపురేపుల మట్టిరేణువు**

గంగాగౌరీ సవతుల పోట్లాటలలో మునిగి తేలుతు ఒకరితో నొకరు ఏకీభవించక పోయిన, శ్రీవారి పాదరేణు మహిమను గుర్తెఱిగి కొంగుచుంగుల గట్టినారనిన ఇతరులమాట చెప్పనక్కఱలేదు. దీనికి తృప్తిపడని దత్తిలుని దండకముతోనైన అష్టమహిషులనే వారి యిబ్బందులను తీర్చి కాపాడినట్లు వెంకటాచార్యులు తమ బహుముఖ కవితా శక్తిని ప్రదర్శించిన విధము చూడుడు.

## దండకము

రుక్మిణీ స్వాదుబింబాధరాత్యంతదంతక్షతుల్ బాపె నే రేణువున్, నిత్యమున్ సత్యభామా విలాసార్థలీలా కళాస్థానపుం జారలున్ దీరగాఁ ద్రోచె నే రేణువున్, జాంబవత్యక్షిపద్మాంచ జనస్ఫూర్తి రంజల్లెనే రేణువున్, చిత్రమై మిత్రవిందాను చుంబద్గతిన్ సారె నోరూర గావించె నే రేణువున్, ముందు కాళింది మైఘుర్మబిందు ప్రకాశంబు నొందించె నే రేణువున్, భద్రమా భద్రపెన్గొప్పు పుష్పాళికన్ జల్లు పుట్టించె

నే రేణువున్, అంతనంతన్ సుదంతావసంతోత్సవ క్రీడకున్ గోడె జోడమ్యో నే రేణువున్, లక్షణా హస్తలా ఘానుబంధన్ ద్రవత్వంబు సంధిల్లె నే రేణువున్.

ఈ కవులందరు శ్రీ వెంకటేశ్వరస్వామి అలమేలుమంగ తరువాత శ్రీకృష్ణుని ఆయన అష్ట మహిషులకు ఎక్కువ ప్రాధాన్య మిచ్చినారు. వీరు సమయము చూచుకొని వారిని కీర్తించితే చిన్నన్న వారిపై అష్టమహిషీకల్యాణమను గ్రంధమునే రచించినారు. శ్రీవారి పాదధూళి ప్రభావము భూత బేతాళ పిశాచాదుల పారద్రోలు ప్రభావముకలదని ఆదండకముననే తెలిపినారు.

'దేహాది దేవాంచితా గార సంచార తారాజిత శ్రీ రజోభూతిచే భూతబేతాళ రక్షః పిశాచాదులన్ బారగా దోలుదున్.'

ఆదిశేషుడు అన్నియుగములలోను, అన్నిఅవతారములలోను తన దేవుని వద్దనే ఏదో ఒక రూపములో ఉంటూ, విడువజాలని వాడై నాడనుట పురాణ ప్రసిద్ధము. కలియుగ వైకుంఠుడని ఖ్యాతిగాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామికి పవళింప పాన్పుపై శేషాద్రిగా జన్మమెత్తి శ్రీ పాదరేణువును లెస్సందాల్చు తలంపుతో శేషుడు చేసిన తపమును వెంకటాచార్యులు వర్ణించిన విధము చూడుము.

> భువిపై సాగమి నాగలోకకుహరంబుం జొచ్చి నిశ్చబ్ధుడై
> పవనాహారముతోన ఘోర తపముల్ బాటించి శ్రీ వేంకటా
> ద్రివిభుండున్ బవళింపఁ బానుపయి తా దేహంబునందెల్ల సం
> స్తవనీయోరుతదంఘ్రి రేణువులు లెస్సం దాల్పఁబో శేషుఁడుఁ

ఆది శేషుడు శేషాద్రిగా మారుటలోని పరమార్థము శ్రీ పాదరేణువును లెస్సగా పొందుటయే యని సమర్థించినాడు. ఇది ఆ కవి ఊహించుట లోని వైచిత్రి. ఒకడు బల్లపాటుగ బండమీద పడినాడట 'ఏమిరా పడితి వేయంటే' 'అది ఒక లగువులే' అని చమత్కరించి నాడట.

దత్తిలుడు మొండి ఘటముగా నున్నాడు. పాదరేణువు ప్రభావము ఎంతచెప్పిన ఉలుకడు, పలుకడు అనేక విధముల, అనేక ఛందస్సులలో చెప్పిన తృప్తివడని దత్తిలుని లయగ్రాహిలో తుంబరుడు చెప్పి ఒప్పించినట్లున్నది. తాను కనుగొని రుచిచూచితి ననిన తుంబురుని మాటలు దత్తిలుని సమాధాన పరచినట్లున్నవి.

**నేను గనుగొంటి నదినేను పనివింటినది**
**నేను రుచితింటి నదినేను సిరిగంటి.**

తుంబురుడు అనేక విధముల శ్రీ పాదరేణు ప్రభావమును ప్రణుతించిన దత్తిలుడు తత్ ప్రభావమహిమకు తన్మయుడై వినుతించిన విధము చూడుడు. శ్రీ రామావతారములో కొంచెము పాదరేణువు సోకిన ఱాయిగానున్న అహల్యకు శాపవిముక్తి కలిగినది. తత్కారణముగనే లక్ష్మి శేషగిరి స్వామి పదముల పట్టినదట,

**పూర్వము రామచంద్రుఁడయి పుట్టిన యాతని పాదరేణువున్**
**సర్వముగాక లేశము వెసన్ బ్రసరించిన ఱాతి నాతిగాఁ**
**బర్వెను గండపెండములఁ బాయని రత్నపుఱాల సోకుటే**
**పర్వమటంచు శేషగిరిస్వామి పదంబులఁబట్టె లక్ష్మియున్.**

వేంకటేశ్వరుని దివ్యచరణ రేణువు గిరుల శిఖరమున కలుగుట కతన తత్ప్రభావమున అక్కడ జంతువులు, తరువులు, సరస్సులు తదితరములు ఎట్లు మారినవో వర్ణించుటవలన దత్తిలుని భక్తిపారవశ్యము కాననగును.

కలమృగంబులవెల్లఁ గస్తూరి మృగములై
పొలుపొందె వేంకట భూధరమున
జనితసత్తరులెల్లఁ జందన తరువులై
పొలుపొందె వేంకట భూధరమున
పసిడి రేకుల వెల్లఁ పద్మంపు రేకులై
పొలుపొందె వేంకట భూధరమున
నయము సరసులెల్ల నవసుధాసరసులై
పొలుపొందె వేంకట భూధరమున
ధూళులెల్లను గర్పూరధూళు లగుచు
బోల్పఁ బొలుపొందె వేంకట భూధరమున
శ్రీనివాసాంఘ్రి రేణువై చిత్రకలిత
పరిమళ ఘుమం ఘుమద్గుణ ప్రాప్తమహిమ.

తరువాత రగడలో రామాయణగాథనంతయు వరుసక్రమమున వినుతించి దత్తిలుఁడు శౌరిపాద రేణువుకు శరణుజొచ్చినట్లు వర్ణించినారు వేంకటాచార్యులు.

శరణు దశరథేశ మహిషి సరసనద్దు ముద్దుఁజూపు
పరిఢవిల్లు రామభద్రు పాదరేణు జాలమునకు
శరణు పంక్తికంఠ కంఠ సంఘమెల్లఁ దెగి పడంగఁ
బరగఁ బూడ్చు రామభద్రు పాదరేణుజాలమునకు
శరణు శరణు శరణు శరణు శరణు శరణు శరణు శరణు
పరమపదనివాస శౌరి పాదరేణుజాలమునకు.

తుదకు తుంబుర దత్తిలు లిరువురు శ్రీవారి పాదరేణు మహిమను గొనియాడి తరించిరి.

తృతీయోల్లాసమును తనివితీర రంభాపురందరుల సంవాదముగా మనోహరముగా నూహించి బుధులు మెచ్చ వర్ణించినారు వెంకటాచార్యులు. రతికావతంసుడగు పురందరుడు, నలకూబరనఖ రేఖాంచిత కుచకుంభరంభ యిందులోని పాత్రలు ఒకరిని ఒకరు బాగుగా నెఱిగిన వారగుటచే మూడవ ఉల్లాసము ముచ్చటగా కుదిరినది. రంభకు పురందరుడనిన చనువుతో కూడిన సహవాసము. రంభయనిన దేవేంద్రునికి అనురాగముతో కూడిన ఆప్యాయత. అందులకే యీ ఉల్లాసము మనోల్లాసిగానున్నది. వీరి సందేహములు సమాధానములు వారి మనస్తత్త్వమునుబట్టియున్నవి. రంభకు పురందరునిపైన కలిగిన అనుమానములు సమంజసములు. సకారణములు. కాని యిక్కడ మనకు ప్రత్యక్షింపబడిన పురందరుడు పోకిరికాక, పాదరేణు ప్రభావమెఱిగిన భక్తుడుగా ప్రదర్శింపబడినాడు. దేవేంద్రుని ముఖములోని మరకలు చెలిగోళ్ల నొక్కులని ప్రతిపాదించిన రంభకు, సమాధానముగా పురందరుడు స్వామి ముద్దు పదంబులకు మ్రొక్క అంటిన పాదరేణువని చక్కని రంభకు సమాధానమిచ్చిన సాత్త్వికుడు.

**చక్కెరబొమ్మ యెవ్వతెయొ చక్కిలిగింతల గోళ్ళ నొక్కనో**<br>
**చెక్కుల నీకు మిక్కుటపు జీరలవేమిర యో పురందరా!**<br>
**మ్రొక్కితి వేంకటేశ్వరుని ముద్దుపదంబుల కప్పు డంటెనే**<br>
**చక్కటి పాదరేణు వది చక్కనిరంభ మరాళగామినీ!**

అతడు చేసిన పాపములు అక్కసుతీర యీ అదనుతీసికొని ఆడిపోసుకున్నది ఆరంభ. ఈతని స్త్రీ లోలత్వము అహల్యా సమాగమమున పరాకాష్ఠనందుకొన్నది. గౌతముని శాపము యీతని వళ్లు గుల్లచేసినది. మానని మచ్చయై కూర్చున్నది. దీనికి మించిన బాధ పదేపదే ఆతప్పును

వేలెత్తిచూపుట. అందులో రంభ యెత్తిపొడుపు భరింపరానిదైనను బదులు చెప్పవలసినదై యాగభాగఫల మబ్బుటకు శ్రీపాద రజోదకము గ్రోలుటయని తన్మహిమను ప్రశంసించినాడు.

గౌతమపత్ని వాతెరను గమ్మనితేనియఁ గ్రోలి నీకు దు
ష్ప్రాతకి కెట్లు యాగముల భాగము లబ్బెడిరా పురందరా!
పాతక మెద్ది వేంకటుని పాదరజోదక మేను గ్రోలితిఁ
ఖ్యాతిగ యాగభాగములఁ గాంచితి రంభ మరాళగామినీ!

రంభపురందరుని చనువుతో 'రా'యని సంబోధించినా, ఆతడు సద్దుకొని రంభను 'మరాళగామినీ' యని ముద్దుమురిపెముతో ప్రశంసించినాడు. ఆమె యీర్ష్యాద్వేషముల వదలక మరల నిత్యయౌవనుడగు ఇంద్రుని కల్పక పుష్పములవలె జవ్వనము వాడకుండుటకు కారణమేమన అతడు వేంకటపతి పదమ్ముల రేణువు పూసినందున యౌవనము వాడకున్నదని సమాధాన మిచ్చెను.

పువ్వులనెల్లఁ గల్పకపు పువ్వులకైవడి నీదు నెమ్మెయిన్
జవ్వన మట్టెవాడక యెసంగుటదేమి యొహో పురందరా!
మవ్వపు వేంకటాద్రిపతి మంచిపదమ్ముల రేణుఁ బూసితిన్
నెవ్వగ మించెఁ దన్మహిమ నేర్పులరంభ మరాళగామినీ!

ఎంత చెప్పిన వినిపించుకొనని రంభతో సంవాదము సరికాదని శ్రీపాద రేణుమహిమను పురందరుడు తానే ఏకరువు పెట్టిన విధములోని వైవిధ్యమును గమనింపుడు. పితౄణము తీర్ప భగీరథుడు దివినుండి భువికి గంగను తెచ్చిన ఘట్టము వెంకటాచార్యులు హృద్యముగ చెప్పినారు.

సుతుఁడైనందుకుఁ దాఁ బితౄణములుదీర్పన్నెవ్వఁడో వాడపో
సుతుఁడంచుఁ బితృకోటి కున్నతగతుల్ జూపెందిలోఁగ్రియా

కృతిచే మున్ను భగీరథప్రభుడు చక్రీశాఖ్యకుత్కూల సం
సితదేవోత్తమపాదరేణుసహజాద్రిస్రోతవారిం జుమీ.

దేవేంద్రుని పనుపుననే ఎన్నో లోకములు చూచి ఎందరి నెత్తిననో చేతులు పెట్టిన రంభను మెప్పించలేని యింద్రుడు విష్ణుపాదరేణు ప్రభావమును వైష్ణవౌన్నత్యము చాటునీ భావములో తెలిపినాడు. గంగ విష్ణువు పాదమున పుట్టి పవిత్రతనొంది శివునిజుట్టున మెట్టినది. ఈశ్వరుని శిరోధారయైన గంగకు జన్మస్థానమైనది. విష్ణుపాదము అటువంటి పవిత్ర పాదధూళి పరమోత్కృష్టమైనది పావనమైనదని చెప్పినాడు పురందరుడు.

శ్రీ వేంకటేశ సత్పద
పావనతీర్థంబు మౌళిపైఁగల శివుఁడే
కావలె సర్వజ్ఞుడు నే
సేవించెద వేంకటేశు శ్రీ పదరేణున్

నేనేమో పాదరేణువును సేవించెదను. నీకిష్టమున్న నీవు ప్రార్థించమని కఠినపదములతో చెప్పిన రంభకు అర్థమైనదో లేదోనని సరళపదములతో తెలుగు తనముట్టిపడ శ్రీ కృష్ణావతార వర్ణనచేసి శ్రీ పాదరేణు మహాత్మ్యమును వర్ణించిన వేంకటాచార్యుడు ధన్యుడు.

గొల్లపల్లియ నిండనెల్లఁ జల్లనిచల్లఁ
గొల్లలాడగఁ బెర్వుకొరిత బారి
వాఁగులాగిన లోఁగ కేఁగి బాగులదాయ
లాగులేగల దోల వేగ నుటికి
బాలలీలల గోపికాళి లోలతనాడఁ
జేల లూడ్చుక పొన్నపాలి కెగిరి

సందు గొందులచిన్ని పొందు విందులగూడి
కందుకంబుల క్రీడఁ చిందులాడి
బాలగోపాలుడగు శేషశైలభూమి
పాలుఁడు పదక్రమాలోల లీల నలర
బాలపదముల నిండినమేలిరేణు
బాలమిల మాకొసంగు సుశ్రీల నెపుడు

చావైనా బ్రతుకైనా సౌఖ్యమైన ఆ దేవుని నమ్మి దేవేంద్రునిచేత పాదరేణు మహాత్మ్యమును రూపకాలంకారములో చమత్కృతితో చెప్పించినాడు వెంకటాచార్యుడు. ఇందు వీరి వైష్ణవ మతాభిమానము అభివర్ణితము.

తిరుమంత్రాఖ్య హలంబుఁ బూని కృషికృద్ధీమంతుఁడాత్మీయహృ
ద్ధరణిం దున్ని ద్వయార్థబీజములు నిండం జల్ల సంకూరమై
పరగం బూచిన మోక్షశాలికిని బైపై సత్తువల్ నింపు దా
నెరువై శేషగిరీంద్రపాదరజ మూహింపంగ నిద్ధారుణిన్

ధీమంతుడైన కర్షకుడు మోక్షార్థియై అష్టాక్షరీ మంత్రమను నాగలితో తన హృదయమను భూమిని దున్ని ద్వయమను మంత్రాక్షరములు చల్లగా మొలకెత్తి పెరిగి వెన్నుదొడగి మోక్షమను పంటనిచ్చుటకు స్వామివారి పాదరేణువు మంచి యెరువగుచున్నదని రేణు మహిమను ఉదాత్త భావముతో నుపమించినాడు. ఇంద్రుని మాటపైన నమ్మకము లేక కాదు రంభ పాదరేణు ప్రభావము గుర్తింపకపోవుట. అతనిని ఉడికించవలె ననునదే ఆమె ఉద్దేశమై యుండును. రంభ పురందరుని పోషణలో ఉంటూ, అతని మాటవింటూ, అతని ఉప్పుపులుసు తింటూ అతనిని నిర్లక్ష్యముగాచూచు కృతఘ్నురాలు కాదు. అట్ల నటించిన

రంభను ఇక అష్టకనుమ అర్రిది ఛందస్సులో స్వాదరేణు ప్రభావము వర్ణించినాడు వెంకటాచార్యుడు. ఈ కవి ప్రబంధకాలమున అణగి యుండిన దేశీయచ్ఛందములను కొన్నిటిని పునరుద్ధరించినాడు. ఈ అష్టక ములను క్రొత్తమార్గమున నడిపినాడు. వీనిలోని కవితారీతియు ధారయు చక్కగాసాగినవి. పాల్కురికి సోమనాథుడు అష్టకములు రచి యించెనని వినికిడి. రంగరాజమ్మ 'మన్నారుదాస విలాసము' లోని అష్టకము తీరు తెన్నువేరు. రుద్రకవి జనార్ధనాష్టకములు బాగున్నవి.

కందకూరి రుద్రకవి శ్రీకృష్ణదేవరాయలవారి ఆస్థానమున నున్నట్లు కొందరి అభిప్రాయము. వారి జనార్ధనాష్టకములోని యీక్రింది నాల్గిటిని పొందుపరచిన వాని నడకలోని యింపు, భావములోని సొంపు తెలియనగును. ఇది మధురభక్తిగా నున్నది. ఒక భక్తుడు భక్తిపార వశ్యమున తాను ప్రేయసిగా, భగవంతుడు ప్రియుడుగా భావించి కావించిన రచన

ఆనపెట్టిన రాకపోతివి ఆయెంబో అటు మొన్ననూ
పూనిపిలువగ వినకపోతివి పొంచిపోవుచు మొన్ననూ
నేను చూడగఁ గడిచిపోతివి నీటుచేసుక నిన్ననూ
కానిలేరా, దనుజమర్ధన! కందుకూరి జనార్ధనా!

నిన్నరాతిరి చవికెలోపల నీవుచెలి కూడుంటిరా
ఉన్నమార్గము లన్నియును నేనొకతెచేతను వింటిరా
విన్నమాత్రము కాదురా నిను వీధిలోఁ గనుగొంటిరా
కన్నులారా, దనుజమర్ధన! కందకూరి జనార్ధనా!

దబ్బులన్నియుఁ దెలిసికొంటిని తప్పు బాసలు చేయకూ
మబ్బుదేరెడి కన్నుగవతో మాటిమాటికి డాయకూ

ఉబ్బుచేసుక తత్తరంబున నొడలిపై చెయి వేయకూ
గర్వితనమున, దనుజమర్ధన! కందుకూరి జనార్ధనా!
అలుకలన్నియుఁ దీఱ నీవు నాయండ కెప్పుడు వస్తివి
పిలుచి నవరత్నాల సొమ్ములు ప్రేమతో నెపు డిస్తివి
వలచి వలపించియును గూరిమి వదల కెప్పుడు మెస్తివి
కలసి వేడుక, దనుజమర్ధన! కందుకూరి జనార్ధనా!

ప్రియుడు పరకాముకుడై నాడని యీర్ష్యతో కూడిన కినుక, దగ్గఱకు వచ్చినపుడు లాలింపుతో కూడినబెట్టు, తనవాడు తనకు దక్కినాడను తృప్తితో కూడిన ప్రియమునెంతో మనోహరముగ వర్ణింపబడినవి.

ఆంధ్ర ఛందో గ్రంథము లందీ యష్టక లక్షణములు చెప్పలేదు. వీరు రచియించిన అష్టకములు 'స్తోత్ర రత్నాకరము' లోని చంద్ర శేఖరాష్టకమువలె ఆఱేసి మాత్రలు గల మూడు గణములు అయిదు మాత్రలు గల నాల్గవ గణమును గల నాలుగేసి గణములు గల రెండు పాదములుండుటచే వీనిని యష్టకమని పిలుచునట్లు తోచుచున్నవి. ఇటు వంటివి పదునెనిమిది అష్టకములలో శ్రీ పాదరేణువును వర్ణించినాడీ కవి శేఖరుడు. అందులోని పదముల పొందిక, శబ్ద రామణీయకత, భావ గంభీరత బహు శ్లాఘనీయము.

రంభ సంభ్రమకేళి శ్రీ హరిరమ్యపాదపరాగములే
దంభ జృంభితసూక్తి నైపుణిఁ దా గణింపఁగ నైకొనెన్
గప్పు గొప్పున నెప్పు డెప్పుడు గప్పుగప్పున గప్పునో
అప్పడై తగు వేంకటాద్రిపు నప్పదాంబుజరేణువుల......
గబ్బి గుబ్బల గొబ్బు గొబ్బునఁ గ్రమ్ముకొన నెపు డబ్బునో
యుబ్బరంబగు పాపగుబ్బలి యప్పదద్వయ రేణుపున్........
రంగు రంగుల దుంగుపైఁట చెఱంగు టాత్తెపు డొసునో?
మంగమాధిప మంగళప్రద సంగ సత్పదరేణువుల........

తియ్య తియ్యగ మోవి నెన్నడు తియ్యమై చవిగొందునో
వెయ్యిమోముల శయ్యపైగల వేల్పు మేల్పదరేణువున్.........
మాధవీకృత పుష్పదామక మాధురిమ నెపు డుందునో
రాధికామధురాధరాధర సీధురత పదరేణువున్

అప్పటికి ఆ రంభ ఒప్పుకొనలేదేమో తురంగవృత్తములో తృప్తికలుగు నను ఆశతో పాదరేణువును పొగడినాడు పురందరుడు.

శ్రీల నయ్యలమేలు మంగకు
బాలఁ బయ్యగఁ బాలు రేణువు
భూమి పాపట ప్రేమఁ గొల్చిన
కామితార్థిత కామ రేణువు.........
రాధికా మధురాధరాంతర
సీధుమేళన సాధు రేణువు

అప్పటికి తల ఆడించలేదేమో ద్విపదలో రేణుప్రభావమును ప్రశంసించినాడు.

పూతన చను చేదు పుచ్చు రేణువును
వాతరూపుని నేల వచ్చు రేణువును
శకటార్పఁ దెగటార్చి బడియు రేణువును
ప్రకటాళి నొక డోలఁ బడియు రేణువును
కాళీయుతలలపైఁగదలు రేణువును
మేలీయఁ దలకొల్ప మెదలు రేణువును
యమునతోయమ్ము దాయమ్ము రేణువు.

ఇవన్నియు కాదనుకొని ఉత్కలికలో హృద్యముగ వర్ణించినాడు శ్రీపాదరేణు ప్రభావమును.

శ్రీగిరి పైపై మూఁగిన రేణువు
పుష్కరిణీతట పుష్కల రేణువు
కలువల చలువల మిలమిల రేణువు
వలసిన తులసిన గలసిన రేణువు........
గుత్తుల పొత్తుల మెత్తుల రేణువు
పువ్వుల నవ్వుల రివ్వుల రేణువు
చటుల చటులతర కుటిలపటుల ఖర
పరిపూర్ణ రేణువు హరిపదరేణువు.

అప్పటికి ఆరంభ గ్రహించినది హరిపదరేణు మహిమను. నటన విద్యా పటిమలతో రంభ రేణుమహిమ లభినుతింప, దేవేంద్రుడు రంభను తటాలున అతిముదంబున పొదివి తన హర్షామోదములను వెల్లడించెను.

చటులతర నటన విద్యా
పటిమలతో రంభ నృహరిపదరేణు సము
త్కటమహిమ లభినుతింపఁగ
తటుకునఁ దేవేంద్రుఁ డతిముదంబునఁ బొదవెన్.

నాల్గవ ఉల్లాసము సరస్వతీ చతుర్ముఖుల సంవాదము. ఇది అసమ గ్రమ్ము. ఇందుండు సరస్వతి స్వాతిశయము అహంభావముల ప్రతిమగా గోచరించుచున్నది. సరస్వతి తన ప్రభావము వలననే లోకమున సర్వము కలుగునని బల్కి, బ్రహ్మ శ్రీ పాదరేణు ప్రభావముననే అన్నియు సిద్ధించునని తెలిపినాఁడు. భార్యాభర్తలగుటవలన ఒకరినొకరు బాగా ఎరిగినవారై ఒకరి భావములు మరియొకరికి తెలిసియే యుండును. సరస్వతి పలుకు చెలువయని తాను లేనిదే చదువురాదని పలుకు లేదను దురభిమానము కలది. నాలుగు వేదాలు ఉచ్చరించుటకు చతుర్ముఖుని జిహ్వాలందు తానుండి పలికించుటచే వేదములు వెలువడినట్లు సరస్వతి

పలుక, శ్రీవారిపాద రేణు సేవవలన అతని జిహ్వాలతలందు వేదపుష్పములు విరిసెనని బ్రహ్మ సమర్థించెను.

నాలుకలందు వేదములు నాల్గు పఠింపగ, నేను మత్పద
శ్రీల నటింగాఁ గలిగె జెల్వుగ నీకును వారిజాసనా
శ్రీలలనేశు పద్రజపు సేవమహత్వమునన్ మదీయ జి
హ్వాలతలందు వేదకుసుమావళు లబ్బె గదే సరస్వతీ.

వాణి విప్పు కొప్పు కప్పును చూచే వాణీశుడు సృష్టిలోని అందములను సృజియించు చున్నాడనిన సరస్వతికి సమాధానముగా శేషగిరీశ్వర పాద రేణు ప్రభావముచేతనే అందచందములు అమర్చుచున్నానని చెప్పినాడు బ్రహ్మ.

గొప్పగ విప్పునాదునెరి గొప్పును కప్పును జూచి నీవు నా
యప్పుల దాల్తువెప్పుడల యన్ని సృజించెదు వారిజాసనా !
తప్పగనేల బల్కెదవు తార్క్ష్య గిరీశ్వరపాద రేణువున్
గుప్పలచే సృజించెదను గుల్కులు గుల్కకువే సరస్వతీ !

అద్దములో చూచుకున్నదో ఏమో ఆ ముద్దు నగుమోము చందమామ కన్న చక్కగా నున్నదట సరస్వతికి. వారిజాసనుని తన్నుచూచి చంద్రుని సృష్టించితివా యనియడుగ శ్రీ పాద రేణువు సుదాబ్ధి మీఁగడన్ బోల్చి పున్నమ చందమామను సృజియించినట్లు చెప్పినాడు.

చిన్నెల ముద్దు ముద్దువగ చెల్వగు నా నగుమోముఁజూచియో
పున్నమ చందమామ నెటుబోల్చి సృజింతి వారిజాననా !
పన్నగశైల భర్తృపద పంకజరేణు సుధాబ్ధి మీగడన్
పున్నమ చందమామ నిటు బోల్చి సృజింతిగా సరస్వతీ !

సరస్వతికి తాను అతిలోక సుందరివని చెక్కులు అద్దములవలె నునుపుగను తళతళ మెఱయుచుండగా, నలువ ఆ చెక్కులు జూచి అద్దములను

సృష్టించినాడను భావమును సరస్వతి వ్యక్తపరుప శ్రీపాదధూళి రేణువుల నిగనిగలుచూచి ఆ తళ్కుటద్దములను సృజించినట్లు శ్రీపాదరజ మహిమను ప్రశంసించినాడు బ్రహ్మ.

అద్దిర నాడు నిద్దమగు నద్దపుఁజెక్కుల నీడఁజూచి యో
యద్దము లెట్లు చేసితివి యందము లందగ వారిజాననా!
ముద్దులగుమ్మ వేంకటుని ముద్దు పదమ్ముల ధూళియణ్వులన్
దద్దయుఁ దళ్కు బెళ్కులకుఁ దళ్కులఁజేసితినో సరస్వతీ!

అందమైన కుదురైన తన కుచలములను చూచియే బ్రహ్మదేవుడు వానికి నీడుగ వక్రబుద్ధితో నితర జవరాండ్రకు స్తనములు సృష్టించినాడను భావమును పలుకుచెలువ ప్రదర్శింప, వారి జాసనుడద్దానిని ఒప్పుకొనక వారిజాక్షుల వక్షోజములు శ్రీపాద రేణు ప్రభావమునవీ అందచందములతో నలరారుచున్నవని పొగడినాడు.

సిబ్బల గెబ్బునావలపు సిబ్బెపు గుబ్బలతోడ నీడుగా
గుబ్బల నెట్లుచేసితివి కుత్సితబుద్ధిని వారిజాసనా!
గొబ్బునఁ బాఁప గుబ్బలని గుబ్బలు వేంకటుపాద రేణునన్
జొబ్బిలె నీదుగుబ్బలకు సూటిఘటింపగనో సరస్వతీ!

తన మృదువైన అందమైన జేగురురంగు కలిగిన పాదములను చూచియే చిగురుటాకులను సృష్టించి వాని మృదుత్వమును మోహనమగు ఆ యెఱ్ఱని రంగును ప్రసాదించినవని నలువతో పలుకుచెలువ ప్రతిపాదించిన, శతానందుండు దానిని ఖండించుతూ, శ్రీవారి పాదముల నుండి చిల్లున చిప్పిలు రేణువు నుండియే పల్లవకోటికి ఆ మెత్తదనము, ప్రభావితమైన రంగు చేకూరెనని వాణితో వాదించెదను.

సరస్వతియు నంతటితో వదలక తానే యీ సృష్టిలోని లోపములను సవరించుటకు మూగవానికి మాటలు వచ్చుటకు, చెవిటివానికి బధిరత్వము తొలగుటకు, అజ్ఞానికి విజ్ఞానము కలుగుటకు, నత్తివానికి

నత్తి తొలగుటకు తాను కారణభూతురాలని సరస్వతి నొక్కి వక్కాణింప, శ్రీనారసింహ పాదరేణు స్పర్శ మాత్రమున మనుజులలోని మూకత, బధిరత, అజ్ఞత, నత్తి తొలగుచున్నవని పలుకుచెలువతో నలువ పలికెను.

నేఁ గటాక్షించినేకదా మూకకు
మూఁకత్వము దొలంగు లోకనాథ!
నే దయాదృతిఁగన్న మీఁదకా బధిరుని
బధిరత్వము దొలంగు విధిపదాంక
నేను సంభాషించితేనెకా నజ్ఞాను
నజ్ఞానము దొలంగు విజ్ఞహృదయ
ధాత్రినాదుప్రసాద మత్తికాన త్తికి
నత్తిపల్కు దొలంగు నళినగర్భ
మూకకు మూకత దొలంగు మొగి బధిరుని
బధిరత దొలంగు నజ్ఞు నజ్ఞత దొలంగు
నత్తికిని నత్తి దొలగు శ్రీ నారసింహు
పదరజః స్పర్శమాత్రనే పలుకుఁబోటి!

అప్పటికి సరస్వతిలోని స్వాతిశయము కొంత తగ్గినట్లున్నది. భర్తను లోకనాథా! విధిపదాంక, విజ్ఞహృదయ, నళినగర్భయని సంబోధించుటయేకాక, క్రింది పద్యములో వారిలోని రజోగుణమునకు కారణము తన పాదపద్మములఁబోలు పద్మమున పుట్టినందుననిన ప్రతిపాదించిన వానిని ఒప్పుకొనక వాణితో వాణీశు డిట్లనియె. పద్మములతో వెంకటేశ్వరుని పాదముల పూజఁజేయ వానిరజస్కము రజోగుణమ్ముగ నామెయి నాక్రమించెనని శ్రీపాదరేణు ప్రభావమును స్తుతించెను.

శ్రీ పాదరేణు ప్రభావమును కొంత గుర్తించినదై ఆమె తన గొప్పలు చెప్పుట తగ్గించి, తనకు కలిగిన అనుమానములను నాథునడిగి

తెలిసికొన మొదలిడిన విధము చూడుడు. అంతకు ముందున్న అహం భావము అణగి, అణకువతో విజ్ఞుడైన నీరజాసనుని లోకోత్తర వస్తువేద్ది యని పలుభంగుల ప్రార్థించిన విధము, వారిరువురి ప్రశ్నోత్తరములు ఈ ఉత్కళికలో నింపుగ సాగినవి.

అమరసేవ్యమై యమితభవ్యమై
ప్రమద ముఖ్యమై భక్తిసౌఖ్యమై
ఘుమఘుమంఘుమై గుప్తకుంకుమై
యమరునేద్ది నాథాంబుజాసనా.

దేవతలచే సేవింపబడినది, పుణ్యప్రదమైనది, ప్రమదముఖ్యమైనది, భక్తులకు సౌఖ్యము నిచ్చునది. ఘుమ ఘుమ వాసనతో విరాజిల్లు కుంకుమ యేదియని నాథునడుగుటలో శ్రీ పాదరేణువను సమాధానము ఆమె ప్రశ్నలో నిక్షిప్తమైయున్నట్లు తోచును. భార్య మెత్తబడుట గ్రహించిన బ్రహ్మ బృహదానందము పొంది సవ్యముగను శాంతముగను 'వినయ సమ్మతీ విను సరస్వతీ!' యని ముద్దు మురిపెములొలుక హరిపాదరజమని పలికెను. మునులకు, జనులకు హాయినిచ్చి, మోక్షదాయియైనది శ్రీ పాదరేణువట.

మునిజనాళికిఁ ఘనజనాళికిన్
మొనసిహాయియై మోక్షదాయియై
దనరు హరిపదాధారరజముదా
వినయ సమ్మతీ విను సరస్వతీ!

తనకు కలిగిన అనేక అనుమానములకు తగిన సమాధానములను భర్తవలన పొంది, సంతృప్తి కలిగినదై పాదరేణు ప్రభావమును కడ

తెలిసికొనఁ మొదలిడిన విధము చూడుడు. అంతకు ముందున్న అహం భావము అణగి, అణకువతో విజ్ఞురాలైన నీరజాసనుని లోకోత్తర వస్తువెద్ది యని పలుభంగుల ప్రార్థించిన విధము, వారిరువురి ప్రశ్నోత్తరములు ఈ ఉత్కళికలో నింపుగ సాగినవి.

అమరసేవ్యమై యమితభవ్యమై
ప్రమద ముఖ్యమై భక్తిసౌఖ్యమై
ఘుమఘుమంఘుమై గుప్తకుంకుమై
యమరునెద్ది నాథాంబుజాసనా.

దేవతలచే సేవింపబడినది, పుణ్యప్రదమైనది, ప్రమదముఖ్యమైనది, భక్తులకు సౌఖ్యము నిచ్చునది. ఘుమ ఘుమ వాసనతో విరాజిల్లు కుంకుమ యేదియని నాథునడుగుటలో శ్రీ పాదరేణువను సమాధానము ఆమె ప్రశ్నలో నిక్షిప్తమైయున్నట్లు తోచును. భార్య మెత్తబడుట గ్రహించిన బ్రహ్మ బృహదానందము పొంది సవ్యముగను శాంతముగను 'వినయ సమ్మతీ విను సరస్వతీ!' యని ముద్దు మురిపెములొలుక హరిపాదరజమని పలికెను. మునులకు, జనులకు హాయినిచ్చి, మోక్షదాయియైనది శ్రీ పాదరేణువట.

మునిజనాళికిఁ ఘనజనాళికిన్
మొనసిహాయియై మోక్షదాయియై
దనరు హరిపదాధారరజముదా
వినయ సమ్మతీ విను సరస్వతీ!

తనకు కలిగిన అనేక అనుమానములకు తగిన సమాధానములను భర్తవలన పొంది, సంతృప్తి కలిగినదై పాదరేణు ప్రభావమును కడ